


www.prajapaksham.in

# ప్రజాపక్షం

ప్రతి అక్షరం ప్రజల కోసం

PRAJAPAKSHAM ★★★

నాలుగు వారాల్లో యుద్ధం ముగుస్తుంది : రుబియో 02
నెతన్యాహూ తప్పుడు అంచనాలతో అమెరికా-ఇజ్రాయెల్ మధ్య విభేదాలు!
ముగ్గురు మావోయిస్టులు లొంగుబాటు 05

సంపుటి 09, సంచిక: 118 | ఆదివారం | 29-03-2026 | కరీంనగర్ Published from: Karimnagar, Hyderabad, Khammam, Mahabubnagar పేజీలు: 12+8 | వెల రూ. 5.00

## ఇసుక, మైనింగ్ అక్రమాలపై సిబిసిఐడి

### 2014 జూన్ 2వ తేదీ నుంచి మైనింగ్ లీజులపై విచారణ కొనసాగుతది
### శాసనసభలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రకటన



- నిజాలు నిగ్గుతేల్చి పూర్తిస్థాయి నివేదికను వచ్చే అసెంబ్లీ సమావేశాలలో ప్రవేశపెడతామని వెల్లడి
- ప్రభుత్వ ఆదాయానికి గండికొట్టే ఎలాంటి తప్పిదాలను ఉపేక్షించబోమని హెచ్చరిక
- ఇసుక మాఫియాకు, దోపిడీకి పాల్పడింది హరీశ్‌రావు, కెటిఆర్‌లేనని ఆగ్రహం
- బిఆర్‌ఎస్ నాయకుల బ్లాక్‌మెయిల్ రాజకీయాలకు భయపడబోమని స్పష్టీకరణ
- వివిధ శాఖల పద్దులపై జరిగిన చర్చలో అధికార, ప్రతిపక్ష సభ్యుల మధ్య వాగ్వాదం

ప్రజాపక్షం/హైదరాబాద్

తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావం 2014 నాటి నుంచి నేటి వరకు రాష్ట్రంలో చోటుచేసుకున్న ఇసుక అక్రమ రవాణ, గనుల అక్రమ మైనింగ్‌పై సిబిసిఐడి విచారణ చేపట్టనున్నట్లు శాసనసభలో ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి ప్రకటించారు. ఈ విచారణలో నిజాలు నిగ్గు తేల్చి పూర్తి స్థాయి నివేదికను వచ్చే అసెంబ్లీ సమావేశాలలో ప్రవేశపెడతామని సిఎం వెల్లడించారు. 2014 జూన్ 2వ తేదీ నుంచి ఇప్పటివరకు ఇచ్చిన మైనింగ్ లీజులపై విచారణ కొనసాగుతుందన్నారు. శాసనసభలో శనివారం వివిధ శాఖల పద్దులపై జరిగిన చర్చలో బిఆర్‌ఎస్ పక్ష ఉప నాయకులు టి.హరీష్‌రావు మైనింగ్ లీజులపై ఆరోపణలు చేయడంతో అందుకు మంత్రులు, కాంగ్రెస్ సభ్యులు తీవ్రంగా స్పందించారు. ఈ సందర్భంగా అధికార, ప్రతిపక్ష సభ్యుల మధ్య జరిగిన వాగ్వాదంపై సిఎం జోక్యం చేసుకుని మాట్లాడారు. సిఎం మాట్లాడుతూ మాజీ ఎంపి జోగినిపల్లి సంతోష్ రావు, ఆయన తండ్రి రవీందర్ రావు సిరిసిల్ల నేరళ్లలో ఇసుక బాధితులను లారీ ఎక్కించి తొక్కి చంపిన అక్రమ ఇసుక మాఫియా మొదలు సర్వే నెంబర్ 168లో శీరిషా జియో గ్రానైట్స్‌కు సంబంధించి మాజీ మంత్రిగా పనిచేసిన వ్యక్తి ఎపి మాజీ ఎంఎల్‌ఎను బెదిరించి మైనింగ్‌ను తమ పేరు మీద రాయించుకుని జరిపిన అక్రమ మైనింగ్ మిడ్‌వెస్ట్ గ్రానైట్స్‌కు సంబంధించి ఎంఎల్‌ఎ తమ్ముడి పేరుతో కొనసాగించిన మైనింగ్, ఎంఎల్‌ఎ గంగుల కమలాకర్‌కు సంబంధించి శ్వేత గ్రానేట్స్‌పై ఆయన కుటుంబ సభ్యులపై సైతం విచారణ కొనసాగుతుందని సిఎం వివరించారు. ఎంపి వద్ది రాజును వేధింపులకు గురిచేసి ఆయనను లొంగదీసుకుని రాయించుకున్న ఘటనతో పాటు గాయత్రి గ్రానేట్స్ అక్రమ మైనింగ్‌పై, మాజీ మంత్రి హరీష్‌రావు మంత్రిగా ఉన్న సమయంలో ఆయన తమ్ముడు మహేశ్ రావు కొనసాగించిన దోపిడితో పాటు తరువాయి 2లో

## మెట్రో ఫస్ట్ ఫేజ్ స్వాధీనం

- శాసనసభలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తీర్మానం
- సభ ఏకగ్రీవ ఆమోదం



హైదరాబాద్ విస్తరణ, పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా ప్రజా రవాణ వ్యవస్థను మెరుగుపర్చడంలో భాగంగా 'హైదరాబాద్ మెట్రో రైల్ లిమిటెడ్ (హెచ్‌ఎంఆర్‌ఎల్) నుంచి మెట్రో మొదటి ఫేజ్‌ను ప్రభుత్వం స్వాధీనం చేసుకోనుందని తెలంగాణ ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి ప్రకటించారు. హైదరాబాద్ మహా నగరానికి అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు తీసుకురావడానికి అవసరమైన కార్యాచరణలో భాగంగా ప్రభుత్వం హైదరాబాద్ మెట్రో రైల్‌ను స్వాధీనం చేసుకునేందుకు శాసనసభలో శనివారం ముఖ్యమంత్రి ప్రవేశపెట్టిన తీర్మానాన్ని సభ ఏకగ్రీవంగా తరువాయి 2లో



### అంగన్‌వాడీ చిన్నారులకు అల్పాహారం

## తొలిముద్ద

- పథకం ప్రారంభించిన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి
- దేశంలో ఆహారభద్రత ఉన్నా పౌష్టికాహారం అందడంలేదని ఆవేదన
- తొలిముద్ద ద్వారా ఉప్మా, కిచిడీ మిక్స్, బ్రేక్ పాస్తాను అందించనున్న ప్రభుత్వం
- అంగన్‌వాడీలు అద్దెభవనాల్లో ఉండడానికి వీలులేదని, సొంత భవనాలు నిర్మించడానికి చర్యలు చేపట్టాలని అధికారులకు ఆదేశం

ప్రజాపక్షం/హైదరాబాద్

దేశంలో ప్రస్తుతం ఆహారభద్రత ఉంది కానీ, పౌష్టికాహారం అందట్లేదని ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి అన్నారు. అంగన్‌వాడీ చిన్నారులకు అల్పాహారం అందించేందుకు 'తొలి ముద్ద' పథకాన్ని ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి ప్రారంభించారు. శాసనసభ కమిటీ హాల్‌లో శనివారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో అంగన్‌వాడీ చిన్నారులకు అల్పాహారం అందించేందుకు బ్రేక్ ఫాస్ట్ పథకం కింద 'తొలి ముద్ద' కార్యక్రమాన్ని ముఖ్యమంత్రి లాంఛనంగా ప్రారంభించారు. ఈ పథకం ద్వారా ప్రభుత్వం ఉప్మా, కిచిడీ మిక్స్‌ను, బ్రేక్ పాస్తాను అందించనుంది. ఈ సందర్భంగా సిఎం రేవంత్ రెడ్డి మాట్లాడుతూ బ్రేక్ ఫాస్ట్ స్కీమ్ అమలు చేయడం వెనుక సహేతుక కారణం ఉందన్నారు. బిడ్డ కడుపులో ఉన్నప్పటి నుంచే తల్లికి పౌష్టికాహారం అందిస్తున్నామన్నారు. సమతులాహారం లేకపోవడం వల్లే ఎక్కువ సమస్యలు వస్తున్నాయన్నారు. పిల్లలకు పౌష్టికాహారం అందితేనే మానసిక ఎదుగుదల ఉంటుందన్నారు. అంగన్‌వాడీ సిబ్బందిని ప్రభుత్వం కుటుంబ సభ్యుల్లా భావిస్తోందని, వారి సమస్యలపై ఎప్పటికప్పుడు చర్చిస్తున్నామన్నారు. అంగన్‌వాడీ కేంద్రాలు అద్దె భవనాల్లో ఉండటానికి వీల్లేదని, సొంత భవనాలు నిర్మించే చర్యలు చేపట్టామన్నారు. గతంలో దేశంలో నిరక్షరాస్యతను తగ్గించేందుకు, వ్యవసాయ అభివృద్ధికి తొలి ప్రధాని నెహ్రూ ఎడ్యుకేషన్, ఇరిగేషన్‌కు ప్రాధాన్యమిచ్చారు. ప్రభుత్వం ఎంత మంచి ప్రణాళికలు చేసినా అమలు చేయాల్సింది అంగన్‌వాడీ టీచర్లు మాత్రమేనని, అందుకే ఈ ప్రభుత్వం మీపై గురుతర బాధ్యత పెట్టిందన్నారు. కార్యక్రమంలో తరువాయి 2లో

## సభా సమయాన్ని అడ్డుకోవద్దు

- హరీశ్‌రావు పద్దులకు సంబంధించి విషయాలు కాకుండా ఇతర అంశాలను ప్రస్తావించడం తగదు
- అధికార కాంగ్రెస్, ప్రతిపక్ష బిఆర్‌ఎస్ సభ్యుల మధ్య మాటల యుద్ధంతో సభా కార్యకలాపాలకు ఆటంకం కలిగించొద్దు
- శాసనసభలో సిపిఐ పక్ష నేత కూనంనేని అసహనం



ప్రజాపక్షం/హైదరాబాద్

శాసనసభ కార్యకలాపాలను బిఆర్‌ఎస్ అడ్డుకోవడం సరైందికాదని సిపిఐ శాసనసభా పక్ష నాయకులు కూనంనేని సాంబశివ రావు హితవు చెప్పారు. శాసనసభలో శనివారం బిఆర్‌ఎస్ శాసనసభ పక్ష ఉప నాయకులు టి.హరీష్‌రావు వివిధ శాఖల పద్దులపై చర్చలో ఆ పద్దులకు సంబంధించిన విషయాలు కాకుండా ఇతర అంశాలు మాట్లాడి సభా సమయాన్ని వృథా చేయడం తగ్గదన్నారు. ఈ సందర్భంగా అధికార కాంగ్రెస్, ప్రతిపక్ష బిఆర్‌ఎస్ సభ్యులు తమ విమర్శలు, ప్రతివిమర్శలు, మాటల యుద్ధంతో సభా కార్యకలాపాలకు ఆటంకం తరువాయి 2లో

## సరైన సమయంలో తగిన నిర్ణయం

- ఆర్‌టిసి విలీన అంశం కమిటీ వద్ద చర్చలో ఉంది
- సంస్థ కార్మికులు, ఉద్యోగుల పట్ల ప్రభుత్వం సానుభూతితో ఉంది
- సమస్యలు పరిష్కరించే బాధ్యత ప్రభుత్వానిది
- ఎవరూ ఆందోళన చెందొద్దు
- సిపిఐ శాసనసభాపక్ష నేత కూనంనేని ప్రస్తావించిన అంశాలపై మంత్రి పొన్నం సమాధానం



ప్రజాపక్షం/హైదరాబాద్

ఆర్‌టిసి కార్మికులు, ఉద్యోగుల పట్ల ప్రభుత్వం సానుభూతితో ఉన్నదని, ఆర్‌టిసి విలీన అంశం విలీన కమిటీ వద్ద చర్చలో ఉన్నదని, సరైన సమయంలో సరైన నిర్ణయం తీసుకుంటామని రాష్ట్ర రవాణ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ హామీ ఇచ్చారు. ఉద్యోగుల సమస్యలను పరిష్కరించే బాధ్యత ప్రభుత్వానిదని, ఎవ్వరూ ఆందోళన చెందాల్సిన అవసరంలేదని ఆయన భరోసా ఇచ్చారు. 'రవాణ, హోమ్, వెనుకబడిన తరగతుల సంక్షేమం' పద్దులపై శాసనసభలో శనివారం జరిగిన చర్చలో సిపిఐ శాసన సభా పక్ష నేత కూనంనేని సాంబశివ రావు ప్రస్తావించిన అంశాలపై మంత్రి పొన్నం ప్రభాకర్ సమాధానమిస్తూ 'నై చెలేగా...బస్‌కా.. పయ్యా..' అంటూ ఆర్‌టిసి ఉద్యోగులు తెలంగాణ ఉద్యమంలో అగ్రభాగాన నిలిచారని గుర్తు చేశారు. వారి సమస్యలను పరిష్కరిస్తామన్నారు. అంతకుముందు కూనంనేని సాంబశివ రావు చర్చలో పాల్గొంటూ సింగరేణి, ఆర్‌టిసి ఉద్యోగుల పాత్ర లేకుండా తెలంగాణ ఉద్యమంలో సకల జనుల సమ్మె విజయవంతమయ్యేది తరువాయి 2లో






## జర్నలిజంలో విలువల పునరుద్ధరణ అవశ్యం

- తప్పుడు ప్రచారాన్ని అడ్డుకోవడంలో జర్నలిస్టుల పాత్ర కీలకం
- ఐజెయు ప్లీనరీలో ఎపి ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు

**అమరావతి :** మీడియాలో వచ్చే కథనాలను తమ ప్రభుత్వం నిశితంగా పరిశీలిస్తోందని, అదేసమయంలో పత్రికా రంగానికి అత్యంత ప్రాధాన్యత నిస్తోందని ఎపి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అన్నారు. ప్రస్తుత మీడియా పోకడల పట్ల ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. విజయవాడ తుమ్మలపల్లి కళాక్షేత్రంలో శనివారం జరిగిన ఇండియన్ జర్నలిస్ట్స్ యూనియన్ (ఐజేయూ) 11వ ప్లీనరీలో ముఖ్యమంత్రి ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రసంగించారు. మూడు దశాబ్దాలుగా తనకు జర్నలిస్టులతో ఉన్న విడదీయలేని అనుబంధాన్ని సిఎం గుర్తు చేసుకున్నారు. ఉమ్మడి రాష్ట్రంలో ఐటీ అభివృద్ధికి తాము వేసిన పునాదుల ఫలితాలు హైదరాబాద్‌లో కనిపిస్తున్నట్లు ఐజెయు ప్రతినిధులు ప్రశంసించడం సంతోషకరమని పేర్కొన్నారు. గతంలో వైఎస్ వివేకానందరెడ్డి మరణం విషయంలో జరిగిన తప్పుడు ప్రచారాన్ని ఉదాహరణగా చూపుతూ... అబద్ధాలను నిజాలుగా చిత్రీకరించే ధోరణి సమాజానికి ఏమాత్రం మంచిది కాదని హితవు పలికారు. గత ప్రభుత్వం మీడియాను కట్టడి చేసేలా తెచ్చిన జీవో నెంబర్ 2430ని ప్రస్తావిస్తూ... తమది జర్నలిస్ట్ ఫ్రెండ్లీ ప్రభుత్వమని, విలేకరులకు ప్రశ్నించే స్వేచ్ఛను తిరిగి కల్పించామని చెప్పారు. ఇప్పటికే మండల రిపోర్టర్లకు అక్రిడిటేషన్లు ఇవ్వడంతో పాటు జర్నలిస్ట్ వెల్ఫేర్ ఫండ్‌ను ఏర్పాటు చేశామన్నారు. మంత్రుల క్వార్టర్ల కోసం కేటాయించిన స్థలాన్ని కూడా ప్రెస్‌క్లబ్‌కు ఇచ్చామని గుర్తు చేశారు. అమరావతిలో ఐజెయు కార్యాలయానికి స్థలం కేటాయించే అంశాన్ని సబ్ కమిటీకి అప్పగిస్తామని హామీ ఇచ్చారు. సోషల్ మీడియాలో జరుగుతున్న తప్పుడు ప్రచారాన్ని అడ్డుకోవడంలో జర్నలిస్టులు కీలక పాత్ర పోషించాలని పిలుపునిచ్చారు. ఇప్పుడు రాజకీయ పార్టీలకు మీడియా సంస్థలు ఉంటున్నాయని, ఇది ప్రజాస్వామ్యానికి మంచిది కాదన్నారు. మీడియాలో పడిపోతున్న విలువలు, సిద్ధాంతాలను పునరుద్ధరించుకోవాల్సిన అవసరం తరువాయి 12లో

## వదంతులు నమ్మొద్దు

- తెలంగాణలో ఇంధన కొరత లేదు
- పుష్కలంగా నిల్వలున్నాయ్
- కేంద్రమంత్రి జి. కిషన్ రెడ్డి



ప్రజాపక్షం/హైదరాబాద్

రాష్ట్రంలో ఇంధన నిల్వలు పుష్కలంగా ఉన్నాయని, ప్రజలు ఎలాంటి భయాందోళనలకు గురికావద్దని కేంద్ర మంత్రి జి. కిషన్ రెడ్డి అన్నారు. హైదరాబాద్ బోలక్‌పూర్ సిజిఓ టవర్స్‌లో శనివారం తెలంగాణలో పెట్రోల్, డిజిల్, ఎల్‌పిజి సరఫరా, లభ్యత ప్రస్తుత పరిస్థితులపై ఆయిల్ మార్కెంట్ కంపెనీలు, డీలర్స్ అసోసియేషన్స్‌తో సమావేశం నిర్వహించారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ కొన్ని ప్రాంతాల్లో పెట్రోల్ బంకుల్లో ఇంధనం అందుబాటులో లేకపోవడం, తాత్కాలికంగా పంపులను మూసివేయడం వంటి ఘటనలు ప్రజల్లో భయాందోళనలకు దారి తీసాయన్నారు. ఈ పరిస్థితులు కేవలం తెలంగాణకు తరువాయి 12లో

## యుద్ధంలోకి హౌతీ సైన్యం

### ఇరాన్, లెబనాన్, ఇరాక్ దేశాలకు మద్దతుగా దాడులు

- ముప్పేట దాడులతో ఇజ్రాయెల్ గడగడ
- బాబ్ ఎల్-మందాబ్ జలసంధిలో నౌకలపై దాడులకు హౌతీ హెచ్చరిక
- యుఎఇలో దాడులు : ఐదుగురు భారతీయులకు గాయాలు
- ఇరాన్ అణుస్థావరాలపై ఇజ్రాయెల్ దాడులు



**సనా/దుబాయ్ :** ఇరాన్ అనుకూల హౌతీ ఉగ్రవాదులు పశ్చిమాసియా యుద్ధరంగంలోకి ప్రవేశించారు. ఇప్పటికే సైనికుల కొరత ఎదుర్కొంటున్న ఇజ్రాయెల్‌పై ఇరాన్, హెజ్బొల్లా, హౌతీ సైన్యాలు ముప్పేట దాడులు ప్రారంభించాయి. దక్షిణ లెబనాన్‌లో హెజ్బొల్లా చేసిన దాడుల్లో తొమ్మిదిమంది ఇజ్రాయెల్ సైనికులు గాయపడ్డారు. ఇజ్రాయెల్ విధ్వంసమే లక్ష్యంగా ఇరాన్, లెబనాన్, ఇరాక్ దేశాలకు మద్దతుగా క్షిపణి, తరువాయి 2లో

## శర్మ ఓలి అరెస్టు

- నేపాల్‌లో నిరసన ప్రదర్శనలు
- ప్రతీకార రాజకీయాలు కట్టిపెట్టండి : ప్రదర్శకుల నినాదాలు
- తక్షణ విడుదలకు డిమాండ్





**కాఠండు:** నేపాల్ మాజీ ప్రధానమంత్రి కె.పి.శర్మ ఓలి (74) ని పోలీసులు శనివారం తెల్లవారుజామున అరెస్టు చేశారు. ఆయనతోపాటు హోంశాఖ మాజీమంత్రి రమేశ్ లేఖాక్‌ను కూడా అరెస్టు చేశారు. దీంతో దేశవ్యాప్తంగా నిరసన ప్రదర్శనలు మొదలయ్యాయి. ప్రతీకార రాజకీయాలు కట్టిపెట్టి వారిని తక్షణం విడుదల చేయాలని ప్రదర్శకులు డిమాండ్ చేశారు. బాలేంద్ర షా బాలెన్ నాయకత్వంలో కొత్త ప్రభుత్వం పదవీ బాధ్యతలు చేపట్టిన 24 గంటల వ్యవధిలోనే వీరిద్దరినీ అరెస్టు చేశారు. హత్యలకు పాల్పడ్డారన్న ఆరోపణలపై నేపాల్ చరిత్రలో దేశ ప్రధానమంత్రిని పోలీసులు అరెస్టు చేయడం ఇదే మొదటిసారి. గౌరీ బహదూర్ కర్కి నాయకత్వంలో విచారణా కమిషన్ సమర్పించిన నివేదికను తక్షణం అమలు చేయాలని కొత్త మంత్రివర్గం తీసుకున్న నిర్ణయానికి అనుగుణంగా ఈ అరెస్టులు జరిగాయి. ఐతే విచిత్రం ఏమిటంటే మంత్రివర్గ సమావేశంలో అ నిర్ణయం తీసుకోకముందే హోంమంత్రి సుడాన్ గురుంగ్ వారిని తరువాయి 2లో

# నాలుగు వారాల్లో యుద్ధం ముగుస్తుంది:రుబియో

### ఇరాన్‌కు పదాతి దళాలు పంపే అవసరం లేదు

### భూతల దళాలు వస్తే నరకం చూస్తారు:ఇరాన్



**పారిస్:** ఇరాన్‌లో తాము చేస్తున్న మిలిటరీ ఆపరేషన్ నాలుగు వారాల్లో ముగిసిపోతుందని అంచనా వేస్తున్నట్లు అమెరికా విదేశీమంత్రి మార్కో రుబియో చెప్పారు. పారిస్ శివార్లలో జరిగిన జి–7 సమావేశానంతరం పాత్రికేయులకు చెప్పారు. యూరోపియన్ మిత్రదేశాలు చేసిన తీవ్ర ఒత్తిడి, అడిన ప్రశ్నలపై ఆయన స్పందించారు. యుద్ధం నెలలపాటు కొనసాగే అవసరం ఉండదని, నాలుగు వారాలలోనే ముగిసిపోతుందని అన్నారు. ఇరాన్‌కు భూతలంపై దాడులు చేసే పదాతి దళాలను తరలించాల్సిన అవసరం లేకుండానే యుద్ధం ముగిపిపోతుందని చెప్పారు. ప్రస్తుతం అక్కడ ఉన్న దళాలకు గరిష్ఠస్థాయిలో ఉపశమనం కలిగించడంకోసం అదనపు బలగాలను పశ్చిమాసియాకు ట్రంప్ పంపించారని ఆయన చెప్పారు. తీవ్ర హెచ్చరికలు, యుద్ధం తర్వాత కూడా ఇస్లామిక్ రివల్యూషనరీ గార్డ్ కోర్ హోర్ముజ్ నుండి వెళ్ళే నౌకల నుండి షిప్పింగ్ టోల్ వసూలు చేయడం సమస్యను మరింతగా పెంచుతోందని, ప్రమాదం పెరుగుతోందని జి–7 సమావేశంలో యూరోపియన్ మిత్రులకు ఆయన తెలియజేశారు. ఈ యుద్ధం వల్ల యూరప్, ఆసియా దేశాలు లాభపడే అవకాశం ఉందన్నారు. ఇదిలా ఉండగా, ట్రంప్ పొడిగించిన గడువు ప్రకటనకు విరుద్ధంగా తమ దేశంపై దాడులు జరుగుతున్నాయని ఇరాన్ విదేశీ వ్యవహారాల మంత్రి అబ్బాస్ అరాఘ్చి విమర్శించారు. ఒకవైపు వేలాదిమంది సైనికులను పశ్చిమాసియాకు తరలిస్తూనే యుద్ధం త్వరగా ముగిసిపోతుందని ప్రకటనలు చేస్తోంది. ఈ పరిస్థితుల్లో అంతర్జాతీయ మార్కెట్‌లో భయాందోళన పెరుగుతోంది. ఇరాన్‌లో అణు కార్యక్రమాన్ని ముగించడం సహా 15 అంశాల ప్రణాళికపై ఇరాన్ నుండి త్వరలో స్పందన వస్తుందని స్టీవ్ విట్‌కాఫ్ చెబుతుండగా, ఇరాన్ సంప్రదింపులు చేస్తోందని, ఒక ఒప్పందం కోసం 'అడుక్కుంటోందని (బెగ్గింగ్) ట్రంప్ చెప్పగా, అమెరికాతో ముఖాముఖీ చర్చలకు అవకాశం లేదని అబ్బాస్ అరాఘ్చి మరోసారి స్పష్టం చేశారు. ఇప్పటివరకూ ఇరాన్ పట్ల చేసిన తీవ్ర నేరాలకు ఇజ్రాయెల్ భారీ మూల్యాన్ని చెల్లించుకుంటుందని హెచ్చరించారు. భూతల దాడులు చేసేందుకు, ఖర్గ్ ద్వీపాన్ని స్వాధీనం చేసుకునేందుకు అదనపు బలగాలను తరలించి అమెరికా ఎలాంటి సాహసం చేసినా గానీ వారికి నరకం చూపించేందుకు 10 లక్షల మంది సైన్యాలను తమ దేశం సిద్ధం చేసిందని ఇరాన్ మీడియా నుండి ప్రకటనలు వెలువడ్డాయి. హోర్ముజ్ జలసంధిని తెరిచేందుకు ఇరాన్‌కు ట్రంప్ ఆదివారం నుండి (మార్చి 30) మరో తొమ్మిది రోజులు ఇరాన్‌కు గడువు ఇచ్చామని, ఈ లోపు ఇరాన్‌లో ఉన్న ప్రధానమైన విద్యుత్ కేంద్రాలపై ఎలాంటి దాడులూ చేయబోమని ట్రంప్ ప్రకటించారు. మొదట రెండు రోజులు (మార్చి 22,23) గడువు ఇచ్చిన ట్రంప్ ఆ గడువును ఐదు రోజులకు పొడిగించారు. ఈ గడువు శనివారంతో ముగిసిపోవడంతో ఏప్రిల్ ఆరో తేదీ వరకూ ఈ గడువు పొడిగిస్తున్నట్లు దానికి ముందురోజే ట్రంప్ మరో ప్రకటన చేశారు. గడువు తీరిపోతే ట్రంప్ చేసే దాడులు చరిత్రలో అతి భయానకంగా ఉంటాయని వైట్‌హౌస్ తొలుత ప్రకటించింది.

# ఉక్రేన్ యుద్ధంపై రుబియో–కల్లాస్ వాగ్వాదం



**పారిస్:** ఉక్రేన్ యుద్ధాన్ని నివారించే విషయంపై జి–7 సమావేశంలో అమెరికా, యూరోపియన్ యూనియన్ ఉన్నతాధిపతుల మధ్య తీవ్ర వాగ్వాదం చోటు చేసుకుంది. "ఏడాది గడచిపోయింది... రష్యాను ఆపలేకపోయారు, ఏం చేయగలిగారు?" అంటూ యూరోపియన్ యూనియన్ విదేశాంగ విధానాధిపతి కాజా కల్లాస్ అమెరికా విదేశీ వ్యవహారాల మంత్రి మార్కో రుబియోపై మండిపడ్డారు. దీంతో వాగ్వాదం చోటు చేసుకుంది. "మేం చేయగలిగింది చేస్తున్నాం, మా కంటే గొప్పగా మీరు చేయగలరనుకుంటే మీరే సమస్యను పరిష్కరించండి, మేం పూర్తిగా పక్కకు తప్పుకుంటాం" అని కాజా కల్లాస్ మాట తీరుపై మార్కో రుబియో తీవ్రస్థాయిలో ధ్వజమెత్తినట్లు 'యాక్సియోస్' నివేదిక తెలియజేసింది. పారిస్ శివార్లలో రెండు రోజులపాటు ఈ సమావేశాలు జరిగాయి. అధికారంలోకి వచ్చిన నెలరోజులకే ఉక్రేన్‌లో యుద్ధానికి చరమగీతం పాడతానని అమెరికా అధ్యక్ష ఎన్నికల ప్రచారంలో ఆనాడు రిపబ్లికన్ అధ్యక్ష అభ్యర్థి హోదాల్లో డోనాల్డ్ ట్రంప్ అన్ని రాష్ట్రాలలో వాగ్దానాలతో ఊదరగొట్టారు. పశ్చిమాసియాలో యుద్ధం ముదిరిపాకాన పడ్డాక ఉక్రేన్–అమెరికా మధ్య కొద్ది రోజులుగా తీవ్రరూపంలో జరుగుతున్న దాడులు,ప్రతిదాడులు, భారీ నష్టాలకు ఎలాంటి ప్రచారం లేకపోగా దానిపై ఎవరికీ జవాబుదారీ లేకపోవడంతో యూరోపియన్ దేశాలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నాయి. ముఖ్యంగా అమెరికాను తప్పుపడుతున్నాయి. తాజా జరిగిన జి–7 మంత్రుల సమావేశంలో కాజా కల్లాస్ ఈ అంశాన్ని తెరమీదకు తెచ్చారు. యుద్ధం ముగించే విషయంలో రష్యాపై అమెరికా ఒత్తిడి పెంచడంలేదని విమర్శించారు. యుద్ధాన్ని ముగించే ప్రయత్నాలు చేస్తున్నామని, ఈ ప్రయత్నాలకు రష్యా అడ్డం పడితే తీవ్ర చర్యలు తీసుకుంటామని ఏడాది క్రితం మార్కో రుబియో చెప్పిన విషయాన్ని ఆమె ఈ సమావేశంలో గుర్తుచేసుకున్నారు. "ఏడాది గడిచింది, రష్యా ముందుకే వెళుతోందిగానీ, ఆగడం లేదు, మీ సహనం ఎప్పుడు నశిస్తుంది.. మీరెప్పుడు చర్యలు తీసుకుంటారు?" అని కల్లాస్ ప్రశ్నించారు. దానిపై రుబియో స్పందిస్తూ, మా వంతు ప్రయత్నం చేస్తున్నాం, మీరు బాగా చేయగలిగితే చేయండి, మేం పక్కకి తప్పుకుంటాం" అన్నారని యాక్సియోస్ పేర్కొంది. ఈ వాగ్వాదం తర్వాత పలువురు యూరోపియన్ మంత్రులు జోక్యం చేసుకుని, అమెరికా తన మధ్యవర్తిత్వాన్ని, సంభాషణలను కొనసాగించాలని రుబియోను కోరారు. ఆతర్వాత రుబియో పాత్రికేయులతో మాట్లాడుతూ సమావేశంలో ఎలాంటి ఘర్షణా జరగలేదని ఖండించారు. తాము నిర్వహించిన పాత్రకు కృతజ్ఞతలు చెప్పే సమావేశాలు జరుగుతాయని, ఈ సమావేశంలో అరుపులూ, ఘర్షణలేమీ లేవని వివరణ ఇచ్చారు.

## ఆయిల్ బ్లాకేడ్ చేస్తే క్యూబా ఏకాకి కాబోదు

### ప్రత్యామ్నాయ వనరులున్నాయి: మంత్రుల ప్రకటన

**హవానా:** క్యూబాకు చమురు ఎగుమతులు లేకుండా కట్టడి చేసినంతమాత్రాన తమ దేశ మనుగడ ఆగిపోదని ఆ దేశ విదేశీ వ్యవహారాల ఉపమంత్రి జోసెఫినా విదల్ ఫెర్రైరో, ఇంధన, గనులశాఖ మొదటి ఉపమంత్రి అర్జెలియో జీసస్ అబద్ విగోవా వేరు వేరు ఇంటర్వ్యూలలో చెప్పారు. తమ మద్దతుదార్ల నుండి సహాయం పొందుతున్నామని ఫెర్రైరో చెప్పారు. ఈ నష్టాలు, కష్టాలు, బాధలు క్యూబాకు ఇదే మొదటిసారి కాదని, తమకు సొంత ప్రత్యామ్నా వనరులు ఉన్నాయని చెప్పారు. చమురు బ్లాకేడ్ కష్టాల నుండి ఎలా బయట పడా లో క్యూబాకు బాగా తెలుసునన్నారు. మేం ఏకాకులం కాదు, మాకు మద్దతు ఉంది, ఈపాటికి మరో దేశమైతే వ్యవస్థ మొత్తం కుప్పకూలిపోయి ఉండేదే, మా ఐక్యతతో మేం నిలదొక్కుకున్నాం" అని చెప్పారు. ఆసుపత్రులు పనిచేస్తున్నాయి, ఎన్ని ఇబ్బందులున్నాగానీ వ్యవస్థలు పనిచేస్తున్నాయి అని చెప్పారు.

క్యూబాకు మిత్రదేశాలు, సోషలిస్టు కూటమి మిత్రదేశాలు సహాయం కొనసాగిస్తున్నాయని "మేసా రెండోడా" అనే ఒక టెలివిజన్ కార్యక్రమంలో మరో మంత్రి విగోవా చెప్పారు. దశాబ్దాలుగా కొనసాగుతున్న నిషేధం, ఆయిల్ కంపెనీలపై ఆంక్షలు, బెదిరింపులు ఉన్నప్పటికీ అంతర్జాతీయ మార్కెట్‌లో క్యూబా ఇంధనాన్ని సేకరించిగలిగిందని విగోవా చెప్పారు. ఆర్థిక వ్యవస్థను, ప్రజల జీవితాలను, క్యూబాను నిలబెట్టడానికి ఓడలు వచ్చాయన్నారు. అంతర్జాతీయ మార్కెట్‌లో కుదుర్చుకున్న ఒప్పందాల ప్రకారం గడచిన జనవరి నుండి ఇప్పటివరకూ క్యూబాకు ఒక్క చమురు నౌక ద్వారా కూడా ఇంధన సరఫరా జరగలేదు. ఈ పరిస్థితి వల్ల అందుబాటులో ఉన్న విద్యుత్‌ను కూడా ఉపయోగించుకోలేకపోతున్నామని చెప్పారు. దేశీయ ముడి చమురు బావులపై ప్రస్తుతం తాము ఆధారపడ్డామన్నారు. కొత్త బావులు తవ్వామని, మంచి ఫలితాలు వచ్చాయని చెప్పారు.

**అమెరికా ఫాసిస్టులు గోబెల్స్ నుండి చాలా నేర్చుకున్నారు**

ఒక అబద్ధాన్నివెయ్యిసార్లు ప్రచారం చేస్తే అదే నిజం అవుతుందని గోబెల్స్ చెప్పిన సూత్రాల నుండి ప్రస్తుతం అమెరికాలో అధికారంలో ఉన్న ఫాసిస్టు పాలకులు చాలా నేర్చుకున్నారని క్యూబా కమ్యూనిస్టుపార్టీ సెంట్రల్ కమిటీ ప్రధాన కార్యదర్శి, ఆ దేశ రిపబ్లిక్ అధ్యక్షుడు డయాజ్ కానెల్ బెర్మెడెజ్ ఒక స్పానిష్ పత్రికకు ఇచ్చిన ఇంటర్వ్యూలో చెప్పారు. లాటిన్ అమెరికా, కరీబియన్ దేశాల కమ్యూనిటీ (సెలాక్) వ్యవస్థాపక సభ్యదేశంగా క్యూబా కొనసాగుతోందని ఇక్కడి పరిస్థితులన్నింటినీ క్యూబా క్షుణ్ణంగా అర్థం చేసుకుంటుందని చెప్పారు. ఈ ప్రాంతంలో జరిగిన అన్ని సమావేశాలకు క్యూబా హాజరైందని, ఇక్కడి ప్రభుత్వాలమధ్య ఏకాభిప్రాయాన్ని కూడగట్టగలదన్నారు. ఉమ్మడి లక్ష్యాలకు, మన అమెరికాఖండ ప్రజల ప్రయోజనాలకు క్యూబా కట్టుబడి ఉందన్నారు. ప్రజలు కష్టాలు పడుతుంటే, అధికారం దుర్వినియోగమవుతుంటే క్యూబా మౌనంగా ఉండలేదన్నారు.క్యూబా తన సార్వభౌమాధికారాన్ని, స్వాతంత్ర్యాన్ని కాపాడుకోవడానికి కట్టుబడి ఉందని చెప్పారు. ఆరు దశాబ్దాలుగా క్యూబా ఆంక్షలు కొనసాగుతున్నాయని, ఈ ఆంక్షలు ఈ ఏడాది జనవరి 29వ తేదీన ఇచ్చిన అతి క్రూరమైన ఉత్తర్వుల ద్వారా పరాకాష్ఠకు చేరాయన్నారు. క్యూబా దాదాపు ప్రతిరోజూ సైనిక దాడులకు గురవుతోందన్నారు. ఈ సంక్లిష్ట పరిస్థితుల్లో క్యూబా ప్రజలు ఎంతో చైతన్యవంతంగా, ఐక్యంగా ఉన్నందుకు తాను కృతజ్ఞతలు తెలయజేస్తున్నానన్నారు. ప్రాంతీయ సంక్లిష్టతలను, క్యూబాకు పొంచి ఉన్న ముప్పును విస్మరించి తప్పించుకోవడానికి ప్రయత్నించేవారిని చరిత్ర క్షమించదని అన్నారు. లాటిన్ అమెరికా సంరక్షణలో క్యూబా వెనుకంజ వేయబోదన్నారు.

# నెతన్యాహూ తప్పుడు అంచనాలతో అమెరికా–ఇజ్రాయెల్ మధ్య విభేదాలు!

**వాషింగ్టన్:** యుద్ధంలో ఇరాన్ రోజు రోజుకూ బలపడుతూ ఉండటమే కాకుండా, అమెరికాకు అన్ని విధాలుగా పరిభవం ఎదురవుతూ ఉండటంతో యుద్ధం ప్రారంభించిన రెండు మిత్రదేశాల మధ్య కొంతకాలంగా అంతర్గతంగా రగులుతున్న విభేదాల అసలు రంగు మెల్లగా బయట పడటం ప్రారంభించింది. ఈ యుద్ధం విషయంలో మొదటి నుండీ వ్యతిరేకంగా ఉంటూ తక్కువగా మాట్లాడిన అమెరికా ఉపాధ్యక్షుడు జె.డి.వాన్స్ ఇప్పుడు తెరమీదకు వస్తున్నారు.

ఈ వారంలోనే జె.డి.వాన్స్, ఇజ్రాయెల్ ప్రధానమంత్రి నెతన్యాహూ మధ్య ఫోన్ సంభాషణలో వాగ్వాదం జరిగిందన్న విషయం చర్చనీయాంశంగా మారింది. అంతర్గతంగా ఉన్న సమస్యలను తట్టుకుని నిలబడేందుకు, తమ తప్పు లేదని ఎదుటివారిమీద పూర్తిగా నిందలు తోసేందుకు తప్పంగా పూర్తిగా నెతన్యాహూ మీదే నెట్టేసేందుకు ట్రంప్ స్వయంగా జె.డి.వాన్స్‌ను ఉపయోగించుకుంటున్నారన్న వాదనలు కూడా బయలుదేరాయి. ఇరాన్‌తో జరుగుతున్న యుద్ధంపై నెతన్యాహూ తాహతుకు మించి మితిమీరిన అంచనావే వేశారని వాన్స్ ఫోన్ సంభాషణల్లో నెతన్యాహూపై ఆగ్రహం వ్యక్తం చేశారని యాక్సియోస్ నివేదిక వెల్లడించింది. ట్రంప్‌ను తప్పుదారి పట్టించారని ఆయనపై జె.డి.వాన్స్ విమర్శలు గుప్పించారట. మొదటినుండీ రకరకాల గందరగోళ ప్రకటనలు చేసే ట్రంప్, "అవసరమైతే యుద్ధం నుండి తాము వైదొలగుతాం, ఇజ్రాయెల్ కొనసాగిస్తుంది" అని కూడా ఒక సందర్భంగా వ్యాఖ్యానించారు. ఫిబ్రవరి 28వ తేదీ మొదటిరోజు దాడుల్లో ఇరాన్ సర్వాధినేత అలీ ఖమేనీ, ఆయన రెండో భార్య, అల్లుడు, కూతురు, మనవరాలు, కోడలు మరణించడంతో ట్రంప్–నెతన్యాహూ సంబరపడ్డారు. ఇక ఇరాన్‌లో ప్రజలు తిరగబడతారని, ప్రభుత్వం తారుమారవుతుందని కలలు గన్నారు. ఆ తర్వాత ట్రంప్, నెతన్యాహూ సహా పలువురు ఇరాన్ ప్రజలను రెచ్చగొట్టే ప్రకటనలు చేసినప్పటికీ అక్కడ ప్రజల నుండి స్పందన రాలేదు. ప్రజలు వీధుల్లోకి రాకుండా మౌనంగా ఇళ్ళల్లో ఉండిపోయారు. దీంతో ట్రంప్ డీలా పడ్డారు.

సత్వరం ఇరాన్‌లో పాలన మార్పు జరుగుతుందని నెతన్యాహూ వేసిన అంచనాలు తలక్రిందులయ్యాయి. జె.డి.వాన్స్ ఇవే ప్రశ్నలను ఆయనను ఫోన్ సంభాషణల్లో నిలదీశారు. తమ అధ్యక్షుణ్ణి బాగానే నమ్మించి యుద్ధంలోకి లాగారని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. పాకిస్థాన్ మధ్యవర్తిగా ఇరాన్‌తో జె.డి.వాన్స్ కీలక చర్చలు జరుపుతున్నారని విస్తారంగా వార్తలు వచ్చాయి. స్టీవ్‌విట్‌కాఫ్, జారెడ్ కుష్నెర్‌లతో తాము చర్చించే ప్రశ్నే లేదని కూడా ఇరాన్ తిరస్కరించిందని వార్తలు వచ్చాయి. 2028లో జరిగే అధ్యక్ష ఎన్నికల్లో జె.డి.వాన్స్ అభ్యర్థిగా ఉన్నారని ఇప్పటికే చాలా ప్రచారం కూడా జరిగింది. ఈ నేపథ్యంలో ఆయన యుద్ధ వ్యతిరేకిగా, శాంతిదూతగా ప్రచారం పొందుతున్నారు.

## మెట్రో ఫస్ట్ ఫేజ్ స్వాధీనం

(మొదటి పేజీ తరువాయి)

ఆమోదించింది. తొలుత సిఎం తీర్మానాన్ని ప్రవేశ పెడుతూ విశాల ప్రజా ప్రయోజనాల దృష్ట్యా హైదరాబాద్ కోర్ అర్బన్ రీజియన్ (క్యూర్) కు మెట్రో నెట్‌వర్క్ విస్తరించాలనే వివిధ వర్గాల డిమాండ్ మేరకు ఫేజ్ 2(ఎ) 76.4 కిలోమీటర్లు, ఫేజ్ 2 (బి) 86.1 కిలోమీటర్ల మేరకు విస్తరణ ప్రతిపాదనలను కేంద్ర ప్రభుత్వానికి సమర్పించామని తెలిపారు. అయితే ఫేజ్I ప్రైవేట్ నిర్వహణలో ఉండగా, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సంయుక్త భాగస్వామ్యంతో ఫేజ్II ప్రభుత్వ ప్రాజెక్టుగా చేపట్టేందుకు సాంకేతిక, చట్టపరమైన, నిర్వహణ సమస్యలను ఎదురువుతున్నాయని ఆయన వివరించారు. ఇందుకోసం మెట్రో ఫేజ్ 1 స్వాధీనం చేసుకునే ప్రక్రియకు రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న ఈ నిర్ణయాన్ని సభ ఏకగీవ్రంఅ ఆమోదించాలని సిఎం విజ్ఞప్తి చేశారు. మెట్రో విస్తరణకు కేంద్ర ప్రభుత్వం సహకరించాలని సిఎం కోరారు. అంతకుముందు ఈ అంశానికి సంబంధించి శాసనసభ వ్యవహారాల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు సభలో ఒక ప్రకటన చేశారు.

## శర్మ ఓలి అరెస్టు

(మొదటి పేజీ తరువాయి)

వెంటనే అరెస్టు చేయాలని ఆదేశాలు జారీ చేశారు. దీంతో నేపాల్ దేశవ్యాప్తంగా సిపిఎన్–యుఎంఎల్ పార్టీ కార్యకర్తలు,ప్రజలు, అభిమానులు అనేక ప్రాంతాలలో నిరసన ప్రదర్శనలు జరిపారు. తక్షణం ఓలిని, ఇతరులను విడుదల చేయాలని డిమాండ్ చేశారు. విచారణ కమిషన్ నివేదిక ప్రతులను కార్యకర్తలు దగ్ధం చేశబూరు. ఆల్ నేపాలీ నేషనల్ ఫ్రీ స్టూడెంట్స్ యూనియన్ కార్యకర్తలు,విద్యార్థులు పెద్దసంఖ్యలో వీధుల్లోకి వచ్చి కొత్త ప్రధానమంత్రి బాలేంద్ర షాకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. హోంమంత్రి సుడన్ గురుంగ్ చర్యను తీవ్రంగా ఖండించారు. త్రిభువన్ యూనివర్సిటీ కాలేజీ ఆర్‌ఆర్ క్యాంపస్‌కు ఎదురుగా భ్రికుటి మండపంవద్ద ప్రదర్శన జరిపారు. ఓలిని తక్షణం విడుదల చేయాలని కోరుతూ ఎఎన్‌ఎన్‌ఎఫ్‌ఎస్‌యు విద్యార్థులు ప్ల కార్డులు ప్రదర్శిస్తూ నినాదాలు చేశారు. ఈ అరెస్టుకు ముందుగతా వారికి వైద్య పరీక్షలు నిర్వహించారు. గత ఏడాది సెప్టెంబరు 8,9 తేదీలలో నేపాల్‌లో జరిగిన జనరేషన్ జెడ్ ఉద్యమాన్ని మానవహక్కులను ఉల్లంఘించి అమానవీయస్థాయిలో హింసాత్మక పద్ధతులలో అణచివేతకు గురిచేశారన్న కేసులో కె.పి.శర్మ ఓటి, లేఖాక్ ప్రధాన ఆరోపణలు ఎదుర్కొంటున్నారు. "ఇది ప్రతీకారం కాదు, న్యాయానికి నాంది, వారిద్దరు జనరేషన్ జెడ్ ఉద్యమాన్ని తీవ్రంగా అణచివేశారన్న ఆరోపణలు ఎదుర్కొంటున్నారు, మేం ఇచ్చిన మాటను నిలబెట్టుకోవాల్సిన అవసరం ఉంది, మేం ఇప్పుడు కె.పి.శర్మ ఓలి, నిన్న పదవీ విరమణ చేసిన హోంమంత్రి లేఖక్‌లను అరెస్టు చేశాం, నేపాల్ దేశం ఇప్పుడు ఒక కొత్త దిశగా ప్రయాణం చేస్తోందని మేం నమ్ముతున్నాం" అని శుక్రవారం దేశ హోంశాఖామంత్రిగాబాధ్యతలు తీసుకున్న సుడాన్ గురుంగ్ తన ఫేస్‌బుక్ ఖాతా ప్రకటనలో పేర్కొన్నారు. గుండులో ఉన్న ఆయన నివాసంలో శనివారం తెల్లవారుజామున ఓలిని అరెస్టుచేశాం, శుక్రవారం రాత్రి నుండీ ఆయన అరెస్టుకు తీవ్ర ప్రయత్నాలు కొనసాగాయి. ఆ తర్వాత భక్తపూర్ కుతుంజేలో ఉన్న నివాసం నుండి లేఖక్‌ను కూడా అరెస్టు చేశాం, గత ఏడాది సెప్టెంబరు ఎనిమిదో తేదీన జరిగిన జనరేషన్ జెడ్ ఉద్యమంలో 19 మంది విద్యార్థులు సహా మొత్తం 76 మంది మరణించడానికి ప్రధాన కారకులన్న ఆరోపణలపై వారిద్దరినీ అరెస్టు చేశామని కొత్త హోంమంత్రి సుడాన్ గురుంగ్ పేర్కొన్నారు. ఖర్గా ప్రసాద్ శర్మ ఓలి నేపాల్‌కు మూడుసార్లు ప్రధానమంత్రిగా పనిచేశారు. 2015– 16లో ఒక ఏడాది, 2018 నుండి 2021 వరకూ నాలుగేళ్ళు, 2024 నుండి 2025 సెప్టెంబరులో పదవీచ్యుతుడయ్యే వరకూ మరో ఏడాది కాలం ఆయన ప్రధానమంత్రి బాధ్యతలు నిర్వహించారు. 2017 నుండి ఇప్పటివరకూ ఆయన ఝూపా నియోజకవర్గాల నుండి ఎంపిగా కొనసాగుతూ వచ్చారు. కానీ ఈ ఏడాది మార్చి ఐదో తేదీన జరిగిన ఎన్నికల్లో కంచుకోట వంటి ఆయన నియోజకవర్గంలోనే కొత్త ప్రధానమంత్రి బాలేంద్ర షా సవాలు చేసి ఓలిపై విజయం సాధించారు. 1970 లో నేపాల్ కమ్యూనిస్టుపార్టీలో చేరిన కె.పి.శర్మ ఓలి ప్రస్తుతం సిపిఐ (యుఎంఎల్) నాయకుడుగా ఉన్నారు.

# వాకౌట్ చేయడానికే సభకొచ్చారా?

### డిప్యూటీ సిఎం భట్టి విక్రమార్క

### వాకౌట్ అంటూ ఇలా వెళ్లి... అలా వస్తారా?: మంత్రి శ్రీధర్‌బాబు

**ప్రజాపక్షం/హైదరాబాద్:** శాసనసభకు వచ్చిందే వాకౌట్ చేయడానికి అన్నట్టుగా బిఆర్‌ఎస్ ఎంఎల్‌ఎలు వ్యవహరిస్తున్నారని డిప్యూటీ సిఎం మల్లు భట్టి విక్రమార్క మండిపడ్డారు. శాసనసభలో శనివారం పద్దులపైన జరిగిన చర్చలో బిఆర్‌ఎస్ సభ్యులు రెండు పద్దులపైన రెండుసార్లు వేర్వేరుగా వాకౌట్ చేశారు. దీనిపైన డిప్యూటీ సిఎం భట్టి విక్రమార్క స్పందిస్తూ శాసనసభ బిఎసిలో సభ ఎక్కువ రోజులు పెట్టాలని డిమాండ్ చేసే బిఆర్‌ఎస్,సభలో మాత్రం ఇలా వాకౌట్ చేసి వెళ్ళడం అర్థం ఏమిటని?, ఇది సరైంది కాదని బిఆర్‌ఎస్ సభ్యులకు సూచించారు.

అనంతరం శాసనసభ వ్యవహారాల శాఖ మంత్రి మాట్లాడుతూ బిసిలకు అన్యాయం చేసిందే బిఆర్‌ఎస్ అని, వారి పదేళ్ల పాలనలో బిసిలకు ఒరిగిందేమీలేదని, ఆ పార్టీకి బిసిల గురించి మాట్లాడే నైతిక హక్కు లేదన్నారు. వచ్చే లోక్‌సభ ఎన్నికల్లో అధికారంలోకి రాబోయేది కాంగ్రెస్ పార్టీనేనని, రాహుల్ గాంధీ నాయకత్వంలో రాజ్యాంగ సవరణ చేసి, రిజర్వేషన్ల విషయంలో బిసిలకు ఇచ్చిన మాటను నిలబెట్టుకుంటామని అన్నారు. ఏ అంశంలో కూడా బిఆర్‌ఎస్ సభ్యులకు చిత్తశుద్ధి లేదని, అందుకే ముఖ్యమైన అంశాలపై హౌజ్‌లో చర్చ జరుగుతుంటే బిఆర్‌ఎస్ వాకౌట్ చేస్తుందన్నారు. వాకౌట్ చేస్తే రోజంతా చేయాలని, కానీ ఇలా బయటకు వెళ్లి, మళ్లీ అలా సభలోకి వస్తున్నారని, ప్రతి విషయాన్ని ప్రజలు గమనిస్తున్నారని చెప్పారు. ఇన్నోవాలు సమకూర్చడమే పోలీస్ సంక్షేమమా?, పోలీసుల సంక్షేమానికి తమ ప్రభుత్వం చిత్తశుద్ధితో కృషి చేస్తుంటే, ఏం చేయలేదంటూ తమను విమర్శించడం ఎంత వరకూ సమంజసమని ప్రశ్నించారు.

ఆర్‌టిసిని నిర్వీర్యం చేసిందే బిఆర్‌ఎస్ అని ఆరోపించారు. గత బిఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో ఆర్‌టిసి కార్మికులు సమ్మెకు దిగినప్పటికీ వారిని పట్టించుకోలేదని, సమ్మెకాలంలో 56 మంది కార్మికులు చనిపోయారని మంత్రి శ్రీధర్‌బాబు గుర్తు చేశారు.

తమకు మరో మూడేళ్ల సమయం ఉన్నదని, ఆ తర్వాత కూడా తెలంగాణ రాష్ట్రంలో మరోసారి అధికారంలోకి వస్తామన్నారు.

## తొలిముద్ద (మొదటి పేజీ తరువాయి)

అంగన్‌వాడీ సిబ్బందికి మొబైల్ ఫోన్లను సిఎం పంపిణీ చేశారు. రాష్ట్ర మంత్రులు ధనసరి అనసూయ సీతక్క, కొండా సురేఖ, ఫుడ్ కార్పొరేషన్ చైర్మన్ ఫహీమ్, శిశు సంక్షేమ కమిషన్ చైర్మన్ సీతా దయాకర్ రెడ్డి సహా పలువురు ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

## తగిన నిర్ణయం (మొదటి పేజీ తరువాయి)

కాదన్నారు. ఆర్‌టిసి ఉద్యోగులు సమ్మె నోటీసులు ఇచ్చారని, ప్రభుత్వం వారిని తమ సొంత పిల్లలుగా భావిస్తూ, ఆర్థిక భారం లేని సమస్యలను ముందుగా పరిష్కరించి, మిగతా సమస్యలు ఎప్పటివరకు పరిష్కరిస్తారో స్పష్టం చేయాలని ఆయన రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. ఇప్పటికే ఆర్‌టిసి సమస్యలను తాము అనేక పర్యాయాలు ప్రభుత్వం దృష్టికి తీసుకొచ్చామని గుర్తు చేశారు. ఉద్యోగులు తమ బాధలు చెప్పుకునేందకు ఆర్‌టిసిలో ట్రేడ్ యూనియన్లు కూడా లేకపోవడం అన్యాయమన్నారు. ఆర్‌టిసి విలీనం లాంటి సమస్యలను పరిష్కరించాలని కోరారు. ఉద్యోగులు రోడ్లపైకి వస్తే ప్రభుత్వానికే మంచిదికాదని సాంబశివరావు సూచించారు. కాలుష్య నివారణకు ఎలక్ట్రిక్ బస్సులు అవసరమేనని, అయితే వాటిని ఆర్‌టిసి సంస్థ ఆధ్వర్యంలోనే నడిపించాలని ఆయన అన్నారు.

## అడ్డుకోవద్దు

(మొదటి పేజీ తరువాయి)

కల్పించడం పట్ల సాంబశివరావు అసహానం వ్యక్తం చేశారు. పరిశ్రమలు, మైనింగ్ వేర్వేరు శాఖలని, వీటికి మంత్రులు ఉన్నారని, అసలు పదులపై కాకుండా పద్దులకు సంబంధంలేని అంశాన్ని లేవనెత్తి మంత్రి పేరు ప్రస్తవిస్తూ సభా కమిటీ వేయాలనడం సబబు కాదని పేర్కొన్నారు. సభ్యుడు లేవనేత్తిన అంశానికి సంబంధిత మంత్రి విచారణ చేపడుతామని సభకు స్పష్టంగా చెప్పినప్పటికీ సభ్యులు దానిని పదే పదే ప్రస్తావిస్తూ సభా కార్యకలాపాలకు ఆటంకం కల్పిస్తున్నారని, గతంలో బయ్యారంకు సంబంధించి సమస్యను సభలో లేవనెత్తితే సభా సంఘం వేయలేదని గుర్తు చేశారు. ఏ అంశాన్ని అయినా తేగే వరకు లాగవద్దని ఆయన సూచించారు. పద్దులపై అన్ని పక్షాల సభ్యులు మాట్లాడాల్సి ఉందని, సభ సజావుగా కొనసాగేలా సహాకరించాలని బిఆర్‌ఎస్ సభ్యులను కూనంనేని సాంబశివరావు కోరారు.

## యుద్ధంలోకి హౌతీ సైన్యం

(మొదటి పేజీ తరువాయి)

డ్రోన్ దాడులు ప్రారంభించినట్లు హౌతీ నాయకుడు శనివారం ధృవీకరించారు. అతి సన్నని "బాబ్ ఎల్–మందాబ్ జలసంధి" వద్ద కూడా శత్రు వాణిజ్య నౌకలపై దాడులు చేస్తామని హెచ్చరించారు. దీంతో పశ్చిమాసియాలో యుద్ధం 29వ రోజు శనివారం హౌతీలు చేసిన మొదటి దాడులతో కొత్త పరిణామాలు సంభవించాయి. మరోవైపు ఇజ్రాయెల్ కూడా ఇరాన్ అణుస్థావరాలపై దాడులు చేసింది. గల్ఫ్‌లో ఇరాన్ దాడులు కొనసాగుతుండగా, యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ అబుధాబిలో ఖలీఫా ఎకనామిక్ జోన్‌పై దాడుల్లో ఐదుగురు భారతీయులు గాయపడ్డారు. యుఎఇలో గురువారం జరిగిన దాడుల్లో ఒక భారతీయుడు మరణించారు. ఈ ఘటనపట్ల భారత దౌత్యకార్యాలయం తీవ్ర సంతాపం, ఆందోళన వ్యక్తం చేసింది. గల్ఫ్ ప్రాంతంలో శాంతి నెలకొనాలంటే అమెరికా దాడులకు అవకాశం ఇవ్వకూడదని ఇరాన్ విదేశీమంత్రి అబ్బాస్ అరాఘ్చి చెప్పారు. బహ్రైన్,ఖతార్,యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్,జోర్డాన్,సౌదీ అరేబియా,కువైట్ తదితర దేశాలకు ఆయన ఈ హెచ్చరిక చేశారు. మార్చి 19వ తేదీ నుండి ఇప్పటివరకూ ఇరాన్–హెజ్బొల్లా చేసిన దాడులవల్ల ఇజ్రాయెల్‌లో 19 మంది మరణించారు. వారి రాకెట్లు,క్షిపణులు తీవ్ర విధ్వంసం సృష్టించాయి. మరోవైపు ఇరాన్‌లోని క్వామ్,కెర్మన్‌షా ప్రాంతాలపై ఇజ్రాయెల్ భారీ ఎత్తున విరుచుకుపడటంతో ఈ ప్రాంతాలలో 31 మంది ఇజ్రాయెలీ ప్రజలు మరణించారు.తమ నాయకుడు మరణించినప్పటికీ హోర్ముజ్ జలసంధి మూసే ఉందని ఐఆర్‌జిసి ప్రకటించింది. ప్రిన్స్ సుల్తాన్ ఎయిర్ బేస్ వద్ద ఇరాన్ క్షిపణులు,డ్రోన్లు భారీస్థాయిలో దాడులు చేయడంతో 12 మంది అమెరికా సైనికులు గాయపడ్డారు. వీరిలో ఇద్దరు అమెరికన్ సైనికుల పరిస్థితి ప్రమాదకరంగా ఉంది. అదేవిధంగా ఈ వైమానిక స్థావరంలో ఉన్న అనేక విమానాలు, సాంకేతిక పరికరాలు ధ్వంసమయ్యాయి

మూడు వైపుల నుండీ దాడులతో ఊహించని విధంగా ఇజ్రాయెల్ ఉక్కిరి బిక్కిరి అవుతోంది. తాము యుద్ధరంగంలోకి ప్రవేశించామని, ఇజ్రాయెల్‌పై క్షిపణి దాడులు చేశామని యెమెన్ సాయుధ బలగాల అత్యున్నత అధికారి బ్రిగేడియర్ జనరల్ యాహ్యా సరీ శనివారం ఉదయం ఒక ప్రకటన చేశారు. ఇరాన్‌కు మద్దతుగా తాము యుద్ధరంగంలో ప్రవేశిస్తామని యెమెన్ రాజధాని సనాలో హౌతీ దళాల అత్యున్నత అధికారి అబ్దుల్ మాలిక్ అల్ హౌతీ మార్చి 12వ తేదీన ఒక ప్రకటన చేశారు. చెప్పినట్టే తర్వాత 15 రోజులకు యుద్ధంలోకి వచ్చారు. గాజాలో రెండేళ్ళపాటు ఇరాన్ యుద్ధం చేసిన సమయంలో కూడా హౌతీలు పాలస్తీనియన్లకు సంఘీభావంగా ఎర్ర సముద్రంలో ఇజ్రాయెల్ సంబంధ నౌకలపై దాడులు చేశారు. ఇదిలా ఉండగా ఇజ్రాయెల్ కూడా వెనక్కు తగ్గకుండా ఇరాన్‌లోని అణుస్థావరాలపై దాడులు చేసింది. ఐతే ఎలాంటి రేడియేషన్ వెలువడలేదు. దీంతో ఎలాంటి నష్టం వాటిల్లలేదని ఇరాన్ ఆటమిక్ ఎనర్జీ సంస్థ ప్రకటన చేసింది. అదేవిధంగా ఉత్తర ప్రాంత సరిహద్దులను రక్షించుకోవడానికి లెబనాన్‌లోకి ఇజ్రాయెల్ తన 162వ డివిజన్ బలగాలను పంపించింది. ఇరాన్‌పై ఇప్పటివరకూ జరిగిన దాడులలో 600 పాఠశాలలు ధ్వంసమయ్యాయి. 1000 మంది విద్యార్థులు గాయపడ్డారు. ఫిబ్రవరి 28 నుండి ఇప్పటివరకూ ఇరాన్ నగరాలపై ఇజ్రాయెల్–అమెరికా 200కు పైగా లక్ష్యాలపై బాంబు దాడులు చేశాయి. కాగా లెబనాన్‌లోఇజ్రాయెల్ దాడులవల్ల 1100 మంది మరణించగా, ఇరాన్‌లో మృతుల సంఖ్య 1900కు పెరిగింది. ఇప్పటివరకూ యుద్ధంలో 13 మంది అమెరికా సైనికులు మరణించారు.

# అక్రమాలపై సిబిసిఐడి

(మొదటి పేజీ తరువాయి)

రాఘవ కన్‌స్ట్రక్షన్‌పై సిబిసిఐడి విచారణకు ఆదేశిస్తున్నామని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సభలో ప్రకటించారు.

**ప్రభుత్వ ఆదాయానికి గండి కొట్టే ఎలాంటి తప్పిదాలు జరిగినా ప్రభుత్వం ఉపేక్షించబోదు**

ప్రభుత్వ ఆదాయానికి గండి కొట్టే ఎలాంటి తప్పిదాలు జరిగినా కాంగ్రెస్ ప్రభుత్వం ఉపేక్షించబోదని ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి స్పష్టం చేశారు. ఇసుకకు సంబంధించి 2024 25 ఆర్థిక సంవత్సరంలో రూ.721 కోట్లున్న ఆదాయాన్ని కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత 2025 26లో రూ. 972 కోట్లకు (35 శాతం) ఆదాయం పెంచామని చెప్పారు. ఇసుక మాఫియాకు , దోపిడీకి పాల్పడిది హరీశ్‌రావు, కెటిఆర్‌లే సిఎం అన్నారు. రాష్ట్రంలో నిర్మాణ రంగం కుంటుపడిందని, రియల్ ఎస్టేట్ దెబ్బతిన్నదని బిఆర్‌ఎస్ సభ్యులే అంటున్నారని, అదే నిజమైతే ఆదాయం ఏలా పెరిగిందని, ఇసుకను ఏమైనా బుక్కుతున్నామా, లేక బిర్యానీ చేసుకుని తింటున్నామా అని సిఎం ప్రశ్నించారు. రియల్ ఎస్టేట్ పడిపోయినప్పుడు ఆదాయం పెరిగిందంటే గతంలో ప్రతి ఏడాది రూ.1000 కోట్ల దోపిడీకి పాల్పడ్డారని, దీనికి హరీశ్‌రావు, కెటిఆర్‌లే నాయకత్వం వహించారని సిఎం అన్నారు.

మొదట్లో మైనింగ్ శాఖ హరీశ్‌రావు వద్ద ఉండగా, ఆయన అడ్డగోలుగా దోపిడీకి పాల్పడుతున్నారని, అప్పటి ముఖ్యమంత్రి కె.చంద్రశేఖరరావు ఆ శాఖను తన కొడుకు కెటిఆర్‌కు అప్పగించి ఆయన దోచుకోవడానికి అవకాశం ఇచ్చి కొడుకు అల్లుడికి మధ్య పంచాయితీ లేకుండా చూశారన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఇసుక, మైనింగ్‌కు సంబంధించి ఆదాయం పెరగడంతో ప్రభుత్వానికి మంచి పేరు రావడంతో పాటు గతంలో బిఆర్‌ఎస్ ప్రభుత్వం చేసిన అవినీతి ఎక్కడ బయటపడుతుందోనన్న భయంతో ప్రభుత్వంపై బురద జల్లి మంత్రులను లొంగదీసుకునేందుకే బిఆర్‌ఎస్ సభ్యులు ఆరోపణలు చేస్తున్నారని ముఖ్యమంత్రి అన్నారు.

**బిఆర్‌ఎస్ నాయకుల బ్లాక్ మెయిల్స్‌కు భయపడం : సి ఎం**

బిఆర్‌ఎస్ నాయకుల బ్లాక్ మెయిల్స్ రాజకీయాలకు భయపడే ప్రసేక్తే లేదని ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి శాసనసభలో స్పష్టం చేశారు. బిఆర్‌ఎస్ నేతల పైరవీలను అనుమతించడంలేదనే అక్కసుతోనే మంత్రిపై వారు ఆరోపణలు చేస్తున్నారని సిఎం అన్నారు. రాఘవ కన్‌స్ట్రక్షన్స్‌కు సంబంధించిన విషయాలను ప్రతిపక్షం కనిపెట్టలేదని, ఏలాంటి ఫిర్యాదు అందలేదని, ప్రభుత్వమే గుర్తించి చర్యలు చేపట్టిందని చెప్పారు. ఇందులో భాగంగా రాఘవ కన్‌స్ట్రక్షన్స్‌కు నోటీసులు ఇవ్వడమే కాకుండా ఆ సంస్థ నుంచి ప్రభుత్వానికి రావాల్సిన ఆదాయాన్ని వసూలు చేసినట్లు సిఎం తెలిపారు. ఈ అంశం విషయంలో ప్రభుత్వంపై, మంత్రులపై బురద జల్లి వారిని ఒత్తిడికి గురి చేసి గతంలో మాదిరిగా బెదిరింపులకు పాల్పడి భూములు రాయించుకోవాలనుకుంటే ఇక్కడ పప్పులు ఉండకవని సిఎం స్పష్టం చేశారు. రాఘవ కన్‌స్ట్రక్షన్స్‌కు తనకు గానీ, తన కుటుంబానికి గానీ సంబంధంలేదని మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి గతంలో వెల్లడించారని, బిఆర్‌ఎస్ సభ్యులు నిజ నిర్ధారణ అని అక్కడికి వెళ్లి వీరంగం చేశారన్నారు.

మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి బంధువులకు వ్యాపారాలు ఉంటే ఆయనకేమి సంబంధమని సిఎం ప్రశ్నించారు. మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి ఆయన దూరపు బంధువులకు ఉన్న వ్యాపారానికి ముడిపెట్టి మంత్రిని లొంగదీసుకోవడం దిక్కుమాలిన చర్య అని సిఎం పేర్కొన్నారు.

కల్వకుంట్ల తారక రామారావు, కల్వకుంట్ల కవితరావు ఈ ఇద్దరు కల్వకుంట్ల చంద్రశేఖరరావు పిల్లలే కదా, ఆదాయం పంపకాల్లో తేడాలు వస్తే సొంత చెల్లినే మెడలు పట్టి ఇంట్లో నుంచి, పార్టీలో నుంచి బయటికి గెంటి వేశారని, సొంత అన్నా చెల్లెళ్లకే ఆస్తి తగదాలు ఉన్నాయని సిఎం అన్నారు.

● అసెంబ్లీ మీడియా పాయింట్

## విమర్శలకే బిఆర్ఎస్ పరిమితమా?

ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్



**ప్రజాపక్షం/హైదరాబాద్:** శాసనసభ సమావేశాల సమయంలో సభ్యుల ఆరోగ్యాన్ని దృష్టిలో పెట్టుకుని క్రీడా పోటీలు నిర్వహిస్తున్నామని, యువతను క్రీడల వైపు మళ్లించడమే లక్ష్యమని ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ తెలిపారు. క్రీడా పోటీలను బహిష్కరిస్తున్నట్లు కెటిఆర్ ప్రకటించడం పట్ల ఆది శ్రీనివాస్ అభ్యంతరం వ్యక్తం చేస్తూ ఫామ్ హౌస్ పోటీలు, క్లబ్ హౌస్ పోటీలకు వస్తారా? అని ఎద్దేవా చేశారు. ముఖ్యమంత్రి యువతను సానుకూల దిశగా తీసుకెళ్లాలని ప్రయత్నిస్తుంటే, బిఆర్ఎస్ నేతలు ప్రతి అంశాన్ని తప్పుపడుతున్నారని అన్నారు. గంజాయి రహిత రాష్ట్రంగా మార్చేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని, కానీ బిఆర్ఎస్ నేతలు విమర్శలకే పరిమితమవుతున్నారని విమర్శించారు. మాజీ మంత్రి హరీశ్‌రావు ఒక కంపెనీపై వ్యక్తిగత అక్కసుతో మాట్లాడుతున్నారన్నారు. పదేళ్ల పాలనలో ప్రజా సంపద దోచుకుని, కుటుంబాలకే పరిమితం చేశారని ఆరోపించారు. ఇదే విషయంపై ఎమ్మెల్యే విజయరమణారావు మాట్లాడుతూ గోదావరి, మానేరు ప్రాంతాల్లో ఇసుక మాఫియా సాగిందని, బినామీల పేరుతో భారీ అవినీతి జరిగిందని విమర్శించారు. నిజాలు బయటపడిన తర్వాత బిఆర్ఎస్ నేతలు ప్రజలకు ఏమి సమాధానం చెబుతారో చూడాలన్నారు. ఎమ్మెల్యే వీర్లపల్లి శంకరయ్య మాట్లాడుతూ.. బిఆర్ఎస్ నేతలు ప్రజలకు ఉపయోగపడే అంశాలపై చర్చించకుండా మాఫియాలకు మద్దతు ఇస్తున్నారని విమర్శించారు. రాష్ట్రంలో శాంతి భద్రతలు కాపాడుతున్న ప్రభుత్వాన్ని సహించలేక అసభ్యంగా ప్రవర్తిస్తున్నారని అన్నారు.

ఎమ్మెల్యే ఆదినారాయణ మాట్లాడుతూ.. అసెంబ్లీలో మంచి అంశాలపై చర్చ జరుగుతున్న సమయంలో మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌పై నిరాధార ఆరోపణలు చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎమ్మెల్యే రాంచందర్ నాయక్ మాట్లాడుతూ, రాఘవ కన్‌స్ట్రక్షన్‌కు పొంగులేటి కుటుంబానికి సంబంధం లేకున్నా కావాలనే నిందలు వేస్తున్నారని అన్నారు. గత పదేళ్ల మైనింగ్ అవినీతిపై సిబిసిఐడి ఎంక్వైరీకి సిద్ధమని ప్రభుత్వం చెబుతున్నా, బిఆర్ఎస్ నేతలు అసత్య ప్రచారాలతో ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నారని విమర్శించారు.

### ప్రభుత్వం అడ్డంగా దొరికిపోయింది

బిఆర్ఎస్ ఎమ్మెల్యే జగదీశ్వర్‌రెడ్డి



**ప్రజాపక్షం/హైదరాబాద్:** ప్రభుత్వం బహిరంగంగా ప్రజల ముందే దొరికిపోయిందని బిఆర్ఎస్ ఎమ్మెల్యే జగదీశ్వర్‌రెడ్డి విమర్శించారు. అసెంబ్లీలో జరిగిన చర్చల సందర్భంగా, ఒక మంత్రి వ్యవహారం ప్రభుత్వ ప్రతిష్టకు గండి కొడుతోందని పేర్కొన్నారు. ఈ అంశంపై తాము రాజకీయ ఆరోపణలు చేయలేదని, టి.హరీశ్‌రావు ఆధారాలతోనే రాఘవ కన్‌స్ట్రక్షన్ కంపెనీపై ఆరోపణలు చేశారని తెలిపారు. మంత్రి సభలో ఉన్నప్పటికీ స్పందించకపోవడం అనుమానాలకు తావిస్తోందని, అయితే ఇతర ఎనిమిది మంది మంత్రులు స్పందించడం గమనార్హమన్నారు. సాధారణ ఉద్యోగి వెయ్యి రూపాయల అవినీతి చేస్తే చర్యలు తీసుకుంటారని, కానీ మంత్రి విషయంలో మాత్రం వేరే విధంగా వ్యవహరిస్తున్నారని విమర్శించారు. కంపెనీకి సరైన అనుమతులు లేవని, విద్యుత్ లేకుండా డీజిల్ జనరేటర్లతో పనులు నిర్వహించడం పెద్ద నేరమని అన్నారు. ఈ వ్యవహారంలో సంబంధిత కుటుంబ సభ్యులు డైరెక్టర్లుగా ఉన్నారని ఆరోపించారు. కెసిఆర్ నాయకత్వంలో గతంలో ఆదాయం భారీగా పెరిగిందని, ప్రస్తుతం ప్రభుత్వం ధరలు పెంచినా ఆదాయం ఆశించిన స్థాయిలో లేదని విమర్శించారు. ఈ నేపథ్యంలో అవినీతి జరుగుతోందని ఆరోపించారు. అలాగే కాళేశ్వరం లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్ట్ వద్ద పంపులు ఆన్ చేయకుండా, బ్యారేజ్ భద్రతను పక్కన పెట్టి ఇసుక మాఫియా కొనసాగుతోందని అన్నారు. తమపై కేసులు పెట్టి బెదిరించే ప్రయత్నాలు జరుగుతున్నాయని, అయినా తాము వెనక్కి తగ్గబోమని స్పష్టం చేశారు. ప్రభుత్వం అసెంబ్లీని బ్లాక్‌మెయిల్ చేస్తోందని, సభను బుల్డోజ్ చేస్తున్నదని ఆరోపించారు. ఈ వ్యవహారంపై మరిన్ని వివరాలు బయటపెడతామని హెచ్చరిస్తూ, ప్రభుత్వం ప్రజల ముందే దోషిగా నిలిచిందని జగదీశ్వర్‌రెడ్డి పేర్కొన్నారు.

# ప్రతిపక్షంలోకి రాగానే నీటి సమస్య గుర్తొచ్చిందా?

- మిషన్ భగీరథ ద్వారా గ్రామాల్లో వందశాతం నీటి సరఫరా జరుగుతుందని కేంద్రానికి నివేదించింది మీరు కాదా?
- శాసనసభలో బిఆర్ఎస్‌ను నిలదీసిన మంత్రి సీతక్క
- 15వేల అంగన్‌వాడీ పోస్టులు జారీ చేస్తామని ప్రకటన

**ప్రజాపక్షం/హైదరాబాద్:** మిషన్ భగీరథ ద్వారా గ్రామాల్లో వంద శాతం నీటి సరఫరా జరుగుతుందని గత బిఆర్ఎస్ ప్రభుత్వం కేంద్రానికి నివేదించిందని, తద్వారా నీటి సరఫరాకు కేంద్ర ప్రభుత్వం మళ్లీ నిధులను మంజూరు చేయడం లేదని రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, మహిళా శిశు సంక్షే శాఖ మంత్రి ధనసరి అనసూయ సీతక్క అన్నారు. అదే పార్టీ ప్రతిపక్షంలోకి రాగానే నీటి సమస్యను ప్రస్తావించడం విడ్డూరంగా ఉందన్నారు. రాష్ట్రంలో 15 వేల అంగన్‌వాడీ పోస్టులకు నోటిఫికేషన్లను జారీ చేస్తామని, రాష్ట్రంలో మల్టిపర్పస్ వర్కర్ల వేతనాలను పెంచే అంశాన్ని ముఖ్యమంత్రి, మంత్రివర్గంతో చర్చిస్తానని హామీ ఇచ్చారు. రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, మహిళా శిశు సంక్షేమ, దివ్యాంగుల సంక్షేమం పద్దులపై శాసనసభలో శనివారం జరిగిన చర్చలో సభ్యులు అడిగిన ప్రశ్నలకు మంత్రి సీతక్క సమాధానమిచ్చారు. వేసవి కాలాన్ని దృష్టిలో పెట్టుకుని రూ.200 కోట్లను కేటాయించామన్నారు. గ్రామాల్లో బోర్లను ఎక్కడ వేశామో తాము చూపిస్తామని, బోర్లు వేయలేదని బిఆర్ఎస్ ఎమ్మెల్యే సునీతా లక్ష్మారెడ్డి చూపిస్తారా? అని మంత్రి ప్రశ్నించారు. నీటి సరఫరా నిర్వహణ అంశంలో తాము సమీక్ష నిర్వహిస్తామని, ఆ సమీక్షకు బిఆర్ఎస్ ఎమ్మెల్యేలు హాజరై ఎక్కడ నిర్వహణ బాగాలేదో చెప్పాలన్నారు. గ్రామాల అభివృద్ధి కోసం కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నో చర్యలు చేపట్టిందని, 2023–2024 సంవత్సరానికి సంబంధించి రూ.318 కోట్లను విడుదల చేశామని, ఈ నిధులతో అప్పటి వరకు చేసిన పనులకు బకాయిలను చెల్లించామని, ఇందులో మాజీ సర్పంచ్‌లు, ఇతర కాంట్రాక్టర్ల బిల్లులు కూడా ఉన్నాయని వివరించారు. 2024–25 ఆర్థిక సంవత్సరంలో 15వ ఆర్థిక సంఘం నిధులు రూ.1280 కోట్లు తెలంగాణ రాష్ట్రానికి రాగా, వాటికి రాష్ట్ర వాటాగా రూ.611 కోట్లను, 2025–26 ఏడాదికి రాష్ట్ర వాటాగా రూ.400ల కోట్లను గ్రామ పంచాయతీలకు విడుదల చేశామన్నారు. గత రెండేళ్ల కాలంలో ప్రభుత్వం గ్రామ పంచాయతీలకు రూ.1011 కోట్లను ఖర్చు చేసిందని, అంతకు ముందు ఏడాదితో కలిపితే రూ.1329 కోట్లను పల్లెల అభివృద్ధి కోసం ప్రభుత్వం వెచ్చించిందన్నారు. మహిళలకు ఇవ్వాల్సిన అభయ హస్తం రూ.436 కోట్ల నిధులను గత ప్రభుత్వం వాడుకున్నదని, మహిళా సంఘాలకు ఇవ్వాల్సిన రూ.4019 కోట్ల వడ్డీలను ఎగ్గొట్టిందని మంత్రి చెప్పారు. గత బిఆర్ఎస్ ప్రభుత్వ కాలంలోనే గ్రామాల్లో బిల్లులు రాకపోవడంతో మాజీ సర్పంచ్‌లు ఆత్మహత్య చేసుకున్నారని, పంచాయతీల్లో పెండింగ్ బిల్లుల పాపం బిఆర్ఎస్‌దేనని ఆగ్రహం వ్యక్తం చేశారు. సిద్దిపేటలోని కోహెడ మండలం శ్రీరాములపల్లి మహిళా సర్పంచ్ మంజుల ఆత్మహత్యాయత్నం చేశారని గుర్తు చేశారు. గత రెండేళ్లలో సిసి రోడ్లు, పొలం బాటల నిమిత్తం రూ.2045 కోట్లతో పనులు చేపట్టామని, రూ.31 కోట్లతో 1363 సిసి డ్రేయిన్స్ పనులు చేపట్టామన్నారు.



### బిఆర్ఎస్ వాకౌట్

'పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, మహిళా శిశు సంక్షేమ, దివ్యాంగుల సంక్షేమం' పద్దులపై చర్చకు ప్రభుత్వం తమకు సరైన సమాధానం చెప్పలేదని శాసనసభ నుంచి బిఆర్ఎస్ వాకౌట్ చేసింది. అంతకుముందు బిఆర్ఎస్ ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం గ్రామ పంచాయతీలకు విడుదల చేస్తున్న నిధులు కేవలం వేతనాల కోసమేనని, గ్రామ అభివృద్ధికి కాదని ఆరోపించారు. నీటి సరఫరా నిర్వహణ సక్రమంగా లేదని ఆరోపించారు.

### జూన్ 2న 'ఇందిరా మహిళా శక్తి భవనాలు' ప్రారంభం: సీతక్క

'ఇందిరా మహిళా శక్తి' భవనాలను పూర్తి చేసి, జూన్ 2వ తేదీ వరకు ప్రారంభిస్తామని మంత్రి సీతక్క వెల్లడించారు. కల్యాణ లక్ష్మి నిధులను సకాలంలో విడుదల చేస్తున్నామని, ఏదైనా సాంకేతిక సమస్య వల్లనే ఎక్కడైనా ఆగి ఉండవచ్చని, అలాంటివి ఉంటే తమ దృష్టికి తీసుకురావాలని సూచించారు. డయాలసిస్, ఎయిడ్స్ పేషంట్లకు కొత్త పెన్షన్లను మంజూరు చేశామని, రాష్ట్ర వ్యాప్తంగా తమ ప్రభుత్వం సుమారు లక్ష కొత్త పెన్షన్లను మంజూరు చేసి వారికి ప్రతి నెలా పింఛన్ మొత్తాన్ని చెల్లిస్తున్నామని వివరించారు. కేంద్ర ప్రభుత్వం గ్రామీణ ఉపాధి హామీ పథకానికి బదులుగా విబి జి రాం జి పథకాన్ని అమలు చేయడం ద్వారా రాష్ట్ర ప్రభుత్వంపై ఏటా రూ.1500ల కోట్ల అదనపు ఆర్థిక భారం పడుతోందన్నారు.

# ఇసుక మాఫియా, అక్రమ మైనింగ్‌పై దద్దరిల్లిన శాసనసభ





**ప్రజాపక్షం/హైదరాబాద్ :** ఇసుక మాఫియా, అక్రమ మైనింగ్‌పై శనివారం శాసనసభ దద్దరిల్లింది. ఈ అంశం పై అధికార కాంగ్రెస్, ప్రతిపక్ష బిఆర్ఎస్ సభ్యుల మధ్య తీవ్ర వాగ్వాదం చోటుచేసుకుంది. సభ్యుల పరస్పర విమర్శలు, ఆరోపణలు, ప్రత్యారోపణల మాటల యుద్ధం కొనసాగింది. ఓ మంత్రి అక్రమ మైనింగ్‌కు పాల్పడుతున్నారని బిఆర్ఎస్‌పక్ష ఉప నాయకులు టి.హరీష్ రావు ఆరోపించగా, గత పదేళ్ల బిఆర్ఎస్ ప్రభుత్వ హయాంలోనే ఇసుక అక్రమ రవాణా, అక్రమ మైనింగ్ చేసి అప్పటి మంత్రులు, ఎంఎల్‌ఎలు దోపిడీకి పాల్పడ్డారని రాష్ట్ర మంత్రులు, కాంగ్రెస్ సభ్యులు విమర్శించారు. దీంతో సభలో ఇరు పక్షాల మధ్య మాటా మాటా పెరిగి ఉద్రిక్త పరిస్థితి నెలకొంది. అధికార, ప్రతిపక్ష సభ్యులు వాగ్వాదం మధ్యనే వివిధ శాఖల పద్దులను సభ ఆమోదించింది. శాసనసభలో శనివారం పద్దులు విత్త పాలన, ప్రణాళిక, సర్వేలు, ఇంధనం, రెవెన్యూ, రిజిస్ట్రేషన్, గృహ నిర్మాణం, సమాచారా పౌర సంబంధాలు, పరిశ్రమలు, వాణిజ్యం, సమాచార సాంకేతిక, ఎలక్ట్రానిక్, కమ్యూనికేషన్, శాఖల పద్దుల జరిగిన చర్చలో భాగంగా అధికార, ప్రతిపక్ష బిఆర్ఎస్ సభ్యుల మధ్య తీవ్ర వాగ్వివాదం చోటు చేసుకుంది. బిఆర్ఎస్ శాసనసభ పక్ష ఉప నాయకులు హరీష్‌రావు మాట్లాడుతూ ఓ మంత్రికి చెందిన రాఘవ కన్‌స్ట్రాక్షన్ అక్రమ మైనింగ్‌కు పాల్పడుతోందని, దీనిపై సభా కమిటీ వేయడంతో సిట్టింగ్ న్యాయమూర్తితో విచారణ చేపట్టాలని డిమాండ్ చేశారు. అక్రమ మైనింగ్‌పై విచారణ చేపట్టేందుకు ప్రభుత్వం సిద్దంగా ఉందని, అయితే బిఆర్ఎస్ ఉప నాయకులు నిరాధారమైన ఆరోపణలు చేస్తున్నారని ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, మంత్రులు దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, సీతక్క, వాకిటి శ్రీహరి, డాక్టర్ వివేక్, పొన్నం ప్రభాకర్, అడ్లూరి లక్ష్మణ్ కుమార్, అధికారపక్ష సభ్యులు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. సభ్యుడు నిరాధారంగా చేసిన తన వ్యాఖ్యలను వెనక్కి తీసుకోవాలని, లేదా స్పీకర్ వాటిని రికార్డుల నుంచి తొలగించాలని వారు అన్నారు. అయినా హరీష్ రావు వెనక్కి తగ్గకపోవడంతో స్పీకర్ స్థానంలో ఉన్న ప్యానల్ స్పీకర్ సభ్యుడి వాఖ్యలను రికార్డులో నుంచి తొలగిస్తున్నట్లు ప్రకటించారు. దీంతో బిఆర్ఎస్ సభ్యులు నిరసన వ్యక్తం చేస్తూ వెల్‌లోకి దూసుకువచ్చి బైఠాయించారు. సభా కమిటీ వేయాలని, మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తన మంత్రి పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. సభ్యులు తమ తమ స్థానాల్లోకి వెళ్లాలని స్పీకర్ పదే పదే విజ్ఞప్తి చేసినా బిఆర్ఎస్ సభ్యులు అక్కడే బైఠాయించారు.

**మంత్రి శ్రీధర్ బాబు సీరియస్**

సభలో బిఆర్ఎస్ సభ్యులు హరీశ్‌రావు వ్యాఖ్యలపై మంత్రి శ్రీధర్‌బాబు ఆగ్రహం వ్యక్తం చేశారు. హరీశ్‌రావు తన వ్యాఖ్యలను వెనక్కి తీసుకోవాలన్నారు. 'విచారణ కోరారు... జరిపిస్తామని అన్నాం.. ఇంకా ఏంటి. మంత్రి పేరు ఎలా తీసుకుంటారు. ఆరోపణలు వెనక్కి తీసుకోవాలి. మంత్రి ఎందుకు రాజీనామా చేయాలి. అడ్డగోలు ఆరోపణలు సరికాదు. హరీశ్ మాటలు రికార్డ్ నుంచి తొలగించాలి' అని మంత్రి శ్రీధర్ బాబు తెలిపారు.

**మంత్రి పొంగులేటిని టార్గెట్ చేస్తున్నారు: సీతక్క**

హరీష్ రావు అసలు ఉద్దేశం ఏంటో చెప్పాలని మంత్రి ధనసరి అనసూయ సీతక్క ప్రశ్నించారు. గత సిఎం కెసిఆర్ హయాంలో 40 క్రషర్లకు పర్మిషన్ ఇచ్చారని గుర్తు చేశారు. ఇప్పుడు ఉద్దేశపూర్వకంగానే మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డిని టార్గెట్ చేస్తున్నారని మండిపడ్డారు. ఉద్దేశపూర్వకంగా మంత్రుల పేర్లు ప్రస్తావిస్తున్నారన్నారు. పదేళ్ల అక్రమాలపై విచారణ చేయాలని మంత్రి సీతక్క అన్నారు. మంత్రి అడ్లూరి లక్ష్మణ్ మాట్లాడుతూ పదేళ్లలో జరిగిన మైనింగ్‌పై విచారణ జరిపిద్దామన్నారు. పదేళ్లు అడ్డగోలుగా ఇసుక దోపిడీ చేశారని, ఇసుక మాఫియా లారీల కింద పడి ఓ చిన్నారి మరణించినా అప్పటి బిఆర్ఎస్ ప్రభుత్వం చర్యలు తీసుకోలేదన్నారు. తప్పు చేసిన వారిపై తప్పకుండా చర్యలు తీసుకోవాలని మంత్రి తెలిపారు. హరీశ్‌రావు హౌస్ కమిటీ అడగడం సరికాదని, విచారణ జరిపి తామే చర్యలు తీసుకుంటామని మంత్రి వివేక్ స్పష్టం చేశారు. ఇసుక మాఫియాలో దళితులను కొట్టినప్పుడు ఎందుకు హౌస్ కమిటీ వేయలేదని మంత్రి వివేక్ ప్రశ్నించారు.

**తప్పయితే ఉరిశిక్ష వేయండి : హరీశ్ సవాల్**

సభలో బిఆర్ఎస్ పక్ష ఉప నాయకులు హరీశ్‌రావు మంత్రులు, కాంగ్రెస్ సభ్యుల విమర్శలపై తీవ్రంగా స్పందిస్తూ తాను చెప్పిన విషయాలు తప్పయితే ఉరిశిక్ష వేయాలని సవాల్ చేశారు. మైనింగ్ లైసెన్స్ లేకుండా క్రషర్ నడపడం తప్పన్నారు. క్రషర్‌కు రాష్ట్ర పొల్యూషన్ కంట్రోల్ బోర్డు అనుమతి ఇవ్వాలని, కేంద్ర పర్యావరణ అనుమతులు లేవని హరీశ్ వెల్లడించారు. ఇందుకు ప్యానెల్ స్పీకర్ బాలునాయక్ స్పందిస్తూ 'హరీష్‌రావు మీ వ్యాఖ్యలు ఉపసంహరించుకోవాలి' అని కోరారు. ఇందుకు హరీశ్‌రావు మైక్ కట్ చేసిన స్పీకర్ బిజెపి ఎమ్మెల్యే పాల్వాయి హరీశ్‌కు మాట్లాడే అవకాశం ఇచ్చారు. ఈ క్రమంలో పాల్వాయి హరీశ్ మాట్లాడుతుండగా సభలో బిఆర్ఎస్ ఎమ్మెల్యేలు నినాదాలు చేశారు. మైనింగ్ అక్రమాలపై హౌస్ కమిటీ వేయాలని డిమాండ్ చేశారు. ఈ చర్చతో అసెంబ్లీలో ఉద్రిక్త వాతావరణం నెలకొంది. అధికార, ప్రతిపక్ష సభ్యులు వాగ్వాదం మధ్యనే వివిధ శాఖల పద్దులను సభ ఆమోదించింది.

## సిఎంలో డిప్రెషన్ మొదలైంది

కవిత పార్టీని స్వాగతిస్తున్నాం

సిఎం రేవంత్ రెడ్డిపై కేంద్ర మంత్రి బండి సంజయ్ ఫైర్



**ప్రజాపక్షం/కరీంనగర్ :** నియోజకవర్గాల పునర్విభజన, 33 శాతం మహిళా రిజర్వేషన్లను కేంద్రం అమలు చేసేందుకు సిద్ధమవ్వడంతో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిలో డిప్రెషన్ మొదలైందని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ అన్నారు. అందుకే ప్రధానిపై దిగజారి మాట్లాడుతున్నారని, దక్షిణాదికి అన్యాయం జరుగుతోందని దుష్ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు. కాళేశ్వరం డిజైన్ లోపానికి ప్రధాన బాధ్యత కెసిఆర్‌దేనని చెప్పారు. అయినప్పటికీ కెసిఆర్‌ను, కాళేశ్వరం అవినీతి పరులను రేవంత్‌రెడ్డి సర్కార్ అరెస్ట్ చేయడం లేదని అన్నారు. కెసిఆర్‌తో రేవంత్ రెడ్డి కుమ్మక్కవడంవల్లే కెసిఆర్ కుటుంబంసహా బీఆర్ఎస్ నేతల అవినీతిపై చర్యలు తీసుకోవడం లేదని అన్నారు. శనివారం కరీంనగర్‌లోని తన నివాసంలో సోలార్ ప్యానెల్‌ను ఏర్పాటు చేసిన కేంద్రమంత్రి వాటి పనితీరును అధికారులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా మీడియా అడిగిన పలు ప్రశ్నలకు బండి సంజయ్ సమాధానమిచ్చారు. నియోజకవర్గాల పునర్విభజన, 33 శాతం మహిళా రిజర్వేషన్లను కేంద్రం అమలు చేస్తుంటే, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి డిప్రెషన్‌లోకి వెళుతున్నారని, ప్రధానమంత్రి స్థాయి వ్యక్తిపై దిగజారి మాట్లాడుతున్నారని అన్నారు. సీఎం భాషను చూసి తెలంగాణ సమాజం అసహ్యించుకుంటోందని, ఓట్ల కోసం 6 గ్యారంటీలను 100 రోజుల్లో అమలు చేస్తామని హామీలిస్తారు... అధికారంలోకి వచ్చాక గాడిద గుడ్డు చూపిస్తారని అన్నారు. కాళేశ్వరం డిజైన్ లోపానికి ప్రధాన కారకులు కెసిఆరే అని, ఎందుకంటే ఆయన ఇంజనీర్ అవతారమెత్తి, అనేక వేషాలు వేసి డిజైన్లు తయారు చేశారని విమర్శించారు. ప్రధాన బాధ్యత బిఆర్ఎస్ ప్రభుత్వానిదే. అయితే రేవంత్‌రెడ్డి ప్రభుత్వం మాత్రం కాళేశ్వరం డిజైన్ కారకులను, అవీనీతిపరులను అరెస్ట్ చేయడం లేదని, ఎందుకంటే కెసిఆర్‌తో రేవంత్‌రెడ్డి కుమ్మక్కయ్యారని అన్నారు. సిబిఐకి పంపిన లేఖలోనూ పూర్తిస్థాయిలో వాస్తవాలు చెప్పలేదన్నారు.

# రోడ్డు భద్రతపై విద్యార్థుల తల్లిదండ్రుల నుంచి అఫిడవిట్

**ప్రజాపక్షం/హైదరాబాద్:** ఇడబ్ల్యు ఎస్ తరహా బిసి రిజర్వేషన్లను కేంద్ర ప్రభుత్వం ఆమోదిస్తుందని ఆశించామని, కానీ ఆమోదించలేదని బిసి సంక్షేమ, రవాణ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. ప్రధాని అనుకుంటే బిసి రిజర్వేషన్ల అంశం పది నిమిషాల పని అని అన్నారు. రోడ్డు భద్రత అంశంలో వచ్చే విద్యా సంవత్సరం నుంచి విద్యార్థుల తల్లి దండ్రుల నుంచి అఫిడవిట్ తీసుకుంటామని వెల్లడించారు. త్వరలోనే కార్పొరేషన్లకు చైర్మన్లను నియమిస్తామన్నారు. 'రవాణ, హోం, వెనుకబడిన తరగతుల సంక్షేమం' పద్దులపైన శాసనసభలో శనివారం జరిగిన చర్చలో సభ్యులు ప్రస్తావించిన అంశాలకు మంత్రి పొన్నం ప్రభాకర్ సమాధానమిస్తూ , గత బిఆర్ఎస్ ప్రభుత్వం ఆర్‌టిసి సంస్థను నిర్వీర్యం చేసిందని, కార్మిక సంఘాలను రద్దు చేసి, ఎన్నికలకు చివరి సమయంలో హడావుడిగా విలీన పక్రియను చేపట్టిందని ఆరోపించారు. కార్మికుల సమ్మెను కూడా గత బిఆర్ఎస్ ప్రభుత్వం పట్టించుకోలేదని, ఇప్పుడు కార్మిక సంఘాల, విలీన అంశాన్ని ప్రస్తావించే నైతిక హక్కు ఆ పార్టీకి లేదన్నారు. 'పి ఎం ఈ డ్రైవ్ ' ద్వారా సబ్సిడీకి ఇచ్చే బస్సులను ఆర్‌టిసికి ఇవ్వాలని తాము కేంద్ర ప్రభుత్వాన్ని కోరినా తమకు కేటాయించలేదని మంత్రి తెలిపారు. హైదరాబాద్ పాతబస్తీలో ఆర్‌టిసి ఆధ్వర్యంలో 'మినీ' బస్సులను తీసుకొస్తామని, ఎంఎంటిఎస్ స్టేషన్లకు అనుసంధానంగా బస్సు రూట్లను ఏర్పాటు చేస్తున్నామన్నారు. బిసి సబ్‌ప్లాన్ ఏర్పాటు చేసే అంశాన్ని ఆలోచిస్తున్నామన్నారు. బిసి భవనాలను ప్రస్తుత ఏడాదిలోనే పూర్తి చేస్తామన్నారు. రాష్ట్రంలో శాంతిభద్రతలు ప్రశాంతంగా ఉన్నాయని, శ్రీరామనవమి నుంచి మొదటు ఇటీవల జరిగిన రంజాన్, సంక్రాంతి, బోనాలు, గణేష్ ఉత్సవాలను ప్రశాంత వాతావరణంలో నిర్వహించామని గుర్తు చేశారు.

**ప్రధాని వద్దకు తీసుకెళ్లండి: కూనంనేని**

అంతకుముందు సిపిఐ శాసనసభాపక్ష నేత కూనంనేని సాంబశివరావు మాట్లాడుతూ బిసిలకు 42 శాతం రిజర్వేషన్ల అంశంపైన రాష్ట్ర ప్రభుత్వం అన్ని ప్రయత్నాలూ చేసిందని, ప్రస్తుతం 'రిజర్వేషన్ల బిల్లు' కేంద్రం చేతిలో ఉన్నదని, వాటిని సాధించుకునేందుకు చొరవ తీసుకోవాలన్నారు. అన్ని రాజకీయ పార్టీలనూ న్యూఢిల్లీలోని ప్రధానమంత్రి వద్దకు తీసుకెళ్లాలన్నారు. వడ్డేర, రజక లాంటి పేద కులాలకు కార్పొరేషన్లు ఉంటేనే గుర్తింపు ఉంటుందన్నారు. రోడ్లపైన ట్రాఫిక్ పోలీసులు గంటల తరబడి నిలబడి ఇబ్బందుకు గురవుతున్నారని, తమిళనాడు తరహా నిర్ణయం తీసుకోవాలని సూచించారు. పోలీసులకు కూడా షిఫ్ట్ విధానాన్ని అమలు చేస్తే వారు కూడా కుటుంబంతో గడిపేందుకు అవకాశం ఉంటుందని కూనంనేని అన్నారు. ఎంఐఎం ఎమ్మెల్యే పాతబస్తీలో మినీ బస్సులను ఏర్పాటు చేయాలని కోరారు. ఎమ్మెల్యే దానం నాగేందర్ మాట్లాడుతూ మున్నూరుకాపు కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని, మున్నూరుభవన నిర్మాణానికి రూ.20 కోట్ల నిధులను ఇవ్వాలని కోరారు. పోలీసు, ఆర్‌టిసి, బిసి సంక్షేమం పట్ల ప్రభుత్వ నిర్లక్ష్య వైఖరికి నిరసనగా సభ నుంచి బిఆర్ఎస్ వాకౌట్ చేసింది.

# ఘనంగా శ్రీరాముడి పట్టాభిషేకం

స్వామికి పట్టు వస్త్రాలు సమర్పించిన గవర్నర్

రామనామ స్మరణతో మార్మోగిన భద్రగిరి





**ప్రజాపక్షం/భద్రాచలం :** జగమేలే స్వామి, జగదభిరాముని పట్టాభిషేకం మిథిలా స్టేడియంలో శనివారం ఘనంగా జరిగింది. ఈ ఆధ్యాత్మిక కార్యక్రమానికి గవర్నర్ శివ్ ప్రతాప్ శుక్ల దంపతులు హాజరైన స్వామి వారికి పట్టువస్త్రాలను అత్యంత భక్తిశ్రద్ధలతో సమర్పించారు. శ్రీరామ నవమి బ్రహ్మోత్సవాల ప్రధాన వేడుకైన శ్రీసీతారాముల కల్యాణం, పట్టాభిషేకం తదితర మహోత్సవాలకు హాజరైన భక్తజనం పులకించారు. ముందుగా గవర్నర్ ఆలయంలో స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. మిథిలా ప్రాంగణంలో రామయ్య పట్టాభిషేక వేడుక ఎంతో వైభవంగా కన్నుల పండువగా శాస్త్రోక్తంగా వేద మంత్రోశ్చరణల నడుమ సాగింది. ఇందులో భాగంగా రామాలయంలోని భద్రుని మండపంలో అర్చకులు స్వామివారి పాదుకలకు అభిషేకం నిర్వహించారు. రాజలాంఛనాలతో పవిత్రపావన గౌతమి నదీ తీరం నుండి తీర్థబిందెలతో పుణ్య జలాలను తీసుకొచ్చారు. భాజా భజంత్రీలు, మేళతాళాలు, భక్తుల కోలాట నృత్యాల నడుమ ప్రత్యేక పల్లకీలో సీతారామ చంద్ర ప్రభువును ఊరేగింపుగా మిథిలా స్టేడియానికి చేరుకున్నారు. ముందుగానే సిద్ధం చేసిన రాజసింహాసనంపై రాజాధిరాజు రాజా రామచంద్ర ప్రభువుల వారిని ఆశీనులను చేశారు. ఈ సందర్భంగా విశ్వక్షేణపూజ, ఆరాధన, పుణ్యాహావచనం నిర్వహించారు. స్వామి వారికి పాదుకలు, రాజదండం, రాజముద్రిక, స్వర్ణ కిరీటం, ఖడ్గం, రత్నాభరణాలు ధరింపజేశారు. అనంతరం శ్రీరామ పట్టాభిషేక పారాయణం గావించారు. రుగ్వేదం, యజుర్వేదం, సామవేదం, అధర్వణ వేద పారాయణాలతో పాటు, విష్ణుపురాణం, భగవత్‌శాస్త్రం తదితర పారాయణాలు గావించారు. పుష్కర నదీజలాలతో మహాకుంభ తీర్థప్రోక్షణ చేశారు. 11 శ్లోకాలను పఠించి స్వామివారికి హారతి పట్టారు. ఈ సందర్భంగా అర్చకులు భక్తులతో పలు స్తోత్రాలను అనుకరింపజేశారు. జై శ్రీరాం, జై శ్రీరాం, రాజారామ్ అంటూ భక్తులు చేసిన రామనామ స్మరణలతో మిథిలా ప్రాంగణం మార్మోగింది. మానవమాత్రులే కాకుండా పంచభూతాలు సైతం రామనామ స్మరణలో తేలియాడినట్లు అంతా భావించారు. పట్టాభిషేకం అనంతరం భక్తులపై అర్చక స్వాములు పుణ్యనదీ జలాలను చల్లారు. రాష్ట్రప్రభుత్వం తరపున భద్రాచలం రామాలయాభివృద్ధిలో భాగంగా తొలివిడత రూ.351 కోట్ల అభివృద్ధి పనులకు శ్రీరామ నవమి నాడు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి శంకుస్థాపన చేసిన విషయాన్ని గవర్నర్‌కు తమ్మల నాగేశ్వరరావు వివరించారు. రాష్ట్ర వ్యవసాయ,సహకార, చేనేత శాఖా మంత్రి తుమ్మల నాగేశ్వరరావుతో పాటు భద్రాచలం ఎమ్మెల్యే డా.తెల్లం వెంకట్రావు, జిల్లా కలెక్టర్ అంకిత్, ఎస్పి రోహిత్ రాజ్, భద్రాచలం ఐటిడిఏ పిఓ రాహుల్, రామాలయం ఇఓ దామోదర్ రావు, మాజీ ఎంఎల్‌సి బాలసాని లక్ష్మీనారాయణ పట్టాభిషేక వేడుకలో పాలుపంచుకున్నారు. గవర్నర్ పర్యటన నేపథ్యంలో పోలీసులు భారీ బందోబస్తు నిర్వహించారు. శ్రీరామనవమి బ్రహ్మోత్సవాల్లో ముఖ్యమైన వేడుకలైన శ్రీ సీతారాముల కళ్యాణం, పట్టాభిషేకానికి దేశ నలుమూలల నుండి హాజరైన భక్తులు మధుర జ్ఞాపకాలతో, రామనామస్మరణలతో భక్తిపారవశ్యాలతో వారివారి స్వగ్రామాలకు పయణమయ్యారు.

**గవర్నర్‌కు ఘన స్వాగతం :** పట్టాభిషేక మహోత్సవానికి హాజరయ్యేందుకు ప్రత్యేక హెలీకాప్టర్‌లో ఐటిసి పిఎస్‌పి ప్రాంగణంలోని హెలీప్యాడ్ వద్దకు చేరుకున్న గవర్నర్ శివ ప్రతాప్ శుక్లాకు మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా పుష్పగుచ్ఛాన్ని అందించి షాలువా కప్పారు. గవర్నర్ హోదాలో ఆయన తొలిసారిగా భద్రాచలం విచ్చేయడంతో రామాలయ విశిష్ఠత, గోదావరి తీరం, రామాయణ ఇతివృత్తాలకు సంబంధించిన విషయాలను తుమ్మల గవర్నర్‌తో పంచుకున్నారు. ఈ కార్యక్రమంలో భద్రాచలం ఎమ్మెల్యే డా.తెల్లం వెంకటరావు, కలెక్టర్ అంకిత్, ఎస్‌పి రోహిత్ రాజ్ తదితరులున్నారు.

GHMC
హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్
సూపరింటెండింగ్ ఇంజనీర్, సికింద్రాబాద్ జోన్.
'ఇ' ప్రొక్యూర్‌మెంట్ నోటీసు
Short NIT No. 58/SE(M)/Sec-bad Zone/GHMC/2025-26 తేదీ: 26.03.2026
క్ర.సం.1, NIT No. 58/SE(M)/Sec-bad Zone/GHMC/2025-26, తేదీ: 26.03.2026, పనుల సంఖ్య: 01 పని, అంచనా విలువ: రూ.86.00 లక్షలు, బిడ్స్ స్వీకరణకు ప్రారంభ తేది / ఆఖరి తేదీ & సమయం: బిడ్ దాఖలుకు ప్రారంభ తేది & సమయం: 28.03.2026న మ.3.00గం.లకు, బిడ్ దాఖలుకు ఆఖరి తేదీ & సమయం: 31.03.2026న మ.3.00గం.ల వరకు, అధికారి పేరు & చిరునామా: ఎస్‌ఇ, సికింద్రాబాద్ జోన్, జిహెచ్‌ఎంసి. సెల్ నెం. 9963550657. మరిన్ని వివరాలకు @https://www.tender.telangana.gov.in లో చూడవచ్చు.
సం/- సూపరింటెండింగ్ ఇంజనీర్, సికింద్రాబాద్ జోన్, జిహెచ్‌ఎంసి.
DIPR R.O. No. : 17752-PP/CL/ADVT/1/2025-26, Date: 28-03-2026

తెలంగాణ ప్రభుత్వం
మిషన్ భగీరథ డిపార్ట్‌మెంట్, చీఫ్ ఇంజనీర్-IV కార్యాలయం
మిషన్ భగీరథ సర్కిల్, ఆదిలాబాద్.
టెండర్ నోటీస్
టెండర్ నోటీస్ నెం. 01/AEE/DEE/MB/Adilabad/Tender/2025-26, తేదీ: 28-03-2026, పనిపేరు : ఆదిలాబాద్ (జిల్లా), భీంపూర్ (మండలం), పిప్పల్‌కోటి (గ్రామం) సమీపంలోని ప్రతిపాదిత పిప్పల్‌కోటి బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ దాని అనుబంధ పనుల కారణంగా కుంట దర్గా జంక్షన్ నుంచి గొల్లఘాట్ జంక్షన్ వరకు ఉన్న ప్రస్తుత పైప్‌లోని కొంత భాగం మునిగిపోనున్న దృష్ట్యా ఎస్.ఆర్.ఎస్.పి ఆదిలాబాద్ సెగ్మెంట్‌లో కొత్త పైపులైన్ వేయడం. అంచనా వ్యయం : రూ.76.00 లక్షలు. టెండర్ డాక్యుమెంట్స్ ఇ-ప్రొక్యూర్‌మెంట్ వెబ్‌సైట్ : tender.telangana.gov.in లో తేదీ 06.04.2026 నుండి 20.04.2026 మధ్యాహ్నం 3 గంటల వరకు అందుబాటులో ఉంటాయి. మరిన్ని వివరాలను ఇ-ప్రొక్యూర్‌మెంట్ వెబ్‌సైట్ నుండి పొందవచ్చు. ఏవైనా తదుపరి సవరణలు ఉంటే అవి కేవలం ఇ-ప్రొక్యూర్‌మెంట్ ప్లాట్‌ఫారమ్‌లోనే తెలియజేయబడతాయి.
సం/- చీఫ్ ఇంజనీర్-IV MB, హైదరాబాద్.
DIPR R.O. No. : 17785-PP/CL/ADVT/1/2025-26, Date: 28-03-2026

## ప్రజావాణి ఫిర్యాదులపై సత్వర చర్యలు

నల్లగొండ జిల్లా కలెక్టర్ చంద్రశేఖర్

**ప్రజాపక్షం/నల్లగొండ టౌన్** :ప్రత్యేక ప్రజావాణిలో వచ్చిన ఫిర్యాదులపై అధికారులు సత్వరమే చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ బి.చంద్ర శేఖర్ అన్నారు. శనివారం జిల్లా కలెక్టర్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రత్యేక ప్రజావాణి కార్యక్రమంలో దివ్యాంగులు, వృద్ధుల నుండి ఆయన అర్జీలను స్వీకరించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ వృద్దులు, దివ్యాంగులు సోమవారం నిర్వహించే ప్రజావాణిలో ఇబ్బంది పడవద్దని వారికై ప్రతి నెల నాల్గవ శనివారం ప్రత్యేక ప్రజావాణి నిర్వహిస్తున్నామని ఇట్టి అవకాశన్ని జిల్లాలోని దివ్యాంగులు, వృద్ధులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.శనివారం దివ్యాంగులు, వృద్ధుల కొరకు నిర్వహించిన ప్రత్యేక ప్రజావాణి కార్యక్రమం లో మొత్తం 74 దరఖాస్తులు వచ్చాయి.ప్రత్యేక ప్రజావాణి కార్యక్రమానికి రెవెన్యూ అదనపు కలెక్టర్ జే. శ్రీనివాస్,జిల్లా సంక్షేమ అధికారి కృష్ణవేణి,గృహ నిర్మాణ శాఖ పీడి రాజ్ కుమార్,ప్రభుత్వ ప్రధాన ఆస్పత్రి సూపరింటెండెంట్ నరసింహారావు నేత,అధికారులు, సిబ్బంది హాజరయ్యారు.

## పారదర్శకంగా జనగణన 2027

అదనపు కలెక్టర్ భాస్కర్ రావు



**ప్రజాపక్షం/యాదాద్రి కలెక్టరేట్** : జన గణన 2027ను పారదర్శకంగా, సమగ్రంగా నిర్వహించాలని స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ భాస్కరరావు అన్నారు. శనివారం కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాలులో జనగణన 2027 ఫేజ్ 1 గృహాల గణనకు సంబంధించి క్షేత్రస్థాయి శిక్షకుల (ఫీల్ ట్రైనర్స్) శిక్షణ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ మే 11 నుండి ప్రారంభమయ్యే గృహాల గణనలో ఎలాంటి తప్పులకు తావు లేకుండా ఖచ్చితంగా నిర్వహించాలని సూచించారు. ప్రతి వివరాన్ని కచ్చితంగా నమోదు చేసే విధానాన్ని సమగ్రంగా చేపట్టాలన్నారు. ప్రతి అధికారి తమ బాధ్యతలను నిబద్ధతతో నిర్వర్తించాలని సూచించారు. అలాగే ఎన్యూమరేటర్లు మరియు సూపర్వైజర్లకు శిక్షణను సమగ్రంగా, నాణ్యంగా అందించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జిల్లా జనగణన అధికారి వెంకటరమణ, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## నల్లగొండ కోర్టు ప్రాంగణంలో జాతీయ లోక్ అదాలత్

**ప్రజాపక్షం/నల్లగొండ టౌన్:** ప్రజలకు న్యాయం వేగంగా అందించడానికి లోక్ అదాలత్ విజయవంతంగా జరిగిందని జిల్లా జడ్జి,జిల్లా న్యాయ సేవా అధికార సంస్థ చైర్మన్ ఎం. నాగరాజు తెలిపారు.రాష్ట్ర న్యాయ సేవా అధికార సంస్థ ఆదేశాల మేరకు జిల్లా న్యాయ సేవా అధికార సంస్థ ఆధ్వర్యంలో శనివారం నల్లగొండ జిల్లా కోర్టు ఆవరణలో జాతీయ లోక్ అదాలత్ ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా 16 లోక్ అదాలత్ బెంచిలను ప్రజల సౌకర్యార్థం ఏర్పాటు చేశారు. లోక్ అదాలత్‌లో 20 సివిల్ కేసులు,5535 క్రిమినల్ కేసులు,156 మోటార్ వాహన ప్రమాద బీమా కేసులు, 8125 ఇతర ప్రీలిటిగేషన్ కేసులు, 37 సైబర్ క్రైమ్ కేసులు, మొత్తం 13,938 కేసులు పరిష్కరించబడాయి. ప్రమాద భీమా కేసుల్లో రూ. 8,13,10,945 నష్టపరిహారం,సైబర్ క్రైమ్ కేసుల్లో రూ. 2,76,200 రికవరీ చేశారు.కార్యక్రమంలో ప్రిన్సిపాల్ సీనియర్ సివిల్ జడ్జి,కార్యదర్శి పి.పురుషోత్తం రావు,ఇతర న్యాయమూర్తులు,బార్ అసోసియేషన్ సభ్యులు, న్యాయవాదులు,లా కాలేజీ విద్యార్థులు,కక్షిదారులు పాల్గొన్నారు.

## అనసూయమ్మ జీవితం నేటి తరానికి ఎంతో స్ఫూర్తిదాయకం

సిపిఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ



**ప్రజాపక్షం/మునగాల:** తెలంగాణ సాయుధ రైతాంగ పోరాట యోధురాలు కామ్రేడ్ మేదరమెట్ల అనసూయమ్మ ఆశయ సాధనకు కమ్యూనిస్టు పార్టీ కార్యకర్తలు సంసిద్ధం కావాలని సిపిఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి జాన్ వెస్లీ అన్నారు. మేదరమెట్ల సీతారామయ్య సతీమణి అనసూయమ్మ అనారోగ్యంతో మృతి చెందారు. హైద్రాబాద్‌లోని కొత్తపేటలో కుమార్తె స్వగృహంలో అనసూయమ్మ పార్థివదేహానికి పూలమాలలువేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా జరిగిన సంతాప సభలో జాన్‌వెస్లీ మాట్లాడుతూ తెలంగాణ సాయుధరైతాంగ పోరాటంలో తన భర్త సీతారామయ్యతో కలిసి ముఖ్యపాత్ర పోషించిందని అన్నారు. సిపిఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు, మాజీ ఎమ్మెల్యే జూలకంటి రంగారెడ్డి మా ట్లాడుతూ అనసూయమ్మ పేద ప్రజల పట్ల ఉన్న అంకితభావం, పోరాట చైతన్యం మరువలేనిదని అన్నారు. మహిళ సంఘం రాష్ట్రప్రధాన కార్యదర్శి మల్లు లక్ష్మి మాట్లాడుతూ తెలంగాణ సాయుధ పోరాటంలో తన భర్త మేదరమెట్ల సీతరామయ్య గారితో పాటు అనేక ఉద్యమాలలో పాల్గొన్నదన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ చెరుపల్లి సీతారాములు, సిపిఐ(ఎం) జిల్లా కార్యదర్శి మల్లు నాగార్జునరెడ్డి, నాయకులు కొలిశెట్టి యాదగిరిరావు, కోట రమేష్, పారేపల్లి శేఖర్‌రావు, నాగారపు పాండు, పోటు కళావతి, మేదర మెట్ల వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

## లేబర్ కార్డు పేరుతో మోసం..

కూలీల నుంచి డబ్బుల వసూలు



**ప్రజాపక్షం/మునుగోడు:**ప్రభుత్వ పథకాల పేరుతో అమాయక ప్రజలను మోసం చేస్తున్న ఘటన మునుగోడు మండల కేంద్రంలో శనివారం వెలుగుచూసింది. లేబర్ కార్డు ఇప్పిస్తామని చెప్పి వ్యవసాయ కూలీల నుంచి రూ.600 నుంచి రూ.1000 వరకు డబ్బులు వసూలు చేసిన ఇద్దరు యువకులు,స్థానికులు ప్రశ్నించగా అక్కడి నుంచి పరారయ్యారు. వివరాల్లోకి వెళితే,మండలంలోని ఓగ్రామానికి చెందిన ఇద్దరు యువకులు డమ్మీ ఈకెవైసి యంత్రంతో కూలీల వద్దకు వెళ్లి,కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న లేబర్ కార్డు తప్పనిసరిగా తీసుకోవాలి అంటూ మభ్యపెట్టారు.ఆధార్ కార్డు వంటి గుర్తింపు పత్రాలను తీసుకుని నకిలీ కేవైసీ ప్రక్రియ నిర్వహిస్తూ ఒక్కొక్కరి నుంచి రూ.600 నుంచి రూ.1000 వరకు వసూలు చేశారు.ఈవ్యవహారాన్ని గమనించిన స్థానిక ,సిపిఐ మండల కార్యదర్శి చాపల శ్రీను తోపాటు నాయకులు,ఆ యువకులను ఏ శాఖకు చెందినవారో,ఉచితంగా ఇవ్వాల్సిన కార్డు కోసం ఎందుకు డబ్బులు వసూలు చేస్తున్నారో ప్రశ్నించగా, వారు స్పష్టమైన సమాధానం ఇవ్వకుండా అక్కడి నుంచి పారిపోయారు.ఈ ఘటనపై స్పందించిన మునుగోడు ఎస్ఐ ఇరుగు రవి,ప్రభుత్వ పథకాల పేరుతో డబ్బులు వసూలు చేసే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

# యుద్ధ మేఘాల్లో శాంతి సందేశం

శాంతి,సౌభ్రాతృత్వానికి ప్రతీకగా నిలిచిన బుద్ధవనం

ప్రపంచ బౌద్ధ ప్రతినిధుల ఆధ్యాత్మిక విహారం



**ప్రజాపక్షం/నందికొండ:** ప్రపంచవ్యాప్తంగా ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్న ఈ వేళ,శాంతిసహనంసహజీవనానికి ప్రతీకగా నిలిచిన నాగార్జున సాగర్ బుద్ధవనం మరోసారి అంతర్జాతీయ వేదికగా నిలిచింది. హైదరాబాద్‌లో నిర్వహించిన ప్రపంచ బౌద్ధ శాంతి సదస్సుకు హాజరైన వివిధ దేశాల ప్రతినిధులు శనివారం బుద్ధవనాన్ని సందర్శించి ఆధ్యాత్మికతలో మునిగిపోయారు. శ్రీలంక బుద్ధ శాసన,మత సాంస్కృతిక శాఖ మంత్రి హెనిడుమ సునీల్ సెనేవి బుద్ధవనానికి చేరుకోగా మిర్యాలగూడ సబ్ కలెక్టర్ నారాయణ అమిత్, బుద్ధవనం ప్రత్యేక అధికారి మల్లేపల్లి లక్ష్మయ్య,టూరిజం హోటల్స్ జీఎం నాదన్, డీఎస్పీ రాజశేఖర్ రాజు తదితరులు ఘన స్వాగతం పలికారు.22 దేశాలకు చెందిన ప్రొఫసర్లు,బౌద్ధ భిక్షువులు,నిపుణులు బుద్ధవనానికి చేరుకోగా టిబెటన్ సంప్రదాయ వాయిద్యాలతో వారికి విశేష స్వాగతం అందించారు.అనంతరం ప్రతినిధులు బుద్ధుని పాదాల వద్ద పుష్పాంజలి ఘటించి,మహాస్తూపంలోని ధ్యాన మందిరంలో బుద్ధ జ్యోతులు వెలిగించి తమ తమ సంప్రదాయాల ప్రకారం చాంటింగ్ చేస్తూ ధ్యానం నిర్వహించారు.ఆక్షణాలు బుద్ధవనాన్ని మరింత ప్రశాంతంగా,ఆధ్యాత్మికంగా మార్చాయి.తదుపరి ప్రతినిధులు లాంచీ ద్వారా నాగార్జునకొండ మ్యూజియంకు చేరుకుని క్యూరేటర్ కమలహాసన్ స్వాగతం పలికారు. అక్కడ పునర్నిర్మించిన అశ్వమేధ యజ్ఞశాల, మహాస్తూపం, సింహళ విహారం వంటి చారిత్రక నిర్మాణాలను సందర్శించారు. మ్యూజియంలో భద్రపరిచిన బుద్ధ ధాతువులను దర్శించి గౌరవ వందనం సమర్పించారు.ఈ సందర్భంగా శ్రీలంక మంత్రి హెనిడుమ సునీల్ సెనేవి, వియత్నాం బౌద్ధ సంఘం ఉపాధ్యక్షుడు తోచ్ నట్,గగన మాలిక్ మాట్లాడుతూ ప్రపంచం యుద్ధ వాతావరణంలో ఉన్న ఈ సమయంలో తెలంగాణ ప్రభుత్వం నిర్వహించిన శాంతి సదస్సు ప్రపంచానికి శాంతి సందేశం అందిస్తోంది. ఇందులో పాల్గొనడం మా కోసం గౌరవంగా భావిస్తున్నాం అని తెలిపారు.ప్రతినిధుల సందర్శన నేపథ్యంలో భద్రతా ఏర్పాట్లను కట్టుదిట్టం చేశారు. సాగర్ సీఐ శ్రీను నాయక్, హాలియా సీఐ సతీష్ ఆధ్వర్యంలో భారీ బందోబస్తు నిర్వహించారు.ఈకార్యక్రమంలో బుద్ధవనం గైడర్ చెన్నూరు ఆంజనేయ రెడ్డి,తెలంగాణ టూరిజం ఏజీఎం జంగయ్య,తహసీల్దార్ శ్రీదేవి,బుద్ధవనం ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్,ఎస్టేట్ మేనేజర్ రవిచంద్ర,ఆర్ట్స్ ప్రమోషన్స్ మేనేజర్ శ్యామసుందర్ రావు తదితరులు పాల్గొన్నారు.

# సత్వర న్యాయం లోక్ అదాలత్‌తోనే సాధ్యం

సివిల్ 97, క్రిమినల్ 1602, పిఎల్‌సి కేసులు 150 పరిష్కారం




**ప్రజాపక్షం/సూర్యాపేట** : లోక్‌అదాలత్‌తోనే సత్వర న్యాయం జరుగుతుందని జిల్లా ప్రధాన న్యాయమూర్తి, జిల్లా న్యాయసేవ అధికార సంస్థ చైర్మన్ పి. లక్ష్మి శారద అన్నారు. శనివారం నేషనల్ లోక్‌అదాలత్‌ను పురస్కరించుకొని జిల్లా కోర్టులో నిర్వహించిన లోక్‌అదాలత్‌లో ఆమె మాట్లాడుతూ కేసుల్లో రాజీ చేసుకోవడం ద్వారా సత్వర న్యాయం పొందినట్లు అవుతుందని చెప్పారు. లోక్‌అదాలత్ కేసుల్లో రాజీ మార్గం ఇరుపక్షాలు విజయం సాధించినట్లు అవుతుందన్నారు. ఇందులో ఎవరికి కూడా అన్యాయం జరగదన్నారు. న్యాయసేవ అధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ జడ్జి ఫర్వీన్ కౌసర్ మాట్లాడుతూ కోర్టుల్లో పెరుగుతున్న పెండింగ్ కేసుల భారాన్ని తగ్గించడానికి నేషనల్ లోక్‌అదాలత్‌లే శరణ్యమన్నారు. మోటర్ ప్రమాదాల్లో చనిపోవడం వల్ల జిల్లా ప్రధాన న్యాయస్థానంలో నష్ట పరిహారం యాక్సిడెంట్ కేసులు ఫైల్ చేయడం జరుగుతుందన్నారు. ఇట్టి నష్ట పరిహారం కేసు నంబర్ యం.వి.ఓ.పి నం.99/2025 జిల్లా ప్రధాన న్యాయమూర్తి కోర్టు నందు శ్రీరామ్ జనరల్ ఇన్సూరెన్స్ కంపెనీ లిమిటెడ్ నుండి ట్రాఫిక్ పోలీసు కానిస్టేబుల్ కుటుంబానికి రూ.1కోటి 25లక్షలు అవార్డు పాస్ చేయడం జరిగిందని చెప్పారు. ఈ కేసులో లోక్‌అదాలత్ మెంబర్ ఆర్ ఉప్పలయ్య పిటిషనర్ తరపు న్యాయవాది గొండ్రాల అశోక్ అని చెప్పారు. 97 సివిల్ కేసుల్లో రూ.4 కోట్ల 5లక్షలు, 1602 క్రిమినల్ కేసుల్లో రూ.55లక్షలు, 150 పి.ఎల్.సి కేసుల్లో రూ.7లక్షల 65వేలు మొత్తం 1849 కేసుల్లో రూ.4కోట్ల 67లక్షల 65వేలు జరిమానా విధించినట్లు వివరించారు. దీంతో కేసులను కూడా కొట్టివేశామని తెలిపారు. ప్రభుత్వ ఖజానాలో దీనిని జమ చేసినట్లు వెల్లడించారు. ప్రధాన జూనియర్ సివిల్ జడ్జి రజిత గోపు, మొదటి అదనపు జిల్లా జూనియర్ సివిల్ జడ్జి అపూర్వ రవళి, రెండవ అదనపు జూనియర్ సివిల్ జడ్జి ఎం మమత, బార్ అసోసియేషన్ ప్రెసిడెంట్ కొంపల్లి లింగయ్య పాల్గొన్నారు.

# సమస్యల పరిష్కారం కోసం ఇంటింటికీ సిపిఐ




సిపిఐ జిల్లా కార్యదర్శి బెజవాడ వెంకటేశ్వర్లు

**ప్రజాపక్షం/సూర్యాపేట టౌన్** : సమస్యలను తెలుసుకుని వాటి పరిష్కారం కోసం ప్రజా ఉద్యమాలు నిర్మించడానికి రాష్ట్రవ్యాప్తంగా ఏప్రిల్ 1 నుండి 10 వరకు నిర్వహించే ఇంటింటికి సిపిఐ కార్యక్రమానికి ప్రజా విరాళాలు అందించి ప్రజాఉద్యమాలకు తోడ్పాటు ఇవ్వాలని సిపిఐ జిల్లా కార్యదర్శి బెజవాడ వెంకటేశ్వర్లు ప్రజానీకానికి విజ్ఞప్తి చేశారు. శనివారం జిల్లా కేంద్రంలో ధర్మభిక్షం భవనంలో జిల్లా కార్యవర్గ సభ్యులు యల్లంల యాదగిరి అధ్యక్షతన జరిగిన సిపిఐ పార్టీ సూర్యాపేట, తుంగతుర్తి నియోజక వర్గ స్థాయి జిల్లా కౌన్సిల్, ప్రజాసంఘాల బాధ్యుల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఎన్నికల వాగ్దానాలు అమలు చేసే దాంట్లో వైఫల్యాలు జరుగుతున్నాయని వాటిని అమలు చేసే వరకు ప్రజల వెంట ఉండి ప్రజాపోరాటాలు నిర్వహిస్తామని వారి సమస్యల పరిష్కారం కోసం పార్టీ రాష్ట్రంలో సిద్ధంగా ఉందన్నారు. ఇక నుంచి సూర్యాపేట జిల్లా కేంద్రంలో వార్డులలో ఉన్న సమస్యల పరిష్కారం కోసం ప్రజాపోరాటాలు నిర్వహిస్తుందని స్పష్టం చేశారు. ఇంటి స్థలాలు లేని వారికి ఇందిరమ్మ ఇల్లు, ఇండ్లు మంజూరు చేయాలని, ప్రభుత్వం భూముల్లో గుడిసెలు వేసుకున్న వారికి పట్టాలు ఇచ్చి ఇంటి నిర్మాణానికి రూ.5లక్షలు ఇవ్వాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో పట్టణ కార్యదర్శి బూర వెంకటేశ్వర్లు, పట్టణ కార్యవర్గ సభ్యులు బొమ్మగాని శ్రీనివాస్, చామల అశోక్ కుమార్, గుగులోతు రాజారాం, పెంద్ర కృష్ణ, తిరుమలగిరి మండల కార్యదర్శి ఎస్‌కె ఫయాజ్, నీలా శ్రీనివాస్, ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు బూర సైదులు, ఎడెల్లి శ్రీకాంత్, ప్రజానాట్యమండలి జిల్లా కార్యదర్శి జంపాల మల్లయ్య, నియోజక వర్గ మహిళ సంఘం అధ్యక్షురాలు హేమలత పాల్గొన్నారు.

# 285 కేసులు పరిష్కారం




**ప్రజాపక్షం/ మిర్యాలగూడ:** తిరిగి సమయం వృధా చేసుకోకుండా కోర్టుల్లో దీర్ఘకాలికంగా పెండింగ్‌లో ఉన్న కేసులను లోక్ అదాలత్‌లో ఫిర్యాదుదారులు, కక్షిదారులు రాజీమార్గం ద్వారా పరిష్కరించుకోవాలని మిర్యాలగూద అదనపు జిల్లా జడ్జి కెవి.చంద్రశేఖర్‌రావు అన్నారు. శనివారం స్థానిక కోర్టుల సముదాయ ఆవరణలో జరిగిన జాతీయ మెగా లోక్ అదాలత్‌ను ఆయన ప్రారంభించి మాట్లాడారు. ప్రతిరోజు కోర్టుల్లో లోక్‌అదాలత్ నిర్వహిస్తున్నామని వాటిని సద్వినియోగం చేసుకోవాలన్నారు. అనంతరం రోడ్డు ప్రమాదం కేసులో రూ.10లక్షల పరిహారం కోసం కేసు వేసిన వ్యక్తి రూ.5లక్షలకు రాజీపడి అదనపు జిల్లా జడ్జి నుంచి అవార్డు తీసుకున్నారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు జరిగిన లోక్‌అదాలత్‌లో 5వ అదనపు జిల్లా జడ్జి కోర్టులో ఎంవీ యాక్ట్ కింద 4 కేసులు పరిష్కరించి రూ.35.6లక్షల పరిహారం చెల్లించేలా ఆదేశాలు, సబ్ కోర్టులో 2ఓఎస్‌లకు రూ.6.66 లక్షలు చెల్లించేలా, ప్రిన్సిపాల్ జూనియర్ సివిల్ జడ్జి కోర్టులో 18 క్రిమినల్ కేసులు, 8ఎల్‌పి, ప్రథమ జూనియర్ సివిల్ జడ్జి కోర్టులో 18 క్రిమినల్ కేసులు, 10 సీసీ ఐపీసీ, ఆర్థిక లావాదేవీల 29, రెండో అదనపు జూనియర్ సివిల్ జడ్జి కోర్టులో క్రిమినల్ 18, సీసీ ఐపీఎస్ 10, పరిహారం 19కేసులు పరిష్కరించారు. అదాలత్‌లో ప్రిన్సిపాల్ జూనియర్ సివిల్ జడ్జి పి.పవన్‌కుమార్, 1వ అదనపు జూనియర్ సివిల్ జడ్జి జి.లావణ్యారాణి, రెండో అదనపు జూనియర్ సివిల్ జడ్జి వి.అరుణ్‌తేజ్, బార్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు నేతి సత్యనారాయణ, ఎ.భూపతిరెడ్డి, న్యాయవాదులు ఎండి.ఇబ్రహీం, కొంక వెంకన్న, వన్ టౌన్, టూటౌన్ సీఐలు నాగ భూషణరావు, సోమనర్సయ్య, రూరల్ ఎస్ఐ లక్ష్మయ్యలు ఉన్నారు.

## వీధి కుక్కల దాడులను నివారించి
# ప్రజలకు సురక్షిత వాతావరణం కల్పించాలి

యాదాద్రి భువనగిరి జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి



**ప్రజాపక్షం/యాదాద్రి** : వీధి కుక్కల దాడులను నివారించి, ప్రజలకు సురక్షిత వాతావరణం కల్పించడమే లక్ష్యంగా అధికారులు కట్టుదిట్టంగా పనిచేయాలని యాదాద్రి భువనగిరి జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి అధికారులను ఆదేశించారు. శనివారం కలెక్టరేట్‌లోని మినీ మీటింగ్ హాల్లో జిల్లా స్థాయి కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి జిల్లా కలెక్టర్, ఎస్పీ అక్షాంశ్ యాదవ్, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ భాస్కర్ రావు, మున్సిపల్ కమిషనర్లు, పశుసంవర్ధక శాఖ సంబంధిత అధికారులు హాజరయ్యారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో వీధి కుక్కల బెడద అధికంగా ఉన్న ప్రాంతాలను గుర్తించి, వాటిపై ప్రత్యేక దృష్టి సారించాలని ఆదేశించారు. కుక్కల నియంత్రణ కోసం ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి ప్రభావిత ప్రాంతాల్లో కుక్కలను బంధించడం, ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చర్యలు చేపట్టాలని సూచించారు. కుక్కకాటు ద్వారా వ్యాపించే రేబిస్ వ్యాధిని నివారించేందుకు వీధి కుక్కలను గుర్తించి, వాటికి యాంటీ రేబిస్ టీకాలు వేయాలని స్పష్టం చేశారు. అలాగే కుక్కల జనాభాను నియంత్రించేందుకు పెద్దఎత్తున స్టెరిలైజేషన్ (జనన నియంత్రణ) ఆపరేషన్లు చేపట్టాలని ఆదేశించారు. ముఖ్యంగా పాఠశాలలు, ఆసుపత్రులు, ఆర్టీసీ బస్టాండ్లు వంటి ప్రజలు అధికంగా రాకపోకలు చేసే ప్రాంతాల్లో ఉన్న కుక్కలను వెంటనే నియంత్రించాలని పేర్కొన్నారు. స్టెరిలైజేషన్ అనంతరం కుక్కలను తగిన షెల్టర్లలో ఉంచే విధంగా చర్యలు తీసుకోవాలని సూచించారు. జిల్లా ఎస్పీ అక్షాంక్ష్ యాదవ్ మాట్లాడుతూ జిల్లాలో వీధి కుక్కలను గుర్తించి వాటికి స్టెరిలైజేషన్ చేయడం అత్యవసరమని పేర్కొన్నారు. ఈ సమావేశంలో జిల్లా పంచాయతీ అధికారి విష్ణువర్ధన్ రెడ్డి, ఆర్ అండ్ బి శాఖ అధికారి సరిత, పశుసంవర్ధక శాఖ అధికారి జానయ్య, జిల్లా విద్యాశాఖ అధికారి సత్యనారాయణ, జిల్లా వైద్యశాఖ అధికారి మనోహర్, జిల్లా రవాణా శాఖ అధికారి సాయి కృష్ణ, మున్సిపల్ కమిషనర్లు పాల్గొన్నారు.

## లోక్ అదాలత్ సాక్షిగా ఒక్కటైన జంట

**ప్రజాపక్షం/తుంగతుర్తి :** క్షణికావేశంలో కోర్టు మెట్టెక్కిన దంపతులు లోక్ అదాలత్ సాక్షిగా ఒక్కటయ్యారు. సూర్యాపేట జిల్లా తుంగతుర్తిలోని జూనియర్ సివిల్ కోర్టు ప్రాంగణంలో జడ్జి ఎండి గౌస్‌పాషా ఆధ్వర్యంలో జరిగిన లోక్‌అదాలత్‌లో తుంగతుర్తి మండలం గొట్టిపర్తి గ్రామానికి చెందిన వీరమల్లు సరిత దంపతులు 2012లో వివాహం జరిగింది. మనస్పర్థలతో వేరువేరుగా ఉంటున్న, వాళ్ళిద్దరూ ఒక్కటి కావడంతో అందరు సంతోషం వ్యక్తం చేశారు. కేసులు వద్దు సామరస్యంగా పరిష్కారం ముద్దు, అది లోక్ అదాలత్ తోనే సాధ్యపడుతుందని జడ్జి పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక సిఐ నరసింహారావు, ఎస్ఐ క్రాంతి కుమార్, చిరంజీవి, సైదులు, బార్ అసోసియేషన్ అధ్యక్షులు అనపర్తి జ్ఞానసుందర్, కారింగుల వెంకటేశ్వర్లు, పర్వీన్‌బేగం, రాజు, వేణుయాదవ్, సతీష్ తదితరులు పాల్గొన్నారు.







## చర్లగూడెం ద్వారా సాగునీరందించాలి

జీపు జాతా ప్రచారంలో సిపిఐ నేతలు డిమాండ్

**ప్రజాపక్షం/సంస్థాన్ నారాయణపురం** : మండలానికి సాగునీరు అందించాలని కోరుతూ రెండు రోజుల జీప్ జాతను మహమ్మదాబాద్ గ్రామంలో జాతాను ప్రారంభించారు. చర్లగూడెం శివన్నగూడెం ప్రాజెక్టు ద్వారా రాచకొండలో రిజర్వాయర్ ఏర్పాటుచేసి నారాయణపురం మండలానికి సాగునీరు అందించాలని లక్ష్యంతో సిపిఐ, రైతు సంఘాల ఆధ్వర్యంలో గుడిమల్కాపురం, కోతులపురం, అల్లం దేవి చెరువు, సర్వేల్, గుజ్జ, లింగంవారి గూడెం, సేరి గూడెం, పుట్టపాక, కొత్తగూడెం, రాజన్న బావి, ఎర్రగుంట గ్రామాలలో జీపు జాతలో సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు బచ్చనగోని గాలయ్య మాట్లాడుతూ దశాబ్దాలుగా నీటి కోసం ఎదురుచూస్తున్న నారాయణపురం రైతులు ఇప్పటికీ వర్షాధారంగా వ్యవసాయం చేస్తూ నష్టాల్లో కూరుకుపోతున్నారని అన్నారు. రాచకొండలో రిజర్వాయర్ ఏర్పాటు చేసి కాలువల ద్వారా మళ్లిస్తే వేల ఎకరాలకు సాగునీరు అందే అవకాశం ఉందని వెంటనే ప్రభుత్వం సంబంధిత అధికారులతో కలిసి డిపిఆర్ ఏర్పాటు చేయించి ఈ ప్రాంత భూములను బీడు భూములుగా మారకుండా చర్యలు చేపట్టి రైతులను ఆదుకోవాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు కె.శ్రీనివాస్, మండల కార్యదర్శి దుబ్బాక భాస్కర్, సిపిఐ జిల్లా సమితి సభ్యులు చిలివేరు అంజయ్య, ప్రజానాట్యమండలి రాష్ట్ర నాయకులు బి.జగన్, కలకొండ సంజీవ, సర్పంచ్‌లు ముత్యాల అంజయ్య, ఎర్రోళ్ల లింగయ్య, ఈద మల్లయ్య, ప్రజానాట్యమండలి కళాకారులు గణేష్, పరమేష్, ప్రవీణ్, పార్టీ ప్రజాసంఘాల నాయకులు, గ్రామ శాఖ సిపిఐ నాయకులు పాల్గొన్నారు.

## బ్లాక్‌డే ను జయప్రదం చేయాలి

ఎఐటియుసి రాష్ట్ర కార్యదర్శి మేకల శ్రీనివాసరావు



**ప్రజాపక్షం/హుజూర్‌నగర్:** ఏప్రిల్ 1వ తేదీన దేశవ్యాప్తంగా జరిగే బ్లాక్‌డేను జయప్రదం చేయాలని ఎఐటియుసి రాష్ట్ర కార్యదర్శి మేకల శ్రీనివాసరావు పిలుపునిచ్చారు. శనివారం హుజూర్‌నగర్‌లోని సివిల్ సప్లై గోదాం వద్ద జరిగిన సివిల్ సప్లై యూనియన్ సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడుతూ భారత దేశంలోని కేంద్ర ప్రభుత్వం కార్మికుల హక్కులను కాలరాస్తూ నాలుగు కోడ్‌లుగా విభజించిన కార్మిక చట్టాలను తక్షణమే రద్దు చేయాలని, సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని, కనీస వేతనం రూ.26వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. అసంఘటిత రంగాల్లో పనిచేస్తున్న కార్మికులకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని కోరారు. ఏప్రిల్ 1వ తేదీన జరిగే దేశవ్యాప్తంగా జరిగే బ్లాక్‌డేను జిల్లాలోని అన్ని మండల కేంద్రాల్లో నిర్వహించాలన్నారు. ఎఐటియుసి జిల్లా అధ్యక్షులు జడ శ్రీనివాస్ మాట్లాడుతూ కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు కార్మికుల శ్రమతో పెట్టుబడిదారి వర్గానికి కొమ్ముకాస్తూ తన రక్త మాంసాలు ఒడిసి శ్రమ చేస్తున్న కార్మికులకు న్యాయం చేయడంలేదన్నారు. కార్మికులకు పిఎఫ్, ఈఎస్ఐ సౌకర్యం కల్పించాలని, గ్రూప్ ఇన్సూరెన్స్ సౌకర్యం కల్పించి ప్రమాదవశాత్తు మృతి చెందిన కార్మికుని కుటుంబాలకు రూ.10 లక్షలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బెల్లంకొండ రామ్మూర్తి, పండగ వెంకన్న, జక్కుల మల్లయ్య, జెట్టి వెంకన్న, పానుగోతు గోపి, బానావత్ సైదులు, ఎర్ర బాలాజీ, చక్రాల వెంకన్న, బిక్షం, తేజావత్ సైదులు పాల్గొన్నారు.

## ఎన్‌హెచ్-565 అభివృద్ధికి రూ.14.45 కోట్లు

**ప్రజాపక్షం/నల్లగొండ టౌన్:** పట్టణంలో ఎన్‌హెచ్565 రహదారి అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం రూ.14.45 కోట్లను మంజూరు చేసింది. రోడ్డు రవాణా ,జాతీయ రహదారుల మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో ఈ పనులు 2025/26 వార్షిక ప్రణాళిక కింద అమలు కానున్నాయి. పానగల్ బైపాస్ నుంచి డీఈఓ కార్యాలయం వరకు (కిమీ 20.300 నుంచి 23.730) రహదారి విస్తరణ, బ్లాక్ టాపింగ్ పనులు చేపట్టనున్నారు. ఈ ప్రాజెక్టుకు పరిపాలనా,సాంకేతిక, ఆర్థిక ఆమోదాలు లభించాయి.గతంలో విస్తరణకు వ్యతిరేకంగా ప్రజల ఆందోళనలు, కోర్టు కేసుల వల్ల పనులు నిలిచిపోయాయి. అనంతరం రాష్ట్ర మంత్రి కోమటి రెడ్డి వెంకటరెడ్డి చొరవతో బైపాస్ మార్గంలో మార్పులు చేసి, కేంద్రం నుంచి నిధులు సాధించారు.నిధుల మంజూరుపై మేయర్ బుర్రి చైతన్య శ్రీనివాసరెడ్డి హర్షం వ్యక్తం చేస్తూ, స్మార్ట్ సిటీ అభివృద్ధిలో భాగంగా ఈ రహదారిని ఆధునీకరించనున్నట్లు తెలిపారు.

## హెల్మెట్ తప్పనిసరిగా ధరించాలి

**ప్రజాపక్షం/కోదాడ:** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న 99 రోజుల కార్యచరణ ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా కోదాడ పట్టణంలోని పోలీసుల ఆధ్వర్యంలో హెల్మెంట్ వినియోగంపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. రోడ్డు భద్రత అరైవ్ అలైవ్ కార్యక్రమం కింద చేపట్టిన ఈ ర్యాలీని కోదాడ డిఎస్‌పి శ్రీనివాసరెడ్డి, పట్టణ ఇన్స్‌పెక్టర్ శివశంకర్‌తో కలిసి పోలీస్‌స్టేషన్ వద్ద ప్రారంభించారు. ఖమ్మం క్రాస్ రోడ్డు నుంచి రంగా థియేటర్ క్రాస్‌రోడ్డు వరకు సాగిన ఈ ర్యాలీలో స్థానిక ప్రజలు, వాహనదారులు, వ్యాపారులకు హెల్మెంట్ వినియోగంపై అవగాహన కల్పించారు. ఈసందర్భంగా కోదాడ డిఎస్‌పి శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెంట్ ధరించడం ద్వారా అనుకొని ప్రమాదాల సమయంలో ప్రాణపాయం నుంచి రక్షణ పొందవచ్చని సూచించారు.

### సిపిఐ(ఎం), ఎస్‌డిపిఐకి మధ్య

# ఎన్నికల ఒప్పందం లేదు

**సిపిఐ (ఎం) ప్రధాన కార్యదర్శి ఎం.ఎ. బేబీ స్పష్టీకరణ**



**కన్నూర్ :** కేరళలో తమ పార్టీకి, ఎస్‌డిపిఐకి మధ్య ఎటువంటి ఎన్నికల ఒప్పందం లేదని సిపిఐ (ఎం) ప్రధాన కార్యదర్శి ఎం.ఎ. బేబీ స్పష్టం చేశారు. అనేక నియోజకవర్గాల్లో సిపిఐ (ఎం) ఎస్‌డిపిఐతో ఒక అవగాహనకు వచ్చిందంటూ యుడిఎఫ్ నాయకులు చేసిన ఆరోపణలపై బేబీ స్పందించారు. అటువంటి ఏర్పాటు ఏదీ లేదని విలేకరుల సమావేశంలో తెలిపారు. 'సోషల్ డెమోక్రటిక్ పార్టీ ఆఫ్ ఇండియా (ఎస్‌డిపిఐ) రాజకీయ విధానం ప్రజాస్వామ్య రాజకీయాలకు అనుగుణంగా లేదని సిపిఐ (ఎం) భావిస్తోంది. ఇటువంటి సంస్థలు ప్రజాస్వామ్య పద్ధతులను అవలంబించడం ద్వారా తమ వైఖరిని సరిదిద్దుకోవాలి' అని ఆయన అన్నారు. జమాతే –ఇ–ఇస్లామీ ప్రస్తావన తెస్తూ, ఆ సంస్థకు మతపరమైన జాతీయవాద ధోరణి ఉందని ఆయన అభివర్ణించారు. 'ఒకవేళ వారు అటువంటి ధోరణిని అనుసరించకపోతే, ఆ విషయాన్ని బహిరంగంగా ప్రకటించి, ప్రచారం చేయాలి. వారి పట్ల మా వైఖరి ఇదే' అని బేబీ పేర్కొన్నారు. ఎల్‌డిఎఫ్ కూటమిలోని భాగస్వామ్య పక్షాలతోనూ, అలాగే కూటమికి బహిరంగంగా మద్దతు ప్రకటించిన ఇతర రాజకీయ సంస్థలతోనూ కలిసి పనిచేస్తుందని ఆయన తెలిపారు. పీపుల్స్ డెమోక్రటిక్ పార్టీ (పిడిపి) ఎల్‌డిఎఫ్‌కు తన మద్దతును ప్రకటించిందని బేబీ చెబుతూ నిర్ణయం తీసుకోవడం ఆ పార్టీ స్వతంత్ర హక్కు అని అన్నారు. ఎల్‌డిఎఫ్ మైనారిటీలకు అనుకూలంగా ఉంటుందని పిడిపి భావిస్తోందని, ఏయే పార్టీలు మతతత్వ ధోరణిని కలిగి ఉన్నాయనే విషయంపై తమకు సొంత అభిప్రాయం ఉందని ఆయన చెప్పారు. పిడిపి నాయకుడు అబ్దుల్ నాజర్ మదనీ గతంలో మతతత్వ వైఖరిని అవలంబించినప్పటికీ, ఆ తర్వాత దానిని సరిదిద్దుకున్నారని ఆయన చెప్పారు. రాజకీయ కక్షల కారణంగా పలు కేసుల్లో ఇరుక్కున్న తన అనుభవం దృష్ట్యా, తాను గతంలో అనుసరించిన వైఖరులను విడనాడి, ఇప్పుడు కేవలం ప్రజాస్వామ్య పద్ధతుల్లోనే వ్యవహరిస్తున్నట్లు మదనీ స్వయంగా ప్రకటించారని, ఆ మార్పు మదనీ, పిడిపి ఇద్దరి విధానాల్లోనూ స్పష్టంగా కనిపిస్తోందని బేబీ అన్నారు. జి. సుధాకరన్‌తో సహా కొంతమంది అసమ్మతి సిపిఐ(ఎం) నాయకులు చేసిన వ్యాఖ్యలను కూడా ఆయన ప్రస్తావిస్తూ, ఆ వ్యాఖ్యలు కాంగ్రెస్, బిజెపి మధ్య ఏదో ఒక అవగాహన కుదిరిందనే విషయాన్ని సూచిస్తున్నాయని ఆరోపించారు. సిపిఐ(ఎం) మద్దతుదారులలో అత్యధిక శాతం మంది పార్టీని బలోపేతం చేయడానికి కట్టుబడి ఉన్నారని బేబీ పేర్కొన్నారు. 'కేవలం ముగ్గురు లేదా నలుగురు వ్యక్తులు మాత్రమే పార్టీని విడిచిపెట్టారు, వారికి ఎటువంటి అనుచరులు కూడా లేరు. పదవులు, హోదాల ఆశతోనే వారు పార్టీని వీడారు. ఇది అమరవీరుల త్యాగాల పునాదిపై నిలిచిన పార్టీ; ఇటువంటి స్వార్థపూరితమైన అంశాలపై ఆధారపడే పార్టీ కాదు' అని ఆయన అన్నారు. ఎల్‌డిఎఫ్ కూటమి ఆర్‌ఎస్‌ఎస్ ఓట్ల కోసం ఆశపడటం లేదని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి బినోయ్ విశ్వం స్పష్టం చేశారు. 'మైనారిటీలను లక్ష్యంగా చేసుకుంటూ, లౌకిక విలువల పట్ల వ్యతిరేకత కలిగిన వారి ఓట్లు మాకు వద్దు' అని ఆయన అన్నారు. కేరళలో అసలైన అవగాహన కాంగ్రెస్, బిజెపి మధ్యే ఉందని ఆయన ఆరోపించారు. 'మహాత్మా గాంధీ, జవహర్‌లాల్ నెహ్రూలను విస్మరించి, కేరళలోని కాంగ్రెస్ పార్టీ బిజెపికి అత్యంత సన్నిహిత మిత్రపక్షంగా మారిపోయిందని ఆయన పేర్కొన్నారు. కేరళలో అసెంబ్లీ ఎన్నికలు ఏప్రిల్ 9న జరగనున్నాయి.

### 164 సీట్లకు అభ్యర్థులను

# ప్రకటించిన డిఎంకె

**నగర నియోజకవర్గాల నుంచే స్టాలిన్, ఉదయనిధి పోటీ**



**చెన్నై :** తమిళనాడులో ఏప్రిల్ 23న అసెంబ్లీ ఎన్నికలు జరగనునున్నాయి. ఈ నేపథ్యంలో అధికార డిఎంకె శనివారం 164 నియోజకవర్గాలకు అభ్యర్థులను ప్రకటించింది. ముఖ్యమంత్రి ఎం.కె. స్టాలిన్, ఆయన కుమారుడు, ఉప ముఖ్యమంత్రి ఉదయనిధిలను వారి ప్రస్తుత నగర స్థానాల నుంచి తిరిగి నామినేట్ చేసింది. చాలా మంది మంత్రులు, ఎమ్మెల్యేలు, సీనియర్ నాయకులను కూడా కొనసాగించింది. పార్టీ ప్రధాన కార్యాలయంలో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో డిఎంకె అధ్యక్షుడు స్టాలిన్ అన్నా అరివలయన్ మాట్లాడుతూ తాను కొలత్తూరు నుంచి మరోసారి పోటీ చేస్తానని తెలిపారు. ఉదయనిధి కూడా నగరంలోని చెపాక్‌ట్రిప్లికేన్ నుంచి తిరిగి ఎన్నిక కోరుతున్నారన్నారు. మంత్రులు దురై మురుగన్ (డిఎంకె ప్రధాన కార్యదర్శి), కె.ఎన్. నెహ్రూ, అన్బిల్ మహేష్ పొయ్యమొళి, తంగం తెన్నరసు, ఎం.ఎ. సుబ్రమణియన్, ఇవి. వేలులను కొనసాగించారు. అయితే ఇటీవల డిఎంకెలో చేరిన, ఎఐఎడిఎంకె నుండి బహిష్కరించబడిన నాయకుడు ఓ. పన్నీర్‌సెల్వంను, గత అసెంబ్లీలో తాను ప్రాతినిధ్యం వహించిన బోడినాయకనూరు స్థానం నుంచి బరిలోకి దింపారు. డిఎంకెలో చేరిన తర్వాత ఆయన ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేశారు. గతంలో డిఎంకెలో చేరిన పన్నీర్‌సెల్వం సహచరులైన పాల్ మనోజ్ పాండియన్, ఆర్. వైతిలింగంలకు కూడా టికెట్లు కేటాయించారు. కోయంబత్తూరు దక్షిణ నియోజకవర్గం నుంచి మాజీ మంత్రి వి. సెంథిల్ బాలాజీని బరిలోకి దింపారు. శనిఆరం ఉదయం, కాంగ్రెస్, వామపక్షాలు, విసికె, డిఎండికె తదితరులు పోటీ చేసే నియోజకవర్గాలను గుర్తించి, డిఎంకె తన మిత్రపక్షాలతో సీట్ల పంపకం ప్రక్రియను పూర్తి చేసింది. రాష్ట్రంలో సెక్యులర్ ప్రోగ్రెసివ్ అలయన్స్ (ఎస్‌పిఎ)కు డిఎంకె నాయకత్వం వహిస్తోంది. ప్రధాన మిత్రపక్షమైన కాంగ్రెస్‌కు కేటాయించిన 28 సీట్లలో పొన్నేరి, ఈరోడ్ ఈస్ట్, విలవన్‌కోడ్ శివకాశి, కారైకుడి ఉన్నాయి. ప్రేమలత విజయకాంత్ నేతృత్వంలోని డిఎండికెకు 10 సీట్లు కేటాయించారు. వీటిలో వృద్ధాచలం, పల్లవరం ఉన్నాయి. టోల్ తిరుమవల్వన్ నేతృత్వంలోని విడుతలై చిరుతైగల్ కట్చి (విసికె) కేటాయించిన ఎనిమిది స్థానాల్లో, కట్టుమన్నార్కోయిల్, పన్రుట్టి, తిండివనం నుండి పోటీ చేస్తుంది. సిపిఐ (ఎం)కి పద్మనాభపురం, పళని కేటాయించగా, సిపిఐ తల్లీ, భవానీసాగర్ (ఎస్సీ) నుంచి ఎన్నికలను ఎదుర్కోనుంది. రెండు వామపక్ష పార్టీలకు చెరో ఐదు సీట్లు కేటాయించారు. డిఎంకె తన ఇతర మిత్రపక్షాలకు కూడా సీట్లను కేటాయించింది. వీటిలో వైకో నేతృత్వంలోని ఎండిఎంకె నాలుగు స్థానాల్లో పోటీ చేయనుంది. వీటిలో మూడు సీట్లు డిఎంకె ఉదయ కిరణం గుర్తుపై ఉంటాయి. మదురై సౌత్ నియోజకవర్గం కూడా దీని కేటాయింపులలో ఒకటి. డిఎంకె 164 నియోజకవర్గాల్లో పోటీ చేస్తుండగా, మిత్రపక్షాలకు చెందిన 11 మంది అభ్యర్థులు ద్రవిడ పార్టీ అయిన ఉదయ కిరణం గుర్తుపై పోటీ చేస్తారు.

# ముగ్గురు మావోయిస్టులు లొంగుబాటు

**కాంకర్ :** ఛత్తీస్‌గఢ్‌లోని కాంకర్ జిల్లాలో శనివారం ఒక మహిళతో సహా ముగ్గురు నక్సలైట్లు లొంగిపోయారని పోలీసు అధికారులు తెలిపారు. లొంగిపోయిన ఈ కార్యకర్తలను రాధిక కుంజమ్, సందీప్ కాడియం, రైను పడ్డాగా గుర్తించారు. కుంజమ్, కాడియం, నిషేధిత కమ్యూనిస్ట్ పార్టీ ఆఫ్ ఇండియా (మావోయిస్ట్)కు చెందిన ఏరియా కమిటీ సభ్యులు అని పోలీసు సూపరింటెండెంట్ నిఖిల్ రాఖేచా తెలిపారు. వారు రెండు సెల్ఫ్‌లోడింగ్ రైఫిల్స్ (ఎస్‌ఎల్ఆర్), ఒక .303 రైఫిల్‌ను కూడా పోలీసులకు అప్పగించారని ఆయన చెప్పారు. వారు అందించిన సమాచారం ఆధారంగా, ఆ ప్రాంతంలో ఇంకా క్రియాశీలకంగా ఉన్న ఇతర నక్సలైట్ కార్యకర్తలతో సంప్రదింపులు జరిపి, హింసను విడనాడి జనజీవన స్రవంతిలో కలిసేలా వారిని ప్రోత్సహించే ప్రయత్నాలు జరుగుతున్నాయని ఎస్‌పి పేర్కొన్నారు. కాగా, గత మూడు రోజుల క్రితం ఈ జిల్లాలో ఆరుగురు నక్సలైట్లు లొంగిపోయారు. మిగిలిన మావోయిస్టు కార్యకర్తలు హింసను విడనాడాలని ఇన్‌స్పెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ (బస్తర్ రేంజ్) సుందర్‌రాజ్ పట్టిలింగం మరోసారి విజ్ఞప్తి చేశారు. లొంగిపోయిన వారికి ప్రభుత్వ పునరావాస విధానం కింద లభించే అన్ని ప్రయోజనాలు అందుతాయని ఆయన పేర్కొన్నారు. గత 26 నెలల్లో రాష్ట్ర లొంగుబాటు, పునరావాస విధానం కింద 2,700 మందికి పైగా మావోయిస్టులు జనజీవన స్రవంతిలో కలిశారని ఆ సీనియర్ అధికారి తెలిపారు. ఈనెల 24న, సీనియర్ మావోయిస్ట్ కమాండర్ పాపారావు, మరో 17 మంది బస్తర్ ప్రాంతంలో లొంగిపోయారు. రావు లొంగుబాటు తర్వాత రాష్ట్రంలో ఏ సీనియర్ నక్సల్ నాయకుడు కూడా క్రియాశీలకంగా మిగిలి ఉండరని ఉప ముఖ్యమంత్రి, హోం మంత్రి విజయ్ శర్మ అప్పట్లో వ్యాఖ్యానించారు.



### వికసిత్ భారత్ లక్ష్య సాధనకు... 140కోట్ల పౌరుల

# సంఘటిత కృషి, ఐక్యత అవసరం

**ప్రధానమంత్రి మోదీ పిలుపు**
**నొయిడాలో అంతర్జాతీయ విమానాశ్రయాన్ని ప్రారంభించిన ప్రధాని**

**నొయిడా :** సవాళ్లను ఎదుర్కోవడానికి అంకితభావంతో ఐక్యంగా పనిచేయాలని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పౌరులకు పిలుపునిచ్చారు. భారతదేశ ప్రయోజనాలను కాపాడటం, కుటుంబాలు, రైతులను పరిరక్షించడం ప్రభుత్వ ప్రాధాన్యతలు అని నొక్కిచెప్పారు. శనివారం ఆయన నొయిడా అంతర్జాతీయ విమానాశ్రయాన్ని ప్రారంభించిన అనంతరం ప్రసంగిస్తూ పశ్చిమాసియాలో కొనసాగుతోన్న సంఘర్షణను ప్రస్తావించారు. ప్రపంచ సవాళ్లను ఎదుర్కోవడానికి వికసిత్ భారత్ సాధనకు 140కోట్ల మంది పౌరుల సామూహిక కృషి, ఐక్యత అవసరమని అన్నారు. సమయాన్ని ఆదాచేయడం, ఖర్చులను తగ్గించడం ద్వారా పౌరుల సౌకర్యాన్ని మెరుగుపర్చడమే ప్రభుత్వ ప్రాధాన్యత అని ఆయన నొక్కిచెప్పారు. ఈ సంక్షోభాన్ని మనం ప్రశాంతంగా సహనంతో ఐక్యంగా ఎదుర్కోవాలని నేను దేశ ప్రజలకు మరోసారి విజ్ఞప్తి చేస్తున్నానని ఉద్ఘాటించారు. ఇది ప్రపంచ సంక్షోభమని, మనం భారతదేశ ప్రయోజనాలకు ప్రాధాన్యత ఇవ్వాలని, అదే మన గొప్ప బలమని ఆయన అన్నారు. తాను పార్లమెంట్‌లో ఈ పరిస్థితి వివరంగా చర్చించానని, అలాగే వివిధ రాష్ట్రాల ముఖ్యమంత్రులతో విస్తృతమైన చాలా సానుకూలమైన చర్చలు జరిపినట్లు ఆయన తెలిపారు. ప్రధానమంత్రి రాజకీయ పార్టీలను ముఖ్యంగా ఉత్తరప్రదేశ్‌లో సమావేశాల సమయంలో బాధ్యతారాహిత్యమైన ప్రకటనలు చేయకుండా ఉండాలని కూడా కోరారు. 'దేశానికి హానికలిగించే వ్యాఖ్యలు చేసేవారు రాజకీయ చర్చలలో పాయింట్లు సంపాదించవచ్చు కానీ అటువంటి చర్యలను ప్రజలు ఎప్పటికీ క్షమించరు' అని కోవిడ్19 మహమ్మారి సమయంలో ఓటర్లు తప్పుడు సమాచార ప్రచారాలను ఎలా తిరస్కరించారో గుర్తుచేస్తూ ఆయన అన్నారు. పశ్చిమాసియాలో కొనసాగుతున్న సంఘర్షణ వల్ల తలెత్తిన సవాళ్లను భారతదేశం పూర్తి శక్తితో ఎదుర్కొంటోందని, తన పౌరులను కాపాడటానికి దేశం అన్ని అవసరమైన చర్యలు తీసుకుంటోందని ప్రధాని చెప్పారు. పశ్చిమాసియాలో నెలరోజులకు పైగా సంఘర్షణ కొనసాగుతోంది.ఈ సవాల్‌ను పూర్తి శక్తితో ఎదుర్కొంటున్నామని మోదీ తెలిపారు. సంఘర్షణ ప్రభావిత ప్రాంతాల నుంచి లభించే ముడి చమురు, గ్యాస్‌పై భారతదేశం ఆధారపడి ఉందని తెలియజేశారు. ఈ భారం కుటుంబాలు, రైతులపై పడకుండా ఉండేందుకు ప్రభుత్వం అవసరమైన అన్ని చర్యలు తీసుకుంటోందని ప్రధాని వెల్లడించారు. విశిష్ట ఉత్తర్‌ప్రదేశ్, విశిష్ట భారత్ దిశగా సాగుతోన్న ప్రయాణంలో నేడు ఒక కొత్త అధ్యాయం ప్రారంభం అవుతోందన్నారు. నొయిడా అంతర్జాతీయ విమానాశ్రయం ఈ ప్రాంతంలో ఆర్థిక కార్యకలాపాలను పెంచుతోందన్నారు. నొయిడా అంతర్జాతీయ విమానాశ్రయం పశ్చిమ ఉత్తర్‌ప్రదేశ్‌లోని చిన్న వ్యాపారులు, యువతకు కొత్త అవకాశాలు సృష్టిస్తుందని మోదీ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన ప్రధాన ప్రతిపక్షపార్టీపై తీవ్రస్థాయిలో విమర్శల దాడికి దిగారు. సమాజ్‌వాదీ పార్టీ నోయిడాను 'దోపిడీకి ఎటిఎం'గా మార్చిందని ఆరోపించారు. అయితే భారతీయ జనతా పార్టీ నాయకత్వంలో అది ఇప్పుడు అభివృద్ధికి చోదకశక్తిగా ఆవిర్భవిస్తోందన్నారు. సాధారణ కుటుంబాలకు విమాన ప్రయాణం అందుబాటులో ఉండేందుకు ఉడాన్ పథకాన్ని ప్రారంభించామని, గత కొన్నేళ్లుగా ఈ పథకం కింద 1.6 కోట్లకు పైగా ప్రజలు సరసమైన ధరలకు ప్రయాణించారన్నారు. సుమారు రూ.29,000కోట్ల నిరూపిత వ్యయంతో ఈ పథకాన్ని ఇటీవల విస్తరించారని, రాబోయే ఏడాదిలో చిన్న నగరాలలో కొత్త పోర్టులను అభివృద్ధి చేయడానికి దాదాపు 200హెలిప్యాడ్‌లను నిర్మించడానికి ప్రణాళికలు ఉన్నాయని ప్రధానమంత్రి మోదీ తెలిపారు.ఈ విస్తరణ వల్ల ఉత్తర్‌ప్రదేశ్ వంటి రాష్ట్రాలు గణనీయంగా లబ్ధి పొందుతాయని వివరించారు. 11,200కోట్ల అంచనా వ్యయంతో అభివృద్ధి చేస్తున్న ఈ విమానాశ్రయం మొదటి దశను రోడ్డు, రైలు,మెట్రో, ప్రాంతీయ రవాణా వ్యవస్థల ద్వారా నిరంతరాయ అనుసంధానంతో కూడిన బహుళ రవాణా కేంద్రంగా రూపొందించాలని భావిస్తున్నారు. విమానశ్రయం ప్రారంభ ప్రయాణికుల నిర్వహణా సామర్థ్యం సంవత్సరానికి 12 మిలియన్లుగా ఉంటుందని, దీనిని 70మిలియన్ల వరకూ పెంచవచ్చని ప్రధానమంత్రి తెలిపారు. ఈ సందర్భంగా ప్రధానమంత్రి మోదీ టెర్మినల్‌ను తనిఖీ చేశారు.




### వెస్ట్ బాంక్‌లో ఇజ్రాయెల్ చర్యలను...

# వ్యతిరేకించే ధైర్యం ప్రధాని మోదీకి లేదా?

**కాంగ్రెస్ విమర్శల దాడి**



**న్యూఢిల్లీ :** పశ్చిమాసియా యుద్ధాన్ని ఒక ముసుగుగా వాడుకుంటూ ఇజ్రాయెల్ తన గ్రేటర్ ఇజ్రాయెల్ దార్శనికతతో ముందుకు సాగుతోందని, స్వాతంత్ర్య సమైక్యతపై ఉన్న ఆశలను పూర్తిగా తుంచివేస్తోందని కాంగ్రెస్ శనివారం ఆరోపించింది. వెస్ట్ బ్యాంక్‌లో ఇజ్రాయెల్ చర్యలకు వ్యతిరేకంగా ప్రధానమంత్రి నరేంద్రమోదీ గళం కూడా విప్పకపోవడాన్ని కాంగ్రెస్ తీవ్రంగా విమర్శించింది. అమెరికాఇజ్రాయెల్ వైమానిక దాడి, ఇరాన్ ప్రతిదాడి ప్రారంభమై 28 రోజులు అయిందని కాంగ్రెస్ ప్రధానకార్యదర్శి ఇన్‌చార్జి కమ్యూనికేషన్స్ జైరాం రమేశ్ తెలిపారు. గత నాలుగు వారాలుగా ప్రపంచ దృష్టి హోర్ముజ్ జలసంధి, గల్ఫ్ దేశాలలోని ఇంధన మౌలిక సదుపాయాలపై ఉన్నప్పటికీ ఇజ్రాయెల్ గాజా ప్రజలపై తన క్రూరత్వాన్ని కొనసాగించిందని, దక్షిణ లెబనాన్‌లో తన కోసం ఒక పెద్ద బఫర్ జోన్‌ను సృష్టించడం ప్రారంభించిందని, వెస్ట్ బ్యాంక్‌ను తనలో విలీనం చేసుకోవడాన్ని దృఢమైన ఆక్రమణగా మార్చడానికి నిర్ణయాత్మక చర్యలు తీసుకుంటోందని జైరాం రమేశ్ తన 'ఎక్స్' పోస్ట్‌లో ధ్వజమెత్తారు. ప్రస్తుత పశ్చిమాసియా యుద్ధం బృహత్ ఇజ్రాయెల్ అనే తన దార్శనికతను ముందుకు తీసుకెళ్లడానికి , అలాగే ఏ పాలస్తీనా రాజ్యాన్నైనా అంతం చేయడానికి ఇజ్రాయెల్‌కు ఒక రక్షణ కవచంలా పనిచేస్తుందని అన్నారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఇజ్రాయెల్ నుండి బయల్దేరిన కేవలం రెండు వారాలకే ఇరాన్‌పై అమెరికాఇజ్రాయెల్ బాంబు దాడులు ప్రారంభమయ్యాయని, ఆయన అక్కడకు చేరుకున్న కొద్ది రోజులకే 1967 తర్వాత తొలిసారిగా ఆక్రమిత వెస్ట్ బ్యాంక్‌లోని సగభాగంలో భూమి రిజిస్ట్రేషన్‌కు ఇజ్రాయెల్‌కు కేబినెట్ ఆమోదం తెలిపిందన్న విషయం చాలామందికి తెలియదు అని జైరాం రమేశ్ అన్నారు. దీనివల్ల లక్షలాది మంది ప్రజలు తమ నివాసాలను కోల్పోతారని, కానీ మోదీకి, తన మంచి స్నేహితుడైన బెంజమిన్ నెతన్యాహూకు ఈ విషయంలో గళం విప్పే ధైర్యం లేదని కాంగ్రెస్ ముఖ్యనేత జైరాం రమేశ్ మండిపడ్డారు.

# టిఎంసి ప్రభుత్వంపై షా 'చార్జిషీట్' విడుదల




**కోల్‌కతా:** పశ్చిమ బెంగాల్‌లో అసెంబ్లీ ఎన్నికల్లో బిజెపి తరుపున ప్రచారాన్ని కేంద్ర హోం మంత్రి అమిత్ షా మరింత ముమ్మరం చేశారు. టిఎంసి ప్రభుత్వంపై చార్జిషీట్ విడుదల చేశారు. ఈ ఎన్నికలు కేవలం బెంగాల్ కోసమే కాకుండా దేశ భద్రత కోసం జరిగే పోరాటమని ఆయన అభివర్ణించారు. శనివారం కోల్‌కతాలో జరిగిన విలేకరుల సమావేశంలో షా మాట్లాడుతూ మమతా బెనర్జీ ప్రభుత్వంపై తీవ్ర స్థాయిలో విమర్శలు గుప్పించారు. 15 ఏళ్ల టిఎంసి పాలనలో బుజ్జగింపు రాజకీయాలు, అవినీతి, రాజకీయ హింస కారణంగా పశ్చిమ బెంగాల్ దేశంలోకి చొరబాట్లకు ప్రధాన కారిడార్‌గా మారిందని షా ఆరోపించారు. 'మమతా దీదీ ఎప్పుడూ బాధితురాలి కార్డు రాజకీయాలు ఆడారు. కొన్నిసార్లు తన గాయం గురించి మాట్లాడతారు, కొన్నిసార్లు ఎన్నికల కమిషన్‌ను దూషిస్తారు. కానీ బెంగాల్ ప్రజలు ఇప్పుడు మమతా దీదీ బాధితురాలి కార్డు రాజకీయాలను చాలా బాగా అర్థం చేసుకున్నారు' అని ఆయన అన్నారు. ఎన్నికల సంఘం చేపట్టిన 'సర్' ప్రక్రియను వ్యతిరేచించడంపై బెనర్జీని విమర్శిస్తూ, టిఎంసి 'మైనారిటీ ఓటు బ్యాంకు'ను కాపాడుకోవడానికి ఆమె ఆగ్రహాన్ని సృష్టిస్తున్నారని షా ఆరోపించారు.'సర్' ఇతర రాష్ట్రాల్లో కూడా జరిగిందని, కానీ ఎక్కడా దీనిని ఇంత పెద్ద సమస్యగా చేయలేదన్నారు. మమతా బెనర్జీ తన ఓటు బ్యాంకును కాపాడుకోవాలనుకుంటున్నందుకే బెంగాల్‌లో దీనిని ఒక సమస్యగా మార్చారని, ఎన్నికల సంఘం వంటి రాజ్యాంగ సంస్థలను దూషించడం బెంగాలీ సంస్కృతిలో భాగం కాదని షా అన్నారు. అసోంలో బిజెపి అధికారంలోకి వచ్చిన తర్వాత అక్కడి నుంచి చొరబాట్లు దాదాపుగా అంతమైపోయాయని పేర్కొంటూ, చొరబాటుదారులు భారతదేశంలోకి ప్రవేశించి రాష్ట్రాల వ్యాప్తంగా చెల్లాచెదురయ్యేందుకు పశ్చిమ బెంగాల్ ఇప్పుడు 'మిగిలిన చివరి మార్గంగా' అవతరించిందని షా ఆరోపించారు. బెంగాల్ ఎన్నికలు కేవలం బెంగాల్‌కే కాకుండా యావత్ దేశానికి ముఖ్యమైనవని, యావత్ దేశ భద్రత ఒక విధంగా బెంగాల్ ఎన్నికలతో ముడిపడి ఉందని షా పేర్కొన్నారు. పశ్చిమ బెంగాల్ సరిహద్దుల గుండా జరిగే అక్రమ వలసలు జాతీయ భద్రతకు ఆందోళన కలిగించే విషయంగా మారాయని ఆయన పేర్కొన్నారు. ఈశాన్య ప్రాంతాన్ని భారతదేశంలోని మిగిలిన ప్రాంతాలతో అనుసంధానించే ఇరుకైన ప్రాంతమైన వ్యూహాత్మకంగా కీలకమైన సిలిగురి కారిడార్ భద్రత టిఎంసి ప్రభుత్వ బుజ్జగింపు రాజకీయాల కారణంగా ప్రమాదంలో పడుతోందని షా అన్నారు. కేంద్రం పదేపదే విజ్ఞప్తులు చేసినప్పటికీ, బంగ్లాదేశ్ సరిహద్దు వెంబడి కంచె ఏర్పాటుకు అవసరమైన భూమిని మమతా బెనర్జీ ప్రభుత్వం సమకూర్చలేదని కేంద్ర హోం మంత్రి ఆరోపించారు. సరిహద్దు కంచె ఏర్పాటు అంశాన్ని ఒక ఎన్నికల హామీగా మలిచే ప్రయత్నంలో భాగంగా, బెంగాల్‌లో బిజెపి అధికారంలోకి వస్తే, 45 రోజుల్లోగా అవసరమైన భూమిని కేంద్రానికి అప్పగిస్తుందని షా ప్రకటించారు. 'మే 6న పశ్చిమ బెంగాల్‌లో బిజెపి ప్రభుత్వం కొలువుదీరుతుంది. ఆ తర్వాత 45 రోజుల్లోగా, సరిహద్దు కంచె ఏర్పాటుకు అవసరమైన భూమిని బెంగాల్ బిజెపి ప్రభుత్వం కేంద్రానికి అందిస్తుంది; తద్వారా మేము చొరబాట్లను అరికడతాము' పేర్కొన్నారు.

# గెలిచిన వెంటనే ఢిల్లీని స్వాధీనం చేసుకుంటా

**బెంగాల్‌ను నాశనం చేసే యత్నంలో దేశంలో బిజెపి అధికారాన్ని కోల్పోతోంది : మమతా బెనర్జీ**




**కోల్‌కతా :** పశ్చిమ బెంగాల్‌ను నాశనం చేసే ప్రయత్నంలో బిజెపి దేశంలో అధికారాన్ని కోల్పోతుందని తృణమూల్ కాంగ్రెస్ అధినేత్రి మమతా బెనర్జీ స్పష్టం చేశారు. శనివారం రాణిగంజ్‌లో జరిగిన ఒక ఎన్నికల ర్యాలీలో ఆమె మాట్లాడుతూ వరుసగా నాలుగోసారి పశ్చిమ బెంగాల్ అసెంబ్లీ ఎన్నికల్లో గెలిచిన తర్వాత, ఢిల్లీని 'స్వాధీనం' చేసుకోవడానికి అన్ని రాజకీయ పార్టీలను కలుపుకొని వెళ్తానని ప్రకటించారు. రాష్ట్రంలో బిజెపి అధికారంలోకి వస్తే, వారు బుల్డోజర్లను ఉపయోగించి అందరినీ బయటకు గెంటేస్తారని బెనర్జీ పేర్కొన్నారు. బెంగాల్‌ను నాశనం చేసే ప్రయత్నం చేయడం ద్వారా, బిజెపి దేశవ్యాప్తంగా అధికారాన్ని కోల్పోతుందని, పశ్చిమ బర్ధమాన్ జిల్లాలోని మైనింగ్ పట్టణంలో జరిగిన ర్యాలీలో ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. ఓటర్ల జాబితాల స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (సర్)లో ఓటర్ల పేర్లను తొలగించడానికి కాషాయ పార్టీ ఆదేశాల మేరకు ఎన్నికల సంఘం పనిచేస్తోందని ఆరోపించారు. ఒక లక్ష్మణ రేఖ ఉండాలి, కానీ బిజెపి అన్ని హద్దులు దాటుతోందని మండిపడ్డారు. 'సర్' మీ పతనానికి కారణమవుతోందని మమతా బిజెపిని హెచ్చరించారు. ముర్షిదాబాద్‌లోని రఘునాథ్‌గంజ్‌లో రామనవమి ఊరేగింపు సందర్భంగా జరిగిన ఘర్షణలను ప్రస్తావిస్తూ, యంత్రాంగం ఎలాంటి చర్యలు తీసుకోలేదని ఆమె ఆరోపించారు. 'నేను ఎన్నికైన ముఖ్యమంత్రిని, కానీ వారు నా అధికారాలన్నింటినీ లాగేసుకున్నారు' అని ఆమె అన్నారు. టిఎంసి తిరిగి అధికారంలోకి వచ్చిన తర్వాత, ఈ హింసకు బాధ్యులైన వారందరినీ పట్టిస్తామని ఆమె హామీనిచ్చారు. ఎన్నికలు జరగనున్న పశ్చిమ బెంగాల్‌లోని ముర్షిదాబాద్ జిల్లాలో శుక్రవారం రామనవమి ఊరేగింపుల సందర్భంగా ఘర్షణలు చెలరేగడంతో ఉద్రిక్తత నెలకొంది. పలుచోట్ల రాళ్ల దాడి, విధ్వంసం, నిప్పుపెట్టడం వంటి ఘటనలు చోటుచేసుకున్నాయి. ప్రభావిత జంగిపూర్, రఘునాథ్‌గంజ్ ప్రాంతాల్లో భద్రతను కట్టుదిట్టం చేసినట్లు పోలీసులు తెలిపారు.

# అమరావతికి చట్టబద్ధత

**ఆంధ్రప్రదేశ్ అసెంబ్లీ చారిత్రక తీర్మానం**



**అమరావతి:** ఆంధ్రప్రదేశ్ పునర్వ్యవస్థీకరణ చట్టం2014 ప్రకారం రాష్ట్ర రాజధాని విషయంలో నెలకొన్న న్యాయపరమైన, సాంకేతికపరమైన సందిగ్ధతకు శాశ్వత పరిష్కారం చూపే దిశగా ఆంధ్రప్రదేశ్ శాసనసభ అడుగులు వేసింది. ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రతిపాదించిన రాజధాని తీర్మానాన్ని సభ ఏకగ్రీవంగా ఆమోదించి... కేంద్ర ప్రభుత్వానికి పంపింది. రాష్ట్ర విభజన సమయంలో సెక్షన్5 ప్రకారం హైదరాబాద్ పదేళ్లపాటు ఉమ్మడి రాజధానిగా ఉంది. అయితే, విభజన చట్టంలో ఆంధ్రప్రదేశ్ కొత్త రాజధాని పేరును స్పష్టంగా పొందుపరచలేదు. ఇప్పుడు సెక్షన్ 5(2)ను సవరించి, 'ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి అమరావతి రాజధాని' అని స్పష్టమైన చట్టబద్ధత కల్పించాలని అసెంబ్లీ కోరింది. గతంలో ప్రభుత్వం నోటిఫై చేసిన రాజధాని ప్రాంత అభివద్ధి ప్రాధికార సంస్థ పరిధిని కేంద్ర చట్టంలో భాగంగా గుర్తించాలని తీర్మానించారు. దీనివల్ల రాజధాని మాస్టర్ ప్లాన్‌కు జాతీయస్థాయిలో గుర్తింపు లభిస్తుంది. కేంద్ర ప్రభుత్వం నుండి వచ్చే నిధులు, గ్రాంట్లు మౌలిక సదుపాయాల కల్పనలో న్యాయపరమైన చిక్కులు తొలగిపోతాయి. ఈ తీర్మానం కేవలం కాగితాలకే పరిమితం కాకుండా... దానిని అమలు చేసేందుకు స్పీకర్ అయ్యన్నపాత్రుడు, అసెంబ్లీ సెక్రటరీ జనరల్ వేగంగా చర్యలు చేపట్టారు. పార్లమెంటు ఉభయసభల అధిపతులకు ఈ తీర్మానం చేరింది. తద్వారా రాబోయే పార్లమెంటు సమావేశాల్లో విభజన చట్ట సవరణ బిల్లు వచ్చే అవకాశం ఉంది. రాష్ట్ర విభజన అంశాలన్నీ హోంశాఖ పరిధిలో ఉంటాయి కాబట్టి... కేంద్ర హోం మంత్రికి, హోం సెక్రటరీకి ప్రత్యేకంగా ప్రతులు అందజేశారు. రాజధాని అమరావతి విషయంలో కొన్నేళ్లుగా ఉన్న అనిశ్చితికి ఈ తీర్మానం ముగింపు పలకనుంది. రాజధాని రైతులకు, పెట్టుబడిదారులకు, రాష్ట్ర ప్రజలకు ఇది ఒక భరోసాగా నిలుస్తుంది. అమరావతి ఒక నగరం మాత్రమే కాదు... ఆంధ్రుల ఆత్మగౌరవ ప్రతీక అని ప్రభుత్వం పునరుద్ఘాటించింది. ఈ తీర్మానం కాపీలను ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కూడా స్వీకరించారు. దీని ఆధారంగా రాష్ట్ర ప్రభుత్వం కేంద్రంతో సంప్రదింపులు జరిపి త్వరితగతిన గెజిట్ నోటిఫికేషన్ వచ్చేలా చర్యలు తీసుకోనుంది.

**అజేయం... అజరామరం:చంద్రబాబు**

అద్భుతం... అజరామరమని, అమరావతితోనే తెలుగు వైభవమని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు స్పష్టం చేశారు. శాశ్వత రాజధానిగా అమరావతికి చట్ట బద్ధత కల్పించాలని కేంద్రాన్ని కోరుతూ శాసనసభలో ముఖ్యమంత్రి చంద్రబాబు అసెంబ్లీలో శనివారం తీర్మానం ప్రవేశపెట్టారు. తీర్మానానికి మద్దతు పలికిన శాసనసభ్యులందరికీ ధన్యవాదాలు తెలిపారు. రాజధానిని ఇక ఎవరూ అంగుళం కూడా కదిలించలేరన్నారు. ఏపికి ఒక్కటే రాజధాని అని, అది అమరావతి మాత్రమేని పునరుద్ఘాటించారు. రాజధానిపై వైసిపి బుద్ధి ఇంకా మారలేదని, ఇంకా కుట్రలు, కుతంత్రాలకు పాల్పడుతూనే ఉందని ముఖ్యమంత్రి ఆక్షేపించారు. 'రాజ్యాంగంలో రాజధాని అనే పేరే లేదంటారు. వీళ్లకు ఏమైనా ప్రత్యేకమైన రాజ్యాంగం ఉందా? రాజారెడ్డి రాజ్యాంగాన్ని వీళ్లు అనుసరిస్తారు. దేశం అనుసరించేది అంబేద్కర్ రాసిన రాజ్యాంగమే. విభజన అనంతరం రాష్ట్రానికి రాజధాని విజయవాడగుంటూరు మధ్య ఏర్పాటు చేయాలని 46 శాతం మంది కోరుకున్నట్టు శివరామకష్ణన్ కమిటీ స్పష్టంగా చెప్పింది' అని చంద్రబాబు అన్నారు. అభివద్ధి వికేంద్రీకరణ చేస్తూ వివిధ జాతీయ స్థాయి సంస్థలను రాష్ట్రవ్యాప్తంగా ఏర్పాటు చేశామని, ప్రతిపక్షంలో ఉన్న వ్యక్తి రాజధానిగా అమరావతికి బేషరతుగా మద్దతు ఇస్తున్నామని గతంలో చెప్పాడన్నారు. కానీ ఇప్పుడు రోజుకో మాటతో ఊసరవెల్లి రాజకీయాలు చేస్తున్నాడని, టెక్నాలజీ అందుబాటులో ఉన్న రోజుల్లోనూ రాజకీయ విన్యాసాలు చేస్తున్నాడని మండిపడ్డారు. వంద ఎకరాలు తీసుకుని భవనాలు కట్టేసి రాజధాని అని చెప్పేయవచ్చని, కానీ రాష్ట్రానికి ఆర్థిక వనరులు సమకూరేలా ఓ ప్రాంతం ఉండాలని ఆలోచించానన్నారు. ఈ ప్రాంత రైతులను సంప్రదించడంతో 58 రోజుల్లోనే 34 వేల ఎకరాలు త్యాగం చేశారని కొనియాడారు. రాష్ట్రం కోసం రాజధానికి భూములు ఇచ్చిన రైతులకు శిరస్సు వంచి పాదాభివందనం చేస్తున్నానన్నారు.




## మొక్కలతో ప్లాస్టిక్ సృష్టి!

ప్రపంచవ్యాప్తంగా మైక్రోప్లాస్టిక్స్ సమస్య వేగంగా తీవ్రమవుతోంది. ఐక్యరాజ్య సమితి చేపట్టిన పర్యావరణ పరిరక్షణ విభాగం విడుదల చేసిన తాజా నివేదికను అనుసరించి 2020లోనే సుమారు 2.7 మిలియన్ టన్నుల మైక్రోప్లాస్టిక్స్ పర్యావరణంలోకి విడుదలయ్యాయి. 2040 నాటికి ఈ పరిమాణం రెట్టింపు కావచ్చని నిపుణులు హెచ్చరిస్తున్నారు. ఇవి సముద్రాలలోనే కాదు, నేలలో, గాలిలో, తాగునీటిలో, ఆహార పదార్థాల్లోనూ కనిపించాయి. కొన్ని అధ్యయనాలు మానవ మెదడులో కూడా మైక్రోప్లాస్టిక్స్ ఆనవాళ్లు కనుగొనడం ఆందోళన కలిగిస్తోంది. ప్లాస్టిక్ తక్కువ ఖర్చుతో తయారవడం, దీర్ఘకాలం మన్నిక కలిగి ఉండడం, విభిన్న వినియోగాలకు అనుకూలంగా ఉండడం వల్ల విస్తృతంగా ఉపయోగంలో ఉంది. అయితే ఇదే లక్షణాలు దాని పర్యావరణ హానిని పెంచుతున్నాయి. ఒక ప్లాస్టిక్ వస్తువు పూర్తిగా క్షీణించడానికి 20 నుండి 500 సంవత్సరాల వరకు పట్టవచ్చని శాస్త్రవేత్తలు అంచనా వేస్తున్నారు. ఈ నేపథ్యంలో జపాన్ శాస్త్రవేత్తలు అభివృద్ధి చేసిన కొత్త ప్లాంట్‌బేస్డ్ ప్లాస్టిక్ గమనార్హమైన పురోగతి. రికెట్ సెంటర్ ఫర్ ఎనర్జీ మ్యాటర్ సైన్స్, యూనివర్సిటీ ఆఫ్ టోక్యో పరిశోధకులు కలసి సెల్యులోజ్ ఆధారిత పదార్థంతో ఈ కొత్త ప్లాస్టిక్‌ను రూపొందించారు. ప్రయోగశాల పరీక్షల్లో ఈ పదార్థం సముద్రజలంలో కలిపిన తర్వాత సుమారు ఒక గంటలోనే పూర్తిగా కరిగిపోయింది. సాధారణ వినియోగంలో ఇది బలంగా ఉండి, ఉప్పు నీటిని ఉద్దేశపూర్వకంగా పరిచయం చేసినప్పుడు మాత్రమే విచ్ఛిన్నమవుతుంది. ఈ పరిశోధన ఫలితాలు 'జర్నల్ ఆఫ్ ది అమెరికన్ కెమికల్ సొసైటీ'లో ప్రచురితమయ్యాయి. పరిశోధన బృందానికి టకుజో ఐడా నాయకత్వం వహించారు. సెల్యులోజ్‌ను ఫుడ్ పల్ప్ నుండి తయారు చేసి, పాలిఎథిలీన్‌ఇమైన్ గ్వానిడినియం అయాన్లతో కలిపారు. వ్యతిరేక విద్యుత్ ఛార్జ్‌ల ఆకర్షణ వల్ల బలమైన ఐయానిక్ నెట్‌వర్క్ ఏర్పడింది. ఆపై చోలిన్ క్లోరైడ్ అనే ఆహారసురక్షిత యాజకాన్ని చేర్చడం ద్వారా పదార్థానికి లవచికత, దృఢత్వం పెంచారు. ప్రకృతిలో ప్రతి సంవత్సరం సుమారు 100 బిలియన్ టన్నుల సెల్యులోజ్ ఉత్పత్తి అవుతుందని అంచనా. అందువల్ల ముడి పదార్థం కొరత సమస్య లేదు. ముఖ్యంగా, ఈ పదార్థం క్షీణించినప్పుడు మైక్రోప్లాస్టిక్స్ అవశేషాలు మిగలవు. ఈ కొత్త ప్లాస్టిక్ సముద్ర కాలుష్యాన్ని తగ్గించడంలో ఇది కీలక మలుపు కావచ్చు.




## బెడిసికొట్టిన వ్యూహం..



ఒక్కోసారి ఎంతో ఆలోచించి, సిద్ధం చేసుకున్న వ్యూహం ఎందుకూ పనికిరాకుండా పోతుంది. అమెరికాలోని కన్సాస్‌కు చెందిన 70 ఏళ్ల లారెన్స్ జాన్ రిపిల్ విషయంలోనూ అదే జరిగింది. చిన్నాచితకా విషయాలకు కూడా భార్య సూటిపోటి మాటలు అనడంతో విసిగిపోయాడు. పాడైన హెయిర్ డ్రయర్‌ను బాగు చేయించ డం కూడా రాదా? అంటూ భార్య విసుక్కోవడంతో విరక్తి చెందిన రిపిల్, ఆ యాతన నుంచి బయటపడడానికి గొప్ప ప్లాన్ వేశాడు. ఇంట్లో ఉండడం కంటే జైలే నయమనుకున్నాడు. తన ఇంటి పక్కనే ఉన్న బ్యాంకుకి వెళ్లి అక్కడ తుపాకీ చూపించి క్యాషియర్ కు ఒక స్లిప్ ఇచ్చాడు. అందులో తనకు 3వేల డాలర్లు ఇవ్వమని రాశాడు. భయపడి రిపిల్ మూడు వేల డాలర్‌లు ఇచ్చాడు. అయితే ఈ డబ్బు తీసుకున్న రిపిల్ అక్కడే బెంచ్ మీద కూర్చుని 'ధైర్యం ఉంటే పోలీసులను పిలువు' అంటూ రెచ్చగొట్టాడు. బ్యాంకు సిబ్బంది పోలీసులకుఫోన్ చేశారు. పోలీసులు వచ్చి రావడంతోనే వారిని దగ్గరికి పిలిచి 'మీరు వెతుకుతున్న వ్యక్తి నేనే' అంటూ తనను తాను పరిచయం చేసుకొని తనమీద కేసు పెట్టి జైల్లో వేయమని కోరాడు. రిపిల్ కోరినట్టే కేసు పెట్టిన పోలీసులు కేసు పెట్టిన పోలీసులు అతనిని కోర్టు ముందు హాజరు పరిచారు. కేసు మొత్తం విన్న న్యాయమూర్తి రిపిల్ కు వేసిన శిక్ష ఏమిటో తెలుసా? ఆరు నెలల పాటు ఇంట్లోనే ఉండాలని బయటికి రాకూడదని ఆంక్షలు విధించడం. అంతేకాదు, బయటకు రానీయకుండా ఒక సెక్యూరిటీ గార్డు ను కాపలాగా పెట్టాలని ఆదేశించాడు. పాపం రిపిల్ కోర్టులోనే బావురుమన్నాడు. తన వ్యూహం తిరిగి తనకే శిక్షగా మారుతుందని ఊహించలేకపోయాడు.

## చనిపోయింది.. మళ్లీ బతికింది...



సోషల్ మీడియాలో ఇటీవలి కాలం లో నిర్ధారణలేని కథలు, అర్థాంతర సమాచారంతో కూడిన వ్యక్తిగత అనుభవాల కథనాలు వేగంగా వ్యాప్తి చెందుతున్నాయి. వాటిలో తాజాది 33 సంవత్సరాల బ్రియాన్నా లాఫర్టీ అనే మహిళకు సంబంధించింది. అమెరికాలోని కొలరాడోకు చెందిన ఈమె, ఎనిమిది నిమిషాలపాటు హృదయ స్పందన లేకుండా ఉండిపోయిన సమయంలో కూడా చైతన్యం కొనసాగిందని ప్రకటించుకుంది. అయితే, అది కేవలం ఆమె వ్యక్తిగత అనుభూతిపై ఆధారపడింది. అయితే ఈ కథను శాస్త్రీయ నిరూపణగా కూడా చెప్పలేం, పూర్తిగా భ్రమగా కొట్టేయలేం అని నిపుణులు స్పష్టం చేస్తున్నారు. వైద్య రికార్డుల ప్రకారం, ఆ సమయంలో ఆమెకు పల్స్ లేదు, హృదయం పనిచేయలేదు, యంత్రాలు స్పందించలేదు. సాంప్రదాయ బయాలజీ ప్రకారం చూస్తే, అప్పుడు చైతన్యం ఉండకూడదు. కానీ ఆమె మాత్రం చీకటి, భయం కాకుండా స్పష్టత, నిశ్శబ్దం, నిరంతరం అనుభవించానని చెబుతోంది. మరణం అనిపించలేదు, మార్పు అనిపించింది అన్న ఆమె మాటలు సోషల్ మీడియాలో విస్తృతంగా షేర్ అవుతున్నాయి. ఇక్కడే ఈ కథపై సందేహాలు మొదలవుతున్నాయి. శాస్త్రవేత్తలు, సందేహవాదులు ఈ అనుభూతికి ఆక్సిజన్ లోపం, మెదడులో న్యూరోకెమికల్ మార్పులు, తీవ్రమైన ఒత్తిడి వల్ల వచ్చే హల్యూసినేషన్లు వంటి కారణాలు ఉండవచ్చని చెబుతున్నారు. ఇవన్నీ శాస్త్రీయంగా సాధ్యమైన వివరణలే. అయితే, విభిన్న దేశాలు, మతాల నుంచి వచ్చిన అనేక సమాన అనుభూతుల కథలు ఒకేలా ఉండటం కూడా పూర్తిగా విస్మరించలేని అంశంగా పేర్కొంటున్నారు. అయినా, ఈ కథ మరణానంతర జీవితం ఉందని లేదా శాస్త్రం తప్పని నిరూపించదని నిపుణులు హెచ్చరిస్తున్నారు.

## ఆర్గానిక్ శవపేటిక!



మరణం అంటే జీవితం అక్కడితో ముగిసిపోయిందని చాలామంది భావిస్తారు. కానీ ఒక మనిషి వెళ్ళిపోయిన తర్వాత కూడా ఈ భూమిపై జీవంతో నిండిన జ్ఞాపకంగా నిలవగలిగితే ఎలా ఉంటుంది? ఇదే ప్రశ్న నుంచి పుట్టిన ఒక ప్రేరణాత్మక ఆలోచనే 'క్యాప్సులా ముండి'. దీనిని ఆర్గానిక్ శవపేటికగా పేర్కోవచ్చు. ఇది మరణాన్ని అంతంగా కాకుండా, కొత్త జీవనానికి ఆరంభంగా చూడమని మనకు నేర్పే కథ. ఈ ఆలోచన ఒక యువ డిజైనర్‌కు తాకినప్పుడు, అతడు తన జీవితంలో చూసిన శ్మశానవాటికలను గుర్తు చేసుకున్నాడు. రాళ్ల సమాధులు, నిశ్శబ్దం, వేదన మాత్రమే కనిపించే ఆ ప్రదేశాలు అతనికి భారంగా అనిపించాయి. మనం వెళ్లిపోయిన తర్వాత కూడా ఈ భూమికి ఏదైనా తిరిగి ఇవ్వలేమా? మన జ్ఞాపకాలు రాతి పలకలపై కాదు, ఆకుల చప్పుడు మధ్య జీవించలేవా? ఆ ఆలోచన క్రమంగా ఒక రూపం దాల్చింది. తల్లి గర్భంలో శిశువు ఎలా ఒదిగి ఉంటాడో, అలాగే మనిషి శరీరాన్ని శిశువు ఆకృతిలో ఉంచే ఒక ఆర్గానిక్ పాడ్‌ను వారు రూపొందించారు. అదే 'క్యాప్సులా ముండి'. ఆ పాడ్ భూమిలో ఉంచిన తర్వాత, దానిపైన ఒక మొక్కను నాటుతారు. కాలం గడిచే కొద్దీ, ఆ మొక్క లోపల ఉన్న శరీరం నుంచి సహజంగా వచ్చే పోషకాలను గ్రహించి ఒక బలమైన చెట్టుగా ఎదుగుతుంది. ఒక మనిషి జీవితం ముగిసిన చోట, మరో జీవితం ప్రారంభమవుతుంది. మట్టిలో కలిసిపోవడం అంటే అంతమవడం కాదు. అది మరో జీవానికి బీజం వేయడం. మన తర్వాత మనం వదిలివెళ్ళేది కేవలం జ్ఞాపకాలు మాత్రమే కాకూడదు.

— బిఎస్ఎస్ మైత్రేయి

# అచ్చేదిన్ ఎప్పుడు?

'సంతోషమే సగం బలం' అన్నారు పెద్దలు. సగటు లేదా తలసరి గణాంకాలతో ప్రజలు ఎంతో అభివృద్ధి చెందినట్లు వల్లె వేయవచ్చు. కాని సంపద కొద్దిమంది చేతుల్లో పోగుపడుతున్న ఆర్థిక విధానాలను పాలకులు అనుసరించటంవల్ల ప్రపంచవ్యాప్తంగా వ్యత్యాసాల అగాధం ఏటికేడు పెరుగుతూ ప్రజలకు సంతోషం దూరమవుతున్నది. మన దేశంలో 2014లో అధికారంలోకి వచ్చిన ప్రధాని నరేంద్రమోదీ ప్రజలను ఆకర్షించే నినాదాలు సృష్టించటంలో దిట్ట అని మనకు తెలుసు. ప్రజల జీవితాల్లో సంతోషం తెచ్చిపెడతామన్న ఉద్దేశం స్ఫురించేలా 'అచ్చేదిన్' వాగ్దానం చేశాడు. అది ఎలా ఉంటుందో, ఎప్పుడొస్తుందో బహుశా ఆయనకు కూడా తెలియదు. కార్మిక, కర్షక వ్యతిరేక విధానాలు అనుసరిస్తూ వాటికి అందమైన రంగులు అద్దుతున్నారు. అయితే శ్రమజీవులు తమ హక్కుల రక్షణకై, గిట్టుబాటు ధరలకై చైతన్యంతో పోరాటాలు చేస్తున్నారు. మోదీ పాలనలో రెండు చేతులా ప్రభుత్వాన్ని, ప్రజలను దోచుకుంటున్న కొద్దిమంది గుత్తపెట్టుబడిదారులు, నయా ఉదార సంస్కరణలవల్ల లాభపడుతున్న ఉన్నత మధ్య తరగతులు సంతోషంగా ఉన్నారు. కాని అత్యధిక మెజారిటీ కనీస అవసరాలు తీరక, అను నిత్యం జీవన పోరాటంతో అసంతృప్తితో అసంతోషులుగా ఉన్నారు. ప్రపంచ సంతోష నివేదిక, 2026 అదే చెబుతున్నది. మార్చి 20న ప్రపంచ సంతోష దినం సందర్భంగా విడుదల చేయబడిన ఆ నివేదిక, భారతదేశ సంతోష స్కోరు 2014 కన్నా దిగజారినట్లు తెలుపుతోంది.

ప్రపంచ సంతోష నివేదిక – 2026, ప్రపంచంలోని 147 దేశాల్లో సంతోషం స్థాయిని మదింపు చేసింది. 2014లో భారత దేశ సంతోష స్కోరు 4.565 పాయింట్లు, ర్యాంక్ 117. 2026 నివేదిక ప్రకారం భారత్ స్కోరు 4.536 పాయింట్లు, ర్యాంక్ 116. 0–10 స్కేలులో 0.029 కోల్పోయింది. 2025 నివేదికలో భారత్ ర్యాంక్ 118 అని గుర్తు చేసుకోవటం అవసరం. భారతదేశం ప్రపంచంలో నాల్గవ అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా అవతరించిందని, అతి వేగంగా అభివృద్ధి చెందుతున్నదని, మూడవ అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా ఆవిర్భవించే అవకాశాలున్నాయని మోదీ ప్రభుత్వం గొప్పలు చెప్పుకుంటుండగా, 2026లో దాని సంతోష్ సూచీ 116. దీన్నెలా అర్థం చేసుకోవాలి. స్థూల దేశీయ ఉత్పత్తి (జిడిపి) ఏటా 5–6 శాతం పెరుగుతున్నప్పటికీ దాని ప్రభావం అత్యధిక మెజారిటీగా ఉన్న శ్రమజీవుల జీవన నాణ్యతలో ఎందుకు ప్రతిఫలించటం లేదు? వారు సృష్టించే సంపద ఒకవైపే పోగుపడుతోంది. లాభాలు వారి సొంతం. నష్టాల్లో కూరుకుపోతే బ్యాంక్, ఇతర ద్రవ్య సంస్థలనుంచి తీసుకున్న లక్షల కోట్లు ఎగనామం. డిపాజిట్ దార్లనుండి ఆర్జించిన అధిక వడ్డీలతో ఆ నష్టాన్ని భర్తీ చేయటంవల్ల ఆ నష్టాన్ని పరోక్షంగా ప్రజలే మోస్తున్నారు. ఇలా లక్షల కోట్లు స్వాహా చేసిన దగాకోరుల్లో ఎంతమందికి జైలు శిక్షలు విధించారో ప్రభుత్వం చెప్పగలదా? శ్రమజీవులకు వారి పోరాటాల ద్వారానో లేక బేరసారాల ద్వారానో, లేదా ఒప్పందాలు, అవార్డుల ప్రకారమో వేతనాలు కొంత పెరిగితే అది మున్నాళ్ల ముచ్చట. ఉన్నత వేతన తరగతి మినహాయింపు కావచ్చు. వ్యాపారవర్గం నిత్య జీవితావసర వస్తువుల ధరలు పెంచేసి ఆ పెరిగిన సొమ్ముకు మించి దోచేస్తే, ప్రభుత్వం కూడా తన వంతుగా పెట్రోలు రేట్లు వగైరా పెంచి తన వాటా రాబట్టుకుంటుంది. ఇక ప్రభుత్వాలు విద్య, వైద్యం ప్రైవేటురంగానికి అప్పగించటంతో వారి దోపిడీ మరీ అధికం. నిత్యం అప్పులతో పోరాడే సామాన్యులకు గుండెలనిండా భారం తప్ప ఇక సంతోషమెక్కడ?

ఇదే మూసకట్టు వ్యవస్థలో నడుస్తున్న మన పొరుగుదేశాల పరిస్థితి మరీ దారుణం. అఫ్ఘానిస్థాన్ సంతోషం ర్యాంక్‌ల్లో చిట్టచివర ఉంది –147. ఇక శ్రీలంక (134), మయన్మార్ (129), బంగ్లాదేశ్ (127). మరికొన్ని పొరుగుదేశాల పరిస్థితి ఎంతో మెరుగ్గా ఉంది. పాకిస్థాన్ 104, నేపాల్ 99, చైనా 65. భూటాన్, మాల్దీవుల లెక్కలు తీయలేదు. కాగా అండమాన్–నికోబార్ దీవుల సమీపంలోని ఇండోనేషియా ర్యాంక్ 87, థాయ్‌లాండ్ 52, మలేషియా 71.

ఎనిమిది ప్రమాణాలతో సంతోషాన్ని మదింపు చేశారు. అవి – తలసరి జిడిపి, సామాజిక తోడ్పాటు, ఆరోగ్యకరమైన ఆయుఃప్రమాణం, జీవిత ప్రాధాన్యతలను ఎంచుకునే స్వేచ్ఛ, దాతృత్వం, అవినీతి గూర్చిన భావనలు, డైస్టోపియా (1.16) ప్లస్ రెసిడ్యువల్, 95 శాతం ఆత్మవిశ్వాస స్థాయి. వీటిలో అనేక కొలబద్దల్లో భారత్ వెనుకబడి ఉంది.

సంతోషంలో అట్టడుగున ఉన్న దేశాలు – సియ్రాలియోన్, మలావి, జింబాబ్వే, బోట్స్‌వనా, ఎమెన్, లెబనాన్, డి.ఆర్.కాంగో, ఈజిప్టు, టాంజానియా, అఫ్ఘానిస్థాన్. సంతోషంలో అగ్రస్థానంలో ఉన్న 10 దేశాలు – ఫిన్‌లాండ్, ఐస్‌లాండ్, డెన్మార్క్, కోస్టారికా, స్వీడన్, నార్వే, నెదర్లాండ్స్, ఇజ్రాయెల్, లక్సెంబర్గ్, స్విట్జర్‌లాండ్.

సోషల్ మీడియా వల్ల సంతోష, అసంతోషాలను కూడా మదింపు చేసింది. అన్ని ప్రాంతాల్లోనూ నెగటివ్ మనోభావాలు సర్వసామాన్యంగా ఉన్నాయి. ఏమైనా అది వ్యసనం కాకుండా పరిమితంగా చూడటం, స్పందించటం మంచిదని సలహా ఇచ్చింది. సోషల్ మీడియా ప్లాట్‌ఫాంలు లేకుండా ఉంటే, అనేకమంది వినియోగదారులు మెరుగ్గా ఉంటారన్నది ఆ నివేదిక సహేతుకమైన నిర్ధారణ.

# మధ్యప్రాచ్యంపై మృత్యుఘోష : బలవంతుడిదేనా న్యాయం?



డా.సూర్యదేవర రామకృష్ణ
9490754169

మధ్యప్రాచ్యం మరోసారి నెత్తుటి మడుగులో మునిగిపోయింది. ఆకాశం నుండి కురుస్తున్నది వర్షం కాదు, మారణాయుధాల సెగలు. ఫిబ్రవరి 28, 2026 .ఈ తేదీ మానవ చరిత్రలో మరో నల్లని అధ్యాయంగా మిగిలిపోనుంది. అమెరికా, ఇజ్రాయిల్ సంయుక్తంగా ఇరాన్‌పై జరిపిన సైనిక దాడులు కేవలం ఒక దేశంపై జరిగిన దాడి కాదు, మానవత్వంపై జరిగిన సర్జికల్ స్ట్రైక్. నాలుగు వారాలు గడిచాయి. లెక్కలేనన్ని శవాలు, కూలిన భవనాలు, చెదిరిన కలలు. కానీ నేటికీ మిగిలి ఉన్న ప్రశ్న ఒక్కటే,ఈ విధ్వంసానికి బాధ్యులు ఎవరు? అంతర్జాతీయ న్యాయ సూత్రాలు కేవలం పుస్తకాలకే పరిమితమా? శక్తివంతుడి మాటే శాసనమైతే, సామాన్యుడి ప్రాణానికి విలువే లేదా? హ్యూమన్ రైట్స్ యాక్టివిస్ట్స్ ఇన్ ఇరాన్ (HRANA) గణాంకాల ప్రకారం, ఈ నాలుగు వారాల్లోనే దాదాపు 3,114 మంది ప్రాణాలు కోల్పోయారు. ఇందులో 1,354 మంది అమాయక పౌరులు. ఇరాన్ ఆరోగ్య మంత్రిత్వ శాఖ వెల్లడించిన వివరాలు వింటే గుండె తరుక్కుపోతుంది. మరణించిన వారిలో 200 మంది పసిపిల్లలు, 11 మంది ప్రాణాలు కాపాడే వైద్యులు ఉన్నారు.

అత్యంత హృదయవిదారకమైన సంఘటన మీనాబ్‌లో చోటుచేసుకుంది. షజరే తయ్యెబే బాలికల పాఠశాల మీద జరిగిన దాడిలో 175 మంది చిన్నారులు అక్కడికక్కడే విగతజీవులయ్యారు. ఆ చిన్నారుల చేతుల్లో ఉండాల్సిన పుస్తకాలు రక్తం మడుగులో తడిసిపోయాయి. ఇది కేవలం యుద్ధం కాదు, పసిప్రాయంపై జరిగిన పాశవిక దాడి.

విధ్వంసం ఇరాన్‌తోనే ఆగలేదు. ప్రతీకార దాడుల మంటలు ఇజ్రాయిల్, అమెరికా సైనికులు, గల్ఫ్ దేశాల వరకు పాకాయి. కువైట్‌లోని అమెరికా కార్యాచరణ కేంద్రంపై జరిగిన దాడిలో ఆరుగురు సైనికులు మరణించారు. లెబనాన్‌లో పరిస్థితి మరీ ఘోరం. 773 మంది మరణించగా, దాదాపు 8.3 లక్షల మంది తమ సొంత గడ్డపైనే పరాయివాళ్లలా నిరాశ్రయులయ్యారు. యుద్ధం కేవలం మనుషులను చంపడం లేదు, ప్రకృతిని కూడా ఖూనీ చేస్తోంది. తెహ్రాన్‌లోని చమురు నిల్వ కేంద్రాలపై దాడుల వల్ల వెలువడిన విషపూరిత పొగ నగరాన్ని కమ్మేసింది. పర్యావరణ వేత్తల హెచ్చరికల ప్రకారం, రాబోయే రోజుల్లో కురిసే ఆమ్ల వర్షం నేలతల్లిని విషతుల్యం చేస్తుంది. ఇరాన్ రెడ్ క్రెసెంట్ నివేదిక ప్రకారం 81,000 పౌర నివాస ప్రాంతాలు నేలమట్టమయ్యాయి. ఆసుపత్రులు, పాఠశాలలు ధ్వంసమై, కనీస వైద్యం అందక ప్రజలు అల్లాడుతున్నారు. ఈ మంటలు రాత్రికి రాత్రే పుట్టినవి కావు. 2020లో ఖాసెమ్ సులేమానీ హత్య మొదలుకొని, 2023 అక్టోబర్ 7 దాడుల తర్వాతి పరిణామాలు, జూన్ 2025లో జరిగిన పన్నెండు రోజుల యుద్ధం వరకు అన్నీ ఒకదానికొకటి ముడిపడి ఉన్నాయి. 2026 ప్రారంభంలో ఇరాన్‌లో చెలరేగిన అంతర్గత నిరసనలు, ఆర్థిక సంక్షోభం అగ్రరాజ్యాలకు ఒక సాకుగా దొరికాయి. డొనాల్డ్ ట్రంప్ నాయకత్వంలోని అమెరికా యంత్రాంగం, ఇరాన్ సుప్రీం లీడర్ అలీ ఖమేనీని లక్ష్యంగా చేసుకుని జరిపిన ఈ ఆకస్మిక దాడులు ప్రపంచాన్ని దిగ్భ్రాంతికి గురిచేశాయి.

టైమ్ మ్యాగజైన్ విశ్లేషించినట్లుగా, ఈ యుద్ధానికి ముందు అమెరికా కాంగ్రెస్‌కు గానీ, ప్రజలకు గానీ ఎటువంటి స్పష్టమైన వివరణ ఇవ్వలేదు. అస్పష్టమైన లక్ష్యాలు, విరుద్ధమైన ప్రకటనలతో వైట్‌హౌస్ ప్రపంచాన్ని అయోమయంలో నెట్టింది. ఇప్పుడు అసలు చర్చ న్యాయం ఎక్కడ? అంతర్జాతీయ క్రిమినల్ కోర్టు (ICC) ఉండొచ్చు, కానీ అమెరికా, ఇజ్రాయిల్, ఇరాన్ వంటి దేశాలు ఆ కోర్టు పరిధిని గుర్తించవు. అంటే వీరు చేసే ఏ నేరానికైనా శిక్ష ఉండదా?

నిపుణులు కొన్ని మార్గాలను సూచిస్తున్నారు.ఆర్టికల్ 12(3) డిక్లరేషన్ గతంలో పాలస్తీనా, ఉక్రెయిన్ చేసినట్లుగా ఇరాన్ స్వచ్ఛందంగా ICC కి అధికారాన్ని ఇస్తే దర్యాప్తు సాధ్యమవుతుంది. UN ఫ్యాక్ట్‌ఫైండింగ్ మిషన్ ఐక్యరాజ్యసమితి ద్వారా సాక్ష్యాలను సేకరించి ప్రపంచం ముందు ఉంచడం. కానీ ఇక్కడ మరో పెద్ద అడ్డంకి ఉంది 'వీటో' అధికారం. సెక్యూరిటీ కౌన్సిల్‌లో శక్తివంతమైన దేశాలు తమ మిత్రపక్షాలను కాపాడుకోవడానికి ఈ అధికారాన్ని వాడుకుంటాయి. వెరసి, న్యాయం అనేది బలవంతుడి చుట్టముగా మారిపోతోంది.ప్రొఫెసర్ మార్కో మిలానోవిక్ చెప్పినట్లుగా, నేటి యుద్ధాల్లో కృత్రిమ మేధస్సు (AI) కీలక పాత్ర పోషిస్తోంది. బాంబులు ఎక్కడ వేయాలో అల్గారిథమ్‌లు నిర్ణయిస్తున్నాయి. ఒకవేళ పౌరులు చనిపోతే, అది సాంకేతిక లోపం అని చెప్పి తప్పించుకునే ప్రమాదం ఉంది. అల్గారిథమ్ చెప్పింది కాబట్టి దాడి చేశాం అనే వాదన జవాబుదారీతనాన్ని నిర్వీర్యం చేస్తోంది.మధ్యప్రాచ్యంలో యుద్ధం అంటే అది కేవలం ఒక ప్రాంతానికే పరిమితం కాదు. స్ట్రెయిట్ ఆఫ్ హోర్ముజ్ మూసివేత అంచున ఉండటంతో ప్రపంచ చమురు ధరలు 45% పెరిగి, బ్యారెల్‌కు $110 దాటాయి. ఐరోపా నుండి ఆసియా వరకు అన్ని దేశాల్లో ద్రవ్యోల్బణం ఆకాశాన్ని తాకుతోంది. ఐఈఏ (IEA) ఇప్పటికే ప్రజలను ప్రయాణాలు తగ్గించుకోమని కోరుతోంది. ఫిలిప్పీన్స్ వంటి దేశాలు అత్యవసర పరిస్థితిని ప్రకటించాయి. అంటే ఎక్కడో ఇరాన్‌లో పడుతున్న బాంబులు, ఇక్కడ మన వంటింటి బడ్జెట్‌ను చిన్నాభిన్నం చేస్తున్నాయి. యుద్ధం ఎవరిని గెలిపించినా, మనిషిని మాత్రం ఓడిస్తుంది. చరిత్రలో జరిగిన ప్రతి యుద్ధం ఒక వినాశనాన్ని, అస్థిరతను మాత్రమే మిగిల్చింది. ఇరాక్ (2003) అయినా, లిబియా (2011) అయినా పర్యవసానాలు భయంకరంగానే ఉన్నాయి.ఈ రోజు ట్రంప్, నెతన్యాహు వంటి నేతలు అత్యంత శక్తివంతులుగా కనిపించవచ్చు. కానీ రేపు చరిత్ర వారిని ఏమని పిలుస్తుంది? శాంతి స్థాపకులనా లేక విధ్వంసకారులనా? యుద్ధ నేరాలకు శిక్ష నేడు దొరక్కపోవచ్చు, కానీ కాలం వేసే శిక్ష తప్పదు.ప్రపంచ పౌర సమాజం మేల్కోవాలి. మీనాబ్ పాఠశాల చిన్నారుల ప్రాణాలు, కువైట్‌లో మరణించిన సైనికుల త్యాగాలు వృధా కాకూడదు. ఈ రక్తం చిందిన నేల మీద రేపు మళ్ళీ శాంతి పూలు వికసించాలంటే, యుద్ధోన్మాదాన్ని గొంతెత్తి ఖండించాల్సిందే. మౌనం కూడా ఒక నేరమే. న్యాయం ఆలస్యం కావచ్చు, కానీ మానవత్వం గెలవాలి. అది మనందరి బాధ్యత.

# బాల్యం బందీ... బడులతోనే విముక్తి



రెహమాన్
AISF రాష్ట్ర ఉపాధ్యక్షుడు
9704184133

పట్నం అంటే పల్లె ప్రజలకు ఒక ఆశ. కాలం కలిసిరాక, ఉన్న ఊరిలో బతుకు భారమవుతున్న వేళ, కష్టాలన్నీ మోసుకొని, జీవితంపై ఆశతో మహానగరాలవైపు లక్షలాదిమంది ప్రజలు నిత్యం సాగుతూనే వుంటారు. 21వ శతాబ్దంలో ప్రపంచమే కుగ్రామంగా మారిపోయింది. భారతదేశ నగరాలన్నీ, ప్రపంచ నగరాలతో పోటీ పడుతున్నాయి. నాలుగు శతాబ్దాల చారిత్రక నగరం హైదరాబాద్. తెలంగాణ సాంస్కృతిక వారసత్వానికి ప్రతీకగా నిలుస్తోంది. పాలకులు సైతం హైదరాబాద్ అభివృద్ధికి మేమే పునాదులు వేశామంటూ ప్రగల్భాలు పలుకుతూనే వున్నారు. అయినా నగరం నిదురపోతున్న వేళ, రోడ్లపై, ఫుట్ పాత్ లపై, మురికి కాలువల వెంట, పూరి గుడిసెలో పేదరికం మేల్కొని, ప్రభుత్వాల నిర్లక్ష్యాన్ని తట్టిలేపుతూనే వుంటాయి. ప్రపంచ స్థాయి నగరంగా గుర్తింపు పొంది న హైదరాబాద్ మహానగరంలో, రాష్ట్ర అసెంబ్లీకి కేవలం 22 కిలోమీటర్ల దూరంలో ఉన్న ప్రాంతం జవహర్ నగర్! దేశ మొట్టమొదటి ప్రధానమంత్రి పండిట్ జవహర్ లాల్ నెహ్రూ పేరుతో వెలసిన ప్రాంతమిది. లక్షలాది వలస జీవుల, నిత్య జీవిత పోరాట క్షేత్రం జవహర్ నగర్. దేశంలోని వివిధ ప్రాంతాల నుండి వలసొచ్చిన, లక్షలాది కార్మికులు ఇక్కడ నివసిస్తున్నారు. ఒకవైపు ఆకాశాన్ని తాకే బిల్డింగ్ లు వుంటే, మరోవైపు హైదరాబాద్ మహానగరం చెత్తతో, గోల్కొండ కంటే ఎత్తైన గుట్టలా మారిన ప్రాంతం, జవహర్ నగర్ డంపింగ్ యార్డ్ దీని చుట్టూ దాదాపు 100కు పైగా బస్తీలు ఉన్నాయి. 3 లక్షలకు పైగా జనాభా ఇక్కడ నివసిస్తున్నారు. రోజు కూలీలుగా పనులు చేస్తూ, భవన నిర్మాణ కార్మికులుగా, ఇక్కడి ప్రజలు జీవితం గడుపుతూ ఉంటా రు. దాంతోపాటు లక్షా ఇరవై వేల మందికి పైగా 18 సంవత్సరాల లోపు పిల్లలు కూడా వున్నారు. బాల్యమంటే అందరికీ ఓ మధుర జ్ఞాపకం. చిన్ననాటి చదువులు, చేసే అల్లరి ప్రతి ఒక్కరికీ జీవితాంతం గుర్తుండిపోతాయి. కానీ జవహర్ నగర్ ప్రాంతంలో వుండే పిల్లల కు మాత్రం బాల్యం ఒక శాపం.

మహాకవి శ్రీశ్రీ అన్నట్లు: మెరుపు మెరిస్తే, వాన కురిస్తే / ఆకసమున హరివిల్లు విరిస్తే / అవి మాకే అని ఆనందించే బాల్యం...

జవహర్‌నగర్‌లో మాత్రం చెత్త కుప్పల్లో బందీగా మారింది రోజూ చెత్త సేకరణ చేస్తూ (ర్యాగ్ పికింగ్) స్క్రాప్ షాపుల్లో అమ్ముకొని బతకడమో, ఎక్కడో ఒకచోట బాల కార్మికులుగా పని చేయడమో చేస్తూ ఉంటారు. లేదంటే మత్తు పదార్థాలకు బానిసలుగా మారి విలువైన జీవితాన్ని కోల్పోతున్నారు. మరోవైపు దగ్గరలో బడి లేకపోవడంతో, బాలికలు బాల్య వివాహాల బారినపడి, బతుకు పోరులో సమిధలౌతున్నారు.



అక్కడి ప్రజలు, పిల్లల జీవితాల మార్పుకోసం వ్యక్తులు, స్వచ్ఛంద సంస్థలు కృషిచేస్తున్నా, ప్రభుత్వాల సహకారం మాత్రం శూన్యం.

భారత రాజ్యాంగం విద్యను ప్రాథమిక హక్కుగా గుర్తించింది. ఈ దేశంలో పుట్టిన ప్రతి ఒక్కరూ చదువుకోవాలని, ఆర్టికల్ 21A ప్రకారం ఉచిత నిర్బంధ విద్యా హక్కు చట్టాన్ని ప్రవేశ పెట్టారు. కానీ లక్షకు పైగా విద్యార్థులు వున్న జవహర్ నగర్‌లో కేవలం రెండే రెండు ఉన్నత పాఠశాలలు, 8ప్రాథమిక పాఠశాలలు మాత్రమే ఉన్నాయి. అందులో కేవలం మూడు వేలకు పైగా విద్యార్థులు మాత్రమే చదువుకుంటున్నారు. అక్కడి పిల్లలకు చదువుకోవాలనే తపన ఉన్నా, వెళ్ళడానికి బడిలేదు. మాకు బడి మంజూరు చేయండి, మా పిల్లలు చదువుకుంటారు అని తల్లిదండ్రులు, పిల్లలు ఎక్కని గడప లేదు, తిరగని చోటు లేదు. చివరికి అధికారులు స్పందించి 2023 జనవరిలో గబ్బిలాలపేటలో 1వ తరగతి నుండి 5వ తరగతి వరకు ఒక పాఠశాలను మంజూరు చేశారు. కానీ ఇంటి అద్దె, మధ్యాహ్న భోజనం, పుస్తకాలు, యూనిఫాంలు, టీచర్లను ఇవేమీ ఇవ్వకుండా తాత్కాలికంగా బడిని ఏర్పాటు చేశా రు. కొంతకాలం రిటైర్డ్ టీచర్‌ని ఇంచార్జిగా పెట్టారు. నాలుగు నెలల తర్వాత ఆయ న కూడా అదృశ్యం అయ్యారు. దీంతో అక్కడి ప్రజలు అతికష్టం మీద చందాలు వేసుకొని, స్కూల్ అద్దెను చెల్లిస్తూ, స్థానికంగా చదువుకున్న వాళ్ళను టీచర్లుగా పెట్టుకొని, ఆయాలను నియమించుకొని, పిల్లలకు మధ్యాహ్న భోజనం సైతం ఏర్పాటు చేసుకున్నారు. ఇలా రెండు సంవత్సరాల పాటు ప్రభుత్వ యంత్రాంగం మొత్తం చేయాల్సిన పనిని, పాలకులు నిర్లక్ష్యం చేసినా, బస్తీవాసుల పట్టుదలతో గబ్బిలాల పేటలో పాఠశాల నడిచింది. ఇలాంటి పరిస్థితుల్లో కూడా అక్కడి ప్రజలకు, తమ పిల్లలను చదివించుకోవాలనే ఆశ చావలేదు. పూర్తి స్థాయిలో నర్సరీ నుండి 12వ తరగతి వరకు పాఠశాల భవన నిర్మాణం కోసం పోరాడుతూనే ఉన్నారు. దీంతో అధికారులు 2025లో గబ్బిలాలపేట పాఠశాలకు ముగ్గురు ప్రభుత్వ ఉపాధ్యాయులను డిప్యుటేషన్ పై నియమించి, 4 ఎకరాల ప్రభుత్వ స్థలాన్ని కేటాయించి, తదనంతరం UDISE కోడ్‌ని ఇచ్చారు. దీంతో మా బస్తీలో బడి వచ్చిందని, మా పిల్లల బతుకులు బాగుపడుతాయని సంబరాలు చేసుకునే లోపే, బస్తీ వాసులకు అంతులేని నిరాశ మిగిలింది. పాఠశాలకు ప్రభుత్వం అధికారికంగా కేటాయించిన నాలుగు ఎకరాల స్థలం, నాదంటూ ఒకరు తెలంగాణ హైకోర్టు లో రిట్ పిటిషన్ వేశారు. దీంతో కోర్టు తాత్కాలికంగా 'స్టే' ఆర్డర్ ఇచ్చింది. కానీ అధికారులు మాత్రం అది ప్రభుత్వ భూమేనని ఢంకా భజాయిస్తున్నారు. ఈ పరిణామాలతో జవహర్ నగర్‌లోని బడి ఈడుపిల్లల భవిష్యత్తు కోర్టు గదుల్లో పడి నలుగుతోంది.

ఇప్పటికైనా ప్రభుత్వం మేల్కొని, లక్ష మంది పిల్లల చదువుల గురించి, వారి భవిష్యత్తు గురించి శాసనసభ సమావేశాల్లో చర్చించి, జవహర్ నగర్ మురికివాడల్లో బందీగా నిలిచిన బాల్యాన్ని విముక్తి చేయాల్సిన అవసరం ఎంతగానో ఉంది.

## లాక్ డౌన్ పుకార్లు షికార్లు

లేఖ

తెలంగాణ రాష్ట్రంలోని 33 జిల్లాలలో ముఖ్యంగా హైదరాబాద్, సికింద్రాబాద్‌లలో లాక్ డౌన్ పెడతారని వదంతులు షికార్లు చేస్తున్నాయి. అమెరికా ఇజ్రాయెల్ ఇరాన్ పై దాడులు చేయడం చమురు, గ్యాస్, గ్యాస్ సిలిండర్ల కొరత ఏర్పడటంతో ప్రజలు అనేక ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. కొంతమంది కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను ఇబ్బందుల్లో పెట్టడానికి లాక్ డౌన్ పుకార్లను వ్యాపింపజేస్తున్నారు. కరోన మహమ్మారి సమయంలో లాక్‌డౌన్ విధించడంతో నిత్యావసర వస్తువులు, కూరగాయలు, పాలు, పెరుగు, పండ్లు దొరకకపోవడంతో ప్రజలు అనేక అష్టకష్టాలు పడాల్సి వచ్చిం ది. ఆ అనుభవం నుండి ఇంకా తేరుకోక ముందే మళ్ళీ లాక్‌డౌన్ అనడం ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు. తెలుగు రాష్ట్రంలోని అన్ని ప్రధాన ప్రాంతాల్లో హైదరాబాద్ జిల్లాలోని అనేక ప్రాంతాల్లోని నిత్యావసర వస్తువులను విక్రయించే దుకాణాలు, కూరగాయల మార్కెట్‌లు, పెట్రోల్, డీజిల్ బంక్ లు, గ్యాస్ డీలర్‌ల దగ్గర ప్రజలు గుంపులు, గుంపులుగా చేరి అన్ని ప్రాంతాలు కిటకిట లాడుతున్నాయి. ప్రజలు కొంతమంది పోకిరిల లాక్‌డౌన్ పుకార్లను నమ్మి ఇంట్లో ప్రతిరోజూ ఉపయోగించుకునే నిత్యావసర వస్తువులను, కూరగాయలను కొనుగోలు చేస్తున్నారు. పెట్రోల్,డిజిల్ బంక్ లలో ప్రతి ఒక్కరూ స్కూటర్లలో, ఆటోలలో, కార్లలో ట్యాంక్ నిండా పోయించుకుంటున్నారు.హోటళ్ళలలో టిఫిన్ లపై ఏది కొన్నప్పటికి 10 రూపాయలను పెంచి విక్రయయిస్తున్నారు.

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పుకార్లను నమ్మవద్దని నిత్యావసర వస్తువుల పై ధరలను పెంచిన, టిఫిన్ సెంటర్లులో ధరలను పెంచిన తమ దృష్టికి తీసుకురావాలని వాటిపై చర్యలు తీసుకుంటామని ప్రకటించిన ప్రజలకు మాత్రం ఎక్కువ మొత్తాలలో చెల్లించి తీసుకోవల్సిన పరిస్థితులు ఏర్పడుతున్నాయి. గ్యాస్ సిలిండర్లను పంపిణీ చేసేవారు ఇంటి దగ్గరకు రాకపోవటంతో గ్యాస్ సిలిండర్ల గోదాముల దగ్గరికి ప్రజలు వెళ్లి గగ్గోలు పెడుతున్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు లాక్ డౌన్ పుకార్లను వ్యాపింప జేస్తున్న వారు ఏ పార్టీ కి చెందిన ఏ కులానికి, ఏ మతానికి చెందిన,ఎంతటి రాజకీయ పలుకుబడి ఉన్న వారైన వారిపై చర్యలు తీసుకొని పత్రిక, ఎలక్ట్రానిక్ మీడియా ఛానల్ ల ద్వారా ప్రజలలో ధైర్యం కలిగించాల్సిన అవసరం ఆవశ్యకత ఎంతైనా ఉంది.

డాక్టర్. ఎస్. విజయ భాస్కర్

## రైతులకు కూరగాయల విత్తనాలు పంపిణీ



ప్రజాపక్షం / వేలేరు : వేలేరు మండల కేంద్రంలోని రైతు వేదిక నందు ఉద్యానవనశాఖ ఆధ్వర్యంలో రైతులకు 100 శాతం సబ్సిడీతో కూరగాయల విత్తనాలు పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈకార్యక్రమానికి ముఖ్య అతిథులుగా వేలేరు గ్రామ సర్పంచ్ బిల్లా యాదగిరి హాజరై మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం రైతులకు బడ్జెట్లో కూడా ఎక్కువ శాతం నిధులను కేటాయించగా మననియోజకవర్గం ఎమ్మెల్యే కడియం శ్రీహరి సహకారంతో వేలేరు మండలంలో కూడా రైతులకు సబ్సిడీ యంత్రాలను మంజూరు చేయడం జరిగిందని అన్నారు.ప్రభుత్వం రైతులకు అందిస్తున్న అవకాశాలను 130 మంది రైతులకు (ఒక) రూ,1 లక్ష 50 వేయిల విలువ చేసే కూరగాయల విత్తనాలు అందివ్వడం జరిగిందని అన్నారు . ఉద్యానవన శాఖ అధికారులు , రైతులు పాల్గొన్నారు

## ఆశా వర్కర్ల ముందస్తు అరెస్టు.. సంగెంలో పోలీసుల అడ్డగింత

ప్రజాపక్షం /సంగెం : హైదరాబాద్‌లోని ఇందిరా పార్కు వద్ద తలపెట్టిన ధర్నా కార్యక్రమానికి వెళ్లకుండా సంగెం మండలంలో ఆశా వర్కర్లను పోలీసులు ముందస్తు అరెస్టులు చేశారు. ఉదయాన్నే ఆశా కార్యకర్తల ఇళ్ల వద్దకు చేరుకున్న సంగెం పోలీసులు వారిని అదుపులోకి తీసుకుని పోలీస్ స్టేషన్‌కు తరలించారు.కాంగ్రెస్ పార్టీ తమ ఎన్నికల మేనిఫెస్టోలో హామీ ఇచ్చిన విధంగా.. ప్రస్తుత అసెంబ్లీ బడ్జెట్ సమావేశాల్లో ఆశా వర్కర్లకు రూ. 18,000 కనీస (ఫిక్స్‌డ్) వేతనం నిర్ణయించాలని వారు డిమాండ్ చేస్తున్నారు. అలాగే పెండింగ్‌లో ఉన్న జనవరి, ఫిబ్రవరి రెండు నెలల పారితోషికాలను తక్షణమే చెల్లించాలని కోరుతూ సిఐటియు/ఆశా వర్కర్ల యూనియన్ ఆధ్వర్యంలో ఇందిరా పార్కు వద్ద నిరసన తెలిపేందుకు వారు సిద్ధమయ్యారు.ఈ క్రమంలో ధర్నాకు వెళ్లకుండా పోలీసులు ముందస్తు అరెస్టులు చేయడం పట్ల ఆశా వర్కర్లు, యూనియన్ నాయకులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. శాంతియుతంగా తమ సమస్యలను ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లేందుకు హైదరాబాద్ వెళ్తున్న తమను తెల్లవారు జామునే ఇళ్ల వద్దకు వచ్చి అరెస్టు చేయడం సరికాదన్నారు. ప్రభుత్వం వెంటనే స్పందించి, పోలీసుల నిర్బంధాలను ఆపి తమ న్యాయమైన డిమాండ్లను నెరవేర్చాలని వారు డిమాండ్ చేశారు.

## ప్రభుత్వ భవనాల ఆస్తి పన్నుల చెల్లింపులపై దృష్టి

ప్రజాపక్షం/ఖిలా వరంగల్:ప్రభుత్వ కార్యాలయాల ఆస్తి పన్నుల చెల్లింపులపై దృష్టి సారించి వసూళ్లు చేపట్టాలని హనుమకొండ జిల్లా కలెక్టర్, బల్దియా కమిషనర్ చాహత్ బాజ్ పాయ్ అధికారులను ఆదేశించారు. శనివారం వరంగల్ పరిధిలోని కాశీబుగ్గ సర్కిల్ కార్యాలయ ఆవరణలో గల ఈ సేవా కేంద్రంతో పాటు వివిధ ప్రాంతాల్లో కొనసాగుతున్న పన్ను వసూళ్ల విధానాన్ని పరిశీలించి సమర్థవంతంగా చేపట్టుటకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా కాశీబుగ్గ సర్కిల్ కార్యాలయ ఆవరణలో గల ఈ సేవా కేంద్రంలో ఆకస్మికంగా సందర్శించి పన్నుల సేకరణ తీరును, ప్రభుత్వ ఆస్తుల బిల్లుల చెల్లింపు తదితర అంశాలను అడిగి తెలుసుకొని మొండి బకాయిలపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ నగర పరిధిలోని బకాయిలు పడి ఉన్న రైల్వే, పోస్టాఫీస్‌లు, కేఎంసి తదితర ప్రభుత్వ కార్యాలయాలకు నోటీసులు అందజేసి వెంటనే పన్నులు చెల్లించేలా చూడాలని అన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ కమిషనర్ ప్రసన్న రాణి, రెవెన్యూ అధికారులు రావుల ఆనంద్, శ్రీనివాస్, ఆర్ఐ సోహైల్, తదితరులు పాల్గొన్నారు.

## రాయపర్తిలో 20 కేజీల గంజాయి పట్టివేత



ప్రజాపక్షం /రాయపర్తి : ఒడిశా రాష్ట్రానికి చెందిన ముగ్గురు వ్యక్తులు తమ కారులో 20 కేజీల గంజాయి తరలిస్తుండగా శనివారం మండల కేంద్రంలోని హెచ్.పి పెట్రోల్ పంప్ సమీపంలోని పక్క సమాచారంతో గంజాయిని పట్టుకున్నట్లు ఎస్ఐ ముత్యం రాజేందర్ తెలిపారు. ఎస్ఐ రాజేందర్ తెలిపిన వివరాల ప్రకారం ఒడిస్సా రాష్ట్రం మలకనగిరి జిల్లాకు చెందిన బిక్రమ్ మండల్, గౌతమ్ మండేల్, బిప్రోజిత్ మండల్ అనే ముగ్గురు వ్యక్తులు తమ సొంత కారులో 20 కేజీల గంజాయిని తమ రాష్ట్రం నుండి తొర్రూర్ మీదుగా వరంగల్‌కు తరస్తుండగా పక్కా సమాచారం తెలుసుకున్న రాయపర్తి పోలీసులు మండల కేంద్రంలోని హెచ్ పి పెట్రోల్ పంపు సమీపంలో జాతీయ రహదారిపై వాహనాలను తనిఖీ చేస్తుండగా అనుమానం వచ్చి వీరి కారును చెక్ చేయగా అందులో 20 కేజీల గంజాయి ఉన్నట్టు గుర్తించారు. వెంటనే వారిని అదుపులోకి తీసుకొని కేసు నమోదు చేసుకుని విచారణ జరుపుతున్నట్లు ఎస్ఐ రాజేందర్ తెలిపారు. గంజాయి విలువ సుమారు 10 లక్షలు ఉంటుందని వారి వద్ద నుండి గంజాయితోపాటు ఒక కారు మూడు సెల్ ఫోన్ లను సీజ్ చేసినట్టు ఆయన తెలిపారు.

## పరీక్ష కేంద్రాల్లో ప్రశాంత వాతావరణం



ప్రజాపక్షం/జనగామ :పదో తరగతి పరీక్ష కేంద్రాల వద్ద ప్రశాంత వాతారవణ కల్పించాలని జనగామ జిల్లా కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా అధికారులను ఆదేశించారు. శనివారం జిల్లాలోని స్టేషన్‌ఘనపూర్‌లో గల జిల్లా పరిషత్ పాఠశాల, చాగల్ జెడ్‌పిహెస్ పాఠశాల పరీక్ష కేంద్రాలను అకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పరీక్షల నిర్వాహణ సరళిని పరిశీలించారు. పరీక్ష కేంద్రాల వద్ద తాగునీటి వసతి, ఆషా వర్కర్లు, ఆరోగ్య శిభిరం, సిసి కెమెరాలు, మౌళిక వసతులు కల్పించాలని, ప్రశాంత వాతావరణం కల్పిస్తే విద్యార్థులు మంచిగా పరీక్షలు రాసే అవకాశం ఉంటుందన్నారు. ఎటువంటి పొరపాట్లకు తావులేకుండా పరీక్షలను సజావుగా నిర్వయించాలని, పరీక్ష పూర్తైన వెంటనే జవాబు పత్రాలను పోలీస్ బందోబస్తు మద్యన నిర్దేశిత ప్రాంతాలకు తరలించాలన్నారు. ఎక్కడా ఎలాంటి లోటుపాట్లు జరగకుండా చూడాలని, పరీక్ష కేంద్రాల వద్ద భయానక పరిస్థితులకు తావివొవ్వదన్నారు. ఈ తనిఖీలో సంబంధిత అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# అసైన్డ్ భూమికి పట్టా మంజూరు

వెంకటాపూర్‌లో రెవెన్యూ అధికారుల చర్య* అసెంబ్లీలో ప్రస్తావించిన ఎమ్మెల్యే కూనంనేని
* ఉద్యమానికి సిద్ధమౌతున్న సిపిఐ నాయకులు



ప్రజాపక్షం/హనుమకొండ : అసైన్డ్ భూమికి చట్టాన్ని అతిక్రమించి పట్టా మంజూరు చేసిన రెవెన్యూ అధికారుల చర్యలు చర్చనీయాంశం అయ్యాయి. అసైన్డ్ భూముల చట్టం 1977 పై ప్రజలకు అవగాహన లేకపోవచ్చు కానీ, రెవెన్యూ అధికారులు చట్టాన్ని ఎలా అతిక్రమిస్తా రు? చట్టాలను అనుసరిస్తూ పని చేయాల్సిన అధికారులే నియంతలా చట్టంతోపని లేకుండా వ్యవహరిస్తుంటే ఇక ప్రజలు చేసేది ఏముంటుందని పలువురు చర్చించుకుంటున్నారు. హనుమకొండ జిల్లాలో గతంలో ఐనవోలు ఎమ్మార్వో గా విధులు నిర్వహించిన వారు చేసిన నిర్వాకం నేడు పేద ప్రజల పాలిట శాప మైంది. 20 సంవత్సరాలుగా పరిష్కారం దొరకక బాధిత కుటుంబాలు నిరాశ చెందుతున్నాయి. వివరాల్లోకి వెళితే హను మకొండ జిల్లా ఐనవోలు మండలం వెంకటాపురం గ్రామంలో 70 మంది ఎస్సీలకు 138 ఎకరాల భూ మిని ప్రభుత్వం పంచి పెట్టింది. అలాంటి భూమిని ఓ బడా ఆసామి అక్రమంగా అధికారుల సహాయ, సహకారాలతో పట్టా చేసుకున్నాడు. ఈ ఘటన ప్రస్తావన ఐనవోలు నుంచి అసెంబ్లీ వరకు వెళ్ళింది. అసెంబ్లీ సాక్షిగా కొత్తగూడెం సిపిఐ ఎమ్మెల్యేకూనంనేని సాంబశివరావు నిరుపేదలకు జరుగుతున్న అన్యాయంపై అసెంబ్లీలో ప్ర స్తావన లేవనెత్తారు. గుట్టుగా పట్టా చేసుకున్న వ్యక్తి పేరు చెప్పి మరీ ప్రస్తావించారు. ఇప్పటి వరకు ఎలాంటి చర్యలు లేక పోవ డం బాధితులతో పాటు గ్రామస్తులు సందిగ్దంలో ప డ్డా రు. ఏళ్ల తరబడి ప్రజల ప క్షాన పోరాడుతు న్న భార త కమ్యూ నిస్టు (సిపిఐ) పార్టీ నాయకులు ఎస్సీలపై జ రుగుతున్న అన్యాయాలకు నిరసన,ధర్నాకార్యక్రమాలు చేపట్టేందుకుత్వరలోసి ద్ధం కానున్నారనితెలుస్తున్న ది.

**అసైన్డ్ చట్టం అనుసరించాలి**

వెంకటాపురం గ్రామంలోని నిరుపేద కుటుంబాలను గు ర్తించి కల్పించిన అసైన్డ్ భూమిని అక్రమంగా వేరే వ్యక్తులపై రెవెన్యూ అధికారులు పట్టాలు చేశారు. 2018 నుంచి ఇప్పటి వరకు అనర్హులే ప్రభుత్వ భూమిలో లబ్ధిని పొందుతున్నారు. ప్రభుత్వ అధికారులు ఎలాంటి విచారణ లేకుండా పథకాలను అందిస్తూ, ప్రభుత్వ నిధులు దుర్వినియోగం చేశారు. అలా మోసం చేసి, పట్టాలు పొందిన వారిపై, సహకరించిన అధికారులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని బాధితులు కోరుతున్నారు. ప్రభుత్వ భూముల పరిరక్షణ కొరకు ప్రవేశపెట్టిన పిఒటి చట్టం అనుసరించి మోసపూరిత వ్యక్తులపై క్రిమినల్ కేసులు నమోదు చేస్తూ, వారు కలిగి ఉన్న పట్టాలను త్వరగా తొలగించి,బాధితులకున్యాయంచేయాలనివిజ్ఞప్తిచేస్తున్నారు.

**తరతరాలుగా అవమానాలు**

భక్తిని మెచ్చి భగవంతుడే వరమిచ్చినా పూజారి కనికరించడన్న సామెత ప్రకారం ప్రభుత్వం పేదలను గుర్తించి భూమినిపంచిపెట్టింది. కనికరించాల్సిన రెవెన్యూ అధికారులు ఎస్సీలకు విలువైన భూములు ఉండడానికి వీలు లేదని నిర్ధారించారు. అందువల్ల ఉన్నత వర్గానికి చెందిన వారికి ఆ విలువైన భూమిని అప్పగించి పట్టాలు ఇచ్చారు. దీంతో పేదలకు తీరని అన్యాయం తలపెట్టారు. తరతరాలుగా వ్యవసాయ కూలీలుగా, లేబర్ పనులు చేస్తూ జీవనాన్ని కొనసాగించే బలహీన వర్గాల జీవితాలను వెక్కిరిస్తూనే ఉన్నారు. ప్రభుత్వం 70 కుటుంబాలను గుర్తించి పంచి ఇచ్చిన భూమిని అన్యాయంగా లాక్కోవడం దుర్మార్గమని సిపిఐ హనుమకొండ జిల్లా కార్యవర్గ సభ్యుడు వెంకట్రాజం, రవి ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా చట్టాలను అనుసరిస్తూ ప్రభుత్వ నిబంధనలను అతిక్రమించిన వారిపై చర్యలు చేపట్టాలని, పేదల భూములు వారికే ఇవ్వాలని నాయకులు వారు డిమాండ్ చేస్తున్నారు.

## శ్వాస ఉన్నంతవరకూ వరికోల్‌కు సేవ చేస్తా

ఎమ్మెల్సీ పోచంపల్లి శ్రీనివాస్ రెడ్డి



ప్రజాపక్షం/నడికూడ: హనుమకొండ జిల్లా నడికూడ మండలం వరికోల్ గ్రామాభివృద్ధి ప్రదాత రాష్ట్రంలోనే గ్రామాన్ని ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దిన అభిమన్యుడు ఉమ్మడి వరంగల్ జిల్లా ఎమ్మెల్సీ పోచంపల్లి శ్రీనివాస్ రెడ్డి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఛత్రపతి శివాజీ విగ్రహ ఆవిష్కరణ,నూతన ఫంక్షన్ హాల్,శ్రీ సీతారాముల కళ్యాణ మహోత్సవ కార్యక్రమం గ్రామంలో అంగరంగ వైభవంగా ఏర్పాటు చేశారు.ఈ కార్యక్రమానికి ఎమ్మెల్సీ పోచంపల్లి శ్రీనివాస్ రెడ్డి,మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి,ఫర్టిలైజర్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు నాగూర్ల వెంకటేశ్వర్లు పాల్గొని ఛత్రపతి శివాజీ విగ్రహం ఆవిష్కరించారు.అన్నప్రసాద వితరణ చేశారు.నూతన ఫంక్షన్ హాల్ ను ఆవిష్కరించి శ్రీ సీతారాముల కల్యాణ మహోత్సవంలో ఎమ్మెల్సీ శ్రీనివాస్‌రెడ్డి పాల్గొని వరికోల్ గ్రామ ప్రజలందరికీ శ్రీ రామనవమి శుభాకాంక్షలు తెలియజేస్తూ మాట్లాడుతూ మీ కష్టసుఖాలలో నేనుంటా,మీకు అండగా నిలబడతా,నా శ్వాస ఉన్నంతవరకు మీ ఇంటి బిడ్డగా వరికోల్ కు సేవ అందిస్తా,పిఎస్ఆర్ నిధులతో పులిగిల్లవరికోల్ మధ్య రైతుల కోసం కోల్ స్టోరేజ్ నిర్మిస్తా,ఈ ఫంక్షన్ హాల్ గ్రామ ప్రజలకు ఉచితంగా అందిస్తున్నానని ఈ ఫంక్షన్ హాల్ మన అందరిదని తెలియజేశారు. గ్రామ సర్పంచ్ కుమార్ స్వామి మండల మాజీ వైస్ ఎంపిపి చందా కుమారస్వామి గ్రామ ఉపసర్పంచ్ భుజంగరావు,వెంకటేశ్వర్లపల్లి సర్పంచ్ మహేందర్ రెడ్డి,బిఆర్ఎస్ నాయకులు నందికొండ జైపాల్ రెడ్డి,గణపతి రెడ్డి,బండి శంకర్, శీలం దేవేందర్,శివాజీ,లోకటి నగేష్,రాజు, పోచంపల్లి రఘుపతి,గుడికందుల శివ, రామంచ రాజేందర్,ఆరె సంఘం నాయకులు,పెద్ద సంఖ్యలో గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

## ఏప్రిల్ 17న భారీ బహిరంగ సభ

సిపిఐ వరంగల్ జిల్లా కార్యదర్శి షేక్ బాష్ మియా




ప్రజాపక్షం/వరంగల్: దళిత హక్కుల పోరాట సమితి 2వ రాష్ట్ర మహాసభలను, ఏప్రిల్ 17న భారీ బహిరంగ సభను జయప్రదం చేయాలని సిపిఐ వరంగల్ జిల్లా కార్యదర్శి షేక్ బాష్ మియాపిలుపునిచ్చారు. వరంగల్‌లోని సిపిఐ జిల్లా కార్యాలయం తమ్మెర భవన్‌లో దళిత హక్కుల పోరాట సమితి 2వ రాష్ట్ర మహాసభల వాల్ పోస్టర్‌ను సిపిఐ జిల్లా కార్యదర్శి షేక్ బాష్ మియా శనివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏప్రిల్ 17, 18 తేదీలలో వరంగల్ పట్టణంలోని అబ్బాస్ ఫంక్షన్ హాల్‌లో జరగనున్న దళిత హక్కుల పోరాట సమితి 2వ రాష్ట్ర మహాసభలకు తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా సుమారు 500 మంది ప్రతినిధులు హాజరవుతారని, ఏప్రిల్ 17న నిర్వహించనున్న భారీ బహిరంగ సభకు ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని ఆయన ప్రజలకు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో దండు లక్ష్మణ్ , సంఘీ ఎలేందర్ ,జన్ను రవి , గుండె బద్రి , ఆరె రాజు, మస్కా సుదీర్, తాళ్లపల్లి జాన్ పాల్, రాచర్ల రాజేందర్, జన్ను హరిబాబు, మంద నవీన్, బాణాల మహేశ్, రాజేష్, శ్వేత ,శైలజ తదితరులు పాల్గొన్నారు.

## గ్యాస్ కొరత లేదు : కలెక్టర్ రాహుల్ శర్మ



ప్రజాపక్షం/భూపాలపల్లి :జిల్లాలో గ్యాస్, పెట్రోల్, డీజిల్ నిల్వలు సమృద్ధిగా ఉన్నాయని ఎలాంటి కొరత లేదని జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ తెలిపారు. శనివారం ఐడిఓసి కార్యాలయంలో పౌర సరఫరాల శాఖ ఆధ్వర్యంలో ఎస్పి సంకీర్త్ తో కలిసి జిల్లా ఎనర్జీ సప్లై మానిటరింగ్ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్యాస్, పెట్రోల్, డీజిల్ పై పటిష్ట పర్యవేక్షణ కొనసాగాలని ఆదేశించారు. గృహ అవసరాలకు వినియోగించే సిలిండర్లు వాణిజ్య అవసరాలకు వినియోగిస్తే నిత్యావసర సరుకుల చట్టం ప్రకారం కేసులు నమోదు చేయాలని సూచించారు. జిల్లాలో మొత్తం లక్షా 20 వేల మంది గ్యాస్ వినియోగిస్తున్నారని తెలిపారు. సంక్షేమ వసతి గృహాలు, పాఠశాలలు, ఆసుపత్రులకు యధావిధిగా గ్యాస్ సరఫరా జరుగుతుందని, ఆయా శాఖల అధికారులు. పర్యవేక్షణ చేయాలని ఆదేశించారు.

## తండ్రిమరణం..బాధతో పరీక్ష రాసిన టెన్త్ విద్యార్థి




ప్రజాపక్షం/నర్సింహులపేట:కన్న తండ్రి మరణంతో పుట్టెడు దుఃఖంలో ఉన్న ఓ విద్యార్థి పదవ తరగతి పరీక్ష రాసి అందరికీ అదర్శంగా నిలిచాడు.. వివరాల్లోకి వెళితే..మండలంలోని పడమటిగూడెం గ్రామానికి చెందిన నూకల ఉప్పలయ్య(50) గొర్ల కాపరి వృత్తి చేసుకుంటూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు.కిడ్నీ సమస్యతో బాధపడుతున్న ఉప్పలయ్య మృతి చెందాడు..మండల కేంద్రంలోని మోడల్ స్కూల్లో పదవ తరగతి చదువుతున్న నూకల శివకృష్ణ ఓ వైపు తండ్రి మరణాన్ని దిగమింగుతూ పుట్టెడు దుఃఖంలో పరీక్షకు హాజరైయ్యాడు.తండ్రి మృతదేహం ఇంట్లో ఉండగానే శనివారం గణిత పరీక్షకు హాజరై కన్నీళ్లు తుడుచుకుంటూ పరీక్ష రాసేందుకు వెళ్లగా బాలుడుని చూసి తోటి విద్యార్థులు,గ్రామస్థులు కన్నీటి పర్యంతమయ్యారు.తండ్రి మరణించిన బాధలో ఉండి కూడా భవిష్యత్ కోసం పరీక్షకు హాజరైన శివకృష్ణ ధైర్యాన్ని చూసి స్థానికులు ఆవేదన వ్యక్తం చేశారు. పరీక్ష ముగిసిన వెంటనే ఇంటికి చేరుకున్న శివకృష్ణ మధ్యాహ్నం తండ్రికి అంత్యక్రియాలు నిర్వహించాడు.కాగా తండ్రి చనిపోయి పరీక్షకు హాజరైనా విద్యార్థిని కానిస్టేబుల్ మమత ఓదార్చి మనోధైర్యం చెప్పారు. పరీక్ష రాసిన తరువాత దగ్గర ఉండి బంధువులతో ఇంటికి పంపించారు.

## మంత్రి పొన్నం ప్రభాకర్‌ను కలిసిన ఎమ్మెల్యే నాగరాజు



ప్రజాపక్షం/వర్ధన్నపేట : హైదరాబాద్‌లో తెలంగాణ రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ ను వర్ధన్నపేట నియోజకవర్గ ఎమ్మెల్యే, విశ్రాంత ఐపీఎస్ అధికారి కే ఆర్ నాగరాజు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా నియోజకవర్గ అభివృద్ధికి సంబంధించిన కీలక అంశాలపై మంత్రి దృ ష్టికి తీసుకెళ్లుతూ వినతి పత్రం సమర్పించా రు. అనంతరం ఎమ్మెల్యే నాగరాజు మాట్లాడుతూ వర్ధన్నపేట నియోజకవర్గ పరిధిలోని వరంగల్ మండల పరిధిలోని మున్సిపల్ కార్పొరేషన్ 3వ డివిజన్ పైడిపల్లి గ్రామ సమీపంలో సుమారు 5 ఎకరాల ప్రభుత్వ భూమి అందుబాటులో ఉందని, ఆ స్థలంలో నూతన ఇవి చార్జింగ్ స్టేషన్ ఏర్పాటు చేయాలని కోరారు. దీనివల్ల ప్రాంతీయ రవాణా సౌకర్యాలు మెరుగుపడటంతో పాటు, పర్యావరణానికి అనుకూలమైన ఎలక్ట్రిక్ వాహనాల వినియోగం పెరుగుతుందని తెలిపారు.అదేవిధంగా, నియోజకవర్గానికి 100 కొత్త ఇవి బస్సులను కేటాయించాలని మంత్రి ప్రభాకర్ గౌడ్ వద్ద విజ్ఞప్తి చేశారు. ఈ బస్సుల ద్వారా ప్రజలకు మెరుగైన, ఆధునిక రవాణా సదుపాయాలు అందుబాటులోకి వస్తాయని ఆయన అభిప్రాయపడ్డారు.ఇక, కొత్తగా ఏర్పాటు చేయనున్న బస్ స్టేషన్, ఈవి బస్సుల నిర్వహణలో స్థానిక యువతకు ప్రాధాన్యత ఇవ్వాలని ఎమ్మెల్యే నాగరాజు స్పష్టం చేశారు. ఆర్టీసీ సంస్థలో స్థానికులకు ఉద్యోగాలు, ఉపాధి అవకాశాలు కల్పించడం ద్వారా ప్రాంతీయ అభివృద్ధి వేగవంతం అవుతుందని ఆయన పేర్కొన్నారు.ఈ విషయాలపై మంత్రి పొన్నం ప్రభాకర్ గౌడ్ సానుకూలంగా స్పందించారు.ప్రతిపాదనలను పరిశీలించి తగిన చర్యలు తీసుకుంటామని ఆయన హామీ ఇచ్చారు.

## బిజెపి పాలిత ప్రాంతాల్లో మహిళలకు రక్షణ కరువు

అత్యాచార, లైంగిక వేధింపుల కేసుల్లో 44 మంది ఎంపీలు, ఎమ్మెల్యేలు
రాష్ట్ర మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు ఎర్రబెల్లి స్వర్ణ



ప్రజాపక్షం/హనుమకొండ : బిజెపి పాలిత ప్రాంతాల్లో మహిళలకు రక్షణ కరువు అని, బిజెపికి చెందిన 44 మంది ఎంపిలు, ఎమ్మెల్యేలు అత్యాచార, లైంగిక వేధింపుల కేసుల్లో ఉన్నారనీ హన్మకొండ జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన పత్రికా విలేఖరుల సమావేశంలో తెలంగాణ రాష్ట్ర మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు ఎర్రబెల్లి స్వర్ణ అన్నారు. ఈ ఆరోపణలపై రాజకీయ రక్షణ కింద ఆయా నేతలకు బిజెపి రక్షణ కల్పిస్తోందని ఎర్రబెల్లి స్వర్ణ ఆరోపించారు. మహిళలు అంటే గౌరవం లేని పార్టీ బిజెపి అని అన్నారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ మహిళల సంరక్షణ గురించి మాట్లడుతారని, దేశంలో మహిళల మీద జరుగుతున్న దాష్టీకాల మీద మాత్రం పెదవి విప్పరని,మహిళా మంత్రులు మౌనంగా ఉంటారని, కేంద్రం సహా బిజెపి అధికారంలో ఉన్న రాష్ట్రాలలో కొందరు మంత్రుల వ్యవహారం ఆందోళన కలిగిస్తుందన్నారు. బేటీ బచావో బేటి పడావో కార్యక్రమం ప్రారంభించినప్పుడు వంద కోట్లకు పైగా హోర్డింగ్ లు ప్రకటన ఖర్చు చేసారన్నారు. ప్రధాని మోదీ నియోజకవర్గం వారణాసిలో గత ఏడాది 1686 మహిళలపై నేరాలు జరిగాయని, ఇది పాలన వైఫల్యానికి నిదర్శనం అన్నారు. కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం, మంత్రుల పరిస్థితి రేపిస్టులను వెనుకేసుకురావడం, విద్వేషాలు రెచ్చగొట్టేలా మతపరమైన స్టేట్‌మెంట్లు ఇవ్వడం బిజెపిలోని కొందరు ప్రజాప్రతినిధులకు పరిపాటిగా మారిందని, ఇలాంటి చర్యలు, విధానాలతో అధికారం చేపట్టాలని, ఉన్న అధికారాన్ని కాపడుకోవాలని బిజెపి భావిస్తుందని అన్నారు. లైంగిక నేరాల ఆరోపణలు ఎంపిలు, ఎమ్మెల్యేలపై ఉన్నా, వారిని రక్షించే ధోరణిబిజెపికి ఉందని, రాజకీయ ప్రయోజనాల కోసం వారిని కాపాడుతున్నారని ఎర్రబెల్లి స్వర్ణ ఆరోపించారు. ఈ కార్యక్రమంలో జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షులు నీలం పద్మ, బంక సరళ, నునావత్ రాధా, రాష్ట్ర జిల్లా మహిళా నాయకులు, మండల, డివిజన్ అధ్యక్షులు తదితరులు పాల్గొన్నారు.

## సింగరేణిలో మెడికల్ బోర్డు నిర్వహించాలి

ఇబిజికెఎస్, బిఆర్ఎస్ ఆధ్వర్యంలో రాస్తారోకో



ప్రజాపక్షం/భూపాలపల్లి :సింగరేణిలో వెంటనే మెడికల్ బోర్డు నిర్వహించాలని, సింగరేణికి కాంగ్రెస్ ప్రభుత్వం బాకీ పడ్డ 50 వేల కోట్లు చెల్లించాలి అని భూపాలపల్లి మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణ రెడ్డి డిమాండ్ చేశారు. భూపాలపల్లి జిల్లా కేంద్రంలో టిబిజికెఎస్, బిఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో సింగరేణి కార్మికుల సమస్యలను వెం టనే పరిష్కరించాలని భూపాలపల్లి అంబేద్కర్ సెంటర్లో ధర్నా, రాస్తారోకో నిర్వహించారు. కార్యక్రమంలో భూపాలపల్లి మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణ రెడ్డి,టిబిజికెఎస్ రాష్ట్ర అధ్యక్షుడు మిరియాల రాజిరెడ్డి,వరంగల్ జిల్లా జడ్పీ మాజీ చై ర్పర్సన్ బిఆర్ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షురాలు గండ్ర జ్యోతి పాల్గొన్నారు. ఈ సందర్భంగా సింగరేణిలో మెడికల్ బోర్డును పునరుద్ధరించి డిపెండెంట్ కార్మికులకు ఉద్యోగాలు ఇవ్వాలని,సింగరేణికి రాష్ట్ర ప్రభుత్వం బకాయి ఉన్న 50 వేల కోట్ల రూపాయలను చెల్లించాలని అయన డిమాండ్ చేశారు. మారు పేరు, విజిలెన్స్ అంశం పై ప్రభుత్వం వెంటనే నిర్ణయం తీసుకొని కార్మికులకు న్యాయం చేయాలని, 2025 నుండి పెండింగ్‌లో ఉన్న డిపెండెంట్లకు ఉద్యోగ నియామక పత్రాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్మికుల జీవితాలతో చెలగాటం ఆడుతున్న ఈ ప్రభుత్వం మెడలు వంచి కార్మికుల సమస్యలను పరిష్కరించే దిశగా బిఆర్ఎస్, టిబిజికేఎస్ పనిచేస్తుంది అని హెచ్చరిక మాత్రమే, అని ఇలానే సింగరేణి కార్మికుల సమస్యలను గాలికొదిలేస్తే రాష్ట్ర వ్యాప్తంగా ఈ కార్యక్రమాలను ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఆనంతరం సిఎం రేవంత్ రెడ్డి దిష్టి బొమ్మ దగ్ధం చేశారు. ఈ కార్యక్రమంలో టిఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు కటకం జనార్ధన్, స్థానిక నాయకులు మాడ హరీష్ రెడ్డి, మాజీ కౌన్సిలర్లు నాయకులు పాల్గొన్నారు.

## ప్రాణాంతక రక్తనాళ వ్యాధికి శస్త్రచికిత్స




ప్రజాపక్షం/జనగామ :అరుదైన, ప్రాణాంతక రక్తనాళ వ్యాధికి యశోద మలక్‌పేట హాస్పటల్‌లో శస్త్రచికిత్స నిర్వయించి వ్యాధిగ్రస్తుల ప్రాణాలు కాపాడడం జరుగుతుందని డాక్టర్ రంజిత్‌కుమార్ ఆనందసు తెలిపారు. ఇటీవల జనగామకు చెందిన 52 ఏళ్ల మహిళకు విజయవంతంగా శస్త్ర చికిత్స చేయడం జరిగిందన్నారు. శనివారం జనగామలో విజయ పంక్షన్‌హాల్‌లో జరిగిన విలేకర్ల సమావేశంలో డాక్టర్ యశోదా సూపర్ స్పెషాలిటి వైద్యులు డాక్టర్ రంజిత్‌కుమార్ ఆనందసు మాట్లాడారు. రక్తనాళ వ్యాధి ఎంతో ప్రమాదకరమైందన్నారు. ప్రధాన రక్తనాళం బలహీనమై ఎప్పుడైనా పగిలే ప్రమాదం ఉంటుందని, అత్యంత విషమంగా మారి పొట్టనొప్పి, వెన్నుపూస వరు వ్యాపించడం జరుగుతుందన్నారు. పొట్ట, వెన్నుపూస నొప్పితో హాస్పటల్‌కు వచ్చే రోగులకు వైద్యులు సమగ్రంగా పరీక్షించి సమస్యను తొందరగా గుర్తిస్తారన్నారు. జనగామలోకి ఒక మహిళకు ఇదే జరిగిందని వైద్య బృందం ఆఓర్టోఇలియాక్ బైపాస్ శస్త్రచికిత్స చేసి ప్రాణాలు కాపాడిందన్నారు. ఐసియులో ప్రత్యేక పర్యవేక్షణలో ఉంచి హైపోవేలెమిక్ షాక్, కిడ్నీ సమస్యలు, రక్తహీనత వంటి సమస్యలను సమర్థవంతంగా నియంత్రించడం జరిగిందన్నారు. యశోధ మల్లక్‌పేటలో రక్తనాళాల శస్త్రచికిత్స చేయడం జరుగుతుందన్నారు. ఈ వైద్యాన్ని రోగులు ఉపయోగించుకోవాలని, ఎక్కువ ఖర్చు లేకుండా ఈ చికిత్స చేయబడుతుండన్నారు. ఇన్స్యూ రెన్స్ ఉంటే ఇంకా మంచిదన్నారు. ఇలాంటి రక్తనాళ వ్యాధులను సమయానికి గుర్తించ చికిత్స అందిస్తే ప్రాణాప్రాయం నుండి కాపడావచ్చునన్నారు. అత్యాధునిక సదుపాయాలు, అనుభవజ్ఞులైన డాక్టర్లు యశోదలో ఉన్నారని తెలిపారు. ఈ సందర్భంగా ప్రవిలేజ్ కార్డును ఆవిష్కరించారు. ఈ విలేకర్ల సమావేశంలో లక్ష్మ న్‌సింగ్, వాసుకిరన్‌రెడ్డి పాల్గొన్నారు.

## సింగరేణిలో రాజకీయ జోక్యం తగ్గించాలి

### కార్మికుల హక్కుల సాధన సింగరేణి పరిరక్షణ కోసం..

### 'సేవ్ సింగరేణి' నినాదంతో ఎఐటియుసి ప్రచార జాతా



**ప్రజాపక్షం/సత్తుపల్లి :** సింగరేణిలో పెరుగుతున్న రాజకీయ జోక్యాన్ని తగ్గించాలని, అప్పుల ఊబిలో కోరుకున్న సింగరేణిని బయట పడేయడంతో పాటు, సేవ్ సింగరేణిలో బాగంగా కార్మికుల హక్కుల సాధన, సింగరేణి పరిరక్షణ కోసం ఈ 'నెల18 నుండి మంచిర్యాల జిల్లా శ్రీరాంపురం ఆర్కే మైన్ నుండి ప్రారంభమైనా ఎఐటియుసి ఆధ్వర్యంలో ప్రచార జాతా ప్రారంభమైంది. ఈ ప్రచార జాతా శనివారం సత్తుపల్లి జెవిఆర్, సింగరేణి ఒసిలకు చేరుకుంది. సింగరేణి కార్మికులతో పట్టణంలో భారీ ర్యాలీ నిర్వహించారు. అనంతరం ప్రభుత్వ వసతి గృహంలో విలేకరుల సమావేశం నిర్వహించి, ఎఐటియుసి జిల్లా అధ్యక్షుడు వాసిరెడ్డి సీతారామయ్య, జనరల్ సెక్రెటరీ రాజ్ కుమార్ లు మాట్లాడారు. గత బిఆర్ఎస్, నేటి కాంగ్రెస్ ప్రభుత్వంలోని పెద్దలు సింగరేణికి పూర్తి రాజకీయ రంగు పులిమి, నేడు సింగరేణి దివాళా తీసే స్థాయికి తెచ్చారని మండిపడ్డారు. గతంలో సిఎస్ఆర్ నిధులు రూ.కోటిని నేరుగా ఎమ్మెల్యేలకు అందిస్తే, నేటి ముఖ్యమంత్రి ఏకంగా రూ.3 కోట్లు ఇస్తున్నాడని, సింగరేణి ప్రభావిత ప్రాంతాల్లో ఖర్చు చేయాల్సిన నిధులను, సింగరేణికి అవసరం లేని ప్రాంతాలలో ఖర్చు చేస్తూ పక్కదారి పట్టిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. సింగరేణిలో మెడికల్ బోర్డును యధావిధిగా కొనసాగించాలని డిమాండ్ చేశారు. మారుపేరు ఉన్న వారిని సొంత పేర్లతో చేస్తానని నాటి సిఎం కెసిఆర్ చెప్పినా జరగలేదని, నేటి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చెప్పి చేయడం లేదని ఎద్దేవా చేశారు.సేవ్ సింగరేణిలో భాగంగా ఈనెల 30న కొత్తగూడెంలోని హెడ్ ఆఫీస్ వద్ద వంటావార్పు కార్యక్రమాన్ని ప్రారంభిస్తామని, అన్ని కార్మిక సంఘాలను కలుపుకొని పెద్ద ఎత్తున పోరాటాలు చేసి సింగరేణిని రక్షిస్తామన్నారు. ప్రతిదానిని లెక్కలతో సహా కక్కిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ జనరల్ సెక్రెటరీలు వీరభద్రయ్య, ముస్కే సమ్మయ్య, వైవి రావు, సెంట్రల్ సెక్రెటరీ వీరస్వామి, బ్రాంచ్ సెక్రటరీ సముద్రాల సుధాకర్, వైస్ ప్రెసిడెంట్ భీమయ్య, బ్రాంచ్ అసిస్టెంట్ సెక్రటరీ సూర్యప్రకాశ్, సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు దండు ఆదినారాయణ, ఎఐటియుసి నాయకులు నిమ్మటూరి రామకృష్ణ, తడికమళ్ల యోబు తదితరులు పాల్గొన్నారు.

## సమస్యల పరిష్కారానికి సమరశీల పోరాటాలు: జమ్ముల



**ప్రజాపక్షం/చింతకాని :** ప్రజా సమస్యల పరిష్కారానికి సమరశీల పోరాటాలు నిర్వహించనున్నట్లు సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి జమ్ముల జితేందర్ రెడ్డి తెలిపారు. చింతకాని మండలం నాగిలిగొండ లో శాఖ కార్యదర్శి చాట్ల రమేష్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో జమ్ముల మాట్లాడుతూ మోదీ పాలనలో దేశ ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు.పేద ప్రజల సమస్యలు పట్టించుకునే పరిస్థితుల్లో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు లేవన్నారు. ఎన్నికల హామీలు నిలబెట్టుకోవడంలో కాంగ్రెస్ సర్కార్ పూర్తిగా విఫలమైందన్నారు. ప్రస్తుతం మొక్కజొన్న పంట చేతికొచ్చిన తరుణంలో కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసామని సర్కార్ చెబుతున్నప్పటికీ అవి రైతులకు కానరాని దూరంలో ఉన్నాయని, పంట దిగుబడిలో సీలింగ్ ఏర్పాటు చేయడం దారుణమన్నారు. తక్షణమే కొనుగోలు కేంద్రాలు పూర్తి స్థాయిలో ఏర్పాటు చేయాలన్నారు. రైతుబంధు విషయంలో కూడా సర్కార్ పూర్తిగా రైతుల ఖాతాల్లో జమ చేయకుండా రైతులను మోసం చేస్తుందన్నారు. ప్రజాసమస్యల పరిష్కారానికి పోరాటాలే మార్గమని ఆయన తెలిపారు. ఈ సమావేశంలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు వేపూరి రవీంద్ర బాబు, పావులూరి మల్లిఖార్జునరావు, ఏఐకేఎస్ మండల ప్రధాన కార్యదర్శి పదిమల వెంకటనర్సయ్య, షేక్ చిన్న జాన్, పంది శేఖర్, చాట్ల మురార్జి, చాట్ల బాబు, అరికోట్ల భాస్కర్ , దమ్మాలపాటి శ్రీను, కొమ్ము పిలిప్ , సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

## మద్యం మత్తులో విధులకు హాజరు

### జిల్లా మార్కెటింగ్ అధికారి ఆగ్రహం




**ప్రజాపక్షం/నేలకొండపల్లి :** ఖమ్మం జిల్లా, నేలకొండపల్లి మండల కేంద్రంలోని వ్యవసాయ మార్కెట్ కమిటి కార్యదర్శి పంతులు శనివారం మద్యం మత్తులో విధులకు హాజరయ్యారు. జిల్లా మార్కెటింగ్ అధికారి ఎంఎ ఆలీం మార్కెట్ ఆకస్మిక తనిఖీలో కార్యాలయానికి వచ్చారు. మద్యం మత్తులో ఉన్న కార్యదర్శి ని గమనించారు. ఎందుకు మద్యం తాగి వచ్చారని ప్రశ్నించటంతో పొంతన లేని సమాధానాలు చెబుతూ, వాగ్వాదానికి దిగాడు. ఏమి చేస్తారు సస్పెండ్ చేస్తారా చేసుకోండి, కోర్టుకు వెళ్తానని గొడవకు దిగాడు. దీంతో జిల్లా మార్కెటింగ్ అధికారి అగ్రహం వ్యక్తం చేశారు. గతంలో పలు మార్లు హెచ్చరించినప్పటికీ మార్పు రావటం లేదని హెచ్చరించారు. విషయాన్ని సంబంధిత శాఖ ఉన్నతాధికారులతో పాటు, మార్కెట్ కమిటీ చైర్మన్‌కు ఫోన్ ద్వారా వివరించారు. డిఎం 108 వాహనానికి సమాచారం అందించారు. ఈ మేరకు 108 సిబ్బంది మార్కెట్ కార్యాలయానికి వచ్చి వైద్య పరీక్షల కోసం ఖమ్మం తరలించారు. ఇటీవల కార్యాలయంలో సిబ్బందిని కూడా దూషించినట్లు ఫిర్యాదులు ఉన్నట్లు తెలిసింది. ఈ విషయంపై మార్కెటింగ్ డీయం ఆలీం ను వివరణ కోరగా, మద్యం మత్తులో విధులకు హజరైన కార్యదర్శి పై తీరు పై ఉన్నతాధికారులకు తెలిపినట్లు పేర్కొన్నారు. ఫిర్యాదులపై సమగ్ర విచారణ చేసి నివేదికను పంపనున్నట్లు తెలిపారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు చర్యలు తీసుకుంటామని తెలిపారు.

## కలెక్టర్‌ను కలిసిన తహసీల్దార్లు

**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** నూతనంగా బాధ్యతలు స్వీకరించిన తహసీల్దార్లు జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టిని మర్యాద పూర్వకంగా కలిశారు. శనివారం ఖమ్మం అర్బన్ తహసీల్దార్‌గా జయచందర్, కూసుమంచి తహసీల్దార్‌గా సైదులు బాధ్యతలు స్వీకరించారు. అనంతరం కలెక్టరేట్‌లో కలెక్టర్ అనుదీప్ దురిశెట్టిని మర్యాద పూర్వకంగా కలిసి మొక్క ను అందజేశారు. ఈ సందర్భంగా తహసీల్దార్లకు కలెక్టర్ శుభాకాంక్షలు తెలిపారు.

# ఈ ఆశయం ముందుకు సాగాలి

### గవర్నర్ శివప్రతాప్ శుక్లా

### భద్రగిరి మార్ట్‌ను ప్రారంభించిన గవర్నర్

### గిరిజన మహిళా సంఘాల అభివృద్ధి

### ప్రత్యేకంగా అభినందించిన తుమ్మల





**ప్రజాపక్షం/భద్రాచలం :** గిరిజన మహిళా సంఘాల ఆర్థికాభివృద్ధే లక్ష్యంగా చేపట్టిన ఈ ఆశయం ముందుకు సాగాలని గవర్నర్ శివ్ ప్రతాప్ శుక్ల ఆకాంక్షించారు. ఐటిడిఏ ద్వారా ఏర్పాటు చేసిన భద్రగిరి మార్ట్‌ను రాష్ట్ర వ్యవసాయ మార్కెటింగ్ శాఖా మంత్రి తుమ్మల నాగేశ్వరరావుతో కలిసి ఆయన శనివారం ప్రారంభించారు. భద్రాచలం వంటి ఏజెన్సీ ప్రాంతంలో అటవీ ఫల సముదాయాలు అధికంగా లభించే అవకాశం ఉందని, దీంతోపాటు గిరిజన మహిళా స్వయం సహాయక సంఘాలను ఆర్థికంగా ముందుకు తీసుకెళ్లడమే ప్రధానంగా లక్ష్యంగా గిరి మార్ట్ ఏర్పాటు చేసినట్లు గవర్నర్‌కు మంత్రి వివరించారు. ఈ సందర్భంగా మార్ట్‌లోని అటవీ ఉత్పత్తులను గవర్నర్ దంపతులు పరిశీలించారు. ప్రజా ఉపయోగ కరమైన అనేక ఉత్పత్తులను ఒకే వేదికపైకి తీసుకురావడం అభినందనీయం అంటూ, మరింతంగా అభివృద్ధి పథంలో ముందుకు సాగాలని గవర్నర్ తెలిపారు. ఈ మార్ట్ ప్రజలకు ఎంతగానో ఉపయోగంగా ఉంటుందని, ఏర్పాటుకు కృషి చేసిన పిఓ రాహుల్‌ను అభినందించారు. మంత్రి తుమ్మల మాట్లాడుతూ గిరిజన ఉత్పత్తులకు విస్తృత మార్కెటింగ్ కల్పించడంతో పాటు స్థానిక గిరిజన కుటుంబాలకు ఆర్థిక బలాన్ని అందించే సదాశయంతో ఏర్పాటు చేసిన ఈ మార్ట్‌ను స్థానికులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఇప్పటికే ట్రైబల్ మ్యూజియం వంటి వినూత్న కార్యక్రమాలతో గుర్తింపు పొందిన పిఓ రాహుల్ భద్రగిరి మార్ట్ అందుబాటులోనికి తేవడం మరో మైలురాయిగా నిలుస్తుందన్నారు. గిరిజనుల సాంప్రదాయ ఉత్పత్తులు, వారి ప్రతిభకు సరైన గుర్తింపు ఇవ్వడం, వారి జీవనోపాధిని మెరుగు పరచడమే లక్ష్యంగా ఈ మార్ట్‌ను ఏర్పాటు చేయడం గర్వకారణం అన్నారు. ప్రజలు గిరిజన ఉత్పత్తులు కొనుగోలు చేసి గిరిజన ఎస్‌హెచ్‌జి గ్రూపు మహిళలు, గిరిజన రైతులకు ఆర్థికంగా చేయూత అందించాలని ఆయన అన్నారు. ఈ సందర్భంగా గిరిజన ఉత్పత్తులు వాటి వల్ల కలిగే ఆరోగ్య ప్రయోజనాలను ఐటిడిఏ పిఓ గవర్నర్ దంపతులకు వివరించారు. అనంతరం గిరిజన కళాకారులు స్వయంగా చెక్కిన చెక్క బొమ్మను జిల్లా కలెక్టర్ వారికి అందజేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక ఎంఎల్ఏ డా.తెల్లం వెంకట్రావు, సబ్ కలెక్టర్ మినాల్ శ్రేష్ట, శిక్షణ కలెక్టర్ సౌరభ్ శర్మ, సహాయ ప్రాజెక్టు అధికారి జనరల్ డేవిడ్ రాజ్, ఐటిడిఏ యూనిట్ అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

గత ఏడాది సరిగ్గా శ్రీరాముని పట్టాభిషేకం నాడు ఆనాటి గవర్నర్ జిష్ణుదేవ్ శర్మ చేతుల మీదుగా గిరిజన మ్యూజియం ప్రారంభం కాగా, ఇప్పుడు అదే వేడుక నాడు ప్రస్తుతం గవర్నర్ శివ్ ప్రతాప్ శుక్ల చేతుల మీదుగా భద్రగిరి మార్ట్ ప్రారంభమైంది. దూరదృష్టిలో గిరిజనాభివృద్ధి, సంస్కృతి సంప్రదాయాల కాపాడటమే లక్ష్యంగా ఐటిడిఏ పిఓ చేస్తున్న కృషి ప్రశంసలు అందుకుంటోంది. గిరిజన మ్యూజియంను ఎంతో మంది సందర్శించి ప్రశంసలు కురిపించారు. అంతరించిపోతున్న గిరిజన సంస్కృతి సంప్రదాయాలను కాపాడేందుకు ఏర్పాటు చేసిన ఈ మ్యూజియం ముందు తరాలకు సజీవ సాక్ష్యం. దేశ విదేశాల నుండి ఎందరో ఇక్కడి చేరుకుని మ్యూజియాన్ని తిలకించారు. శ్వేత దేశస్తులు సైతం మ్యూజియం గురించి తెలుసుకుని భద్రాచలం చేరుకుని సందర్శించి గిరిజనుల పనిముట్లు, ఆహార అలవాట్లు, ఆచార వ్యవహారాలను తెలుసుకుని అబ్బురపడ్డారు. ఇప్పుడు అదే స్ఫూర్తితో ఏర్పాటైన భద్రగిరి మార్ట్ మరోమైలు రాయి కానుంది. అటవీ ఫల సముదాయాలు దళారుల పాలు కాకుండా వాటిని గిరిజన మహిళా సంఘాలు సేకరించి గిరిమార్ట్‌లో ఉంచి అమ్మకాలు సాగించనున్నారు. అదేవిధంగా సేంద్రీయ పద్ధతుల్లో సాగుచేసిన పండించిన పలు రకాల తృణధాన్యాలతో పాటు ఉలు రకాలు ఉత్పత్తులు, బియ్యం, పప్పు ధాన్యాలు, ఇతర నిత్యవసర సరుకులు ఈ భద్రగిరి మార్ట్‌లో లభ్యమయ్యేలా ఉంచారు. కొనుగోలు దారులకు సరసరమైన ధరలకు, నాణ్యమైన ఉత్పత్తులు అందించనున్నట్లు ఐటిడిఏ అధికారులు తెలిపారు. ఇదిలా ఉండగా గిరిజన మహిళా సంఘాలు ఐటిడిఏ సహాయ సహకారంతో తయారు చేసిన పలు రకాల తృణ ధాన్యాల ఉత్పత్తులపై దేశ ప్రధాని నరేంద్రమోదీ మన్‌కీ బాత్ కార్యక్రమంలో ప్రత్యేకంగా ప్రశంసించిన విషయం విధితమే.

**ప్రత్యేకంగా అభినందించిన తుమ్మల :** ఐటిడిఏ పిఓ చేస్తున్న వినూత్న కృషిని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ప్రత్యేకంగా అభినందించారు. గిరిజనాభివృద్ధి కోసం నియమితులైన అధికారులు గిరిజనుల ఆర్థికాభివృద్ధి కోసం చేసే కృషి చిరకాలం గుర్తుండిపోతుందని, ఇలాంటి కార్యక్రమాలకు పిఓ రాహుల్ శ్రీకారం చుట్టడం అభినందనీయం అన్నారు. లక్ష్యాలు చేరుకునేందుకు అధికారులు కృషి చేయాలని తెలిపారు. ఇటు గిరిజన సంఘాలతో పాటు గిరిజన మహిళా స్వయం సహాయక సంఘాలు పిఓను కృతజ్ఞతలు తెలుపుతుండగా, ఒకే వేదికపైకి గిరిజన ఉత్పత్తులతో పాటు తృణధాన్యాలు, పలు రకాల వస్తువులు తీసుకురావడం ప్రశంసనీయం అంటూ ప్రజలు అంటున్నారు.

## వెలుగుమట్లలో యుద్ధ ప్రాతిపదికన పనులు

### విద్యుత్, తాగునీటి పనులు పూర్తి

### లబ్ధిదారులు ఇండ్లను త్వరితగతిన పూర్తి చేసుకోవాలి

### అభివృద్ధి పనులను పరిశీలించిన మంత్రి తుమ్మల



**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** వెలుగుమట్ల భూదాన్ భూముల్లో లబ్ధిదారులకు అవసరమైన అన్ని రకాల సౌకర్యాలను యుద్ధ ప్రాతిపదికన చేపట్టినట్లు రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. శనివారం వెలుగుమట్ల భూదాన్ భూముల్లో జరుగుతున్న అభివృద్ధి పనులను మంత్రి తుమ్మల నాగేశ్వరరావు కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి, పోలీస్ కమిషనర్ సునీల్ దత్, ఖమ్మం మున్సిపల్ కమిషనర్ అభిషేక్ అగస్త్య, అదనపు కలెక్టర్ పి. శ్రీనివాసరెడ్డి లతో కలిసి క్షేత్ర స్థాయిలో పరిశీలించారు. కలెక్టర్ మ్యాపు ద్వారా అభివృద్ధి పనులను వివరించారు. కాలనీలో ఇప్పటికే విద్యుత్ స్తంభాల ఏర్పాటు, వీధి దీపాల పనులు పూర్తయ్యాయని వాటర్ ట్యాంకు నుండి ఇంటింటికి తాగునీటి పైపులైన్ అనుసంధానం జరిగిందన్నారు. అంతర్గత రోడ్ల నిర్మాణం, రవాణా సౌకర్యం కల్పించేలా ప్రణాళికలు రూపొందించినట్లు మంత్రికి వివరించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ప్రజల మౌలిక అవసరాలను ప్రాధాన్యంగా తీసుకుని ప్రతి కుటుంబానికి త్రాగునీరు, విద్యుత్, రోడ్లు వంటి సదుపాయాలు అందించేందుకు ప్రభుత్వం తగు చర్యలు తీసుకుంటుందన్నారు. గత పదేళ్ల కాలంలో పేదలు మౌలిక సదుపాయాల కొరతతో అనేక ఇబ్బందులు ఎదుర్కొన్నారని ఇందిరమ్మ ప్రభుత్వంలో ఆ సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపిస్తామన్నారు. వెలుగుమట్ల కాలనీలో విద్యుత్, తాగునీరు, రోడ్లు, కాలువలు, పారిశుధ్య వ్యవస్థ వంటి అన్ని సదుపాయాలు సమగ్రంగా ఏర్పాటు చేసి ఆదర్శవంతమైన నివాస ప్రాంతంగా తీర్చిదిద్దుతామని మంత్రి తెలిపారు. కాలనీలో స్కూల్, కమ్యూనిటీ హాల్, పార్కు వంటి సామాజిక వసతులను కూడా ఏర్పాటు చేస్తామన్నారు. డ్రైన్ నిర్మాణ పనులు త్వరితగతిన పూర్తి చేయాలని వర్షాకాలం కాలనీలో నీటి నిల్వ సమస్య ఉండకూడదన్నారు. లబ్ధిదారులు తమ ఇండ్ల నిర్మాణాన్ని త్వరితగతిన పూర్తి చేసుకోవాలని మంత్రి సూచించారు. అధికారులంతా సమన్వయంతో పనిచేసి పనులు యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేయాలన్నారు. అభివృద్ధి పనుల పురోగతిపై మంత్రి సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర గిడ్డంగుల సంస్థ ఛైర్మన్ రాయల నాగేశ్వరరావు, ఖమ్మం మార్కెట్ కమిటీ ఛైర్మన్ యరగర్ల హన్మంతరావు, ఆర్అండ్‌బి ఎస్ఈ యాకూబ్, హౌజింగ్ పిడి భూక్యా శ్రీనివాస్, పబ్లిక్ హెల్త్ ఈఈ రంజిత్, ఖమ్మం ఆర్డివో శ్రీనివాస్, తహసీల్దార్లు జయచందర్, సైదులు, ప్రజాప్రతినిధులు, సంబంధిత శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## రూ.72.34కోట్లతో.. ఏదులాపురం మున్సిపాలిటీ బడ్జెట్



**ప్రజాపక్షం/ఖమ్మం-రూరల్ :** ఏదులాపురం మున్సిపాలిటీలో చెర్పర్సన్ పోకబత్తిని అనిత అధ్యక్షతన బడ్జెట్‌పై కౌన్సిల్ సమావేశాన్ని శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా 2026–27 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన అంచనా బడ్జెట్ రూ.72.34కోట్ల 87లక్షలతో ప్రవేశపెట్టి ఆమోదించుకున్నారు. ఇది ఏడాదిలోనే ఆరు రెట్లు పెంపు చేసుకునే విధంగా ప్రవేశపెట్టారు. ఇందులో ఆదాయంలో నుంచి ఉద్యోగుల జీతాలు, పారిశుధ్య నిర్వహణ, కరెంట్‌బిల్లులు, రుణవాయిదాలు వంటి తప్పనిసరి ఖర్చులకు ప్రాధాన్యతనిచ్చారు. అదేవిధంగా మున్సిపాలిటీ సొంత అదాయ వనరులు, స్టేట్ మ్యాచింగ్ గ్రాంట్లు, 15వ ఆర్థిక సంఘం నిధుల నుంచి 10శాతం మొత్తాన్ని హరితహారానికి కేటాయించారు. విలీనమైన ప్రాంతాలు, అభివృద్ధి చెందని ప్రాంతాలు, బలహీన వర్గాలు, మైనార్టీలు, మురికివాడలలో మౌలిక వసతుల అభివృద్ధి కోసం మిగిలిన సొంత నిధులలో 1/3వంతు ప్రత్యేకంగా కేటాయింపులకై ప్రణాళికలు రూపొందించారు. ఈ కార్యక్రమంలో కమిషనర్ మున్వర్‌అలీ, వైస్ చైర్మన్ తమ్మినేని నవీన్, సిపిఐ కౌన్సిలర్లు దండి రంగారావు, మామిండ్ల శ్రీనాథ్‌రెడ్డి, దండి శ్రీజ, సిపిఎం కౌన్సిలర్ ఊరడి హైమావతి, కాంగ్రెస్ కౌన్సిలర్లు దివ్య, కడవ నవీన్, పూల్‌చంద్, ప్రసాద్, తమ్మినేని మంగతాయి, శేషమ్మ, కృష్ణకుమారి, వెంపటి ఉమా తదితరులు పాల్గొన్నారు.

## సైబర్ నేరస్తులు అరెస్ట్



**ప్రజాపక్షం/ఖమ్మం క్రైం :** ఆన్‌లౌన్‌లో ట్రేడింగ్, ఇన్‌వెస్ట్‌మెంట్ పెడితే అధిక లాభాలు వస్తాయని నమ్మించి మోసం చేసిన ఇద్దరు సైబర్ నేరగాళ్లను ఖమ్మం సైబర్ క్రైం పోలీసులు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం పశ్చిమగోదావరి జిల్లా తణుకు పట్టణంలో అరెస్ట్ చేసి శనివారం ఖమ్మం సైబర్ కోర్టులో హాజరుపరిచి రిమాండ్‌కు తరలించినట్లు సైబర్‌క్రైం డిఎస్‌పి సిహెచ్ఆర్‌వి ఫణీంధర్ తెలిపారు. వివరాలు ఇలా ఉన్నాయి. ఖమ్మం నగరానికి చెందిన ఒక వ్యాపారికి వాట్సప్‌లో పరిచయం అయిన వ్యక్తులు ఆన్‌లైన్‌లో ఎఫ్ ఎక్స్ పిఆర్ఓ కంపెనీ ట్రేడింగ్, ఇన్‌వెస్ట్‌మెంట్ చేస్తే అధిక లభాలు వస్తాయని ఆశచూపి వాట్స్‌ప్‌కి ట్రేడింగ్‌లింక్‌లు పంపి వాటి ద్వారా సుమారు 2 కోట్ల రూపాయల వరకూ పెట్టుబడిపెట్టాలని కోరడంతో సదరు వ్యాపారీ అందులో పెట్టుబడి పెట్టాడు. తరువాత వారినుంచి స్పందనలేకపోవడంతో మోసపోయినట్లు గుర్తించి సైబర్ క్రైం పోలీసులకు ఫిర్యాదు చేయడంతో వారు తొలుత 7లక్షలు నగదు బదిలీ చేసిన బ్యాంక్ అకౌంట్ నెంబర్ ఆధారంగా సదరు సైబర్‌నేరగాళ్లు పశ్చిమగోదావరి జిల్లా తణుకు పట్టణానికి చెందిన వారిగా గుర్తించి అక్కడి వెళ్లి వారిని అరెస్ట్ చేసినట్లు తెలిపారు. అరెస్ట్ అయిన వారిలో తణుకు పట్టణానికి చెందిన ఎండి సాదిక్, శ్యామ్‌బాబు ఉండగా వారిని శనివారం ఖమ్మం తరలించి స్థానిక సైబర్ కోర్టులో హాజరుపరిచి రిమాండ్‌కు తరలించినట్లు పేర్కొన్నారు. సైబర్ కేటుగాళ్లను పట్టుకోవడంలో ప్రముఖ పాత్ర పోషించిన సైబర్ క్రైం డిఎస్‌పి సిహెచ్ఆర్‌వి ఫణీంధర్, సిఐ కొండపర్తి నరేష్, ఎస్సై రంజిత్‌కుమార్, కానిస్టేబుల్స్ వెంకటకృష్ణరావు, కిషన్‌రావు, సైబర్ స్టేషన్ సిబ్బందిని ఖమ్మం పోలీసుకమిషనర్ సునిల్‌దత్ ఈసందర్భంగా వారిని అభినందించారు.

## రాజీ మార్గమే రాజ మార్గం

### జిల్లా ప్రధాన న్యాయమూర్తి రాజగోపాల్

### జిల్లా కోర్టులో జాతీయ లోక్ అదాలత్




**ప్రజాపక్షం/ ఖమ్మం లీగల్ :** రాజీ మార్గమే రాజ మార్గమని జిల్లా ప్రధాన న్యాయమూర్తి, న్యాయసేవాధికార సంస్థ ఛైర్మన్ జి. రాజగోపాల్ తెలిపారు. రాజీ పడదగ్గ కేసులలో రాజీపడి సత్వర న్యాయం పొందాలని ప్రధాన న్యాయమూర్తి సూచించారు. శనివారం జిల్లా కోర్టులో న్యాయ సేవా సదన్‌లో జాతీయ లోక్ అదాలత్ నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా ప్రధాన న్యాయమూర్తి మాట్లాడుతూ లోక్ అదాలత్‌లో రాజీతో ఇరు వర్గాలు గెలిచినట్లేనని, లోక్ అదాలత్ తీర్పు సుప్రీం కోర్టు తుది తీర్పుతో సమానమన్నారు. లోక్ అదాలత్‌ను కక్షిదారులు సద్వినియోగం చేసుకుని త్వరితగతిన కేసులను పరిష్కరించుకోవాలన్నారు. రాజీ మార్గంలో కక్షిదారులు లోక్ అదాలత్‌లను సద్వినియోగం చేసుకుని తమ కేసులను శాంతియుతంగా పరిష్కరించుకోవాలన్నారు. ఎలాంటి ఫీజు లేకుండా న్యాయ సేవా సంస్థ సహకారంతో కేసులను పూర్తి చేసుకోవచ్చునని ఆయన తెలిపారు. కేసులను రాజీ చేసుకోవడం ద్వారా అప్పీల్ చేసుకోవడం ఉండదని, కోర్టు చుట్టూ తిరిగే సమయం, డబ్బు ఆదా అవుతుందన్నారు. కేసుల పరిష్కారంతో మానసిక ప్రశాంతత చేకూరుతుందన్నారు. కేసుల సత్వర పరిష్కారంతో ఆరోగ్యకరమైన సమాజాన్ని నిర్మిద్దామని ప్రధాన న్యాయమూర్తి తెలిపారు. గత లోక్ అదాలత్‌లో 8,490 కేసులు పరిష్కారం చేసి తెలంగాణ రాష్ట్రంలో ఖమ్మం జిల్లా ఆరవ స్థానంలో నిలిచిందన్నారు. ఇందులో 63 మోటార్ వాహన ప్రమాదాల కేసులు పరిష్కరించి రూ. 4.28 కోట్లు పరిహారం కింద అందించామని ప్రధాన న్యాయమూర్తి తెలిపారు. ప్రస్తుత లోక్ అదాలత్‌లో కేసుల పరిష్కారంలో జిల్లా ఇంకా మెరుగైన స్థానం సాధించాలన్నారు. క్రిమినల్ కాంపౌండ్ కేసులు, సివిల్ తగాదా కేసులు, ఆస్తి విభజన కేసులు, వైవాహిక జీవితానికి సంబంధించిన కేసులు, బ్యాంకు రికవరీ, విద్యుత్ చౌర్యం, చెక్కు బౌన్స్ కేసులు, రోడ్డు ప్రమాదం, డ్రంక్ అండ్ డ్రైవ్, పెట్టి కేసులు, ఇతర రాజీపడదగిన కేసుల్లో కక్షిదారులు రాజీపడాలని ప్రధాన న్యాయమూర్తి తెలిపారు. జిల్లా బార్ అసోసియేషన్ అధ్యక్షులు తొండపు వెంకటేశ్వరరావు మాట్లాడుతూ బేషజాలకు పోకుండా ఇరు వర్గాల గెలుపు లోక్ అదాలత్‌లో ఉంటుందన్నారు. లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో మొదటి అదనపు జిల్లా న్యాయమూర్తి ఉమాదేవి, సీనియర్ సివిల్ జడ్జి, న్యాయ సేవాసదన్ ఇన్‌చార్జి కార్యదర్శి కల్పన, తెలంగాణ బార్ కౌన్సిల్ మెంబర్ శ్రీనివాసరావు, న్యాయమూర్తులు, న్యాయాధికారులు , న్యాయ సేవాధికార సంస్థ సభ్యులు, మీడియేటర్స్, న్యాయవాదులు, కక్షిదారులు తదితరులు పాల్గొన్నారు.

## అధికారులు నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవు

### ఆర్‌టిసి సమస్యలపై ఎమ్మెల్యేలతో మంత్రి పొన్నం ముఖాముఖీ



**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** ప్రజా సమస్యల పరిష్కారంలో ఆర్‌టిసి అధికారులు నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. ఉమ్మడి జిల్లాల వారీగా ఆర్టిసి సమస్యలపై ఆయా జిల్లాల ఎమ్మెల్యేలతో మంత్రి పొన్నం ప్రభాకర్ ముఖాముఖీ కార్యక్రమం నిర్వహించారు. అందులో భాగంగా శనివారం ఆదిలాబాద్, కరీంనగర్, ఖమ్మం జిల్లాల ప్రతినిధులతో మంత్రి పొన్నం ప్రభాకర్ ముఖాముఖి సమావేశం నిర్వహించారు. నియోజకవర్గాల వారీగా కావాల్సిన మౌలిక సదుపాయాలు, కొత్త బస్సులు, బస్ స్టేషన్ల అభివృద్ధి, కొత్త రూట్లు, బస్‌డిపోల అవసరాలపై ప్రజాప్రతినిధులతో మంత్రి సమీక్షించారు. అశ్వారావుపేటలో కావడిగుండ్ల, గుమ్మడివల్లికి దశాబ్దాల కాలం తర్వాత బస్సులు రావడం పట్ల ఎమ్మెల్యే ఆదినారాయణ సంతోషం వ్యక్తం చేశారు. శిథిలావస్థలో ఉన్న దమ్మపేట బస్‌స్టేషన్‌కు రూ.60 లక్షల నిధులు మంజూరయ్యాయని త్వరగా పనులు ప్రారంభించాలని కోరారు. భద్రాచలం వెళ్లడానికి విజయవాడ, కొత్తగూడెం నుంచి కాకుండా ప్రత్యామ్నాయ రూట్లలో బస్సులు నడపాలని సూచించారు. పినపాక నియోజక వర్గం గుండాల మండలం రాష్ట్రంలోనే అత్యంత మారుమూల ప్రాంతమని అక్కడ మధ్యాహ్నం సమయంలో అదనంగా బస్సులు నడపాలని ఎమ్మెల్యే పాయం కోరారు. సింగరేణి ప్రాంతంలో లక్ష జనాభా ఉందని అక్కడ బస్‌డిపోకు అదనంగా బస్సులు కావాలని కోరారు. ఇల్లందు నియోజక వర్గంలో అదనంగా బస్సులు నడపాలని ఎమ్మెల్యే కోరం కనకయ్య కోరారు. వైరా నియోజకవర్గం నాలుగు జిల్లాలకు సరిహద్దుల్లో ఉందని అదనంగా బస్సులు వేయాలని ఎమ్మెల్యే రాందాస్ నాయక్ కోరారు. ప్రజాప్రతినిధులతో ముఖాముఖి నిర్వహించి ఆర్టిసి సమస్యల పరిష్కారానికి మంత్రి సమావేశాలు నిర్వహించడంపై ఎమ్మెల్యేలు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా పలు అంశాలకు సంబంధించి మంత్రి పొన్నం ప్రభాకర్‌కు ఎంఎల్‌ఏలు వినతి పత్రాలు సమర్పించారు. ఈ సమావేశంలో ఎమ్మెల్యేలు పాయం వెంకటేశ్వర్లు, ఆదినారాయణ, రాందాస్ నాయక్, కోరం కనకయ్య, ఆర్టిసి అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## డంపింగ్‌యార్డ్ పనులు ప్రారంభించాలి : అదనపు కలెక్టర్

**ప్రజాపక్షం/వైరా :** వైరా మున్సిపాలిటీ పరిధిలోని 15వ వార్డు దిద్దుపూడి 81వ నెంబర్ సర్వే నెంబర్‌లో ఉన్న రెండు ఎకరాల ప్రభుత్వ భూమిని శనివారం అదనపు కలెక్టర్ శ్రీజ పరిశీలించారు. ఇటీవల వైరా మున్సిపాలిటీకి డంపింగ్‌యార్డ్ నిర్మాణం కోసం కొణిజర్ల మండలం దిద్దిపూడి రెవెన్యూలో 81 సర్వే నెంబర్‌లో రెండు ఎకరాల భూమిని వైరా మున్సిపాలిటీ అవసరాల నిమిత్తం డంపింగ్‌యార్డ్ నిర్మాణానికి కేటాయిస్తూ తహసీల్దార్ ఆర్డర్ కాపీని మున్సిపల్ అధికారులకు అందజేశారు. అందులో భాగంగా అదనపు కలెక్టర్ శ్రీజ పరిశీలించి డంపింగ్‌యార్డ్ నిర్మాణ స్థలానికి ఫెన్సింగ్ ఏర్పాటు చేసి వాడుకలోకి తెచ్చే విధంగా పనులు చేపట్టాలని మున్సిపల్ కమిషనర్ గురులింగంను ఆదేశించారు. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్‌పర్సన్ కాపా చంద్రకళ, కొణిజర్ల తహసీల్దార్ అరుణను ప్రజల సమస్యలు ఏంటని? అడిగి తెలుసుకున్నారు. ఈ డంపింగ్‌యార్డ్ పరిశీలన కార్యక్రమంలో మున్సిపల్ శానిటేషన్ అధికారి గుగులోతు వీరన్న, ఖమ్మం జిల్లా కాంగ్రెస్ మెడికల్ అధ్యక్షుడు గుగులోతు వీరన్న, ఖమ్మం జిల్లా కాంగ్రెస్ మెడికల్ అండ్ హెల్త్ అధ్యక్షుడు డాక్టర్ మురళీకృష్ణ, పలువురు ప్రభుత్వ అధికారులు, గంగవరపు కిషన్, తోటకూర శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

# సన్‌రైజర్స్‌కు ఆదిలోనే షాక్..

## ఒకే ఓవర్లో అభిషేక్ శర్మ(7), ట్రావిస్ హెడ్ ఔట్



ఐపిఎల్ పంతొమ్మిదో సీజన్ మొదటి మ్యాచ్‌లో సన్‌రైజర్స్ హైదరాబాద్ ఆదిలోనే కష్టాల్లో పడింది. ఆర్‌సిబి పేసర్ జాకబ్ డఫ్ఫీ(3–17) విజృంభణతో స్వల్ప వ్యవధిలో మూడు బిగ్ వికెట్లు కోల్పోయింది. విధ్వంసక ఓపెనర్లు అభిషేక్ శర్మ(7), ట్రావిస్ హెడ్(11)లు ఒకే ఓవర్లో పెవిలియన్ చేర్చిన డఫ్ఫీ ఆ తర్వాతి ఓవర్లో నితీశ్ రెడ్డి(1)ని బోల్తా కొట్టించి ఆరెంజ్ ఆర్మీని ఒత్తిడిలో పడేశాడు. ఆరంభ పోరులో టాస్ ఓడిన సన్‌రైజర్స్ హైదరాబాద్‌కు వరుస షాక్‌లు తగులుతున్నాయి. తొలి ఓవర్లో సిక్సర్‌తో అలరించిన అభిషేక్ శర్మ(7) దూకుడు పెంచే క్రమంలో టైమింగ్ కుదరక జాకబ్ డఫ్ఫీ(317) ఓవర్లో వెనుదిరిగాడు. చివరి బంతికి సిక్సర్ కొట్టే ప్రయత్నంలో ట్రావిస్ హెడ్11) బౌండరీ లైన్ వద్ద సాల్ట్ చేతికి చిక్కాడు. దాంతో.. రెండు కీలక వికెట్లు కోల్పోయింది. అనంతరం కెప్టెన్ ఇషాన్ కిషన్(23 నాటౌట్) జతగా క్రీజులో నిలుస్తాడ నుకున్న నితీశ్ రెడ్డి(1) సైతం తేలికగావికెట్ ఇచ్చేశాడు. డఫ్ఫీ బౌలింగ్‌లోనే పేలవ షాట్ ఆడి చేతికి చిక్కాడు. మూడు వికెట్లు పడిన వేళ అభినందన్ సింగ్ ఓవర్లో రెచ్చిపోయిన ఇషాన్ వరుసగా సిక్స్, ఫోర్, సిక్స్ బాదడంతో స్కోర్ 50కి చేరువైంది. పవర్ ప్లేలో 3 వికెట్ల నష్టానికి ఎస్ఆర్‌హెచ్ 49 పరుగులు చేసింది.

# ఐపిఎల్‌కు ధోనీ దూరం

## శాంసన్‌కు భలే ఛాన్స్ దొరికిందిగా!



పంతొమ్మిదో సీజన్ ఆరంభానికి ముందే చెన్నై సూపర్ కింగ్స్‌కు పెద్ద షాక్. తొలి ఎడిషన్ నుంచి సిఎస్‌కెకు ఆడుతున్న మహేంద్ర సింగ్ ధోనీ మెగా టోర్నీకి దూ రం కానున్నాడు. గాయం నుంచి పూర్తిగా కోలుకోని ధోనీ తొలి రెండు వారాలు ఐపిఎల్‌కు అందుబాటులో ఉండడం లేదు. తమ వెటరన్ ఆటగాడు మెగా ఈవెంట్‌కు కొన్ని రోజులు దూరం అవుతున్నాడని శనివారం సిఎస్‌కె యాజమాన్యం వెల్లడించింది. ధోనీ లేకుండా చెన్నై జట్టు ఐపిఎల్ ఆడనుండడం ఇదే మొదటి సారి కానుంది. అంతర్జాతీయ క్రికెట్‌కు వీడ్కోలు పలికినప్పటి నుంచి పూర్తిగా ఐపిఎల్‌కే అంకితమైన మహేంద్ర సింగ్ ధోనీ తొలిసారి టోర్నీకి దూరమవుతున్నాడు. ఆరంభ సీజన్ నుంచి బ్రేక్ లేకుండా ఆడుతున్న తాలా ఈసారి కొన్ని మ్యాచ్‌లకు అందుబాటులో ఉండడు. గత సీజన్ ఫైనల్లో మోకాలి గాయంతోనే ఆడిన ధోనీ అనంతరం సర్జరీ చేయించుకున్నాడు. ఈ గాయం నుంచి కోలుకున్నా.. కండరాల గాయం ధోనీని వెంటాడింది. దాంతో, అతడికి విశ్రాంతి అవసరమని వైద్యులు సూచించారు. అందుకే రెండు వారాలు సిఎస్‌కె మ్యాచ్‌లకు ధోనీ దూరం కానున్నాడు. పంతొమ్మిదో ఎడిషన్ తొలి మ్యాచ్‌లో మార్చి 30న రాజస్థాన్ రాయల్స్‌తో సిఎస్‌కె తలపడనుంది. రికార్డు స్థాయిలో 278 మ్యాచ్‌లు ఆడిన ధోనీ గైర్హాజరీలో సంజూ శాంసన్‌కు వికెట్ కీపింగ్ అప్పగించే అవకాశముంది. ఇటీవలే ట్రేడ్ పద్ధతిన సిఎస్‌కె గూటికి చేరిన శాంసన్ ఓపెనర్‌గా, వికెట్ కీపర్‌గా తన ముద్ర వేసేందుకు ఇంతకుమించిన సమయం ఉండదేమో.

# తొక్కిసలాట మృతులకు నివాళి

## స్మారకార్థం 11 సీట్లు కేటాయింపు



ఐపిఎల్ పంతొమ్మిదో సీజన్ ఆరంభ పోరులో చిన్నస్వామి తొక్కిసలాట మృతులకు నివాళులు అర్పించారు. టాస్ అనంతరం ఆర్‌సిబి, సన్‌రైజర్స్ హైదరాబాద్ ఆటగాళ్లతో పాటు స్టాండ్స్‌లోని అభిమానులందరూ లేచి నిల్చొని మౌనం పాటించారు. ఇదివరకూ చెప్పినట్టుగానే ఆ పదకొండు మంది జ్ఞాపకార్థం కర్నాటక క్రికెట్ సంఘం ప్రత్యేకంగా 11 సీట్లను కేటాయించింది. జాతీయ గీతం ఆలాపన అనంతరం మ్యాచ్ ప్రారంభమైం ది. ఐపిఎల్ ఫ్రాంచైజీ ఆర్‌సిబి, కర్నాటక క్రికెట్ సంఘం మాట నిలబెట్టుకున్నాయి. గత ఏడాది జూన్ 4వ తేదీన మరణించిన 11 మంది జ్ఞాపకార్థం చిన్నస్వామి స్టేడియంలో స్మారకం ఏర్పాటు చేయడంతో పాటు పదకొండు ప్రత్యేక సీట్లను కేటాయించాయి. ఇదివరకే మృతుల కుటుంబాలకు రూ.10 లక్షల ఆర్థిక సాయం ప్రకటించిన ఆర్‌సిబి.. ఇప్పుడు వారిని ప్రత్యేకంగా స్మరించుకుంది.

ఆరంభ పోరుకు ముందు బిసిసిఐ చైర్మన్ మిథున్ మన్హాస్, కెఎస్‌సిఎ అధ్యక్షుడు వెంకటేశ్ ప్రసాద్, ఆర్‌సి – సన్‌రైజర్స్ ఆటగాళ్లు, ప్రేక్షకులు తొక్కిసలాట మృతులకు నివాళులు అర్పించారు. పది నెలల అనంతరం చిన్నస్వామిలో తొలి బంతి పడింది.

### 350కి పైగా సీసీ కెమెరాలు

గత సీజన్ చేదు జ్ఞాపకాల నేపథ్యంలో కమిషన్ సూచన మేరకు స్టేడియంలో నిర్మాణ పరమైన మార్పులు చేవారు. అభిమానుల భద్రతకు భరోసాగా మైదానంలో 350కి పైగా సీసీ కెమెరాలను ఏర్పాటు చేసి, నిరంతరం పర్యవేక్షిస్తున్నారు.

## ఈ వారం స్టాక్ మార్కెట్లు

**బాంబే స్టాక్ ఎక్స్ఛేంజ్ (బిఎస్ఇ/ క్లోజింగ్):** సెన్సెక్స్ 73,583.22 పాయింట్లు (ఈ వారం ప్రారంభంలో 74,532.96 పాయింట్లు. నష్టం 949.74 పాయింట్లు).

**జాతీయ స్టాక్ ఎక్స్ఛేంజ్ (ఎన్ఎస్ఇ/ క్లోజింగ్):** నిఫ్టీ 22,819.60 పాయింట్లు (ఈ వారం ప్రారంభంలో 23,114.50 పాయింట్లు. నష్టం 294.90 పాయింట్లు).

## బులియన్ మార్కెట్

10 గ్రాముల ధర. రూపాయలలో

24 క్యారెట్లు : 1,48,090
22 క్యారెట్లు : 1,35,750
18 క్యారెట్లు : 1,11,090






# కనిష్టానికి రూపాయి విలువ

భారత రూపాయి మారకపు విలువ ఇటీవల చరిత్రలోనే కనిష్ట స్థాయికి పడిపోవడం ప్రస్తుత ఆర్థిక పరిస్థితులపై స్పష్టమైన సంకేతాలను ఇస్తోంది. డాలర్‌తో పోలిస్తే రూపాయి 94.85 వద్ద ముగియడం అనేది సాధారణ మార్పు కాదు. ఇది బహుళ కారణాల కలయికతో ఏర్పడిన ఒత్తిడి ఫలితం. మొదటగా, అంతర్జాతీయ మార్కెట్లో ముడి చమురు ధరలు పెరగడం ప్రధాన కారణం. భారత్ చమురు దిగుమతులపై ఎక్కువగా ఆధారపడే దేశం కాబట్టి, ధరలు పెరిగితే దిగుమతి ఖర్చు భారీగా పెరుగుతుంది. ఇది డాలర్‌కు డిమాండ్‌ను పెంచుతుంది, ఎందుకంటే చమురు కొనుగోలు డాలర్లలోనే జరుగుతుంది. ఈ పరిస్థితిలో రూపాయి విలువ సహజంగానే తగ్గుతుంది. ప్రస్తుతం బ్రెంట్ క్రూడ్ ఆయిల్ ధర బ్యారెల్‌కు 110 డాలర్లకు పైగా ఉండటం ఈ ఒత్తిడిని మరింత పెంచుతోంది. అదే విధంగా, విదేశీ పెట్టుబడిదారులు భారత మార్కెట్ల నుంచి డబ్బు వెనక్కి తీసుకోవడం కూడా రూపాయి విలువ పతనానికి కారణమవుతున్నది. వారు తమ పెట్టుబడులను విక్రయించి డాలర్లుగా మార్చుకోవడం వల్ల రూపాయి మీద అదనపు ఒత్తిడి ఏర్పడుతోంది.



ఇది స్టాక్ మార్కెట్ల పతనంతో కూడి కనిపిస్తోంది. బిఎస్ఇ సెన్సెక్, ఎన్ఎస్ఇ నిఫ్టీ గణనీయంగా పడిపోవడం దీనికి ఉదాహరణ. గ్లోబల్ అనిశ్చితి రూపాయి విలువను దెబ్బతీస్తున్నది. ప్రధానంగా, మధ్యప్రాచ్య ఉద్రిక్తతల నేపథ్యంలో డాలర్‌ను 'సేఫ్ హేవన్' కరెన్సీగా చూస్తున్నారు. అందువల్ల ప్రపంచవ్యాప్తంగా డాలర్ బలపడుతున్నది. ఈ పరిస్థితుల్లో రూపాయి వంటి కరెన్సీలు బలహీనపడతాయి. దీనిని యుఎస్ డార్ ఇండెక్స్ పెరుగుదల ద్వారా కూడా గమనించవచ్చు. అయితే, రూపాయి పడిపోతే ఆర్థిక వ్యవస్థ కుప్పకూలుతుందని మొత్తంగా, రూపాయి పతనానికి చమురు ధరలు, విదేశీ పెట్టుబడులు, గ్లోబల్ రాజకీయ పరిస్థితులు వంటి అనేకానేక కారణాలు ఉన్నాయి. ఈ పరిస్థితి తాత్కాలికమా లేక దీర్ఘకాలికమా అనేది ప్రధానంగా చమురు ధరల మార్పు మరియు అంతర్జాతీయ స్థిరత్వంపై ఆధారపడి ఉంటుంది.

# ప్రపంచ మార్కెట్లలో తీవ్ర అస్థిరత

## హెచ్చరించిన రాబర్ట్ కియోసాకి



ప్రపంచ ఆర్థిక వ్యవస్థపై ఆందోళనలు పెరుగుతున్న వేళ, ప్రముఖ ఆర్థిక రచయిత రాబర్ట్ కియోసాకి తీవ్ర హెచ్చరికలు చేశారు. ఆయన అభిప్రాయం ప్రకారం, 2026లో ప్రపంచ మార్కెట్లు తీవ్రమైన అస్థిరతను ఎదుర్కొనే అవకాశం ఉంది. భౌగోళిక రాజకీయ ఉద్రిక్తతలు, ప్రత్యేకించి మధ్యప్రాచ్యంలో పెరుగుతున్న సంఘర్షణలు, ద్రవ్యోల్బణ ఒత్తిడి, వడ్డీ రేట్ల మార్పులు వంటి అంశాలు కలిసి ఒక పెద్ద మార్కెట్ పతనానికి దారితీయవచ్చు. ఈ పరిస్థితిలో ప్రధానంగా నష్టపోయేది సామాన్యులే. ధరల పెరుగుదల, ఉద్యోగ అవకాశాల తగ్గుదల, అప్పుల భారంతో సాధారణ కుటుంబాలు ఆర్థికంగా తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొనే ప్రమాదం ఉంది. అయితే, ఇదే సమయంలో ముందుచూపుతో ఉన్న పెట్టుబడిదారులకు ఇది అవకాశంగా మారవచ్చని కియోసాకి అభిప్రాయం. కాగా, ఆయన విశ్లేషణలో కొన్ని వివాదాస్పద అంశాలు కూడా ఉన్నాయన్న విమర్శలు వస్తున్నాయి.. ఉదాహరణకు, నాస్ట్రడామస్, ఎడ్గర్ కేయిస్ వంటి భవిష్యవాణులను ఆయన ప్రస్తావించడం శాస్త్రీయ ఆర్థిక విశ్లేషణలో బలమైన ఆధారంగా పరిగణించడానికి వీల్లేదు. అయితే, అసలు సమస్యలు మాత్రం స్పష్టంగా కనిపిస్తున్నాయి. ప్రపంచవ్యాప్తంగా పెరిగిన అప్పులు, అధికంగా నోట్లు ముద్రించడం, మార్కెట్లలో అతి ధోరణులు, నిత్యం మారుతున్న అంచనాలు వంటి అంశాలు ఆర్థిక వ్యవస్థను తీవ్రంగా దెబ్బతీస్తున్నాయి. ఈ నేపథ్యంలో, సంప్రదాయ పెట్టుబడులపై (స్టాక్స్, బాండ్లు, నగదు) పూర్తిగా ఆధారపడడం ప్రమాదకరమని కియోసాకి అంటున్నారు. దాని బదులుగా, ప్రభుత్వాలు సులభంగా నియంత్రించలేని వాస్తవ ఆస్తులు, బంగారం, వెండి, రియల్ ఎస్టేట్, చమురు, ఆహార ఉత్పత్తి వంటి రంగాలపై దృష్టి పెట్టాలని సూచిస్తున్నారు. అలాగే వికేంద్రీకృత ఆర్థిక వ్యవస్థలో భాగమైన క్రిప్టో కరెన్సీలు కూడా సంక్షోభ సమయంలో ఒక రక్షణాత్మక పాత్ర పోషించవచ్చని ఆయన అభిప్రాయం. కాగా, ఈ అభిప్రయాలను విమర్శాత్మకంగా పరిశీలించడం అవసరం. అన్ని మార్కెట్ పతనాలు ఒకే విధంగా ఉండవు. ప్రభుత్వ జోక్యం, కేంద్ర బ్యాంకుల విధానాలు, గ్లోబల్ సమన్వయం వంటి అంశాలు పరిస్థితిని ప్రభావితం చేస్తాయి. కాబట్టి, పతనం ఖాయం అన్న భావన కంటే అస్థిరతకు సిద్ధం కావడం అనే దృక్కోణం మరింత యథార్థవాదంగా ఉంటుంది. చివరగా, మార్కెట్ పడిపోతుందా లేదా అన్నది కంటే, అది పడిపోయినప్పుడు వ్యక్తిగతంగా ఎంత సిద్ధంగా ఉన్నామన్నదే కీలకమని నిపుణులు అంటున్నారు.

'బిజినెస్' శీర్షికన ఇస్తున్న సమాచారం కేవలం పాఠకుల అవగాహన కోసం మాత్రమే. పెట్టుబడులు లేదా లాభనష్టాలపై 'ప్రజాపక్షం' ఎలాంటి బాధ్యత వహించదు. నిపుణులను సంప్రదించి, మార్కెట్ తీరును సమీక్షించుకొని, వ్యక్తిగత బాధ్యతపై నిర్ణయాలు తీసుకోవాలని సూచిస్తున్నాం.




# సిపిఐలోకి మహిళల చేరిక

**ప్రజాపక్షం/మంచిర్యాల :** మంచిర్యాల పట్టణానికి చెందిన పలువురు మహి ళలు సిపిఐలో చేరారు. శనివారం మంచిర్యాల జిల్లా పార్టీ కార్యాలయంలో సిపిఐ జిల్లా సమితి సభ్యులు దేవి పోచన్న ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో వారికి జిల్లా కార్యదర్శి రామడుగు లక్ష్మ ణ్ పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించారు. మంచిర్యాల పట్టణానికి చెందిన పలువురు మహిళలు పార్టీ సిద్ధాంతాలకు ఆకర్షితులై సిపిఐలో చేరడం జరిగిందని ఈ సందర్భంగా నాయకులు తెలిపారు. మహిళా సమస్యల పరిష్కారం కోసం సిపిఐ నిరంతరం పోరాడుతుందని పేర్కొన్నారు. పార్టీలో చేరిన వారిలో మాసు రజిని, భోగే మధు, భుట్టి రజిత, కొత్తపల్లి లక్ష్మి, కోటమ్మ, మల్కాల పోశమ్మ ఉన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఐ పట్టణ కార్యదర్శి ఖలీందర్ ఆలీ ఖాన్, ఏఐటియుసి జిల్లా కార్యదర్శి మేకల దాస్, డిహెచ్ పిఎస్ జిల్లా ఉపాధ్యక్షులు మారపల్లి రవి, యోసేప్ పాల్గొన్నారు.

# యాదగిరిగుట్ట దేవస్థానం టెండర్ల అవకతవకలపై విచారించాలి

## సిపిఐ జిల్లా కార్యదర్శి యానాల దామోదర్ రెడ్డి డిమాండ్

**ప్రజాపక్షం/యాదగిరిగుట్ట :** యాదగిరిగుట్ట శ్రీ లక్ష్మీ నరసింహస్వామి దేవస్థానంలో గత కొన్ని నెలలుగా జరుగుతున్న టెండర్లలో భారీ అవకతవకలు చోటు చేసుకున్నాయని, వాటిని వెంటనే రద్దు చేసి పారదర్శకంగా కొత్త టెండర్లు నిర్వహించాలని సిపిఐ జిల్లా కార్యదర్శి యానాల దామోదర్ రెడ్డి డిమాండ్ చేశారు. శనివారం గుండ్లపల్లి గ్రామంలో ఆరె పుష్ప అధ్యక్షతన జరిగిన భారత కమ్యూనిస్టు పార్టీ (సిపిఐ) యాదగిరిగుట్ట మండల కౌన్సిల్ సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. గత నాలుగు ఐదు నెలలుగా దేవస్థానంలో నిర్వహిస్తున్న టెండర్లలో నిబంధనలకు విరుద్ధంగా తక్కువ రేట్లకు కేటాయింపులు జరుగుతున్నాయని దామోదర్ రెడ్డి ఆరోపించారు. దీనివల్ల దేవాలయ ఆదాయానికి భారీగా గండిపడుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. నాలుగు నెలల క్రితం గుండం వద్ద రెండు కొబ్బరికాయల దుకాణాలకు నిర్వహించిన టెండర్లు, గతంలో కంటే లక్షల రూపాయల తక్కువకు ఇచ్చారని, దీని వెనుక ఉన్న అంతర్యమేమిటో అధికారులు వెల్లడించాలని కోరారు. ఒక కొబ్బరికాయ రూ. 30కి అమ్మాల్సి ఉండగా, ప్రస్తుతం భక్తుల నుంచి రూ.100కు పైగా వసూలు చేస్తూ దోచుకుంటున్నారని మండిపడ్డారు. వారం రోజుల క్రితం జరిగిన కూల్డ్రింక్స్ టెండర్ కూడా గత రేటు కంటే తక్కువకే కట్టబెట్టడం దేవాలయానికి నష్టం కలిగించే చర్య అని విమర్శించారు.ప్రజా సమస్యలపై రాజీలేని పోరాటాలు చేసేందుకు ఏప్రిల్ 1వ తేదీ నుండి ఇంటింటికి సిపిఐ నినాదంతో విరాళాల సేకరణ చేపట్టనున్నట్లు ఆయన ప్రకటించారు. ప్రజా ఉద్యమాలకు ప్రజలు స్వచ్ఛందంగా విరాళాలు ఇచ్చి సహకరించాలని కోరారు. ఈ సమావేశంలో సిపిఐ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు గోదా శ్రీరాములు, జిల్లా కార్యవర్గ సభ్యులు కళ్లెం కృష్ణ, బండి జంగమ్మ, పేరబోయిన మహేందర్, మండల కార్యదర్శి కల్లేపల్లి మహేందర్, కౌన్సిలర్ బబ్బురి శ్రీధర్, మండల నేతలు పేరబోయిన పెంటయ్య, బంగారి, మీసాల దాసు, ముకర్ల పెంటయ్య తదితరులు పాల్గొన్నారు.



# కాంగ్రెస్ ప్రభుత్వం తక్షణమే ఫార్మాసిటీ జిఒ రద్దు చేయాలి

**● రైతులు సాగు చేసుకుంటన్న భూములను ఆన్‌లైన్‌లో నమోదు చేయాలి ● తెలంగాణ రాష్ట్ర రైతుసంఘం ప్రధాన కార్యదర్శి పశ్యపద్మ డిమాండ్ ● గ్రీన్ ఫీల్డ్ రోడ్డు నిర్మాణ బాధితులకు మద్దతూగా దీక్ష**



**ప్రజాపక్షం/యాచారం :** కాంగ్రెస్ ప్రభుత్వం తక్షణమే ఫార్మాసిటీ జిఒను రద్దు చేసి రైతులు సాగు చేసుకుంటున్న భూములను ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి పశ్యపద్మ డిమాండ్ చేశారు.శనివారం రంగారెడ్డి జిల్లా యాచారం మండలం కుర్మిద్ద అనుబంధ గ్రామమైన మర్లకుంట తండాలో గ్రీన్ ఫీల్డ్ రోడ్డు నిర్మాణ భా దితులకు అండగా నిలిచారు. వారికి మద్దతుగా దీక్షలో కూర్చున్నారు. వారి సమస్యలను రైతులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం మోస పూరిత వాగ్దానాలతో రైతులను మభ్యపెట్టి కారుచౌకగా రైతుల భూములు గుంజుకుందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఫార్మాసిటీ కోసం చేసిన భూసేకరణ చెల్లదని రాష్ట్ర హైకోర్టు మధ్యంతర తీర్పు ఇచ్చిన ప్రభుత్వం రైతుల పేర్లను ఎందుకు ఆన్‌లైన్‌లో నమోదు చేయలేదని ఆమె ప్రశ్నించారు. రైతుల పేర్లను నమోదు చేయకుండా రికార్డుల్లోంచి తొలగించి రాష్ట్ర ఇండస్ట్రియల్ ఇన్ఫ్రాస్ట్రక్చర్‌లో చేర్చడం ఎంతవరకు సమంజసమన్నారు.రైతుల భూములు నిషేధిత జాబితా నుంచి తొలగించి వారికి పంట ఋణాలు, ప్రభుత్వం ఇచ్చే సంక్షేమ పథకాలు, రైతు బరోసా, రైతు బీమా ఇవ్వాలని డిమాండ్ చేశారు. రైతులకు యూరియా పొందడానికి పండించిన పంటలను అమ్ముకోవడానికి అవకాశం కల్పించాలని కోరారు. ఫార్మాసిటీ నిర్మాణం కోసం కేంద్ర ప్రభుత్వం ఇచ్చి న పర్యావరణ అనుమతులను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. 44కిలో మీటర్ల గ్రీన్ ఫీల్డ్‌రోడ్డు రహదారి నిర్మాణం ఫ్యూచర్ సిటీ కోసమంటు గిరిజన రైతులు భూములు తీసుకోవడం దారుణమన్నారు. 12 రోజుల నుండి గిరిజన రైతులు రిలే నిరహర దీక్షలు చేస్తున్న ప్రభుత్వం పట్టి పట్టనట్లుగా వ్యహరిస్తుందని ఆగ్రహం వ్యక్తం చేశారు. శ్రీశైలం హైవే, నాగార్జున సాగర్ హైవే అతి సమీపంలో ఉన్నప్పుడు గ్రీన్ పీల్డ్ రహదారి నిర్మాణం ఎందుకని అమే ప్రశ్నించారు.2013 భూసేకరణ చట్టాని తెచ్చింది కేంద్రంలో అప్పుడున్న కాంగ్రెస్ పార్టీ కాగా ఇప్పుడు తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ 2017 బూసేకరణ చట్టాన్ని కోనసాగిస్తుందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రభుత్వం తక్షణమే తమ నిర్ణయాన్ని మార్చుకోడాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో పెద్ద ఎత్తున అందోళన చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం ఉపాధ్యక్షులు ఎం. ప్రభులింగం,రంగారెడ్డి జిలా రైతు సంఘం కె.మాధవరెడ్డి రైతులు తదితరులు పాల్గోన్నారు.




# యుద్ధ ప్రభావంతో పెరుగుతున్న ధరలు

**● వ్యవసాయ రంగం పట్ల నిర్లక్ష్య ధోరణి ● సమస్యల పరిష్కారానికి ప్రజా పోరాటాలు : బాగం**

**ప్రజాపక్షం/ ఖమ్మం :** పశ్చిమాసియా యుద్ధ ప్రభావం భారతదేశంపై తీవ్ర ప్రభావం చూపుతుందని, నిత్యావసర వస్తువుల ధరలు పెరుగుతున్నాయని సిపిఐ జాతీయ సమితి సభ్యులు బాగం హేమంతరావు తెలిపారు. కార్పొరేట్, ఆయిల్ కంపెనీల కోసమే మోడీ ఆయిల్ ధరలు తగ్గించారని అది సామాన్యులకు ఉపయోగపడదన్నారు. సిపిఐ జిల్లా కార్యవర్గ సమావేశం శనివారం స్థానిక గిరిప్రసాద్ భవన్‌లో జాగర్లమూడి రంజిత్ కుమార్ అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన హేమంతరావు మాట్లాడుతూ యుద్ధ నేపథ్యంలో ముందస్తు చర్యలు చేపట్టడంలో మోడీ ప్రభుత్వం విఫలమైందన్నారు. ట్రంప్ ముందు నోరు మెదపలేని స్థితిలో మోడీ ఉన్నారని ఆయన చెప్పింది చేయటమే ప్రధానిగా మోడి పనిగా మారిందన్నారు. ఐదు రాష్ట్రాల ఎన్నికల తర్వాత దేశంలో అన్ని వస్తువుల ధరలు విపరితంగా పెరగనున్నాయని బిజెపి గెలుపు కోసం ధరల పెరుగుదలను ప్రస్తుతానికి నిలువరించారన్నారు. మోడి, ట్రంప్‌ల మధ్య కుదిరిన వ్యవసాయ రంగానికి సంబంధించిన ఒప్పందాలు వ్యవసాయ రంగంపై తీవ్ర ప్రభావాన్ని చూపనున్నాయని హేమంతరావు తెలిపారు. విదేశీ దిగుమతులపై సుంకాన్ని రద్దు చేయటం, ఎగుమతులపై 2.5 నుండి 36 శాతానికి పెంచటం వలనా దేశీయ ఉత్పత్తులకు గిట్టుబాటు ధరలు లభ్యం కావటం లేదు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వ్యవసాయ రంగం పట్ల తీవ్ర వివక్షను ప్రదర్శిస్తున్నాయని హేమంతరావు ఆరోపించారు. భరోసా విషయంలో రాష్ట్ర ప్రభుత్వ వైఖరి సరైంది కాదన్నారు. ఇప్పటికీ మూడు మాసాలు గడిచిందని ఇప్పుడు కూడా ఒక ఎకరానికి మాత్రమే భరోసా జమ చేయడం ద్వారా రైతులు నానా ఇబ్బందులు పడుతున్నారన్నారు. కేంద్ర ప్రభుత్వం కార్పొరేట్ల సేవలో ఉంటే రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయటంలో తీవ్ర జాప్యం చేస్తుందన్నారు. పార్టీ సంస్థాగత నిర్మాణంపై దృష్టి సారించాలని హేమంతరా వు సూచించారు. పార్టీ నిర్మాణ కార్యక్రమాల్లో భాగంగా పార్టీ సభ్యత్వం, శాఖల నిర్మాణంపై దృష్టి సారించాలని సూచించారు. మొక్కజొన్న సహా వ్యవసాయోత్పత్తులకు గిట్టుబాటు ధరల కోసం, విబి జి రామ్ జి పథకాన్ని ఉపసంహరణ, నాలుగు లేబర్ కోడ్‌ల రద్దు తదితర సమస్యలకు సంబంధించి సమరశీల పోరాటాలకు సిద్ధం కావాలని హేమంతరావు పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో సిపిఐ జిల్లా కార్యదర్శి దండి సురేష్, రాష్ట్ర క్రమశిక్షణ సంఘం చైర్మన్ మహ్మద్ మౌలానా, జిల్లా సహాయ కార్యదర్శి జితేందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# త్యాగాల, పోరాటాల పార్టీకి చేయూతనివ్వండి

## సిపిఐ వరంగల్ జిల్లా కార్యదర్శి షేక్ బాష్ మియా




**ప్రజాపక్షం/వరంగల్ :** త్యాగాల పోరాటాల పార్టీకి చేయూతనివ్వాలని, ఆర్థికంగా సహకరించి ఆదరించాలని సిపిఐ వరంగల్ జిల్లా కార్యదర్శి షేక్ బాష్ మియా కొరారు. శివనగర్ తమ్మెర భవన్‌లో సిపిఐ వరంగల్ మండల సమితి సమావేశం మస్కు సుధీర్ అధ్యక్షతన శనివారం నిర్వహించారు. ఈ సమావేశానికి సిపిఐ వరంగల్ జిల్లా కార్యదర్శి షేక్ బాష్‌మియా ముఖ్య అతిథులుగా హజరై మాట్లాడుతూ భారత గడ్డపై వందేళ్ళు పూర్తి చేసుకొని దేశాన్ని, మతోన్మాద, కార్పొరేట్ కభంద హస్తాల నుండి విముక్తి చేసి సమసమాజ స్థాపనకై రాజీలేని పోరాటాలు చేస్తున్న ఏకైక పార్టీ భారత కమ్యూనిస్టు పార్టీ (సిపిఐ)అన్నారు. నేడు దేశంలో నెలకొన్న పరిస్థితులలో కమ్యూనిస్టులు మరింత బలపడాలని వామపక్ష, ప్రజాతం త్ర, పురోగామి శక్తులు కోరుకుటున్నాయన్నారు. ఈ నేపథ్యంలో తెలంగాణలో ఇంటింటికి సిపిఐలో భాగంగా పార్టీ కార్యకర్తలు మీ సహాయం కోరుతూ మీ వద్దకు వస్తున్నామని, కావున అన్ని వర్గాల ప్రజలు తమ వంతుగా విరాళాలు అందించి పోరాటాల పార్టీకి చేయూతనివ్వాలన్నారు. ఈ సమావేశంలో సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు మే కల రవి మాట్లాడుతూ స్వాతంత్రం వచ్చి దశాబ్దాలు గడుస్తున్నా పేదలు, బడుగు బలహీన వర్గాలు నివసించేందుకు స్థలం లేక, పక్కా ఇల్లు లేక, దుర్భర జీవితం గడుపుతున్నారన్నారు. గత పది సంవత్సరాలుగా పేదలకు పంచడానికి కట్టిన డబుల్ బెడ్ రూం ఇండ్లను త్వరగా పేద ప్రజలకు పెంచాలని లేదంటే సిపిఐ ఆధ్వర్యంలో ఆ ఇండ్లను అర్హులైన పేద ప్రజలకు పంచుతామని హెచ్చరించారు. ఈ సమావేశంలో సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శులు పనాస ప్రసాద్, దండు లక్ష్మ ణ్, వరంగల్ మండల కార్యదర్శి గుండె బద్రి, జిల్లా కార్యవర్గ సభ్యులు రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

# సామ్రాజ్యవాద ఆధిపత్యం ప్రపంచ శాంతికి విఘాతం

## సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు బాల నరసింహ్మా

### గ్యాస్ పెట్రోల్ డీజిల్ కొరతతో సామాన్య ప్రజల అవస్థలు : సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్ఎండి ఫయాజ్



**ప్రజాపక్షం/నాగర్ కర్నూల్ :** సామ్రాజ్యవాద ఆధిపత్యం ప్రపంచ శాంతికి విఘాతమని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు ఎం.బాల నరసింహ అన్నారు. శనివారం నాగర్ కర్నూల్ జిల్లా కేంద్రంలోని సిపిఐ జిల్లా పార్టీ ఆఫీస్ లక్ష్మ ణ్ చారి భవన్‌లో జిల్లా సమితి సమావేశం తన్నీరు నరసింహ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు బాల నరసింహ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అమెరికా ఇజ్రాయెల్ దేశాల దూకుడు వైఖరి వల్ల ప్రపంచం నేడు తీవ్ర అల్లకలోలంలోకి నెట్టివేయబడిందని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. ఇరాన్‌పై జరుగుతున్న దాడులు కేవలం సైనిక సంఘర్షణ మాత్రమే కాదని ఇది ఒక ఆదిపత్య అహంకారంతో కూడిన మారణహోమం అని చమురు సమాజ వనరుల కోసం అమెరికా అనుసరిస్తున్న సామ్రాజ్యవాద ధోరణిని ఆయన తీవ్రంగా తప్పు బట్టారు గతంలో ఇరాక్, వెనిజులా దేశాలను ఇబ్బంది పెట్టిందని. ప్రపంచ దేశాలు ఖండించకపోతే అది మన దాక వచ్చిన ఆశ్చర్య పోవాలిసన అవసరం లేదని ఆయన తెలిపారు. విశ్వ గురువుగా తనంతట తానే చెప్పుకునే మన దేశ ప్రధాని ఇప్పటి వరకు కూడా ఈ దాడిపై నోరు మెదపకుండా ఉండటంతో పాటు కనీసం ఖండించకపోవడం మంచి పద్ధతి కాదని మనం ఎవరితో చమురును కొనుగోలు చేయాలో అమెరికా నిర్దేశించడం ఏంటని మన దేశానికి ప్రధాన మోదీయా లేక ట్రంప్‌అనేది స్పష్టం చేయాలని ఆయన డిమాండ్ చేశారు. సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్ఎండి ఫయాజ్ మాట్లాడుతూ ప్రభుత్వ అధినేతలు దేశంలో గ్యాస్ పెట్రోల్ డీజిల్ కొరత లేదని చెప్తున్నారు కానీ వాస్తవ పరిస్థితులను చూస్తే ఎక్కడ అలాంటి పరిస్థితి కనబడటం లేదన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు కేశవులు గౌడ్, జిల్లా కార్యవర్గ సభ్యులు ఈర్ల చంద్రమోళి తదితరులు పాల్గొన్నారు.

# సంక్షేమ హాస్టళ్ల నిర్వహణకు కట్టుదిట్టమైన చర్యలు

## కలెక్టర్ కోయ శ్రీ హర్ష



**ప్రజాపక్షం/పెద్దపల్లి:** సంక్షేమ హాస్టల్స్ నిర్వహణకు కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష తెలిపారు. శనివారం సమీకృత జిల్లా కలెక్టరేట్ లో హాస్టల్ వార్డెన్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సంక్షేమ హాస్టల్స్ వార్డెన్ తప్పనిసరిగా పిల్లలు భోజనం చేసే సమయంలో, సాయంత్రం స్టడీ అవర్స్‌లో అందుబాటులో ఉండాలని కలెక్టర్ ఆదేశించారు. హాస్టల్స్‌లోనే వార్డెన్ తప్పనిసరిగా ఉండాలని కలెక్టర్ స్పష్టం చేశారు. మార్చి నెలాఖరు లోపు హాస్టల్స్‌కు కేటాయించిన బడ్జెట్ పూర్తి స్థాయిలో వినియోగించుకోవాలని కలెక్టర్ తెలిపారు. 10వ తరగతి విద్యార్థులకు పరీక్షలు ముగిసే వరకు స్టడీ అవర్స్ జరగాలని కలెక్టర్ తెలిపారు. ఏప్రిల్ 23 చివరి తేదీ వరకు మిగిలిన తరగతి పిల్లలకు కూడా స్టడీ అవర్స్ ఏర్పాటు చేయాలని అన్నారు. ఈ సమావేశంలో జిల్లా బీసీ అభివృద్ధి అధికారి రంగారెడ్డి, ఏసీ సంక్షేమ శాఖ అధికారి రవీందర్, హాస్టల్ వార్డెన్లు, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

**సకాలంలో రోడ్డు నిర్మాణ పనులు పూర్తి చేయాలి**

ఆర్&బీ శాఖ ద్వారా చేపట్టిన అభివృద్ధి పనులు సకాలంలో పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష తెలిపారు. శనివారం సమీకృత జిల్లా కలెక్టరేట్ లో ఆర్&బీ శాఖ అభివృద్ధి పనులపై సంబంధిత అధికారులతో రివ్యూ నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పెద్దపల్లి కాటారం పరిధిలో జరుగుతున్న రొడ్డు విస్తరణ, బ్రిడ్జి నిర్మాణ పనులు వేగవంతం చేయాలని కలెక్టర్ సూచించారు. లింగాపూర్ రొడ్డు సంబంధించి విస్తరణ పనులు, మీడియన్, పైప లైన్ పనులు చేయాలని అన్నారు. రొడ్డు విస్తరణ పనులు సంబంధించి విద్యుత్ పోల్స్ తరలింపు పనులు పూర్తి చేయాలని కలెక్టర్ సంబంధిత అధికారులను ఆదేశించారు.పెద్దపల్లి లో నిర్మించిన ఆర్&బీ గెస్ట్ హౌస్ కాంపౌండ్ వాల్ నిర్మాణ పనులు పూర్తి చేశామని, సంబంధిత వివరాలను ఎంబీ రికార్డులలో నమోదు చేసి బిల్లులు సమర్పించాలని కలెక్టర్ తెలిపారు.మానేరు నది పై చేపట్టిన బ్రిడ్జి టెండర్ త్వరగా పూర్తి చేయాలని అన్నారు. రోడ్లు నిర్మించే సమయంలో త్రాగు నీటి పైప్ లైన్ పనులకు డ్యామేజి జరుగకుండా చూడాలని అన్నారు. మంథని గెస్ట్ హౌస్ నిర్మాణ పనులు త్వరగా పూర్తి చేయాలని కలెక్టర్ తెలిపారు. కునారం ఆర్ఓబి సంబంధించి అప్రోచ్ రోడ్డు నిర్మాణంలో భాగంగా భూ సేకరణ పూర్తి చేశామని, అక్కడ ఇండ్ల, ఇతర నిర్మాణాల కూల్చివేత పనులు పూర్తి చేయాలని కలెక్టర్ ఆదేశించారు. మంథని స్టేడియం నిర్మాణానికి సంబంధించి అవసరమైన అనుమతులు త్వరగా సాధించేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ సూచించారు. ఈ సమావేశంలో ఈఈ ఆర్ అండ్ బీ భావ్ సింగ్, డీఈలు, ఏఈలు సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# కోరుట్లలో గడి బురుజుల రక్షణకు అఖిలపక్షాలు పిలుపు

## సుమారు 3 ఎకరాలు 21 గుంటల భూమి అక్రమ కబ్జా



**ప్రజాపక్షం/కోరుట్ల :** గడి బురుజు గ్రామకంఠ స్థలంగా ఉన్న సుమారు 3 ఎకరాలు 21 గుంటల భూమి అక్రమ కబ్జాకు గురవుతుంది. కోరుట్ల పట్టణంలోని సి.ప్రభాకర్ స్మారక గ్రంథాలయ భవనంలో శనివారం అఖిలపక్ష సమావేశం నిర్వహించారు. కోరుట్ల పట్టణంలో ఉన్న పురాతన గడి బురుజుల పరివాహక భూముల పరిరక్షణపై ఈ సమావేశంలో విస్తృతంగా చర్చ జరిగింది. కొన్ని వర్గాలు మున్సిపల్ ద్వారా అనుమతులు పొందినట్లు సమాచారం ఉండటంతో,ప్రజల పక్షాన అఖిలపక్ష కమిటీ ఆ భూములను కబ్జా కాకుండా పట్టణ అభివృద్ధి కి ప్రజలకు ఉపయోగపడే విధంగా ప్రభుత్వం పరిశీలన చేయాలనీ ఈ సందర్భంగా, కోరుట్లలోని గడి బురుజు గ్రామకంఠ స్థలంగా ఉన్న సుమారు 3 ఎకరాలు 21 గుంటల భూమి అక్రమ కబ్జాకు గురవుతున్నదని అఖిలపక్ష నాయకులు ఆందోళన వ్యక్తం చేశారు. ఈ భూమిని రక్షించడం కోరుట్ల ప్రజల బాధ్యత అని స్పష్టం చేశారు. తదుపరి కార్యాచరణలో భాగంగా, మార్చి 30, 2026 సోమవారం గడి బురుజుల వద్ద అఖిలపక్షాల ఆధ్వర్యంలో భారీ స్థాయిలో జన సమీకరణ కార్యక్రమం నిర్వహించాలని నిర్ణయించారు. ఈ సందర్భంగా భూముల పరిరక్షణ కోసం ఉద్యమాన్ని మరింత బలపరచాలని, అవసరమైతే చట్టబద్ధంగా కోర్టులో కేసులు వేయాలని కూడా నిర్ణయించారు.ఈ కార్యక్రమానికి కోరుట్ల పట్టణ ప్రజలు, అన్ని రాజకీయ పార్టీల నాయకులు, కార్యకర్తలు, ప్రజాసంఘాల ప్రతినిధులు, మేధావులు పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని అఖిలపక్ష నాయకులు పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో సిపిఐ జిల్లా కార్యదర్శి చెన్న విశ్వనాథం, సిపిఎం పట్టణ కార్యదర్శి కె. శంకర్, న్యూ డెమోక్రసీ నేత చింత భూమేశ్వర్, ఎఐటియుసి జిల్లా అధ్యక్షుడు సుతారి రాములు, ప్రజాసంఘాల జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు పేట భాస్కర్, సమాజ్‌వాది పార్టీ రాష్ట్ర కార్యదర్శి ఎం.డి. ముజాహిద్, ఎంఐఎం పట్టణ అధ్యక్షుడు ఎం.డి. రఫీ, ధర్మ సమాజ్ పార్టీ నాయకుడు బొబ్బిలి కిషోర్, తెలుగుదేశం పార్టీ కోరుట్ల నియోజకవర్గం నాయకులు తుమ్మనపల్లి శ్రీనివాస్ బాబు, సీనియర్ నాయకుడు పోతని సత్యం, మస్తన్ సంఘ సభ్యుడు గుత్తుల గంగ నరసయ్య,తదితరులు పాల్గొన్నారు.

# వరుసగా గుప్తనిధుల తవ్వకాలు

## భయాందోళనలో గ్రామస్తులు



**ప్రజాపక్షం/శంకరపట్నం:** మండల పరిధిలోని మెలంగూర్ గ్రామంలోని ప్రజలకు గుప్తనిధుల తవ్వకాల గుబులు పటుకుంది.వరుస తవ్వకాలతో గ్రామస్తులు భయాందోళన వ్యక్తం చేస్తున్నారు.మొలంగూర్ గ్రామం అని చెప్పగానే మొదట ప్రతి ఒక్కరికి గుర్తుచ్చేది దూద్ బావి,మొలంగూర్ ఖిల్లా ఇది ఇప్పుడు గుప్తనిధుల బారిన పడింది.మొలంగూర్‌లో గుప్తనిధులు ఉన్నాయని ప్రచారం జోరుగా సాగుతుంది.గుప్తనిధులు ఈ ప్రాంతంతో ఉన్నాయని తెలియడంతో గుప్త నిధుల వేట కొనసాగుతుంది.వారంలో రెండు,మూడు సార్లు గుప్త నిధుల కోసం తవ్వకాలు జరగడం అందరిని విస్మయానికి గురిచేస్తుంది.ఈ నెల 24 మంగళవారం రోజున రాత్రి సమయంలో మొలంగూర్ ఖిల్లా దూద్ బావికి వెళ్లే దారిలో తవ్వకాలు చేసినట్లు ఆధారాలు బయటపడ్డాయి ఇదే విషయంపై గ్రామస్తులు కేశవపట్నం ఎస్ఐ కి ఫిర్యాదు చేశారు.ఎస్ఐ తవ్వకాలు జరిపిన ప్రాంతానికి వచ్చి వెళ్లారు.రెండు రోజుల వ్యవధిలోనే అదే ప్రాంత సమీపంలో మరోసారి తవ్వకాలు చేశారు.శుక్రవారం మొలంగూర్ గ్రామం నుండి కన్నాపూర్‌కు వేళ్లే దారిలో పోచమ్మ గుడి సమీపంలో ఖిల్లా పరిసరాల ప్రాంతాల్లో గుప్త నిధుల తవ్వకం చేపట్టినట్లు గ్రామస్తులు తెలిపారు.అలాగే పొన్నం కుంట సమీపంలో ఒక విగ్రహం వద్ద పసుపు కుంకుమ చల్లి గుప్త నిదుల కోసం తవ్వారు.మొలంగూర్ గ్రామంలో యువకులు ఓ ముఠాగా ఏర్పాడి వేరే గ్రామాలకు చెందిన కొంత మందిని తీసుకువచ్చి గ్రామంలో తవ్వకాలు జరిపారని గ్రామస్తులు గుసగుసలాడుతున్నారు.ఒకే వారంలో రెండు మూడు సార్లు వేరువేరు ప్రదేశాల్లో గుప్తనిధుల కోసం తవ్వకాలు జరిగాయి.ఇప్పటికైనా ఉన్నాతాధికారులు స్పందించి మొలంగూర్ గ్రామంలో పోలిసులను ఏర్పాటు చేయాలని గ్రామస్తులు విజ్ఞప్తి చేస్తున్నారు.

# ఓవైపు పది పరీక్షలు.. మరోవైపు ఇసుక ట్రాక్టర్ల వేగం

**ప్రజాపక్షం/ఎల్లారెడ్డిపేట:** మండల కేంద్రంలోని ఎల్లారెడ్డిపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జరిగే పది పరీక్షల నిర్వహణ కార్యక్రమం జరుగుతోంది. నిత్యం సెకండ్ బైపాస్ రద్దీగా ఉంటుంది. అదే సమయంలో నారాయణపూర్ నుండి ఇసుక రీచ్ నుండి ట్రాక్టర్లు నెమ్మదిగా వెళ్లకుండా వేగాన్ని పెంచడంపై స్థానికులు, తల్లిదండ్రులు భయం గుప్పెట్లో ఉంటున్నారు. అంతేకాకుండా అక్కడ రోడ్డు మరమ్మత్తులు జరుగుతున్నాయి. దీనిపై అధికారులు పట్టించుకోకుండా ఉండడం సర్వత్రా విమర్శలు నెలకొంటున్నాయి.

# రోడ్డు ప్రమాదంలో సాఫ్ట్‌వేర్ ఉద్యోగి మృతి



**ప్రజాపక్షం/రామగిరి :** హైదరాబాద్‌లో జరిగిన రోడ్డు ప్రమాదంలో రామగిరి మండలం సెంటినరీకాలనీకి చెందిన యువకుడు గట్ల సాయిచరణ్ మృతి చెందాడు. ఈ ఘటనతో కాలనీలో విషాద ఛాయలు నెలకొన్నాయి.సెంటినరీ కాలనీలో సంఘమిత్ర సూపర్ మార్కెట్ నిర్వహిస్తున్న గట్ల సంపత్ రెడ్డి కుమారుడైన సాయిచరణ్ హైదరాబాద్‌లో సాఫ్ట్వేర్ ఉద్యోగం చేస్తున్నాడు. శుక్రవారం నగరంలో స్కూటీపై ప్రయాణిస్తుండగా వాహనం అదుపు తప్పి స్కిడ్ కావడంతో అతను కిందపడి తలకు తీవ్ర గాయాలు అయ్యాయి. వెంటనే స్థానికులు ఆసుపత్రికి తరలించగా వైద్యులు చికిత్స అందించారు.అయితే గాయాలు తీవ్రమైన కారణంగా చికిత్స పొందుతూ శనివారం సాయంత్రం సాయిచరణ్ మృతి చెందాడు. కుమారుడి ఆకస్మిక మరణంతో కుటుంబ సభ్యులు శోకసంద్రంలో మునిగి పోయారు.ఈ విషయం తెలిసిన సెంటినరీ కాలనీ ప్రజలు, స్నేహితులు తీవ్ర దిగ్భ్రాంతికి గురయ్యారు.మృతుడు స్వగ్రామం పెద్దపల్లి జిల్లాలోని ఎలిగేడు మండలం బురాన్ మియాపేట్ గా కుటుంబ సభ్యులు తెలిపారు. సాయిచరణ్ అంత్యక్రియలు ఆదివారం స్వగ్రామం బురాన్ మియాపేట్ లోనే నిర్వహించనున్నట్లు కుటుంబ సభ్యులు వెల్లడించారు. యువకుడి మృతితో కుటుంబంతో పాటు స్థానికులు కూడా తీవ్ర విషాదంలో మునిగి పోయారు.చురుకైన స్వభావం, మృదుస్వభావంతో అందరితో కలిసిమెలిసి ఉండే సాయిచరణ్ ఆకస్మిక మృతితో కాలనీలో విషాద వాతావరణం నెలకొంది. చిన్న వయసులోనే కుటుంబానికి తోడుగా నిలవాలని ఆశయాలు పెట్టుకున్న యువకుడు ఇలా రోడ్డు ప్రమాదంలో ప్రాణాలు కోల్పోవడం అందరినీ కలచివేసింది.

# చిన్న దూరమైన.. ప్రాణ రక్షణ అవసరం



**ప్రజాపక్షం/గోదావరిఖని:** చిన్న దూరమైన, పెద్ద దూరమైన ప్రయాణ సమయంలో తప్పనిసరిగా హెల్మెట్, సీట్‌బెల్ట్‌ను ప్రతిఒక్కరూ ధరించాలని రామగుండం సి.పి. అంబర్ కిషోర్ ఝా అన్నారు. శనివారం అరైవ్‌అలైవ్ ఫేజ్3లో భాగంగా గోదావరిఖని వన్‌టౌన్ సి.ఐ. ఇంద్రసేనారెడ్డి ఆధ్వర్యంలో మున్సిపల్ చౌరస్తా వద్ద పోలీసులు ప్రత్యేక అవగాహన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా సి.పి. మాట్లాడుతూ, ప్రస్తుత 70 శాతం రోడ్డు ప్రమాదాల్లో హెల్మెట్, సీట్‌బెల్ట్ ధరించకపోవడం వల్లనే జరుగుతున్నాయని, వీటిని ధరించడం ద్వారా ప్రాణాపాయం తగ్గే అవకాశం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో పెద్దపల్లి డిసిపి బి.రామ్‌రెడ్డి, గోదావరిఖని ఎసిపి మడత రమేష్, రామగుండం ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ రాజేశ్వర్‌రావు, గోదావరిఖని టూటౌన్ ఇన్‌స్పెక్టర్ ప్రసాద్‌రావు, ఎస్.ఐ.లు రమేష్, అనూష, మనోహర్, ట్రాఫిక్ ఎస్.ఐ. హరీష్, శేఖర్, రామరాజు, సిబ్బంది పాల్గొన్నారు.

# ఆకట్టుకున్న ఫుడ్ పెస్టివల్



**ప్రజాపక్షం/జగిత్యాలటౌన్:** జగిత్యాల జిల్లా కేంద్రంలోని 50వ వార్డులో ఉన్న సువిద్య పాఠశాల ఆధ్వర్యంలో విద్యార్థులు నిర్వహించిన ఫుడ్ ఫెస్టివల్ ఆకట్టుకుంది. మాజీ మంత్రి జీవన్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై ఫుడ్ ఫెస్టివల్‌ను ప్రారంభించారు. విద్యార్థులు తయారు చేసిన ఆహార పదార్థాలను పరిశీలించి అభినందించారు. విద్యార్థి దశ నుండే విద్యార్థులు నాయకత్వ లక్షణాలను అలవర్చుకోవడంతో పాటు ఉపాధ్యాయుల బోధనలను శ్రద్ధతో విని ఉన్నత లక్ష్యాలను సాధించాలని కోరారు. ఈ కార్యక్రమంలో పాఠశాల యాజమాన్యం ఉన్నారు.

# టెండర్ల రద్దు వెనుక ఉన్న మర్మమేమిటో చెప్పాలి?

## సిపిఐ నేతలు సురేందర్ రెడ్డి, పైడిపల్లి రాజు

## సిపిఐ ఆధ్వర్యంలో మున్సిపల్ ఎదుట ధర్నా



**ప్రజాపక్షం/కరీంనగర్:** కరీంనగర్ నగర పాలక సంస్థ లో ఎన్నికల ముందు రాష్ట్ర ప్రభుత్వం విలీన గ్రామాల అభివృద్ధి కోసం రూ.50 కోట్లు మంజూరైన పనులకు పిలిచిన టెండర్లను గుట్టు చప్పుడు కాకుండా రద్దు చేయడం వెనుక ఉన్న మర్మం ఏమిటో చెప్పాలని సిపిఐ నగర కార్యదర్శి కసిరెడ్డి సురేందర్ రెడ్డి, సహాయ కార్యదర్శి పైడిపల్లి రాజులు మున్సిపల్ అధికారులను ప్రశ్నించారు. బల్దియాలో రద్దయిన టెండర్లను పునరుద్ధరించాలని కోరుతూ సిపిఐ నగర సమితి ఆధ్వర్యంలో శనివారం నగరపాలక సంస్థ కార్యాలయ ప్రధాన గేటు ముందు నిరసన, ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సిపిఐ నగర కార్యదర్శి కసిరెడ్డి సురేందర్ రెడ్డి, సహాయ కార్యదర్శి పైడిపల్లి రాజులు మాట్లాడుతూ మున్సిపల్ పాలకవర్గం ఎన్నిక కాక ముందు ప్రభుత్వం విలీన గ్రామాల్లో రోడ్లు, డ్రైనేజీ ఇతర మౌలిక వసతులను కల్పించేందుకు రూ. 50 కోట్ల నిధులను మంజూరు చేసిందని వీటితో దాదాపు 87 అభివృద్ధి పనులను చేపట్టేందుకు గత సంవత్సరం సిడిఎంఏ పరిపాలన అనుమతి ఇచ్చిందని కానీ కొత్తగా ఏర్పడ్డ పాలకవర్గం కమిషన్ల కోసం విలీనమైన గ్రామాల పట్ల నిర్లక్ష్యం వహిస్తూ అభివృద్ధిని అడ్డుకుంటున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ ప్రక్రియలో కాంగ్రెస్, బిజెపి పార్టీలు కేంద్ర మంత్రి బండి సంజయ్, రాష్ట్ర మంత్రి పొన్నం ప్రభాకర్ ఒక్కటై టెండర్లను రద్దు చేయించడం సిగ్గుచేటని, కమీషన్ల కోసం తప్ప ప్రజల అభివృద్ధిపై మంత్రులకు పట్టింపు లేదని వారు విమర్శించారు. అధికారంలోకి వచ్చాక మా మార్క్ చూపిస్తామని మాట్లాడిన బండి సంజయ్ అవినీతికి ఆద్యం పోస్తున్నాడని, చిత్తశుద్ధి ఉంటే బండి సంజయ్ చొరవ తీసుకుని టెండర్ల రద్దు ప్రక్రియను వెనక్కి తీసుకోవాలన్నారు. కేంద్ర మంత్రి బండి సంజయ్, రాష్ట్ర మంత్రి పొన్నం ప్రభాకర్‌లు చీకటి ఒప్పందం చేసుకొని విలీన గ్రామాల అభివృద్ధిని అడ్డుకుంటున్నారని ప్రజలు వీరిని విలీన గ్రామాల్లోకి వస్తే నిలదీయాలని కోరారు. ఈ ధర్నా కార్యక్రమంలో సిపిఐ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు కసిరెడ్డి మణికంఠ రెడ్డి, జిల్లా కౌన్సిల్ సభ్యులు సర్దార్ వల్లభాయ్ పటేల్, నగర కార్యవర్గ సభ్యులు మామిడిపల్లి హేమంత్, బాకం అంజన్న, కండే అజయ్, మార్క శ్రీనివాస్ గౌడ్, రమేష్, ఎల్లయ్య, రాజు, శ్రీనివాస్ పాల్గొన్నారు.

# వృత్తి నైపుణ్యం అభివృద్ధికి అత్యంత ప్రాధాన్యం

## ఎమ్మెల్యే సంజయ్ కుమార్



**ప్రజాపక్షం/జగిత్యాలటౌన్:** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం వృత్తి నైపుణ్య అభివృద్ధికి అత్యంత ప్రాధాన్యం కల్పిస్తుందని జగిత్యాల ఎమ్మెల్యే సంజయ్ కుమార్ పేర్కొన్నారు. ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా జిల్లా కేంద్రంలోని ఎటిసి కేంద్రంలో వృత్తి నైపుణ్య శిక్షణ పొందుతున్న విద్యార్థులు చెక్కపై రూపొందించిన ఎమ్మెల్యే చిత్ర పటాన్ని సంజయ్ కుమార్‌కు క్యాంపు కార్యాలయంలో అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఉపాధి అవకాశాలను అందించడానికి ప్రభుత్వం కృషి చేస్తుందని వివరించారు. విద్యార్థులకు ఇబ్బందులు కలుగకుండా ఇటీవల మంత్రి శ్రీధర్ బాబు చొరవతో రూ. 70 లక్షల నిధులతో సిసి రోడ్డు వేయించడం జరిగిందన్నారు. ఎటిసి కేంద్రాన్ని విద్యార్థులు ఉపయోగించుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు ఎల్లారెడ్డి, రాంచంద్ర రావు, సతీష్, శ్రీనివాస్, సురేందర్ రావు తదితరులు ఉన్నారు.

**విద్య, వైద్యానికి హబ్‌గా జగిత్యాల:** జగిత్యాల మెడికల్ కళాశాల విద్య, వైద్యానికి హబ్‌గా మారిందని జగిత్యాల ఎమ్మెల్యే సంజయ్ కుమార్ పేర్కొన్నారు. మాతా శిశువు ఆసుపత్రిలో హజ్ యాత్రికుల వ్యాక్సినేషన్ కార్యాక్రమాన్ని ఎమ్మెల్యే సంజయ్ కుమార్ ప్రారంభించారు. అనంతరం మెడికల్ కళాశాల భవన నిర్మాణ పనులు, క్రిటికల్ కేర్ యూనిట్‌ను ఎమ్మెల్యే పరిశీలించి మాట్లాడారు. సిఎం రేవంత్ రెడ్డితో పాటు రాష్ట్ర మంత్రుల సహకారం, కలిసి పనిచేస్తూ జగిత్యాల నియోజకవర్గ అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తున్నానన్నారు. మెడికల్ కళాశాలతో పాటు హాస్టల్ కోసం పట్టణ నడిబొడ్డున 27 ఎకరాల స్థలాన్ని కేటాయించడం జరిగిందన్నారు. 600 గదులతో అన్ని సకల సౌకర్యాలతో హాస్టల్ నిర్మాణ పనులు వేగవంతంగా జరుగుతున్నాయన్నారు.ఈ కార్యక్రమంలో జిల్లా వైద్యాధికారిణి సుజాత, ఉప వైద్యాధికారి శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.

# ఆశ వర్కర్ల న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలి



**ప్రజాపక్షం/పెద్దపల్లి:** ఆశ వర్కర్ల న్యాయమైన డిమాండ్ లను రాష్ట్రం లోని కాంగ్రెస్ సర్కార్ నిర్లక్ష్యం చేస్తున్నాయని, వారి న్యాయపరమైన డిమాండ్లను వెంటనే పరిష్కరించాలని ఏఐఎఫ్టీయూ, రైతు కూలీ సంఘం, తెలంగాణ ప్రజా ఫ్రంట్‌ల ప్రతినిధులు రత్నకుమార్, వెల్తురు సదానందం, గుమ్మడి కొమురయ్య లు డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఆయా సంఘాల నాయకులు మాట్లాడుతూ సమస్యల సాధన కోసం తమ న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని శనివారం రోజున ఛలో ధర్నా చౌక్ (హైద్రాబాద్) కార్యక్రమం నిర్వహిస్తుంటే రాష్ట్ర వ్యాప్తంగా పోలీస్ బలగాలతో అక్రమంగా నిర్బంధించడం సిగ్గుచేటని విమర్శించారు. ప్రజారోగ్యం కోసం సైనికుల్లా పనిచేసే ఆశ వర్కర్లను ప్రభుత్వం వెట్టి జీతగాళ్ళాల చూడటం, సమాన పనికి సమాన వేతనాలు చెల్లించక పోవడం, ఉపాధి భద్రత ఇవ్వకపోవడం సరికాదని అన్నారు. గత ప్రభుత్వం ఇచ్చిన వేతనాలే ఇప్పటికి అరకొరగా ఇవ్వడం వల్ల ఆశ వర్కర్ల కుటుంబాలన్నీ ఆర్థికభారం తో విలవిలా డుతున్నాయని, ప్రభుత్వం తక్షణమే ఆశవర్కర్లందరికి బాకాయి వేతనాలు చెల్లిస్తూ, వేతనాలు పెంచుతూ 'జిఒ' జారీ చేయాలనీ మేం డిమాండ్ చేశారు. పాలకులు మారిన కాని పాలసీలు మారలేదని, పాత సీసాలో కొత్త సారా చందమే తెలంగాణ రాష్ట్రప్రభుత్వ విధానాలు ఉన్నాయని, హక్కులకై గళం విప్పితే అక్రమ నిర్బంధాలా? ఇదేనా ప్రజా స్వామ్యని ప్రశ్నించారు. ప్రజా ఆరోగ్యకార్యకర్తలైన ఆశ వర్కర్ల పోరాటలకు మా సంఘాలు సంపూర్ణ మద్దతు తెలియజేస్తున్నామని అన్నారు. ఉమ్మడి కరీంనగర్ జిల్లా ఆశ వర్కర్లందరిని గుండ్లపల్లి స్టేజ్ వద్ద నిర్బంధించి మానసికంగా వేధించడం విచారకరమని, వారికీ భోజన సౌకర్యాలు కల్పించి తక్షణమే వారిని విడుదల చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

# సిసి రోడ్ల నిర్మాణం... ఇందిరమ్మ ఇండ్ల ప్రారంభం



**ప్రజాపక్షం /మల్లాపూర్:** మండలంలోని వెంకట్రావుపేట గొర్రెపల్లి గ్రామాలలో ఈజీఎస్ నిధులతో నిర్మించే సిసి రోడ్ల నిర్మాణానికి స్థానిక సర్పంచులతో కలిసి టీపీసీసీ నాయకులు జువ్వడి కృష్ణారావు శనివారం భూమి పూజ చేశారు. గొర్రెపల్లి గ్రామంలో 13 లక్షల రూపాయలు వెంకట్రావు పేట గ్రామంలో 10 లక్షల రూపాయల ఈజీఎస్ నిధులతో నిర్మించే సిసి రోడ్లకు భూమి పూజ చేసి పనులను ప్రారంభించారు.అదేవిధంగా సాతారం చిట్టాపూర్ గ్రామంలో ఇందిరమ్మ ఇండ్ల గృహప్రవేశ కార్యక్రమంలో పాల్గొని లబ్ధిదారులకు శుభాకాంక్షలు తెలిపారు.ఈ కార్యక్రమంలో గొర్రెపల్లి సర్పంచ్ ఎలేటి వెంకట్ రెడ్డి ,వెంకట్రావుపేట సర్పంచ్ కనుముల వెంకటేష్, సాధారణ సర్పంచ్ పోతవేణి నారాయణ గౌడ్, మల్లాపూర్ ఉపసర్పంచ్ గడ్డం కామారెడ్డి కిసాన్ జిల్లా అధ్యక్షుడు జలపతి రెడ్డి అధ్యక్షులు శ్రీనివాస్ రెడ్డి, మాజీ ఎంపీపీ నల్ల రాజన్న,ఆనందు సోమయ్య జిల్లా ఆత్మ కమిటీ సభ్యుడు రాజు,తదితరులున్నారు.

# చిన్నారులను దత్తత ఇచ్చిన కలెక్టర్



**ప్రజాపక్షం/సిద్దిపేట:** జిల్లా మహిళా శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో సిద్దిపేట జిల్లాలో శనివారం 4 సంవత్సరాల బాబును ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం విజయనగరం జిల్లాకు చెందిన దంపతులకు, అలాగే ఆరునెలల ఆడశిశువును నిజామాబాద్ జిల్లాకు చెందిన దంపతులకు సమీకృత కలేక్టరేట్‌లో జిల్లా కలెక్టర్ హైమావతి చేతుల మీదుగా అధికారికంగా దత్తత ఇచ్చారు. ఈసందర్భంగా జిల్లా కలెక్టర్ హైమావతి మాట్లాడుతూ పిల్లలను బాగా చదివించాలని, వారికి ఇష్టమైన రంగంలో ప్రోత్సహించాలని దత్తత తీసుకున్న తల్లిదండ్రులకు సూచించారు. పిల్లల బంగారు భవిష్యత్‌కు బాట వేసే పూర్తి బాధ్యత అన్నారు. జిల్లాలో పిల్లలు లేని దంపతులు దత్తత తీసుకుంటే సిద్దిపేటలో శిశుగృహా, జిల్లా బాలల పరిరక్షణ విభాగం ద్వారా దరఖాస్తు చేసుకోవాలన్నారు. తద్వారా వారికి ఏలాంటి న్యాయమైన ఇబ్బందులు ఉండవన్నారు. ఈకార్యక్రమంలో జిల్లా సంక్షేమ శాఖ అధికారి శారద, బాలరక్షక భవన్ కోఆర్డీనేటర్ మమత, జిల్లా బాలల పరిరక్షణ అధికారి కె.రాము పాల్గొన్నారు.

# రాజీ మార్గమే రాజమర్గం




**ప్రజాపక్షం/సిద్దిపేట:** రాజీమార్గమే రాజ మార్గమని సిద్దిపేట జిల్లా ప్రధాన న్యాయమూర్తి కె. సాయిరమాదేవి అన్నారు. శనివారం సిద్దిపేట జిల్లా కోర్టు ఆవరణలో నిర్వహించిన జాతీయ లోక్ ఆదాలత్‌లో పాల్గొని రాజీమార్గం ద్వారా కేసులను పరిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ... లోక్ అదాలత్‌ల ద్వారానే సత్వర న్యాయం లభిస్తుందన్నారు. కేసులను రాజీ చేసుకోవడం ద్వారా ఇరువర్గాల సమయంతో పాటు డబ్బులను కూడా ఆదా చేసుకోవచ్చని తెలిపారు. ఈ సందర్భంగా కక్షిదారులు రాజీ పడదగ్గ క్రిమినల్, సివిల్, తదితర కేసులను రాజీవర్గం ద్వారా పరిష్కరించారు. జిల్లాలో మొదటి లోక్ అదాలత్ కార్యక్రమం కోసం జిల్లాలో కోర్టులో ఏడు బెంచ్‌లను ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. కార్యక్రమంలో న్యాయమూర్తులు సాధన, జయప్రసాద్, న్యాయవాదులు, పోలీసు అధికారులు ఉన్నారు.

# ఇందిరమ్మ ఇండ్లను గృహప్రవేశాలకు సిద్ధం చేయాలి

## నుస్తులాపూర్‌లో ఇందిరమ్మ ఇండ్లను పరిశీలించిన కలెక్టర్ చిత్రా మిశ్రా



**ప్రజాపక్షం/కరీంనగర్:** ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఇందిరమ్మ గృహ నిర్మాణ పథకంలో భాగంగా ప్రారంభించిన ఇండ్లను పూర్తిచేసుకుని గృహప్రవేశాలకు సిద్ధమయ్యేలా చూడాలని జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా అధికారులను ఆదేశించారు. తిమ్మాపూర్ మండలం నుస్తులాపూర్ గ్రామంలో నిర్మాణంలో ఉన్న ఇందిరమ్మ ఇండ్లను పరిశీలించారు. లబ్ధిదారులు తుమ్మనవేణ రజిత, కుంటు రాధతో మాట్లాడారు. ఇంటి నిర్మాణానికి ఇప్పటివరకు అయిన ఖర్చు, ప్రభుత్వం నుండి వచ్చిన బిల్లులు తదితర వివరాలను అడిగి తెలుసుకున్నారు. గృహ నిర్మాణం త్వరితగతిన పూర్తి చేసుకొని పూర్తి లబ్ధి పొందాలని సూచించారు.ఈ సందర్భంగా హౌసింగ్, పంచాయతీరాజ్ అధికారులతో మాట్లాడుతూ ఇందిరమ్మ ఇండ్లు త్వరితగతిన పూర్తి చేసుకునేలా లబ్ధిదారులను ప్రోత్సహించాలని అన్నారు. వారికి ఏమైనా సమస్యలు ఉన్నట్లయితే పరిష్కరించాలని అన్నారు. ఇండ్ల నిర్మాణానికి ఇసుక సరఫరాలో ఇబ్బందులు రాకుండా చూడాలని ఎంపీడీవోను ఆదేశించారు. మోడల్ గ్రామాలు, మొదటి మొదటి దఫాలో ఎంపికైన లబ్ధిదారుల ఇండ్లు నూరు శాతం పూర్తయ్యేలా చూడాలని అన్నారు. కలెక్టర్ వెంట గృహ నిర్మాణ సంస్థ ప్రాజెక్టు సంచాలకులు శ్రీనివాస్, డి.ఈ వెంకటరమణ, ఏ.ఈ శ్రీజ, ఎంపీడీవో మల్హోత్రా, తహసిల్దార్ శ్రీనివాస్ రెడ్డి ఉన్నారు.

## ప్రభుత్వ జూనియర్ కళాశాలకు రాష్ట్రస్థాయి ఉత్తమ అవార్డు



ప్రజాపక్షం/నిజామాబాద్ : నిజామాబాద్ ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలకు రాష్ట్రస్థాయిలో మరో ఉత్తమ కళాశాల అవార్డును రాష్ట్ర రోడ్లు, భవనాలు, సినిమాటోగ్రఫీ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి చేతుల మీదుగా ప్రిన్సిపాల్ గంధం బుద్ధిరాజ్ అందుకున్నారు. శనివారం హైదరాబాద్‌లో హెచ్ఎంటివి, హ్యాన్స్ ఇండియా పత్రికల సంయుక్త ఆధ్వర్యంలో ప్రభుత్వ విద్య వ్యవస్థల ఉత్తమ సేవలు, ఫలితాల ఆధారంగా ప్రభుత్వ కళాశాలలు, పాఠశాలలను గుర్తించి అవార్డులు హైదరాబాద్ ఆర్టీసీ కళాభవన్‌లో అందజేశారు. కార్యక్రమంలో హెచ్ఎంటీవీ, హ్యాన్స్ ఇండియా పత్రిక మేనేజింగ్ డైరెక్టర్ హన్మంతరావు, ఎడిఎట్ వెంకటరెడ్డిలు పాల్గొన్నారు. అవార్డు అందుకున్న సందర్భంగా ప్రిన్సిపాల్ గంధం బుద్ధిరాజ్ మాట్లాడుతూ కళాశాల అభ్యున్నతికి రాష్ట్రస్థాయిలో అవార్డు అందుకోవటం గర్వకారణమన్నారు. తనతో పాటు కళాశాల అధ్యాపక, అధ్యాపకేతర బృందం కృషి అనిర్వచనీయమన్నారు. ఈ అవార్డు రావటంతో కళాశాల అభ్యున్నతికి పాటుపడేందుకు మరింత చూడటంతో పాటు బాధ్యత పెరిగిందన్నారు. బోధన, బోధనేతర సిబ్బందికి ఈ అవార్డు అంకితం ఇస్తున్నానన్నారు.

## కొనుగోళ్లకు సర్వం సిద్ధం

అదనపు కలెక్టర్ కిషోర్ కుమార్



ప్రజాపక్షం/నిర్మల్ : జిల్లాలో యాసంగి వరి ధ్యానం కొనుగోలు ప్రక్రియను అత్యంత పారదర్శకంగా,వేగవంతంగా నిర్వహించేందుకు అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేస్తూ ఏర్పాట్లు పూర్తి చేయాలని జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ)కిషోర్ కుమార్ అదేశించారు.జిల్లాలో నిర్ణీత సమయానికి కొనుగోలు ప్రక్రియను ప్రారంభించి,గడువులోగా పూర్తి చేయాలని స్పష్టం చేశారు.వరి ధాన్యం కొనుగోలు కేంద్రాల ఏర్పాటుకు సంబంధించి ఎటువంటి జాప్యం జరగకుండా తక్షణమే చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు.ముఖ్యంగా ప్రస్తుత వేసవి కాలంలో ఉష్ణోగ్రతలు విపరీతంగా పెరుగుతున్న నేపథ్యంలో,ధాన్యాన్ని విక్రయించేందుకు వచ్చే రైతులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా ప్రతి కొనుగోలు కేంద్రం వద్ద నీడ కోసం టెంట్లు,స్వచ్ఛమైన త్రాగునీరు వంటి కనీస వసతులు తప్పనిసరిగా కల్పించాలని ఆయన ఆదేశించారు.కొనుగోలు ప్రక్రియ సాఫీగా సాగేలా క్షేత్రస్థాయిలో నిరంతరం పర్యవేక్షించాలని అధికారులను కోరారు.జిల్లా సరఫరాల శాఖ అధికారి రాజేందర్,పౌరసరఫరాల మేనేజరు సుధాకర్ సిబ్బంది పాల్గొన్నారు.

## నీటి సమస్యపై అసెంబ్లీలో చర్చ



ప్రజాపక్షం / పెంచికలపేట్ : పెంచికలపేట్ మండలం లోని మురలిగూడ గ్రామంలో నెలకొన్న తాగునీటి సమస్యను సిర్పూర్ నియోజకవర్గ శాసన సభ్యులు డాక్టర్ పాల్వాయి హరీష్ బాబు శనివారం అసెంబ్లీలో ప్రస్తావించారు. గ్రామ ప్రజలు ఎదుర్కొంటున్న ఇబ్బందులను సభ దృష్టికి తీసుకువచ్చిన ఆయన, సమస్య పరిష్కారానికి ప్రభుత్వం తక్షణ చర్యలు తీసుకోవాలని కోరారు. మురలిగూడలో సరైన తాగునీటి వసతి లేకపోవడంతో ప్రజలు దూర ప్రాంతాల నుంచి నీటిని తెచ్చుకోవాల్సి వస్తోందని ఆయన తెలిపారు. ముఖ్యంగా వేసవి కాలంలో పరిస్థితి మరింత దారుణంగా మారుతోందని ఆందోళన వ్యక్తం చేశారు. శుద్ధి చేసిన తాగునీరు అందించేందుకు అవసరమైన చర్యలు చేపట్టాలని, గ్రామంలో స్థిరమైన నీటి సరఫరా వ్యవస్థతో పాటు బోర్లు, ట్యాంకులు నిర్మించాలని ప్రభుత్వాన్ని కోరారు. ప్రజల ప్రాథమిక అవసరమైన తాగునీరు అందించడంలో నిర్లక్ష్యం చేయరాదని ఆయన స్పష్టం చేశారు.

## జాతీయ వేదికపై మరోసారి.. నిర్మల్ జిల్లా ఖ్యాతి

జిల్లాకు రెండు ప్రతిష్టాత్మక స్కాచ్ అవార్డులు




ప్రజాపక్షం/నిర్మల్ టౌన్ : జాతీయ వేదికపై మరోసారి నిర్మల్ జిల్లా ఖ్యాతి ప్రజరిల్లింది,జిల్లాకు రెండు ప్రతిష్టాత్మక స్కాచ్ అవార్డులు దక్కాయి.వివిధ జిల్లా శాఖల ఆధ్వర్యంలో చేపట్టిన వినూత్న కార్యక్రమాలకు గాను స్కాచ్ అవార్డ్‌లు నిర్మల్ జిల్లా సొంతం చేసుకుంది.ఢిల్లీ వేదికగా జరిగిన ఈ అవార్డులను జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ సంబంధిత శాఖలతో కలిసి స్వీకరించారు.నిర్మల్ జిల్లాకే తలమాణికమైన కొయ్య బొమ్మల పరిరక్షణ,చారిత్రాత్మక వారసత్వాన్ని భావితరాలకు అందించాలనే సంకల్పంతో కోయ్య బొమ్మల తయారీకి ఉపయోగించే పొనికి కర్రల పెంపకం కోసం ఏర్పాటు చేసిన పొనికి వనానికి గాను లభించిన జాతీయస్థాయి స్కాచ్ అవార్డును జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ అధికారి విజయలక్ష్మి తో కలిసి స్వీకారించారు.జిల్లాలో అమ్మరక్షిత అనే వినూత్న కార్యక్రమం ద్వారా మాతృత్వ మరణాలు తగ్గించినందుకు లభించిన మరో స్కాచ్ అవార్డును వైద్యరోగ్య శాఖ అధికారి రాజేంధర్‌తో కలిసి కలెక్టర్ స్వీకరించారు.మరోసారి జిల్లాకు జాతీయ వేదికలో అవార్డు రావడం ఎంతో గొప్ప విషయమని పేర్కొన్నారు.అధికారుల ఉత్తమ పనితీరుతో ప్రత్యేక కార్యక్రమాలు అమలు చేసి,అవార్డు సాధనలో కృషి చేసిన అధికారులు అందరికి ఈ సందర్భంగా కలెక్టర్ శుభాకాంక్షలు తెలియజేశారు.

## ఉపాధి హామీ పథకం పేరు మార్చొద్దు

ప్రజాపక్షం / తిర్యాని : మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం పేరును యథాతథంగా కొనసాగించాలని డివైఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు గెడం టికానంద్ డిమాండ్ చేశారు. శనివారం తిర్యాని మండలం దంతన్ పల్లిలో ఉపాధి పనులను ఆయన పరిశీలించారు. కేంద్రం ప్రతిపాదించిన వివిజి రాంజీ పేరును వెంటనే రద్దు చేయాలని కోరారు. పని ప్రదేశంలో కూలీలకు తాగునీరు, నీడ, ప్రథమ చికిత్స సౌకర్యాలు కల్పించాలని ఆయన పేర్కొన్నారు. పని దినాలను 200 రోజులకు పెంచాలని, రోజుకు 800 రూపాయల కూలి అందించాలని డిమాండ్ చేశారు. పెండింగ్ వేతనాలు వెంటనే చెల్లించాలని, కూలీలకు ప్రమాద బీమా సౌకర్యం కల్పించాలని కోరారు. సమస్యల పరిష్కారం కోసం చేపట్టే కలెక్టరేట్ ధర్నాను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

# అవినీతికి అడ్డాగా నిర్మల్ యంత్రాంగం!

## ఎసిబి దాడుల్లో అక్రమ వసూళ్లు బట్టబయలు

ప్రజాపక్షం/నిర్మల్ : అవినీతి అడ్డాగా నిర్మల్ జిల్లా యంత్రాంగా మారింది. ఏ ప్రభుత్వ కార్యాలయానికి వెళ్లినా "పైసలు లేనిదే పని జరగదు" అన్న నినాదం మార్మోగుతోంది. ఒక వైపు వేల సంఖ్యలో ఫైళ్లు అల్మారాల్లో దుమ్ము పట్టి మగ్గిపోతుంటే,మరోవైపు నోట్లు ఇస్తేనే గానీ ఆ ఫైళ్లకు మోక్షం లభించని దుస్థితి నెలకొంది. 2025–26లో నమోదైన ఏసీబీ దాడుల లెక్కలు జిల్లా పరిపాలన ఎంతగా దిగజారిందో కళ్లకు కడుతున్నాయి.మార్చి 26న మామడ పోలీస్ స్టేషన్ పరిధిలో ఎస్ఐ తీగల అశోక్ ఒక చీటింగ్ కేసు నమోదు చేయకుండా ఉండేందుకు 20,000 రూపాయల లంచం,తీసుకుంటూ పోలీస్ క్వార్టర్స్‌లోనే రెడ్ హ్యాండెడ్‌గా పట్టుబడటం రక్షక భట నిలయాల అసలు రంగును బయటపెట్టింది.అలాగే డిసెంబర్ 30న నిర్మల్ రూరల్ పరిధిలో భూమి సర్వే,పంచనామా కోసం 15,000 రూపాయలు డిమాండ్ చేసిన సర్వేయరవ బాలకృష్ణ వర్మ,అందులో 7,500 రూపాయలు తీసుకుంటుండగా తన సహాయకుడు నాగరాజుతో సహా ఏసీబీకి చిక్కడం రెవెన్యూ శాఖలో పాతుకుపోయిన ముడుపుల సంస్కృతికి నిదర్శనం.కేవలం నగరు రూపంలోనే కాకుండా,అధునిక పోకడలను పుణికిపుచ్చుకున్న అవినీతి అధికారులు 9,000 రూపాయల వంటి చిన్న మొత్తాలను కూడా ఫోన్ పై వంటి డిజిటల్ మార్గాల ద్వారా స్వీకరిస్తూ సాంకేతికతను సైతం భ్రష్టు పట్టిస్తున్నారు.తానూర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో సీనియర్ అసిస్టెంట్ గా పనిచేస్తున్న జి. భీమన్న మెడికల్ బిల్లుల ప్రాసెసింగ్ కోసం ఇలాంటి అక్రమాలకు పాల్పడటం గమనార్హం. గ్రామాల్లో సైతం సామాన్యులను పట్టి పీడిస్తున్న అవినీతికి గొడిసెర్యాల పంచాయతీ కార్యదర్శి ఎం.శివకృష్ణ ఉదంతమే సాక్ష్యం,వాటర్ ప్లాంట్ ఏర్పాటుకు ఎన్ఓసీ,హౌస్ నంబర్ కేటాయింపు వంటి అతి చిన్న పనులకు సైతం 12,000 రూపాయలు




డిమాండ్ చేస్తూ ఏసీబీకి చిక్కడం జిల్లాలో కింది స్థాయి యంత్రాంగం ఎంతగా బరితెగించిందో చెబుతోంది. నిర్మల్ మున్సిపల్ కార్యాలయం,సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో జరిగిన సోదాల్లో లెక్కచూపని నగదు సుమారు 2,50,000 రూపాయల మేర లభించడం జిల్లా పరిపాలనపై ఉన్న నమ్మకాన్ని పూర్తిగా నడలించింది.రిజిస్ట్రేషన్ల పేరుతో లక్షలాది రూపాయలు అనధికారికం గా చేతులు మారుతుండటమే కా కుండా,వందలాది ఒరిజినల్ డాక్యుమెంట్లు పంపిణీ చేయకుండా కేవలం లంచం కోసమే ఆపి ఉంచడం ఏ రకమైన ప్రజా పరిపాలన అని ప్రజలు ప్రశ్నిస్తున్నారు.జవాబుదారీతనం వహించాల్సిన అధికారులు అక్రమ వసూళ్లకు అడ్డాగా మార్చుకోవడం,జిల్లా ప్రజలను ఆందోళనకు గురి చేస్తోంది.అంతేకాకుండా, రవాణా శాఖలో కూడా పరిస్థితి ఏమాత్రం భిన్నంగా లేదు.అర్టీవో కార్యాలయంలో పాటు బైంసా చెక్ పోస్టుల వద్ద మోటార్ వెహికల్ ఇన్స్పెక్టర్లు,ప్రైవేట్ ఏజెంట్లు కుమ్మక్కై,ఎటువంటి రసీదులు లేకుండా వసూలు చేస్తున్న 1,80,000 రూపాయల అనధికార నగదు ఏసీబీ దాడుల్లో దొరకడం జిల్లా రవాణా శాఖలో జరుగుతున్న చీకటి దందాను బట్టబయలు చేసింది.ఇంతటి దారుణమైన పరిస్థితులు జిల్లాలో నెలకొన్నా,జిల్లా పరిపాలనా యంత్రాంగం పై నుండి కింది స్థాయి వరకు నిఘా లోపించడం పట్ల ప్రజలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.ఏసీబీ పట్టుకున్న అధికారులు కొద్ది రోజుల్లోనే రాజకీయ పలుకుబడితో మళ్లీ అదే కుర్చీలోకి చేరుతుండటంతో,అవినీతి పరులకు చట్టం అంటే భయం లేకుండా పోయింది.రాజకీయ నాయకులతో అధికారుల కుమ్మక్కు వ్యవహారం ఇప్పుడు జిల్లాలో చర్చనీయాంశంగా మారింది.ఏ అదికారి దగ్గరికి వెళ్లినా పైసలు లేనిదే పని జరగని పరిస్థితి నెలకొనడంతో,సామాన్యుడు కార్యాలయాల గడప తొక్కాలంటేనే జంకుతున్నారు.

## లేబర్ కోడ్స్ రద్దు చేయాలి

ప్రజాపక్షం/నిర్మల్ టౌన్ : కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన నాలుగు లేబర్ కోడ్స్ ను రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ,ఈ నెల 30వ తేదీన నిర్వహించ తలపెట్టిన రాష్ట్రవ్యాప్త నిరసన కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని టీయూసీఐ రాష్ట్ర ఉపాధ్యక్షుడు కే.రాజన్న పిలుపునిచ్చారు.శనివారం నిర్మల్ జిల్లా కేంద్రంలో టీయూసీఐ ఆధ్వర్యంలో ఈ నిరసన కార్యక్రమానికి సంబంధించిన వాల్ పోస్టర్లను విడుదల చేశారు. కార్మిక హక్కులను కాలరాసే విధంగా ఉన్న నాలుగు లేబర్‌కోడ్స్ ను ఏప్రిల్ 1వ తేదీ నుండి అమలు చేయాలని కేంద్రం రాష్ట్ర ప్రభుత్వాలను ఆదేశించడం దుర్మార్గమని విమర్శించారు. ప్రజా వ్యతిరేక చట్టాలను తక్షణమే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు.ఇందులో బాగంగానే మార్చి 30న మధ్యాహ్నం 12 గంటలకు నిర్మల్ జిల్లా కేంద్రంలో భారీ నిరసన కార్యక్రమం ఉంటుందని,జిల్లాలోని కార్మికులందరూ ఈ పోరాటాన్ని జయప్రదం చేయాలని విజ్ఞప్తి చేశారు. టీయూసీఐ నాయకులు శ్రీనివాస్,నారాయణ, పాల్గొని తమ మద్దతు తెలిపారు.

## పకడ్బందీగా 'టెన్త్' పరీక్షలు



ప్రజాపక్షం/నిజామాబాద్ : జిల్లాలో పదవ తరగతి పరీక్షలను పకడ్బంధీగా నిర్వహిస్తున్నామని కలెక్టర్ ఇలా త్రిపాఠి అన్నారు. ఎస్సెస్సీ పరీక్షా కేంద్రాలను కలెక్టర్ శనివారం తనిఖీ చేశారు. జిల్లా కేంద్రంలోని బ్లూమింగ్ బర్డ్స్ స్కూల్, ఆర్మూర్ పట్టణంలోని ప్రభుత్వ జడ్పీహెచ్ఎస్ బాలికల పాఠశాలలో కొనసాగుతున్న పరీక్షా కేంద్రాలను ఆకస్మికంగా సందర్శించారు. పరీక్షా కేంద్రాల్లో అందుబాటులో ఉన్న సదుపాయాలను, సీసీ కెమెరా వ్యవస్థను పరిశీలించారు. విద్యార్థుల హాజరు శాతం, బందోబస్తు, తాగునీరు, ప్రథమ చికిత్స వసతి తదితర విషయాలను గమనించారు. బ్లూమింగ్ బర్డ్స్ స్కూల్‌లో పరీక్షల నిర్వాహణ లో పలు లోపాలను గుర్తించిన కలెక్టర్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. కాపీయింగ్, మాల్ ప్రాక్టీస్‌కు ఆస్కారం కల్పిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. పరీక్షా కేంద్రం చీఫ్ సూపరింటెండెంట్‌కు షోకాజ్ నోటీసు ఇవ్వాలని జిల్లా విద్యాధికారిని ఆదేశించారు. తక్షణమే బ్లూమింగ్ బర్డ్స్ స్కూల్‌ను సందర్శించి నిర్వహణాపరమైన లోపాలను చక్కదిద్దాలని సూచించారు. విద్యార్థులు దగ్గర దగ్గరగా కూర్చుండి రాస్తున్నారని, మరో ఐదు అదనపు గదులను పరీక్షల నిర్వాహణ కోసం వినియోగించాలని, సిట్టింగ్ అరెంజ్‌మెంట్ పక్కాగా ఉండాలన్నారు. పరీక్షా కేంద్రాల్లోకి సెల్‌పోన్లు, ఎల్రక్టానిక్ ఉపకరణాలు ఎట్టి పరిస్థితుల్లోనూ అనుమతించకూడదన్నారు. ప్రశాంత వాతావరణంలో విద్యార్థులు పరీక్షలు రాసేలా చూడాలన్నారు. పరీక్షలు పూర్తయ్యేంత వరకు అధికారులు సమన్వయంతో పని చేస్తూ విద్యార్థులకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా చూడాలన్నారు. కలెక్టర్ వెంట పరీక్షా కేంద్రాల సూపరింటెండెంట్లు సత్య కుమార్, ఎస్.వెంకట్రామ్‌రెడ్డి ఉన్నారు.

## నాణ్యతా ప్రమాణాలతో ధాన్యం కొనుగోలు

జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్

ప్రజాపక్షం / మెదక్ : మెదక్ జిల్లాలో యాసంగి వరి ధాన్యంను నాణ్యత ప్రమాణాలతో పక్బందిగా కొనుగోలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ అధికారులను ఆదేశించారు. శనివారం కలెక్టరేట్ లోని సమావేశ మందిరంలో సివిల్ సప్లై, వ్యవసాయ, పోలీస్, గ్రా మీణ అభివృద్ధి, రెవెన్యూ, రవాణా, రైస్ మిల్లర్ అసోసియేషన్ యాజమాన్యులతో యాసంగి వరి ధాన్యం కొనుగోలు పై సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ మాట్లాడుతూ ధాన్యం కొనుగోలు లో రైతులు దళారులను ఆశ్రయించవద్దన్నారు. ప్రభుత్వం ఒక క్వింటాల్ ఏ గ్రేడ్ ధాన్యానికి 2,389 సాధారణ దకినికి 2,369గా నిర్ణయించిందన్నారు. ఏప్రిల్ 1 నుంచి ధాన్యాం కొనుగోలు కేంద్రాలు పెద్ద ఎత్తున ప్రారంభించాలని పిలుపునిచ్చారు. యాసంగి సీజన్ కు 4,45,466 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని సేకరించడానికి లక్ష్యంగా పనిచేస్తున్నామన్నారు. జిల్లా వ్యాప్తంగా 413 ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. అందులో ఐకెపి 154, పిఎసిఎస్ 224, డీసీఎంఎస్ 9, ఎఫ్‌పిఓ 26 మొత్తం 413 కేంద్రాలు ప్రారంభం కానున్నాయి అన్నారు. రైతుల వద్ద ధాన్యాన్ని చివరి గింజ వరకు కొంటామన్నారు. ధాన్యం కొనుగోలులో నాణ్యత ప్రమాణాలు పాటించాలని సూచించారు. వడగండ్లు, అకాల వర్షాల పట్ల అప్రమత్తంగా ఉండాలన్నారు. టార్పాలిన్ కవర్లను అందుబాటులో ఉంచుకోవాలన్నారు. సరైన తేమశాతాన్ని నమోదు చేసి, ట్యాబ్ ఎంట్రీ చేయాలన్నారు. ప్యాడి క్లీనర్లు అందుబాటులో ఉన్నాయని, ప్యాడి క్లీనలలో సమస్యల తలెత్తితే ఉన్నత అధికారులకు సమాచారం అందించాలన్నారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ నగేష్, అదనపు ఎస్పీ మహేందర్, మెదక్ ఆర్డీఓ రమాదేవి, గ్రామీణ అభివృద్ధి అధికారి శ్రీనివాసరావు, జిల్లా వ్యవసాయ అధికారి దేవ్ కుమార్, జిల్లా సివిల్ సప్లై అధికారి,నిత్యానంద్, సివిల్ సప్లై మేనేజర్ జగదీష్, ట్రాన్స్ పోర్ట్ అధికారి శ్రీలేఖ తదితరులు ఉన్నారు.



## ఫౌండేషనల్ లెర్నింగ్ స్టడీని విజయవంతం చేయాలి

క్వాలిటీ కో–ఆర్డినేటర్ సత్యనారాయణమూర్తి



ప్రజాపక్షం / మంచిర్యాల : దేశవ్యాప్తంగా ఈ నెల 30, 31వ తేదీల్లో నిర్వహించే ఫౌండేషనల్ లెర్నింగ్ స్టడీని విజయవంతం చేయాలని మంచిర్యాల జిల్లా క్వాలిటీ కోఆర్డినేటర్ సత్యనారాయణమూర్తి తెలిపారు. జిల్లా విద్యాధికారి యాదయ్య ఆదేశాల మేరకు ఫీల్డ్ ఇన్వెస్టిగేటర్లకు నిర్వహిస్తున్న శిక్షణ కార్యక్రమం శనివారం రెండో రోజుకు చేరుకుంది.జిల్లాలో నాలుగు పాఠశాలలు ఈ సర్వేకు ఎంపికయ్యాయని వెల్లడించారు. ట్యాబ్ ఆధారంగా నిర్వహించే ఈ స్టడీలో ఫీల్డ్ ఇన్వెస్టిగేటర్లు అత్యంత పారదర్శకంగా వ్యవహరించాలని ఆయన సూచించారు. ఎలాంటి ప్రలోభాలకు గురికాకుండా నిజాయితీగా సర్వే ప్రక్రియను పూర్తి చేయాలని పేర్కొన్నారు. ఈ సర్వే కోసం ఎస్ఆర్‌కెఎం డిఇడి కళాశాల విద్యార్థులను ఫీల్డ్ ఇన్వెస్టిగేటర్లుగా ఎంపిక చేసినట్లు వివరించారు.

## నిజామాబాద్ కోడలివైతే 'అత్తగారి ఇంటి పేరు' చెప్పకో

కవిత కొత్త పార్టీకి 'లిక్కర్ పార్టీ'అని పెట్టుకో

బిజెపి డిప్యూటీ ఫ్లోర్ లీడర్ దంపల్లి జ్యోతి

ప్రజాపక్షం/నిజామాబాద్ : మాజీ ఎంపీ కవిత నిజామాబాద్ కోడలివైతే ముందు మీ అత్తగారి ఇంటి పేరు చెప్పుకోవాలని ఆ పేరును ఇంటి పేరుగా పెట్టుకోవాలని బీజేపీ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ దంపల్లి జ్యోతి అన్నారు. శనివారం బీజేపీ జిల్లా పార్టీ కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. శుక్రవారం జిలాల పర్యటనలో మాజీ ఎంపి కవిత చేసిన వ్యాఖ్యలపై బీజేపీ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ దంపల్లి జ్యోతి మాట్లాడుతూ నిజామాబాద్‌లో విలేకరుల సమావేశంలో తాను తెలంగాణ ఆడబిడ్డలను నిజామాబాద్ కోడలి అని కవిత చెప్పడం విడ్డూరంగా ఉందన్నారు. పక్కన భర్తను పెట్టుకుని భర్త ఇంటి పేరును ఇంటి పేరుగా వాడుకోలేని కవిత నిజామాబాద్ ఆడబిడ్డను నిజామాబాద్ కోడలిని అని చెప్పుకోవడం హాస్యస్పదంగా ఉందన్నారు. కేవలం ఇందూరుకు వచ్చినప్పుడు రాజకీయ అవసరమున్నప్పుడు మాత్రమే ఆమెకు తాను ఆడబిడ్డను, కోడలిని అన్న విషయం గుర్తుకు వస్తుందా ? అని ఎద్దేవా చేశారు. సిఎం రేవంత్ ఉద్దీన్ ఇచ్చిన పైసలు తీసుకుని కొత్త పార్టీ పెడతానని చెప్పులు అరిగేలా తిరుగుతున్నావు. ఏప్రిల్ 25న నువ్వు పెట్టబోయే కొత్త పార్టీకి 'లిక్కర్ పార్టీ' అని పేరు పెట్టుకుంటే నీకు కరెక్ట్‌గా సెట్ అవుతుందన్నారు. మీ తండ్రి సగం తెలంగాణను నాశనం చేస్తే మిగిలిన తెలంగాణను కొత్త పార్టీ పేరుతో నువ్వు నాశనం చేయడానికి బయల్దేరావన్నారు. ఇంకోసారి మా పార్లమెంట్ సభ్యులు అరవింద్ ధర్మపురిపై నోటికి వచ్చినట్లు మాట్లాడితే బాగుండదని ఖబడ్దార్ కవిత, నీ పార్టీతో ప్రజలకు ఒరిగేది లేదు. మా పార్టీకి వచ్చిన నష్టం లేదన్నారు.

## సిర్పూర్-టి లోక్ అదాలత్‌లో 608 కేసుల పరిష్కారం



ప్రజాపక్షం / సిర్పూర్ టి : సిర్పూర్ టి కోర్టు ప్రాంగణంలో శనివారం నిర్వహించిన జాతీయ లోక్ అదాలత్‌లో మొత్తం 608 కేసులు పరిష్కారమయ్యాయి. మండల లీగల్ సర్వీసెస్ కమిటీ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి చైర్మన్ అజయ్ ఉల్లం అధ్యక్షత వహించారు. వివిధ విభాగాల ద్వారా మొత్తం 11,33,800 రూపాయల జరిమానాలు, బకాయిలు వసూలు చేసినట్లు ఆయన వెల్లడించారు. లోక్ అదాలత్ ద్వారా ప్రజలకు వేగవంతమైన, సులభమైన న్యాయం అందుతుందని అధికారులు తెలిపారు. ఇందులో భాగంగా రాజీ కేసుల కింద 26 కేసులు పరిష్కరించి 35,000 రూపాయలు, అడ్మిషన్ కేసుల కింద 221 కేసులు పరిష్కరించి 5,89,800 రూపాయలు వసూలు చేశారు. తరగతి మెజిస్ట్రేట్ కోర్టులో 299 కేసులు పరిష్కరించి 4,69,000 రూపాయలు, బ్యాంకు మరియు ఫైనాన్స్‌కు సంబంధించిన 62 కేసులను పరిష్కరించి 50,000 రూపాయలు వసూలు చేసినట్లు వివరించారు. ప్రజలు ఇలాంటి అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఏజిపి శ్రీనివాస్, ఏపిపి ఎలిషా, ప్రెసిడెంట్ శ్రీనివాస్, న్యాయవాదులు, బ్యాంకు మేనేజర్లు, కోర్టు సిబ్బంది, కానిస్టేబుళ్లు పాల్గొన్నారు.

## ట్రాఫిక్ నిబంధనలను పాటించి ప్రమాదాలను నివారిద్దాం

'తారా' ప్రభుత్వ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ప్రవీణ

ప్రజాపక్షం/సంగారెడ్డి : తారా ప్రభుత్వ కళాశాల సంగారెడ్డి ఎన్ఎస్ఎస్ విభాగాలు రెండు మూడు ,నాలుగుల ఆధ్వర్యంలో దత్తత గ్రామాలైన కల్పగూరు ,అంగన్ పేట, మల్కాపూర్ గ్రామాలలో ప్రత్యేక శిబిరాలలో భాగంగా ట్రాఫిక్ నిబందనలపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించడం జరిగిందని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ప్రవీణ తెలిపారు. కేంద్ర ప్రభుత్వ యువజన వ్యవహారాలు ,క్రీడల మంత్రిత్వ శాఖ సహకారముతో కళాశాల ఎన్ఎస్ఎస్ విభాగాలు దత్తత గ్రామాలలో ప్రజలకు వివిధ అంశాలపై ర్యాలీల ద్వారా అవగాహనను కల్పిస్తున్నారని తెలిపారు. అదే విధంగా కళాశాల వాలంటీర్లకు ట్రాఫిక్ నిబందనలపై సైబర్ క్రైమ్ పోక్ సో చట్టంపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించడం జరిగిందని తెలిపినారు.ముఖ్య అతిథులుగ విచ్చేసిన ట్రాఫిక్ ఎస్ఐలు సాయిలు, గోప్యాచవాన్ మాట్లాడుతూ ట్రాఫిక్ సిగ్నల్స్‌ని పాటించాలని, ట్రిపుల్ రైడ్ చేయడం నేరమని, వాహనాన్ని నడుపుతున్నప్పుడు ఓవర్టేక్ చేయరాదని ,వాహనదాలు హెల్మెట్‌ను లైసెన్సును నంబర్ ప్లేట్‌ను ఇన్సూరెన్స్ పోల్యూషన్ చెకప్ సర్టిఫికెట్లు తప్పని సరిగా కలిగి ఉండాలని తెలిపారు. లైసెన్స్ లేకుండా తాగి వాహనాలను నడపరాదని, అట్టి వారిపై చట్టపరంగా చర్యలు ఉంటాయని తెలిపినారు. అదే విధంగా తెలియని వ్యక్తుల నుండి వచ్చిన మేసేజ్‌ను ఓపెన్ చేయరాదని ,తెలియని వ్యక్తులు ఓటీపి అడిగినప్పుడు చెప్పరాదని ,మన సెల్ పోన్లు జాగ్రత్తగా ఉపయోగించాలని ఎట్టి పరిస్థితులలోనూ అపరచిత వ్యక్తులు సమాదానాలు ఇవ్వరాదని, అపరిచిత వ్యక్తుల చేతుల్లో సెల్ఫోన్లు పెట్టరాదని తెలిపినారు. ఎవరైనా సైబర్ నేరానికి గురైతే అట్టి వ్యక్తులు 24 గంటల లోపు 1930 కు కాల్ చేస్తే వారు పోగొట్టుకున్న డబ్బును పోలీస్ డిపార్మెంటు రికవరీ చేయడానికి అవకాశం ఉంటుందని తెలిపినారు. అదే విధంగా 18 సంవత్సరాల లోపు




బాలికలను ఏ విధంగా వేదించరాదని వారి తల్లిదండ్రులకు సమాచారం లే కుండా వారిని మనము ఎక్కడికి తీసుకొని పోరాదని అది పోక్స్ చట్టం కిందికి వస్తుందని ,లైగింకంగా వేదించిన బాలికలను ఏ రకంగా ఇబ్బంది పెట్టిన పోక్సు చట్టం ప్రకారము నాన్బెయిలబుల్ వారంటూ ఉంటు ందని కఠినమైన జైలు శిక్ష ఉంటుందని బాలికల విషయములో యువత జాగ్రత్తగా ఉండాలని పేర్కొన్నారు. అదే విధం గా వాహనదారుల ట్రాఫిక్ సిగ్నల్స్ ను పాటించనప్పుడు ఏ విధంగా ట్యాప్ ద్వారా వారికి ఫైన్ వేయబడుతుందో అదే విధంగా త్రాగి వాహనాన్ని నడిపితే నూతన పరికరం ఏ విధంగా పనిచేస్తుందో ప్రయోగపూర్వకంగా విద్యార్థులకు వివరించడం జరిగింది. అదే విధంగా యువత జాగ్రత్తగా ఉండాలని ట్రాఫిక్ సిగ్నల్స్ రోడ్డు ప్రమాదాలు సైబర్ క్రైమ్ వంటి వాటిపై ప్రజలలో అవగాహన కల్పించవలసిన బాధ్యత యువతరానిదే అని తెలిపినారు. ఎన్ ఎస్ ఎస్ మూడవ విభాగం ఆధ్వర్యంలో మల్కాపూర్ లో జరుగుతున్న ప్రత్యేక శీతాకాల శిబిరంలో బాలికలు ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు విద్యాభోదనతో పాటు వివిధ రకాలైన ఆటలను ఆడించడం జరిగిందని గ్రామములో ర్యాలీని నిర్వహించి ప్రజలలో సాంఘీక ఆర్థిక అంశాలపై అంటువ్యాదులపై అవగాహన కల్పించడం జరిగిందని పేర్కొన్నారు.

## మత్తు పదార్థాలపై నిఘా పెంచాలి

మెదక్ జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్

ప్రజాపక్షం/మెదక్ : జిల్లాలో పెండింగ్ ఉన్న రోడ్ల పనులు పూర్తి చేసి రోడ్డు ప్రమాదాలు లేకుండా చూడాలని, ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ అధికారులను ఆదేశించారు. ప్రతి పౌరుడు ట్రాఫిక్ నియమాలు పాటిస్తూ రోడ్డుపై ప్రయాణించే ప్రతి ఒక్క వాహనదారుడు సకాలంలో క్షేమంగా ఇంటికి చేరాలన్నారు.సిగ్నల్స్ విద్యాత్ దీపాలు సైన్ బోర్డులు, గుంతలు పూడ్చి పెండింగ్ పనులు లేకుండా చూడాలన్నారు. విద్యాసంస్థల్లో, కళాశాలలో రోడ్డు భద్రత నియమాల గూర్చి విర్యార్థులకు అవగాహన నిర్వహించాలని, రోడ్డు ప్రమాదాలు ఎక్కువగా ద్విచక్ర వాహనదారులకు జరుగుతున్నందున వాహన దారులు నియమాలు పాటించడం, హెల్మెట్ ధరించడం, డ్రైవింగ్ లైసెన్స్ కలిగి ఉండడం, రోడ్ల పై వివిధ సిగ్నల్, మార్కింగ్ గురించి తెలుసుకొని జాగ్రత్తగా ప్రయాణం చేయాలని సూచించారు. జిల్లా వైద్య అధికారి శ్రీరామ్, డిఎస్పీ ప్రసన్న కుమార్, మున్సిపల్ కమిషనర్లు, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

వరుణ్ తేజ్ హీరోగా పింక్ ఎలిఫెంట్ పిక్చర్స్ బ్యానర్ మీద నిహారిక కొణిదెల నిర్మాతగా యదు వంశీ తెరకెక్కిస్తున్న నూతన చిత్రం 'బరి'. ఆంధ్ర ప్రదేశ్ డిప్యూటీ సిఎం పవన్ కళ్యాణ్ ముఖ్య అతిథిగా విచ్చేశారు. 'బరి' సినిమాకు క్లాప్ కొట్టిన పవన్ కల్యాన్



# 'గులాబ్ జామ్' సాంగ్ లాంచ్ చేసిన దిల్ రాజు




రాగ్ మయూర్ హీరోగా, డిజె టిల్లు ఫేమ్ విమల్ కృష్ణ దర్శకత్వంలో రూపొందుతున్న చిత్రం 'అనుమాన పక్షి'. చిలకా ప్రొడక్షన్స్ పై రాజీవ్ చిలకా, రాజేష్ జగ్తియాని, హిరాచంద్ దండ్ నిర్మిస్తున్నారు. భరత్ లక్ష్మిపతి సహనిర్మాత. ఈ సినిమా నుంచి గులాబ్ జామ్ సాంగ్ లాంచ్ చేశారు. శ్రీచరణ్ పాకాల క్యాచి ట్యూన్‌గా కంపోజ్ చేసిన ఈ పాటని వెటరన్ సింగర్ రమణ గోగుల పాడిన తీరు కట్టిపడేసింది. కిట్టు విస్సాప్రగడ రాసిన లిరిక్స్ అందరినీ ఆకట్టుకున్నాయి. ఈ సాంగ్ హిట్ గా నిలిచింది. ఈ సాంగ్ లాంచ్ ఈవెంట్ లో నిర్మాత దిల్ రాజు మాట్లాడుతూ అనుమాన పక్షి సినిమా కంటెంట్ చాలా నచ్చింది. డైరెక్టర్ విమల్‌తో మేము ఒక సినిమా చేయాలనుకున్నాం. అలాంటి ఐడియాతో స్క్రిప్ట్ రెడీ చేశారు. టీమ్ అందరికీ కంగ్రాజులేషన్స్ చేస్తున్నారు. రాగ్ మయూర్ చాలా టాలెంటెడ్. శ్రీ చరణ్ నాంది గూడచారి డి జె టిల్లు లాంటి డిఫరెంట్ జోనర్ సినిమాలు చేస్తున్నారు. ఈ సినిమా కంటెంట్ కొంత చూశాను, చాలా ఫన్ వుంది. ఈ సినిమాని మేలో రిలీజ్ చేయడానికి ప్లాన్ చేస్తున్నారు. హీరో రాగ్ మయూర్ నాకు ఎప్పటి వరకు సపోర్ట్ చేస్తున్న అందరికీ పేరుపేరునా ధన్యవాదాలు.నాపై నా కెరీర్‌లో ఫస్ట్ సాంగ్ గులాబ్ జామ్ . అది కూడా రమణ గోగుల లాంటి ఒక గొప్ప సింగర్ పాడటం చాలా ఆనందాన్ని ఇచ్చింది. శ్రీ చరణ్ ఈ పాట పాడి వినిపించినప్పుడు ఆయన అయితే బాగుంటుందని అనుకున్నాం. మేము బలంగా కోరుకున్నట్టే ఫైనల్ గా ఆయన వచ్చి పాడడం, ఆయన స్టూడియోలో పాడుతుంటే మాకు నిజంగా గూస్ బంప్స్ వచ్చాయి. కార్యక్రమంలో డైరెక్టర్ విమల్ , ప్రొడ్యూసర్ రాజీవ్ చిలకా, కో ప్రొడ్యూసర్ భరత్ , మ్యూజిక్ డైరెక్టర్ శ్రీ చరణ్ పాకాల పాల్గొన్నారు.

## అనిల్ రావిపూడి దర్శకత్వంలో
# మల్టీ స్టార్‌లతో త్వరలో మూవీ షురూ



విక్టరీ వెంకటేష్, నందమూరి కళ్యాణ్ రామ్, హిట్ మిషన్ అనిల్ రావిపూడి కొలాబరేషన్ లో విజయవంతమైన నిర్మాణ సంస్థ 'షైన్ స్క్రీన్స్' ఇటీవల ఒక భారీ సినిమాటిక్ కొలాబరేషన్ ను ప్రకటించింది. వినోదాత్మక చిత్రంగా రూపొందుతున్న ఈ సినిమా 2027 సంక్రాంతికి ఘనంగా విడుదల కావడానికి సిద్ధమవుతోంది. 'షైన్ స్క్రీన్స్' బ్యాన్స్ సాహు గారపాటి ఈ ప్రాజెక్ట్‌ని నిర్మించనున్నారు. ఈ బ్యానర్ ఇప్పటికే 'భగవంత్ కేసరి' రీజినల్ బ్లాక్బస్టర్గా నిలిచిన 'మన శంకర వరప్రసాద్ గారు' వంటి వరుస విజయాలను అందించింది. సురేష్ ప్రొడక్షన్స్, అర్చన ఈ చిత్రాన్ని సమర్పిస్తుండగా, జీ స్టూడియో సహనిర్మాతగా చేరింది. ఎఫ్ 2, ఎఫ్ 3, సంక్రాంతికి వస్తున్నాం వంటి బ్లాక్‌బస్టర్ ఎంటటైనర్‌ల తర్వాత ఇది అనిల్ రావిపూడి వెంకటేష్‌తో కలిసి చేస్తున్న ఐదవ చిత్రం కావడం విశేషం. ఇటివలే ఎం.ఎస్.జీలో అతిధి పాత్రలో అదరగొట్టారు వెంకటేష్. అలాగే సంచలనాత్మక బ్లాక్‌బస్టర్ పటాస్ తర్వాత కళ్యాణ్ రామ్తో ఇది అనిల్ రావిపూడి రెండవ చిత్రం. ఈ కొత్త చిత్రం, దర్శకుడు అనిల్ రావిపూడితో షైన్ స్క్రీన్స్ సంస్థకు మూడో కొలాబరేషన్ నిలుస్తూ, వీరి విజయవంతమైన అనుబంధం మరింత బలపడింది. ప్రస్తుతం ప్రీప్రొడక్షన్ దశలో ఉన్న ఈ చిత్రానికి సంబంధించిన స్క్రిప్ట్ అనిల్ రవిపూడి అంచనాలకు తగ్గట్టుగా రూపొందిస్తున్నారు. త్వరలో పూజా కార్యక్రమంతో సినిమాను ప్రారంభించి, ఆ తర్వాత టైటిల్తో పాటు ఇతర వివరాలను వెల్లడించనున్నారు.

# 'శ్రీమహా విష్ణు' ఫస్ట్ లుక్ రిలీజ్



'సిద్ధార్థ్ రాయ్' చిత్రంలో హీరోగా అరంగేట్రం చేసి ఆకట్టుకున్న బాలనటుడు, హీరో దీపక్ సరోజ్, ఇప్పుడు హరి హరన్ గోధగాని దర్శకత్వంలో తన రెండవ చిత్రానికి సిద్ధమవుతున్నాడు. శ్రీ లక్ష్మి నరసింహ ఆరట్స్ బ్యానర్ పై ప్రొడక్షన్ నెం. 1గా శ్రీ హరి తన్నీరు నిర్మిస్తున్న ఈ చిత్రంలో దీపక్ సరోజ్ సరసన అనైరా గుప్తా, దీప్సిక నటిస్తున్నారు. చిత్ర బృందం టైటిల్, ఫస్ట్ లుక్ పోస్టర్‌ని రిలీజ్ చేశారు. 'శ్రీమహా విష్ణు' అనే టైటిల్‌తో వస్తున్న ఈ రొమాంటిక్ ఫస్ట్ లుక్, హీరో హీరోయిన్ మధ్య ఒక లవ్‌లీ మూమెంట్‌ని ప్రజెంట్ చేస్తోంది. సున్నితమైన ఆయిల్ పెయింటింగ్ స్టయిల్ లో అందంగా డిజైన్ చేసిన ఈ పోస్టర్ అందరినీ ఆకట్టుకుంది. 'ప్రతి హృదయానికీ ఒక కథ ఉంటుంది' అనే ట్యాగ్‌లైన్ ఒక సున్నితమైన ప్రేమకథ ఉందని సూచిస్తుంది. 'శ్రీమహా విష్ణు' ప్రేమ, బాధ్యత, ఆత్మశోధన వంటి అంశాలను ప్రజెంట్ చేసే ఒక మంచి ప్రేమకథగా రూపొందించబడింది. దీపక్ సరోజ్ ఒక యువ చిత్రకారుడి పాత్రను పోషిస్తున్నాడు, ఈ పాత్ర ఎమోషనల్ డెప్త్‌తో సరికొత్తగా ఉండబోతుంది. అత్యున్నత నిర్మాణ, సాంకేతిక ప్రమాణాలతో రూపొందించబడిన ఈ చిత్రం షూటింగ్ మొత్తం పూర్తి చేసుకుంది, పోస్ట్‌ప్రొడక్షన్ పనులు ప్రస్తుతం వేగంగా జరుగుతున్నాయి. ఈ చిత్రంలో ప్రముఖ నటులు నటించగా, టాప్ టెక్నిషియన్స్ పని చేస్తున్నారు. దర్శకుడు హరి హరన్ గోధగాని మాట్లాడుతూ.. ఈ సినిమా నేటి ప్రేక్షకులు, ముఖ్యంగా యువత ఎక్కువగా కనెక్ట్ అయ్యే అన్ని అంశాలతో రూపొందింది. ప్రేమను వేడుకలా చూపిస్తూ, కుటుంబ విలువల ప్రాముఖ్యతను కూడా సున్నితంగా తెలియజేస్తుంది. ఈ చిత్రానికి సంగీతాన్ని అనూప్ రూబెన్స్ అందిస్తుండగా, సినిమాటోగ్రఫీని సురేష్ రగుతు నిర్వహిస్తున్నారు. క్రాంతి ప్రియుమ్ ఆర్ట్ డైరెక్టర్‌గా, శ్రీ వర ఎడిటర్‌గా పని చేస్తున్నారు. దీపక్ సరోజ్, అనైరా గుప్తా, దీప్సిక, రఘుబాబు, సుదర్శన్, రచ్చ రవి, జబర్దస్త్ ఆది, పుంజు రాజు, శశి, లిఖిత, దేవి ప్రసాద్, రవి వర్మ నటిస్తున్నారు. చిత్రానికి రచన, దర్శకత్వం: హరి హరన్ గోధగాని, డీఓపీ సురేష్ రగుతు,సంగీతం: అనూప్ రూబెన్స్, ఎడిటర్: శ్రీ వర,ఆర్ట్: క్రాంతి ప్రియుమ్, సాహిత్యం: కెకె, శ్రీమణి,యాక్షన్: అంజి, కొరియోగ్రాఫర్‌లు: రఘు, హరి కిరణ్, సునీల్, సన్నీ.

# స్టూడెంట్స్, తండ్రులతో కలిసి చూడండి : బైకర్ హీరో శర్వానంద్



శర్వానంద్ హీరోగా యువీ క్రియేషన్స్ బ్యానర్ మీద వంశీకృష్ణారెడ్డి, ప్రమోద్ ఉప్పలపాటి సంయుక్తంగా నిర్మించిన చిత్రం 'బైకర్'. విక్రమ్ రెడ్డి సమర్పణలో ఈ మూవీని అభిలాష్ రెడ్డి తెరకెక్కించారు. ఈ మూవీలో డాక్టర్ రాజశేఖర్ కీలక పాత్రని పోషించగా మాళవిక నాయర్ హీరోయిన్గా నటించారు. ఈ సినిమాని ఏప్రిల్ 3న రిలీజ్ చేయబోతోన్నారు. ఇక ఈ సినిమా ప్రమోషన్స్లో భాగంగా మదనపల్లిలోని మిట్స్లో ఈవెంటును నిర్వహించారు. ఈ కార్యక్రమంలో శర్వానంద్ మాట్లాడుతూ జీవితం అనేది సినిమాలాంటిది కాదు. జీవితంలో బ్యాక్ గ్రౌండ్ స్కోర్ ఉండదు.. కానీ స్ట్రగుల్స్ మాత్రం ఉంటాయి. జీవితంలో కన్ఫ్యూజర్, క్రైయింగ్, లోన్లీ స్టేజ్ అనేవి కచ్చితంగా ఉంటాయి. వీటిని ప్రతీ ఒక్కరూ దాటుకుని రావాల్సిందే. నేనూ ఇవన్నీ దాటుకునే వచ్చాను. నేను బిలో యావరేజ్ స్టూడెంట్‌ని. నేను ఎందుకు పనికి రాను అని అందరూ తిట్టేవాళ్లు. హీరో అవుతాను అంటే. ఎవ్వరూ నమ్మలేదు. చాలా మంది అవమానించారు. 23 ఏళ్ల నుంచి ఇండస్ట్రీలో ఉన్నాను. 'బైకర్' నా కెరీర్లో 36వ చిత్రం. జీవితంలో ఏదైనా కొత్తగా ప్రయత్నిద్దామని అనుకుంటే అందరూ అడ్డుకట్ట వేస్తుంటారు.

# 'డాన్ బాస్కో' షూటింగ్ పూర్తి



రాధా కృష్ణ ఎంటర్‌టైన్‌మెంట్స్, విదేశాల్లో అలాగే తెలుగు రాష్ట్రాల్లో ఎన్నో బ్లాక్‌బస్టర్ సినిమాలను విజయవంతంగా డిస్ట్రిబ్యూట్ చేసి తనదైన గుర్తింపు తెచ్చుకున్న సంస్థ రాధాకృష్ణ ప్రొడక్షన్ హౌస్ ఇప్పుడు కామెడీ ఎంటర్టైనర్ 'డాన్ బోస్కో' సినిమాను నిర్మాత వెంకట్ ఉప్పుటూరి రూపొందిస్తున్నారు. హీరో రుష్య దత్త ఈ సినిమాలో కథానాయకుడిగా నటిస్తున్నారు. ఈ సినిమా షూటింగ్ పూర్తి చేసుకుంది. జైలర్, నా సామి రంగ సినిమాలతో గుర్తింపు పొందిన అందాల నటి మిర్నా మీనన్ ఇందులో హీరోయిన్గా నటిస్తోంది. శనివారం మేకర్స్ ఈ సినిమా ఫస్ట్ లుక్‌తో పాటు ఒక ముఖ్యమైన అప్డేట్‌ను విడుదల చేశారు. పోస్టరులో రుష్య దత్త చాలా స్టైలిష్‌గా కనిపిస్తూ, ఒక చేతిలో కటానా లాంటి కత్తిని పట్టుకుని, మరో చేతితో కాలర్‌ను పైకెత్తుతూ బోల్ పోజ్ లోస్తున్నారు. ఫస్ట్ లుక్ పోస్టర్ ఆసక్తిని రేకెత్తిస్తోంది. 'ప్రతి రీయూనియన్ జ్ఞాపకాల కోసమే కాదు.. కొన్ని విముక్తి (రిడెంప్షన్) కోసం కూడా ఉంటాయి' అనే క్యాప్షన్ మరింత ఎగ్జైట్‌మెంట్‌ని క్రియేట్ చేస్తున్నాయి. ఇందులో మురళీ శర్మ ప్రిన్సిపాల్ విశ్వనాథ్ పాత్రలో కీలక పాత్ర పోషిస్తున్నారు. కచ్చితంగా ఈ మూవీ మంచి ఎంటర్‌టైనరుగా మెప్పించనుందనే హామీ కలుగుతోంది. శంకర్ గౌరి రైటర్, డైరెక్టరుగా వర్క్ చేస్తోన్న ఈ ఎంటర్‌టైనరుకు ఎదురోలు రాజు సినిమాటోగ్రఫీ అందించగా శ్రీచరణ్ పాకాల సంగీతాన్ని అందిస్తున్నారు.

# 'బరి' సినిమాకు క్లాప్ కొట్టిన పవన్ కళ్యాణ్




వరుణ్ తేజ్ హీరోగా పింక్ ఎలిఫెంట్ పిక్చర్స్ బ్యానర్ మీద నిహారిక కొణిదెల నిర్మాతగా యదు వంశీ తెరకెక్కిస్తున్న నూతన చిత్రం 'బరి'. ఈ మూవీకి సంబంధించిన పూజా కార్యక్రమాలను శనివారం నాడు నిర్వహించారు. ఈ సినిమా ప్రారంభోత్సవానికి ఆంధ్ర ప్రదేశ్ డిప్యూటీ సిఎం పవన్ కళ్యాణ్ ముఖ్య అతిథిగా విచ్చేశారు. ముహూర్తపు సన్నివేశానికి ఎపి డిప్యూటీ సిఎం పవన్ కళ్యాణ్ క్లాప్ కొట్టగా మైత్రీ మూవీస్ నిర్మాత నవీన్ యెర్నేని కెమెరా స్విచ్ ఆన్ చేశారు. దర్శకుడు మేర్లపాక గాంధీ, నిర్మాత రాజీవ్ రెడ్డి ఎదుగురు స్క్రిప్ట్ అందజేశారు. పూజా కార్యక్రమాల అనంతరం యూనిట్ చిత్రానికి సంబంధించిన విశేషాల్ని పంచుకున్నారు. ఈ సందర్భంగా వరుణ్ తేజ్ మాట్లాడుతూ 'నా 'ముకుంద' సినిమా తరువాత మళ్లీ మా బాబాయ్ పవన్ కళ్యాణ్ 'బరి' చిత్ర ప్రారంభోత్సవానికి వచ్చారు. ఆయన చేతుల మీదుగా సినిమా ప్రారంభం కావడం ఆనందంగా ఉంది. నిహారిక నిర్మాతగా నేను హీరోగా చేస్తుండం ఎంతో స్పెషల్‌గా అనిపిస్తుంది. మేం ఇద్దరం కలిసి ఇలా ఒక సినిమా చేయాలనే ఆలోచన ఉండేది కాదు. కానీ వంశీ తెచ్చిన స్క్రిప్ట్ మా ఇద్దరిని ఇలా కలిపింది. వంశీ చెప్పిన కథ నాకు చాలా నచ్చింది. ఈ టీం మీద ఉన్న నమ్మకంతోనే సినిమాకి ఓకే చెప్పాను. ఆల్రెడీ ప్రీ ప్రొడక్షన్ పనులు పూర్తయ్యాయి. నేను కూడా వాలీబాల్ ప్రాక్టీస్ చేస్తున్నాను. వచ్చే సంక్రాంతికి 'బరి' సినిమాని బరిలోకి దించబోతోన్నాం అని అన్నారు. నిహారిక కొణిదెల మాట్లాడుతూ 'మా నాన్న ఫ్యామిలీ మెంబర్లతో సినిమాలు తీశాడు. వాళ్ల అన్నయ్య, తమ్ముడితో సినిమాలు తీశారు.ఈ చిత్రానికి ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్: రమేష్ మన్యం, సినిమాటోగ్రఫీ: ధనుష్ భాస్కర్, మ్యూజిక్: అనుదీప్ దేవ్,ఎడిటర్: అన్వర్ అలీ, ఆర్ట్: విష్ణు వర్ధన్ పుల్ల, రైటర్స్: వెంకట సుభాష్ చీరాల, ఉత్తమ్ లెక్కల, విక్కీ మా, రంజిత్ మారెడ్డి.

# రాష్ట్రంలో నూతన లేబర్ కోడ్‌లు అమలు చేయొద్దు

ఎఐటియుసి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్.బాల్‌రాజ్




**ప్రజాపక్షం/హైదరాబాద్:** కార్పొరేట్ శక్తులకు మేలు చేసి, కార్మికులకు నష్టం కలిగించే విధంగా కేంద్ర ప్రభుత్వం అమల్లోకి తీసుకువస్తున్న నాలుగు నూతన లేబర్ కోడ్‌లను రాష్ట్రంలో అమలు చేయవద్దని ఎఐటియుసి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్.బాల్ రాజ్ అన్నారు. కేంద్ర బిజెపి ప్రభుత్వం తీసుకొచ్చిన నాలుగు లేబర్ కోడ్‌లను తెలంగాణ రాష్ట్రంలో అమలు చేయబోమని అసెంబ్లీలో తీర్మానం చేయాలని డిమాండ్ చేస్తూ ఆల్ ట్రేడ్ యూనియన్స్ ఆధ్వర్యంలో శనివారం లోయర్ ట్యాంక్ బాండ్ అంబేద్కర్ విగ్రహం వద్ద నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఎస్.బాల్‌రాజ్ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి నరేంద్ర మోదీకి అనుచరుడి లాగా వ్యవహరిస్తున్నాడని అన్నారు. కేంద్ర ప్రభుత్వ నాలుగు లేబర్ కోడ్‌లను అమలు చేయలేమని కేరళ, తమిళనాడు, కర్నాటక, పశ్చిమ బెంగాల్ రాష్ట్ర ప్రభుత్వాలు ప్రకటించినా తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం మాత్రం మొండి వైఖరి అవలంభిస్తుందని ఆయన తప్పుబట్టారు. నూతన కోడ్‌లకు వ్యతిరేకంగా కార్మిక సంఘాలు చేపట్టిన దీక్షకు టిపిసిసి అధ్యక్షులు మహేష్‌కుమార్ గౌడ్ మద్దతు తెలిపాడని, ఇప్పుడు మౌనంగా ఉన్నారని మండిపడ్డారు. రాష్ట్రంలో నూతన లేబర్ కోడ్‌లు అమలు కాకుండా ఆపాలని కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు మల్లిఖార్జున్ ఖర్గేతో పాటు రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీలకు లేఖలు రాసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో కమటం యాదగిరి(ఎఐటియుసి), పాలడుగు భాస్కర్(సిఐటియు), వై.నాగన్న గౌడ్(ఐఎన్‌టియుసి), శ్రీనివాస్(ఐఎఫ్‌టియు), ఎస్.ఎల్.పద్మ(టియుసిఐ) తదితరులు పాల్గొన్నారు.

**ఏప్రిల్ 1న కార్మిక సంఘాల బ్లాక్ డే**

ఐటియుసి జాతీయ కార్యవర్గ సమావేశం నిర్ణయం మేరకు మిగతా అన్ని సంఘాలు ఐక్యంగా నాలుగు లేబర్ కోడ్‌లను ఏప్రిల్ 1వ తేదీ నుండి అమలు చేస్తున్నందున దేశవ్యాపితంగా నిరసన కార్యక్రమాలు చేయాలని నిర్ణయించటం జరిగిందని ఎఐటియుసి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్.బాల్ రాజ్ ఒక పత్రికా ప్రకటనలో తెలిపారు. కేంద్ర ప్రభుత్వం చట్టబద్ధతలేని కోడ్‌లను తెచ్చేందుకు 29 ముఖ్యమైన కార్మిక చట్టాలను రద్దు చేయడాన్ని నిరసిస్తూ, కార్మిక సంఘాలు ఇచ్చిన పిలుపును విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

# భూదాన భూములను రక్షించి పేదలకు పంచాలి

సిపిఐ సీనియర్ నేత, ఎంపి అజీజ్ పాషా

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** రాష్ట్రంలోని భూదాన భూములను పరిరక్షించి, వెంటనే 'భూదాన యజ్ఞ బోర్డు'ను ఏర్పాటు చేయాలని సిపిఐ సీనియర్ నాయకులు, మాజీ ఎంపి సయ్యద్ అజీజ్ పాషా రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. హైదరాబాద్ ఇందిరా పార్క్ ధర్నా చౌక్ వద్ద శనివారం తెలంగాణ సర్వోదయ మండలి ఆధ్వర్యంలో జరిగిన భారీ ధర్నాలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ కార్యక్రమానికి రాష్ట్ర అధ్యక్షుడు ఆర్. శంకర్ నాయక్ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా అజీజ్ పాషా మాట్లాడుతూ ఆచార్య వినోబా భావే సేకరించిన లక్షలాది ఎకరాల భూదాన భూములు నేడు అన్యాక్రాంతం అవుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ అంశంపై ముఖ్యమంత్రి ఏ. రేవంత్ రెడ్డి తక్షణమే స్పందించాలని ఆయన విజ్ఞప్తి చేశారు. వినోబా భావే ధనిక భూస్వాముల నుండి సుమారు 1,79,000 ఎకరాల భూమిని సేకరించగా, అందులో ఇంకా లక్ష ఎకరాలకు పైగా భూమి పేదలకు పంపిణీ చేయకుండా నిలిచిపోయిందని అజీజ్ పాషా గుర్తు చేశారు. వందలాది ఎకరాల భూదాన భూములు మోసపూరిత అమ్మకాలు, ఆక్రమణలకు గురయ్యాయని, అక్రమార్కులపై కఠిన చర్యలు తీసుకుని ఆ భూములను ప్రభుత్వం తిరిగి స్వాధీనం చేసుకోవాలని కోరారు. స్వాధీనం చేసుకున్న భూములను గ్రామాల్లో భూమిలేని రైతులకు, పట్టణాల్లో ఇళ్లు లేని నిరుపేదలకు పంపిణీ చేయాలని డిమాండ్ చేశారు.

**అక్రమాలపై ఈడీ విచారణ జరపాలి : ఆర్. శంకర్ నాయక్**

తెలంగాణ సర్వోదయ మండలి రాష్ట్ర అధ్యక్షులు ఆర్. శంకర్ నాయక్ మాట్లాడుతూ గత భూదాన యజ్ఞ బోర్డు చైర్మన్ రాజేందర్ రెడ్డి హయాంలో తప్పుడు పత్రాలతో వందలాది ఎకరాల భూమిని విక్రయించారని విమర్శించారు. ముఖ్యంగా రంగారెడ్డి జిల్లాలో భూదాన భూముల్లో అక్రమంగా ఇంజనీరింగ్ కళాశాలలు, విల్లాలు, పరిశ్రమలు వెలిశాయని, ఈ కోట్లాది రూపాయల కుంభకోణంపై ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడి)తో విచారణ జరిపించాలని శంకర్ నాయక్ డిమాండ్ చేశారు. భూదాన భూములను ఆక్రమించిన వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేసి, చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకోవాలని, అలాగే మిగిలి ఉన్న భూములను పేదలకు పంపిణీ చేయాలని నాయకులు ప్రభుత్వాన్ని కోరారు. ఈ ధర్నా కార్యక్రమంలో సర్వోదయ మండలి ప్రధాన కార్యదర్శి వై. గిరి ప్రసాద్, రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి ఖాదర్ బెగ్, నాయకులు ఎస్.యాదమ్మ, రఘుపతి, షహీన్ బేగం, అంబేద్కర్ సంఘం రాష్ట్ర అధ్యక్షులు లాలయ్య, గిరిజన సంఘాల జెఎసి రాష్ట్ర నాయకులు జర్పుల శివ నాయక్, సోషలిస్ట్ పార్టీ ఆఫ్ ఇండియా యునైటెడ్ అధ్యక్షులు బి. పురుషోత్తం, ప్రధాన కార్యదర్శి ఆర్. ఝాన్సీ, జై స్వరాజ్ పార్టీ అధ్యక్షులు కాసాని శ్రీనివాస్ గౌడ్, ఎంసిపిఐ కేంద్ర కమిటీ సభ్యులు తుకారాం నాయక్, వర్కర్స్ పార్టీ అధ్యక్షులు పాండురంగచారి పాల్గొన్నారు.




# పెట్రోల్, గ్యాస్ సరఫరాపై అపోహలు వద్దు

మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి

**ప్రజాపక్షం/హైదరాబాద్:**పెట్రోలియం ఉత్పత్తులతో పాటు ఎల్‌పిజి గ్యాస్ సరఫరాలో పెరిగిన వత్తిడిని ప్రభుత్వం సమర్థవంతంగా నియంత్రించిందని రాష్ట్ర నీటిపారుదల, పౌర సరఫరాల శాఖామంత్రి కెప్టెన్ ఎన్.ఉత్తమ్ కుమార్ రెడ్డి పేర్కొన్నారు. వినియోగదారులెవరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదని ఆయన తేల్చిచెప్పారు.దేశవ్యాప్తంగా శనివారం పెట్రోలియం ఉత్పత్తులతో పాటు వంట గ్యాస్ సరఫరాపై కేంద్ర పెట్రోలియం, సహజ వాయువు,గృహనిర్మాణ, పట్టణ వ్యవహారాల శాఖ మంత్రులు మనోహర్ లాల్ ఖట్టర్,హర్దీప్ సింగ్ పూరి,ప్రహ్లాద్ జోషీలు నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్ లో తెలంగాణ రాష్ట్రం నుండి రాష్ట్ర నీటిపారుదల, పౌర సరఫరాల శాఖామంత్రి కెప్టెన్ ఎన్ .ఉత్తమ్ కుమార్ రెడ్డి పాల్గొన్నారు. ఇదే వీడియో కాన్ఫరెన్స్ లో దేశవ్యాప్తంగా 14 మున్సిపల్ కార్పోరేషన్ లకు చెందిన ప్రతినిధులతో పాటు రాష్ట్ర పౌర సరఫరాల శాఖా కమిషనర్ స్టీఫెన్ రవీంద్ర ,జీ. హెచ్ యం సి ప్రతినిధులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ ఇరాన్ అమెరికా ల మధ్య కొనసాగుతున్న యుద్ధ వాతావరణ ప్రభావంతో పెట్రోలియం ఉత్పత్తులతో గృహ వినియోగదారులకు వంటగ్యాస్ సరఫరాపై ప్రజల్లో అపోహలు పెరిగి నందునే ప్రజల్లో అయోమయం నెలకొనిందని ఆయన చెప్పారు. అయితే రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే రంగంలోకి దిగి కట్టుదిట్టమైన చర్యలు చేపట్టడంతో సమర్థవంతంగా వత్తిడిని నియంత్రించ గలిగామన్నారు. ప్రస్తుతం పరిస్థితి పూర్తిగా అదుపులోకి వచ్చిందని, డిమాండ కు తగిన రీతిలో సరఫరా కొనసాగుతోందని పైగా తాను స్వయంగా రంగంలోకి దిగి క్షేత్రస్థాయిలో ఎప్పటికప్పుడు పర్యవేక్షించడంతో పాటు పంపిణీ దారులతో సమీక్షలు నిర్వహిస్తున్నానని ఆయన తెలిపారు. అయితే అదే సమయంలో వాణిజ్య అవసరాలకు వినియోగించే ఎల్‌పిజి కొరతను దృష్టిలో పెట్టుకొని తెలంగాణకు వాణిజ్య అవసరాలకు పంపిణీ చేసే కేటాయింపులను పెంచాలని ఆయన కేంద్ర మంత్రులను కోరారు కేంద్రం వాణిజ్య అవసరాలకు పంపిణీ చేసే గ్యాస్ కోటా కేటాయింపులను పెంచ గలిగితే వాణిజ్య అవసరాలకు సరిపడా గ్యాస్ సరఫరా చేసేందుకు అవకాశం ఏర్పడుతుందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. హైదరాబాద్ లో భాగ్యనగర్ గ్యాస్ సంస్థ ద్వారా సిఎన్‌జి సరఫరాను విస్తరిస్తున్నామని, జంట నగరాలలో ఆటోలు, ట్యాక్సీ లతో పాటు ప్రయివేటు వాహనాలకు సిఎన్‌జి సరఫరాకై ఫిల్లింగ్ కేంద్రాలు నిరంతరం అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకున్నామని మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి వెల్లడించారు.



## పునరుద్ధరణ అవశ్యం
(మొదటి పేజీ తరువాయి)

ఉందని అభిప్రాయపడ్డారు. రాష్ట్రంలో జరుగుతున్న అభివద్ధిని మీడియానే ప్రపంచానికి తెలియచేయాలన్నారు. వివిధ రంగాల్లో ఏపీ అభివద్ధి చెందుతోందని, జరుగుతున్న అభివద్ధిని జర్నలిస్టులు అధ్యయనం చేసి విశ్లేషించాలని విజ్ఞప్తి చేశారు. రాష్ట్రాభివద్ధిలో మీడియా భాగస్వామ్యం కావాలన్నారు. కేవలం సానుకూల వార్తలు మాత్రమే కాకుండా 'ప్రగతిశీల' (అభివద్ధిని కాంక్షించే) వార్తలకు ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. రాజధానిగా అమరావతికి చట్టబద్ధత కోరుతూ అసెంబ్లీలో తీర్మానం చేసి కేంద్రానికి పంపినట్లు వెల్లడించారు. వచ్చే ఐదేళ్లలో అమరావతి అద్భుతమైన ఫ్యూచర్ సిటీగా మారుతుందని ముఖ్యమంత్రి ధీమా వ్యక్తం చేశారు. సభలో మంత్రులు కొలుసు పార్థసారథి, నిమ్మల రామానాయుడు, ఐ అండ్ పీఆర్ డైరెక్టర్ కెఎస్ విశ్వనాథన్, ఐజేయూ జాతీయ అధ్యక్షుడు, తెలంగాణ మీడియా అకాడమీ చైర్మన్ కె.శ్రీనివాసరెడ్డి, ఐజేయూ ఉపాధ్యక్షుడు అమర్ మోహన్ ప్రసాద్, ఏపీ సీఆర్ మీడియా అకాడమీ చైర్మన్ ఆలపాటి సురేశ్ కుమార్, ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు, ఐజేయూ సెక్రటరీ జనరల్ బల్వీందర్ సింగ్ జమ్ము, యూనియన్ సీనియర్ నేతలు, ప్రెస్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా పూర్వసభ్యులు ఎస్ఎన్ సిన్హా, దేవులపల్లి అమర్, ఎంఏ మాజిద్, ఇటీవల ఐజేయూ సెక్రటరీ జనరల్‌గా ఎన్నికైన ఆంధ్రప్రదేశ్‌కు చెందిన సీనియర్ పాత్రికేయులు డి.సోమసుందర్, ఐజేయూ కార్యదర్శులు వై.నరేంద్రరెడ్డి, బల్బీర్ సింగ్ జందు, డీఎస్ఆర్ సుభాష్, జైసింగ్ రావత్, ఐజేయూ ప్లీనరీ స్క్రీనింగ్ కమిటీ నేతలు ఎస్ఎన్ సిన్హా, ఏపీ యూడబ్ల్యుజే రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఐవీ సుబ్బారావు, కె.జయరాజ్, ఎమ్మెల్యే బొండా ఉమామహేశ్వరరావు, మురళీమోహన్ తదితరులు పాల్గొన్నారు. తొలుత ప్రజానాట్యమండలి కళాకారులు ఆర్.పిచ్చయ్య, చంద్రనాయక్, పల్లె నర్సింహ ఆలపించిన గేయాలు సభికులను విశేషంగా ఆకట్టుకున్నాయి.





## వదంతులు నమ్మొద్దు
(మొదటి పేజీ తరువాయి)

లేదా భారతదేశానికి మాత్రమే పరిమితమైనవి కాదని, ప్రపంచవ్యాప్తంగా నెలకొన్న యుద్ధ వాతావరణం, అంతర్జాతీయ ఉద్రిక్తతల ప్రభావమే ఇందుకు కారణమన్నారు. పెట్రోలియం ఉత్పత్తుల విషయంలో ఇతర దేశాలపై ఆధారపడటం వల్ల గ్లోబల్ పరిస్థితుల ప్రభావం భారత్‌పై పడుతోందన్నారు. ఈ నేపథ్యంలో భారత ప్రభుత్వం సమర్థవంతంగా చర్యలు తీసుకుంటోందని, దేశీయ రిఫైనింగ్ సామర్థ్యాన్ని పెంచుతూ అవసరమైన ఇంధనాన్ని అందించేందుకు కృషి చేస్తోందని చెప్పారు. విదేశాల నుంచి అవసరమైన పెట్రోలియం ఉత్పత్తులను దిగుమతి చేసుకోవడంలో కూడా ప్రభుత్వం చురుకుగా వ్యవహరిస్తోందని తెలిపారు. ప్రపంచవ్యాప్తంగా అనేక సమస్యలు ఉన్నప్పటికీ, భారత్ ప్రతి రోజు పలు దేశాల నాయకులతో చర్చలు జరుపుతూ దేశానికి అవసరమైన ఇంధనం నిరంతర సరఫరా కోసం కృషి చేస్తోందన్నారు. అవసరమైతే అధిక ధరలు చెల్లించి అయినా సరే ప్రజలకు ఇబ్బందులు కలగకుండా చూడటం ప్రభుత్వ లక్ష్యమన్నారు. ఇంధన వినియోగాన్ని తగ్గించేందుకు ప్రభుత్వం ఎలక్ట్రిక్ వాహనాలను ప్రోత్సహించడం, రైల్వేలను విద్యుదీకరణ చేయడం వంటి చర్యలు తీసుకుంటోందన్నారు. సోషల్ మీడియా ద్వారా వ్యాపిస్తున్న వదంతులు ప్రజల్లో అనవసర భయాందోళనలను పెంచుతున్నాయని, పెట్రోల్ కొరత ఉందనే అపోహలు కారణంగా బంకుల వద్ద రద్దీ పెరిగిందన్నారు. అయితే ఆయిల్ కంపెనీల ప్రకటనల ప్రకారం తెలంగాణలో పెట్రోల్, డీజిల్ లేదా వంట గ్యాస్ కొరత లేదని, దేశవ్యాప్తంగా సరఫరాలు సక్రమంగా కొనసాగుతున్నాయని మంత్రి స్పష్టం చేశారు. ప్రజలు వదంతులను నమ్మకుండా శాంతంగా ఉండాలని సూచించారు.

Printed & Published on behalf of M/s Navachethana Vignana Samithi by its president **Palla Venkat Reddy,** Printed at M/s Navachethana Vignana Samithi, 12-1-493/VA, Giriprasad Bhavan, Bandlaguda (Nagole), GSI Post Hyderabad-500068, Telangana State, Published at Baddam Yella Reddy Bhavan, Ganesh Nagar, KARIMNAGAR 505001 Telangana State. RNI TELTEL /2018/76746, **Editor : Makkena Subbarao,** E-mail : editorprajapaksham@gmail.com